సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 130

బుధవారం 25-1-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



అదరగొట్టి అగ్రస్థానానికి...

న్యూజిలాండ్‌పై భారత్ క్లీన్‌స్వీప్.. 3–0తో వన్డే సిరీస్ కైవసం - 12లో



ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

సెన్సెక్స్ నష్టం 37 పాయింట్లు.. నిఫ్టీ యథాతథ ముగింపు - 13లో



ఆ తీర్మానం ఆందోళనకరం

ఐబీ, రా.. రహస్య పత్రాల్లో కొన్నింటిని బహిర్గతం చేయాలన్న కొలీజియం తీర్మానంపై కేంద్రమంత్రి రిజిజు ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



దేశీయ ఓఎస్ 'భరోస్' సక్సెస్

ఐఐటీ–మద్రాస్ అభివృద్ధి చేసిన దేశీయ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్ 'భరోస్'ను కేంద్ర మంత్రులు విజయవంతంగా పరీక్షించారు.

వివరాలు 6లో ▸



కాల్పులతో దద్దరిల్లిన అమెరికా

అమెరికా మళ్లీ కాల్పులతో దద్దరిల్లింది. కాలిఫోర్నియాలో జరిగిన ఘటనల్లో ఏడుగురు, అయోవాలో ఇద్దరు మరణించారు.

వివరాలు 6లో ▸



నేపాల్‌లో భూకంపం

నేపాల్‌లో రిక్టర్ స్కేల్‌పై 5.9 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ ప్రభావంతో ఢిల్లీ, రాజస్తాన్‌లో ప్రకంపనలు వచ్చాయి.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బాలకృష్ణ.. క్షమాపణ చెప్పాలి



'వీరసింహారెడ్డి' సినిమా సభలో నటుడు, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ 'ఆ రంగారావు.. అక్కినేని, తొక్కినేని' అంటూ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏఎన్నార్, ఎస్వీ రంగారావు అభిమానులు ఫైర్ అవుతున్నారు.

వివరాలు 12 ▸

అమ్మ పండగ.. గుండె నిండుగా



పార్వతీపురం మన్యం జిల్లా శంబర గ్రామంలో కొలువైన పోలమాంబ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని.. పూజలు చేశారు. సిరిమానును అధిరోహించిన పూజారి ఆశీర్వచనాలు అందజేశారు.

వివరాలు 5 ▸

క్వాలిటీ వైద్యానికి కేరాఫ్ ఏపీ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యత ప్రమాణాల్లో దేశంలోనే అగ్రగామి

- వసతులు, వైద్యం అందించే తీరు, ఇతర అనేక అంశాల ఆధారంగా ఎన్‌క్వాష్ గుర్తింపు
- 443 ఆస్పత్రులకు ఈ గుర్తింపుతో రాష్ట్రానికి మొదటి స్థానం
- 209 ఆస్పత్రులతో రెండోస్థానంలో గుజరాత్..
- 'నాడు–నేడు' ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మార్చేసిన సీఎం
- మూడున్నరేళ్లలో ఏకంగా 417 ఆస్పత్రులకు ఎన్‌క్వాష్ గుర్తింపు
- అంతకు ముందు టీడీపీ దిగిపోయే నాటికి కేవలం 26 ఆస్పత్రులకే..



సాక్షి, అమరావతి: 'ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తాం. ఇందులో భాగంగానే నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ కార్యక్రమం కింద ఆస్పత్రుల బలోపేతానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. తద్వారా ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ (ఐపీహెచ్‌ఎస్)కు అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తాం' అని మూడో విడత వైఎస్సార్ కంటి వెలుగు ప్రారంభం సందర్భంగా 2020 ఫిబ్రవరి 18న కర్నూలులో సీఎం వైఎస్ జగన్ చెప్పిన మాటలకు కార్యరూపం ఇస్తూ

మిగతా 2వ పేజీలో ▶

ఇది గొప్ప కాన్సెప్ట్

గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థపై యూపీ సీఎం ప్రత్యేక సలహాదారు సాకేత్ మిశ్రా

- క్షేత్ర స్థాయిలో పరిశీలన అనంతరం సీఎం జగన్‌తో భేటీ
- అన్ని సేవలు ఒకే కేంద్రం నుంచి అందడం గొప్ప విషయం
- విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో స్పష్టంగా కనిపిస్తున్న ప్రగతి
- రైతులకు కావాల్సినవన్నీ ఆర్‌బీకేల్లో దొరుకుతున్నాయి
- మద్దతు ధర, ఇతరత్రా రైతులకు సర్కారు అండ

2లో

జేఈఈ మెయిన్‌లో కష్టంగా మ్యాథ్స్

ఐఐటీ, ఎన్‌ఐటీల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్ష తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. మ్యాథ్స్ ప్రశ్నలు కాస్త కఠినంగా ఉన్నాయని పలువురు అభ్యర్థులు పేర్కొన్నారు. మ్యాథ్స్‌తో పోల్చుకుంటే ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రశ్నలు కొంచెం సులభంగా ఉన్నాయని చెప్పారు.

5లో



ఆస్కార్‌కు 'నాటు నాటు'

10లో

- తొలిసారి నామినేషన్ దక్కించుకున్న తెలుగు సినిమా, పాట
- బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో పోటీకి..
- దాదాపు 22 ఏళ్ల తర్వాత ఆస్కార్ బరిలో భారతీయ సినిమా
- బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 'ఆల్ దట్ బ్రీత్స్'
- డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో 'ది ఎలిఫెంట్ విష్పరర్స్'కు నామినేషన్

ఎందుకీ గగ్గోలు?

2లో

- ఇప్పుడు ఎవరి ఇల్లు తగలబడుతోంది?.. వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో మాకంతా తెలుసు
- వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా బహిర్గతం చేయట్లేదు
- న్యాయవ్యవస్థ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది
- ఇంత జరిగినా స్పందించకుంటే రానున్న సీజేలు ఇబ్బంది పడతారు
- రోస్టర్‌లో రెండు పేరాలు మార్చారు.. ఒరిజినల్ రోస్టర్‌ను మార్చారు



- హైకోర్టు సీజే జస్టిస్ మిశ్రా ధర్మాసనం వ్యాఖ్యలు.. జీవో1పై ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

కిలో ధరలు ఇలా...

చక్కెర పాలకోవా: రూ.200

బెల్లం పాలకోవా:రూ.300

పిక్కా పాలకోవా: రూ.450

బ్రాండ్‌గా 'తడకనపల్లి పాలకోవా'

- వందేళ్ల క్రితం మొదలై నేడు కుటీర పరిశ్రమగా ఉపాధి
- దేశంలోని ప్రధాన నగరాలకు ఎగుమతి.. రోజుకు 1,200 కిలోలకుపైగా తయారీ
- ప్రతి నెలా రూ.కోటి వరకు టర్నోవర్



ద్వాక్రా బజారులో అమ్మకానికి పెట్టిన తడకనపల్లి పాలకోవ

ఊరు 'తియ్యన'.. ఉపాధి 'కమ్మన'

కర్నూలు(అగ్రికల్చర్): ఆత్రేయపురం పూతరేకులు.. కాకినాడ కాజా.. బందరు లడ్డూ.. ఈ కోవలోనే ఇప్పుడు తడకనపల్లి పాలకోవా చేరిపోయింది. కర్నూలు నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో కల్లూరు మండలంలోని తడకనపల్లి గ్రామం పేరు ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వినిపిస్తుంది. పాలకోవాకు ఈ గ్రామం బ్రాండ్‌గా మారింది. ఇక్కడ తయారైన దేశ, విదేశాలకు ఎగుమతి అవుతోంది. కల్లూరు మండలం చిన్నటేకూరు మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న తడకనపల్లికి నిత్యం పాలకోవా కోసం వందలాది మంది వచ్చి వెళ్తున్నారు. 650 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో శతాబ్దకాలంగా పాలకోవ తయారీ సాగుతుండగా.. నేడు గ్రామంలో కుటీర పరిశ్రమగా మారింది. పాల ఉత్పత్తి, తద్వారా కోవా తయారీని మరింత పెంచేందుకు ప్రభుత్వం డీఆర్‌డీఏ–వైకేపీ ద్వారా ప్రోత్సహిస్తోంది. ప్రతి నెలా ఈ గ్రామంలో పాలకోవా వ్యాపారం దాదాపు రూ.కోటి వరకు ఉంటోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఉపాధి పొందుతుండటం విశేషం.

రోజుకు 1,200 కిలోలకుపైగా తయారీ

వందేళ్ల నుంచి తడకనపల్లిలో పాలకోవా తయారవుతున్నా.. 1940 నుంచి వెలుగులోకి వచ్చింది. అప్పట్లో 10 లీటర్ల పాలతో పాలకోవా తయారు చేస్తుండగా.. నేడు 3వేల లీటర్లకు చేరుకుంది. 20 కుటుంబాలు పూర్తిగా కోవా తయారీపైనే పైనే ఆధారపడ్డాయి. 3వేల లీటర్లు వినియోగిస్తే 1,200 కిలోల కోవా తయారవుతుంది. చక్కెరతో పాటు బెల్లంతోనూ తయారు చేస్తున్నారు. ఆర్డర్లను బట్టి పిక్కా కోవా కూడా సిద్ధం చేస్తున్నారు. పిక్కాకోవాకు ప్రతి నెలా 1000–1500 కిలోల వరకు ఆర్డర్లు వస్తున్నాయి. గ్రామంలో ఉత్పత్తి అవుతున్న పాలు సరిపోక చుట్టుపక్కల ఉన్న వామసముద్రం, బైరాపురం, లొద్దిపల్లి తదితర గ్రామాల నుంచి 1000 లీటర్లు సేకరిస్తున్నారు. 1000 గ్రాములు, 500 గ్రాములు, 250 గ్రాముల ప్యాకింగ్‌లో కోవాను విక్రయిస్తున్నారు.

ప్రధాన పట్టణాల నుంచి ఆర్డర్లు

తడకనపల్లి పాలకోవ కోసం దేశ రాజధాని ఢిల్లీతో పాటు హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు తదితర నగరాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. రోజుకు 1,200 కిలోల కోవా తయారు చేస్తే 400 కిలోలు ప్రసిద్ధ నగరాలకు ఎగుమతి అవుతోంది. 800 కిలోల్లో 50 శాతం జిల్లాలోని వివిధ పట్టణాలకు చెందిన స్వీట్ వ్యాపారులు.. మిగిలిన 50 శాతం చిన్న, చిన్న వ్యాపారులు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. వివాహాది శుభకార్యాలు ఉన్నప్పుడు పాలకోవాకు మరింత డిమాండ్ ఉంటోంది. ఆ సమయంలో రోజుకు 1,500 కిలోల వరకు తయారు చేస్తున్నారు. స్వచ్ఛమైన పాలు వినియోగిస్తుండటం, కోవా తయారీలో 100 శాతం స్వచ్ఛత ఉండటం వల్ల తడకపపల్లి పాలకోవాకు ఈ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది.



బెల్లం పాలకోవ

మొత్తం కుటుంబాలు: 650

పాలకోవా తయారీ కుటుంబాలు: 20

రోజువారీ పాల వినియోగం: 3వేల లీటర్లు

రోజూ తయారవుతున్న పాలకోవా: 1,200 కిలోలు

పాలకోవా రకాలు: చక్కెర, బెల్లం, పిక్కా

గ్రామంలోని పాడి పశువులు: 500

రోజూ పాల ఉత్పత్తి: 2వేల లీటర్లు

మాదే మొదటి కుటుంబం

మా నాన్న షేక్ శాలీసాహెబ్ 1940లో కోవా తయారీని ప్రారంభించారు. గ్రామంలో మాదే మొదటి కుటుంబం. అప్పట్లో 10 లీటర్ల పాలతో కోవా చేసేవాళ్లం. ఆయన తర్వాత మాకు కోవా తయారీనే ఉపాధి కల్పిస్తోంది. ప్రస్తుతం రోజూ 100 కిలోలకు పైగా కోవా తయారు చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలకు మా కుటుంబం నుంచే కోవా ఎగుమతి అవుతోంది.

– జుబేదా, తడకనపల్లి

రోజూ 60 కిలోల కోవా తయారు చేస్తాం

నా చిన్న తనం నుంచి పాలకోవ తయారు చేస్తున్నాం. 25 ఏళ్లుగా ఇదే ప్రధాన ఉపాధి. రోజుకు 60 కిలోల కోవా తయారు చేస్తాం. పాలు కిలో రూ.54 ప్రకారం సేకరిస్తాం. హైదరాబాద్, బెంగళూరు వంటి పట్టణాల నుంచి కూడా ఆర్డర్‌లు వస్తున్నాయి. తడకనపల్లి పేరుతోనే కోవాకు డిమాండ్ వచ్చింది.

– హజరాంబీ, గులాబీ
పొదుపు గ్రూపు సభ్యురాలు

దేశంలోనే మొదటిసారిగా పశువులకు హాస్టల్

తడకనపల్లిలో పశువులకు ప్రత్యేకంగా దేశంలోనే మొదటి సారిగా హాస్టల్ ఏర్పాటైంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో 300 పశువుల సామర్థ్యం ఉన్న హాస్టల్‌ను ఇక్కడ నిర్వహిస్తున్నారు. పశుగ్రాసాల కోసం 10 ఎకరాల భూమిని కూడా ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం ఈ హాస్టల్‌లో 100 వరకు పశువులు ఉంటున్నాయి. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పశువుల హాస్టల్ ఏర్పాటు కాగా గ్రామంలోని స్వయం సహాయక సంఘాలు దీనిని నిర్వహిస్తున్నాయి.

నలభీముల విందుపల్లి

- ఇందుపల్లి గ్రామంలో అత్యధికులు పాకశాస్త్రవేత్తలే..
- 25 రకాల బిర్యానీలు, 200 రకాల వంటల తయారీలో నిపుణులు.. మూడు లక్షల మందికైనా వంటలు చేసే సామర్థ్యం వారి సొంతం
- ఇతర దేశాలకు వెళ్లి తమ వంటలతో మెప్పిస్తున్న గ్రామస్తులు

ఉంగుటూరు మండలంలోని ఇందుపల్లి.. అదే నండీ విందుపల్లి గ్రామం పేరు చెబితే చాలు.. 'ఆహా ఏమి రుచీ.. తినరా మైమరచి' అంటూ ఆహార ప్రియులు పాటందుకుంటారు. విందు ఎక్కడా.. అంటూ ఆరా తీస్తారు. పాకశాస్త్రంలో రాణిస్తున్న ఈ గ్రామస్తులు అభినవ నలభీములుగా పేరు పొందారు. రాజకీయ పార్టీల ప్లీనరీలైనా, సినిమా వేడుకలైనా, ప్రైవేటు పార్టీలైనా ఇందుపల్లి రుచులు ఉండాల్సిందే. వెయ్యి మంది నుంచి మూడు లక్షల మందికి ఒకే సారి షడ్రుచులతో వంటలు అందించే సామర్థ్యం వీరి సొంతం.



వంటల్లో నిమగ్నమైన ఇందుపల్లి నలభీములు

వంట ఏదైనా టేస్ట్ అదుర్స్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉంగుటూరు మండలంలోని ఇందుపల్లి ఒకప్పుడు వ్యవసాయ అధారిత గ్రామం. ప్రస్తుతం వంట మేస్త్రుల కేంద్రంగా ఈ గ్రామం మారింది. మొదట వంట మేస్త్రిగా గుర్తింపు పొందింది వడ్రాణపు కోటేశ్వరరావు. సుమారు 45 ఏళ్ల క్రితం ఆయన తన చేతి వంటల రుచితో గ్రామానికి పేరు తెచ్చారు. వడ్రాణపు స్ఫూర్తితో ఆ గ్రామస్తులు వంటల తయారీలో మెలకువలు నేర్చుకుని దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు ప్రపంచ దేశాల్లో సైతం తెలుగింటి వంటల రుచులను అందించి మెప్పిస్తున్నారు. ప్రస్తుతం 3,200 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో రెండు వేల మంది వరకు వంట మేస్త్రులు ఉన్నారు. ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసిన వారు కూడా తమ పూర్వికుల వారసత్వంగా పాకశాస్త్రంలోనే ఉపాధి చూసుకుంటున్నారు.

స్టార్ హోటళ్లలో చెఫ్‌లుగా..

మారుతున్న కాలానికి అనుగుణంగా విదేశీ వంటల్లో ప్రావీణ్యం సంపాదించి ఇందుపల్లి గ్రామస్తులు కొందరు ఆయా దేశాల్లోని స్టార్ హోటళ్లలో చెఫ్‌లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇటీవల రెండు రోజుల పాటు జరిగిన వైఎస్సార్ సీపీ ప్లీనరీ సమావేశాలకు తరలివచ్చిన లక్షలాది మంది ఇందుపల్లి వంటల రుచికి ఫిదా అయ్యారు. వెయ్యి నుంచి లక్ష మందికైనా రుచిలో సుచిలో రాజీ పడకుండా వంట చేయగల సిద్ధహస్తులుగా గుర్తింపు పొందారు. ఒకే సారి మూడు లక్షల మందికైనా వంటలు అందించే సామర్థ్యం వీరి సొంతం. ప్రస్తుతం క్యాటరింగ్ రంగంలోకి కూడా అడుగు పెట్టిన ఇందుపల్లి గ్రామస్తులు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఇందుపల్లి వంటలకు ఆదరణకు అనుగుణంగా వారంతా ఆర్థికంగా ఎదిగి తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. అంతే కాకుండా వీరివల్ల సహాయకులుగా, సప్లయిర్స్‌గా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. గ్రామంలోని వంటమేస్త్రులు అందరూ కలిసి 23 ఏళ్ల క్రితం షిర్డీ సాయిబాబా ఆలయం నిర్మించారు. జనవరిలోనే ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించి 20 వేల మందికి తమ వంటలతో అన్నసంతర్పణ చేస్తారు.

ఇందుపల్లి గ్రామస్తులు వంటల తయారీలో నిష్ణాతులు. శాకాహారం, మాంసాహారంలో సుమారు 200లకుపైగా రకాల వంటలను అవలీలగా సిద్ధం చేస్తారు. 25 రకాల బిర్యానీలు, 50 రకాలకుపైగా భోజనంలో వడ్డించే స్వీట్లు, 25 రకాల పచ్చళ్లు, పలు రకాల గుత్తి వంకాయ రెస్పీల తయారీ వీరి ప్రత్యేకత. ఒక ఫంక్షన్‌లో ఏక కాలంలో 40 రకాల వంటలతో భోజనాలు సిద్ధం చేయగల సమర్థులు వీరు. వారి ప్రావీణ్యాన్ని గుర్తించి తానా నిర్వాహకులు అమెరికాలో జరిగే తానా మహాసభలకు పిలిపించి వారి వంటలను అక్కడి వారికి రుచిచూపారు. తెలుగు వారు ఎక్కువగా నివసించే ఆస్ట్రేలియా, దుబాయ్, సింగపూర్, చైనా తదితర దేశాల్లో జరిగే వేడుకల్లో సైతం ఇందుపల్లి నలభీముల రుచులు తప్పనిసరి అయ్యింది.

అంతా వడ్రాణపు చలువే

వడ్రాణపు కోటేశ్వరరావు తన వంటలతో దివంగత ముఖ్యమంత్రులు వైఎస్సార్, ఎన్టీఆర్‌తో పాటు ఎందరో మంది ప్రముఖులను మెప్పించారు. ఈ రోజు మా కుటుంబం ఆర్థికంగా స్థిరపడి పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేనంటే అది వడ్రాణపు చలువే. ఎంతో మంది గ్రామస్తులతో పాటు నేను కూడా వంటలు నేర్చుకున్నాను. వివిధ రాష్ట్రాల్లో నాచేతి వంట రుచిచూపి ప్రశంసలు అందుకున్నాను.

– ఎస్.కృష్ణ, ఇందుపల్లి

వడ్రాణపు విగ్రహం ఏర్పాటు చేస్తాం

నేడు ఇందుపల్లి గ్రామస్తులు దేశ, విదేశాల్లో వంటలు చేసేందుకు బాటలు వేసిన వడ్రాణపు కోటేశ్వరరావు విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేసి ఆయన రుణం తీర్చుకుంటాం. కుటుంబ వారసత్వంగా వస్తున్న వంటల తయారీని ఎంపిక చేసుకుని కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో స్థిరపడ్డాను. క్యాటరింగ్‌లో ఎంతో మందికి ఉపాధి కల్పించే అవకాశం నాకు దక్కింది. లాభాల్లో కొంత సామాజిక సేవకు వెచ్చిస్తున్నాను.

– సీహెచ్.రాంబాబు, ఇందుపల్లి

బీటెక్ చేసినా వంటలే వృత్తి

నేను బీటెక్ చదివాను. ఈ చదువుతో మంచి ఉద్యోగం వస్తుంది. అయితే మా పూర్వికుల నుంచి వారసత్వంగా వస్తున్న వంటల తయారీ వృత్తినే ఇష్టంగా స్వీకరించాను. అందుకే మా బంధు మిత్రులతో కలిసి వివిధ ఫంక్షన్లలో మా వంటశాస్త్ర ప్రావీణ్యం చూపుతున్నాను. రుచికరమైన వంటలను తయారు చేస్తూ ప్రజల మన్ననలు అందుకోవడాన్ని గర్వంగా భావిస్తున్నాను.

– కూరకుల మాధవ, ఇందుపల్లి

క్లుప్తంగా...

సీఎం జగన్‌ను కలిసిన సీఐడీ చీఫ్ సంజయ్



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఐడీ చీఫ్ ఎన్.సంజయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఐడీ చీఫ్‌గా ఎన్.సంజయ్‌ను ప్రభుత్వం ఇటీవలే నియమించింది.

డిజిటల్ అసిస్టెంట్లకు గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతికి వీలు!

సాక్షి, అమరావతి: గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లుగా పనిచేసే వారికి గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు పొందేందుకు వీలు కల్పిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మంగళవారం ఉత్తర్వులిచ్చారు. రాబోయే రోజుల్లో గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాల్లో ఏర్పడే ఖాళీల్లో ప్రతి 10 ఉద్యోగాల్లో నాలుగింటిని నేరుగా నియామక ప్రక్రియ ద్వారా భర్తీ చేశారు. మిగిలిన ఆరింటిలో 5 పోస్టులను డిజిటల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించడం ద్వారా, మరోక పోస్టును గ్రామ పంచాయతీల్లో పనిచేసే ఇతర ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేస్తారు. ఇందుకు ప్రత్యేకంగా రోస్టర్‌లుగా నిర్ధారిస్తూ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ రూల్స్‌లో మార్పులు చేయనున్నారు. కొత్త రోస్టర్ ప్రకారం..గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగ ఖాళీ భర్తీ ప్రక్రియలో ప్రతి 10 పోస్టులలో మొదటిది, 4,5,7, పదవ పోస్టులను డిజిటల్ అసిస్టెంట్‌లకు పదోన్నతి ద్వారా భర్తీ చేస్తారు. ప్రతి పది పోస్టులలో 2, 3, 8, 9 పోస్టులను నేరుగా నియామకాల ద్వారా భర్తీ చేస్తారు. ప్రతి పదింటిలో ఆరవ వరస నంబర్ పోస్టును గ్రామ పంచాయతీలో పనిచేసే ఇతర ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తారు.

ఏపీ హైకోర్టుకు ఇద్దరు అదనపు న్యాయమూర్తుల నియామకం

గెజిట్ విడుదల చేసిన కేంద్రం



వి.గోపాలకృష్ణారావు



పి.వెంకట జ్యోతిర్మయి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు జ్యుడిషియల్ అధికారులు పి.వెంకట జ్యోతిర్మయి, వి.గోపాలకృష్ణారావులను అదనపు న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్రం మంగళవారం గెజిట్ విడుదల చేసింది. ఈ నెల 10న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం సిఫారసు మేరకు వీరిద్దరి నియామకంపై రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆమోదముద్ర వేశారని కేంద్ర న్యాయశాఖ పేర్కొంది. వీరి నియామకంతో ప్రస్తుతం ఏపీ హైకోర్టులో 37 మంది న్యాయమూర్తులకు గాను 30 మంది ఉన్నారు. మరో ఏడు ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది.

ఎందుకీ గగ్గోలు?



సాక్షి, అమరావతి: సంక్రాంతి సెలవుల సందర్భంగా అత్యవసర కేసుల విచారణకు ఏర్పాటైన వెకేషన్ కోర్టులో తాను నిర్దేశించిన రోస్టర్‌కు భిన్నంగా జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని బెంచ్ వ్యవహరించడాన్ని తప్పుబట్టిన ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో తమకు స్పష్టంగా తెలుసని, అయితే న్యాయ వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా ఆ విషయాలను బహిర్గతం చేయడం లేదని తెలిపింది. న్యాయవ్యవస్థ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్న సీజే ధర్మాసనం, ఇంత జరిగిన తరువాత కూడా తాము స్పందించకుంటే భవిష్యత్తులో వచ్చే ప్రధాన న్యాయమూర్తులు ఇలాగే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. పరిపాలనాపరంగా ప్రధాన న్యాయమూర్తి నిర్దేశించిన రోస్టర్‌లో రెండు పేరాలు మార్చారని, తద్వారా ఒరిజినల్ రోస్టర్ మారిందని ధర్మాసనం తెలిపింది. అసలు జీవో 1 విషయంలో ఏదో జరిగిపోతోందని రాజకీయ పార్టీలు ఎందుకు గగ్గోలు పెడుతున్నాయని ప్రశ్నించింది. అంతగా స్పందించేందుకు ఎవరి ఇల్లు తగలబడుతోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వ విధానంపై ఎందుకింత గగ్గోలు పెడుతున్నారని నిలదీసింది. అది ఓ సాధారణ నిర్ణయమని వ్యాఖ్యానించింది. జీవో 1 విషయంలో ఇరుపక్షాల వాదనలు పూర్తైనందున తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. తుది విచారణ జరిపిన నేపథ్యంలో వారంలో తీర్పు వెలువరిస్తామని తెలిపింది.

ఇదీ నేపథ్యం...

రోడ్లు, రోడ్ మార్జిన్లలో బహిరంగ సభల ఏర్పాటును నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2న జారీ చేసిన జీవో 1ని సవాలు చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కాకా రామకృష్ణ సంక్రాంతి సెలవుల్లో అత్యవసర కేసులను మాత్రమే విచారించే హైకోర్టు వెకేషన్ బెంచ్ ముందు వ్యూహాత్మకంగా పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ దేవానంద్, జస్టిస్ కృపాసాగర్ ధర్మాసనం జీవో 1 అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. విచారణ జరిపిన సుప్రీంకోర్టు, రామకృష్ణ వ్యాజ్యంపై విచారణ జరపాలని సీజే ధర్మాసనానికి స్పష్టం చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం ఈ వ్యాజ్యంపై సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం వాదనలు విన్నది. ఇదే అంశంపై బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేత కొల్లు రవీంద్ర, కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై ధర్మాసనం మంగళవారం పూర్తిస్థాయిలో వాదనలు విన్నది.

ప్రస్తుత చర్యలు సరిపోవడం లేదు...

పార్టీలు రోడ్లపై నిర్వహిస్తున్న రోడ్‌షోలు, సభలు, సమావేశాలను నియంత్రించే విషయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదని పాత్రికేయుడు బాలగంగాధర్ తిలక్ దాఖలు చేసిన వ్యాజ్యంపై కూడా ధర్మాసనం విచారణ జరిపింది. జీవో 1 నేపథ్యంలో ఈ వ్యాజ్యం నిరర్థకం కాదా? అని పిటిషనర్ తరపు న్యాయవాది వీఆర్ రెడ్డిని ధర్మాసనం ప్రశ్నించింది. పోలీసులు మరిన్ని చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు.

ఆ అధికారం పోలీసులకు మాత్రమే ఉంది..

కొల్లు రవీంద్ర తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. సభలు, ర్యాలీలు, ధర్నాలు, రోడ్‌షోలు తదితరాల విషయంలో నియంత్రణ చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు మాత్రమే ఉందన్నారు. ఈ విషయంలో పోలీసులకు ఆదేశాలిచ్చే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. ప్రభుత్వానికి కేవలం పర్యవేక్షణ అధికారం మాత్రమే ఉందన్నారు. అంతిమంగా పరిస్థితుల ఆధారంగా డీజీపీనే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ప్రతిపక్షాలు తమ గళం విప్పకూడదనే ప్రభుత్వం జీవో 1 జారీ చేసిందన్నారు. సహేతుక ఆంక్షలు విధిస్తూ అనుమతులిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. అయితే ప్రభుత్వం ఏకంగా సభలను నిషేధించిందన్నారు. ప్రజలు జీవించే హక్కు, రాజకీయ నేతల భావ ప్రకటన స్వేచ్ఛ హక్కు మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు తగిన రీతిలో స్పందించకపోవడం, భద్రత చర్యలు చేపట్టకపోవడం లాంటి కారణాల వల్లే తొక్కిసలాట ఘటనలు జరిగాయన్నారు. నారా లోకేష్ పాదయాత్రకు అనుమతినిచ్చిన పోలీసులు అసంబద్ధ షరతులు విధించారని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పాదయాత్ర చేపడితే అనుమతినివ్వడమే కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్పీలను డీజీపీ ఆదేశించారన్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు.

హక్కులను కాలరాయడం సరికాదు...

కన్నా లక్ష్మీనారాయణ తరపు న్యాయవాది టి.శ్రీధర్ వాదనలు వినిపిస్తూ, నిరసనలను పలు రూపాల్లో తెలియచేసే హక్కు రాజకీయ పార్టీలకు ఉందన్నారు. ఈ హక్కును కాల రాయడం సమాజానికి మంచిది కాదన్నారు. ఎప్పుడో ఒకసారి నిర్వహించే సభలు, సమావేశాలను నిషేధించడం సరికాదన్నారు. అధికార పార్టీ విషయంలో ఒక రకంగా, ప్రతిపక్ష పార్టీల విషయంలో మరో రకంగా వ్యవహరించడం వివక్షే అవుతుందన్నారు.

డీజీపీ ద్వారానే ఉత్తర్వులు ఇవ్వాలి..

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తరపున సీనియర్ న్యాయవాది రవిశంకర్ వాదనలు వినిపిస్తూ గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రోడ్డు షోల విషయంలో తెచ్చిన సర్క్యులర్‌ను అన్ని పార్టీలు స్వాగతించాయని చెప్పారు. డీజీపీ స్వతంత్రంగా వ్యవహరించి పరిస్థితులను బట్టి సభలు, సమావేశాలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోవాలా..?

సీపీఐ రామకృష్ణ తరపు న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్ వాదనలు వినిపిస్తూ.. జీవో 1పై విచారణ జరిపే అధికారం వెకేషన్ బెంచ్‌కు ఉందన్నారు. హైకోర్టు నోటిఫికేషన్ ప్రకారం అత్యవసర కేసులను విచారించే విచక్షణాధికారం సీనియర్ వెకేషన్ జడ్జికి ఉందని తెలిపారు. అందులో భాగంగానే వెకేషన్ బెంచ్ జీవో 1పై తమ వ్యాజ్యాన్ని విచారించిందన్నారు. ప్రభుత్వం పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. ఇలాంటి జీవో ఒక్కరోజు కూడా మనుగడలో ఉండటానికి వీల్లేదన్నారు. ఈ సమయంలో ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ.. జీవో ఎమ్మెస్ అయినా, జీవో ఆర్టీ అయినా ప్రభుత్వం తీసుకున్నది సాధారణ నిర్ణయమేనని, దీనిపై రాజకీయ పార్టీలు ఎందుకు గగ్గోలు పెడుతున్నాయని ప్రశ్నించింది.

పరిస్థితులను బట్టే నిర్ణయం..

రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ ర్యాలీలు, రోడ్‌షోలపై నిషేధించే ఉద్దేశం ప్రభుత్వానికి ఎంత మాత్రం లేదన్నారు. జీవో 1లో కూడా ఎక్కడా నిషేధం అన్న పదమే లేదన్నారు. సభలు, సమావేశాల కోసం సమర్పించే ప్రతి దరఖాస్తును అప్పటి పరిస్థితుల ఆధారంగా పరిగణలోకి తీసుకుంటారని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వాటిని నియంత్రించే అధికారం పోలీసులకు ఉందన్నారు. ప్రజల భద్రత ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రజలు తిరిగే పరిస్థితి లేకుండా చేయడం వల్లే కందుకూరు ఘటన జరిగిందన్నారు. జీవో 1 వల్ల వ్యక్తులకు, రాజకీయ పార్టీలు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. నిబంధనల ప్రకారం పోలీసులకు మార్గనిర్దేశం చేసే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. లోకేష్ పాదయాత్రకు అనుమతినిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఓ రాజకీయ పార్టీ ప్రైవేట్ గ్రౌండ్‌లో సభ నిర్వహణకు అనుమతి కోరితే మంజూరు చేశామన్నారు. ప్రతిదీ పరిస్థితులను బట్టి ఉంటుందని తెలిపారు. వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఈ దశలో సిద్దార్థ లూత్రా మధ్యంతర ఉత్తర్వుల సంగతి ప్రస్తావించగా.. తుది విచారణ చేపట్టామని, వారంలోపు తీర్పు వెలువరిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

పశు సంపదపై మరింత శ్రద్ధ

- మరో 165 వెటర్నరీ అంబులెన్స్‌లు
- నేడు ప్రారంభించనున్న సీఎం జగన్



ప్రారంభానికి సిద్ధమైన వెటర్నరీ అంబులెన్సులు

సాక్షి, అమరావతి: మూగ జీవాలకు మెరుగైన వైద్య సేవలందించే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య (మొబైల్ అంబులేటరీ క్లినిక్స్) సేవలను మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. ఇప్పటికే నియోజకవర్గానికి ఒకటి చొప్పున రూ.129.07 కోట్లతో 175 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. వీటికి అదనంగా రూ.111.62 కోట్లతో రూపొందిన మరో 165 వాహనాలు నేటి నుంచి రోడ్డెక్కబోతున్నాయి. సీఎం వైఎస్ జగన్ బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం వద్ద జెండా ఊపి వీటిని ప్రారంభించనున్నారు. ఈ అంబులెన్స్‌ల విషయంలో జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు ఏపీని స్ఫూర్తిగా తీసుకొని అడుగులు వేస్తున్నాయి.

81 రకాల మందులు.. 54 రకాల పరికరాలు

ఈ అంబులెన్స్‌ల కోసం జాతీయ స్థాయిలో 1962 కాల్ సెంటర్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమీకృత కాల్ సెంటర్ 155251ను అనుసంధానించారు. ఈ నంబర్ల ద్వారా అంబులెన్స్‌ను ఉపయోగించుకోవచ్చు. ఈ అంబులెన్స్‌లో పశు వైద్యుడు, వెటర్నరీ డిప్లొమా సహాయకుడు, డ్రైవర్ కమ్ అటెండర్లను అందుబాటులో ఉంచారు. ప్రతి అంబులెన్స్‌లో రూ.35 వేల విలువైన 81 రకాల మందులు అందుబాటులో ఉంచారు. 54 రకాల అత్యాధునిక పరికరాలతో పాటు వెయ్యి కిలోల బరువు ఎత్తగలిగే హైడ్రాలిక్ లిఫ్ట్ ఏర్పాటు చేశారు. నిర్వహణ బాధ్యతలను జీవీకే–ఈఎంఆర్ఐకు అప్పగించారు. కాల్ సెంటర్‌కు రోజుకు సగటున 1,500 చొప్పున 8 నెలల్లో 3.75 లక్షల ఫోన్‌కాల్స్ రాగా, ఒక్కో వాహనం రోజుకు సగటున 120 కిలోమీటర్లకు పైగా వెళ్లి వైద్య సేవలు అందిస్తోంది. 2,250 ఆర్బీకేల పరిధిలో 4 వేల గ్రామాల్లో 1.85 లక్షల జీవాలకు వైద్య సేవలందించాయి. 6,345 వేలకు పైగా మేజర్, 10,859 మైనర్ శస్త్ర చికిత్సలు చేశారు. అత్యవసర వైద్యసేవల ద్వారా లక్షకు పైగా మూగ, సన్న జీవాల ప్రాణాలను కాపాడగలిగారు. తద్వారా 1.75 లక్షల మంది లబ్ధి పొందారు.

జగనన్న గోరు ముద్ద భేష్!

కేంద్ర ప్రజా పంపిణీ డైరెక్టర్ కల్సా ప్రశంస



విద్యార్థులతో మాట్లాడుతున్న కేఎంఎస్ కల్సా

పెనమలూరు: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన పథకం (జగనన్న గోరు ముద్ద) అమలు భేషుగ్గా ఉందని కేంద్ర ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆహారం, ప్రజా పంపిణీ డైరెక్టర్ కేఎంఎస్ కల్సా ప్రశంసించారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, బేటీ బచావో–బేటీ పడావో అమలును మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రం సరఫరా చేస్తోన్న బలవర్థకమయిన బియ్యంను (ఫోర్టిఫైడ్ రైస్) విద్యార్థులు ఎటువంటి అపోహలకు పోకుండా తినాలని సూచించారు. ఈ బియ్యం తినడం వలన ఐరన్, ఫోలిక్ యాసిడ్, బీ–12 లభిస్తుందని, రక్తహీనత ఉండదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మిడ్ డే మీల్స్ (ఎండీఎం)ను ఏపీ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. భోజనంలో నాణ్యత, మెనూ, తాగునీరు బాగున్నాయని కితాబిచ్చారు. మధ్యాహ్నం భోజన పథకం నాణ్యతగా అమలు చేయటంతో కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రెవెన్యూ అధికారులు, హెచ్ఎం గద్దె సూర్యకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వాలిటీ వైద్యానికి కేరాఫ్ ఏపీ

▶ మొదటి పేజీ తరువాయి

అడుగులు ముందుకు వేశారు. ఫలితంగా మన రాష్ట్రంలోని అత్యధిక ప్రభుత్వ ఆస్పత్రులకు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాష్) గుర్తింపు దక్కింది. ఏకంగా 443 ప్రభుత్వాస్పత్రులకు ఎన్‌క్వాష్ గుర్తింపుతో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో ఉంది. 209 ఆస్పత్రులతో రెండో స్థానంలో గుజరాత్, మూడో స్థానంలో కేరళ (134), నాలుగో స్థానంలో హరియాణ (121), ఐదో స్థానంలో తెలంగాణ (114) ఉన్నాయి.

అప్పట్లో 26 ఆస్పత్రులకే ఎన్‌క్వాష్

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి నామమాత్రంగా కేవలం 26 ఆస్పత్రులకు మాత్రమే ఎన్‌క్వాష్ గుర్తింపు ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మారుస్తూ నాడు–నేడు కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా గడిచిన మూడున్నరేళ్లలోనే ఏకంగా 417 ఆస్పత్రులకు ఎన్‌క్వాష్ గుర్తింపు లభించింది. వీటిలో 391 పీహెచ్‌సీలు, 25 సీహెచ్‌సీలు, ఒక జిల్లా ఆస్పత్రి ఉన్నాయి. వచ్చే ఫిబ్రవరి నెలలోగా 200 వరకూ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లకు ఎన్‌క్వాష్ గుర్తింపు కోసం వైద్య శాఖ దరఖాస్తు చేయనుంది. కాగా, ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 1,142 పీహెచ్‌సీలను అభివృద్ధి చేయడం కోసం రూ.664.96 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ నిధులతో పాత భవనాలకు మరమ్మతులు నిర్వహించడంతో పాటు, శిథిలావస్థలో ఉన్న పీహెచ్‌సీ భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తోంది. ఇందులో భాగంగా ఆస్పత్రులను అధునాతనంగా తీర్చిదిద్దారు. ప్రతి ఆస్పత్రిలో సిటిజన్ చార్టర్, ఆస్పత్రిలో వసతులు లేదా గదులకు సంబంధించి సైన్ బోర్డులు, రక్త పరీక్షలన్నీ అక్కడే జరిగేలా అన్ని ఆస్పత్రుల్లో మౌలిక వసతులతో కూడిన ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా జనరల్ వార్డులు, మరుగుదొడ్లు, ఆస్పత్రికి వచ్చిన రోగులు కూర్చోవడానికి కుర్చీలు ఇలా అన్ని రకాల వసతులు సమకూరాయి. ప్రభుత్వం ఏ మేరకు అభివృద్ధి చేసింది అనేదానికి గత మూడున్నరేళ్లలో ఏకంగా 391 పీహెచ్‌సీలకు ఎన్‌క్వాష్ గుర్తింపు రావడమే నిదర్శనం అని వైద్య రంగ నిపుణులు చెబుతున్నారు. ఇదే తరహాలో మిగిలిన ఆస్పత్రులను బలోపేతం చేయడంతో పాటు, 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం, పలు సూపర్ స్పెషాలిటీ, గిరిజన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు ప్రభుత్వం నాడు–నేడు కింద రూ.16 వేల కోట్లకు పైగా నిధులను ఖర్చు చేస్తోంది. మానవ వనరుల కొరతకు చెక్ పెడుతూ వైద్య శాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 47 వేలకు పైగా పోస్టులు భర్తీ చేపట్టారు. దీంతో 2019తో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధన, ఇతర ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది బాగా పెరిగారు.

'లక్ష్య' గుర్తింపులో రెండో స్థానం

మరోవైపు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన ప్రసూతి సేవలకుగాను ఇచ్చే 'లక్ష్య' గుర్తింపు విభాగంలో దేశంలోనే రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. ఈ క్రమంలో గత నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి ఎంసీహెచ్ వర్క్‌షాప్‌లో కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర వైద్య శాఖకు అవార్డు ప్రదానం చేసింది. ఆస్పత్రుల్లో ప్రసూతి సేవల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించే ఆస్పత్రులకు లక్ష్య గుర్తింపు వస్తుంది. మన రాష్ట్రంలో 40 ప్రభుత్వాస్పత్రులకు ఇప్పటి వరకు లక్ష్య గుర్తింపు లభించింది.

ఎన్‌క్వాష్ అంటే..

కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ 2016 నుంచి అత్యున్నత ప్రమాణాలతో రోగులకు నాణ్యమైన సేవలందించే ఆస్పత్రులకు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాష్) గుర్తింపు ఇవ్వడం ప్రారంభించింది. ఆస్పత్రిలోకి రోగి అడుగు పెట్టినప్పటి నుంచి వైద్యం చేయించుకుని బయటకు వెళ్లేంత వరకు అన్ని స్థాయిల్లో సదుపాయాల కల్పనను పరిగణనలోకి తీసుకుంటారు. పీహెచ్‌సీ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ), ఏరియా ఆస్పత్రి (ఏహెచ్), జిల్లా ఆస్పత్రు(డీహెచ్)లకు ఎన్‌క్వాష్ గుర్తింపు ఇస్తారు. పీహెచ్‌సీల్లో 6 విభాగాల్లో 1,600 రకాల అంశాలను.. ఏరియా, సీహెచ్‌సీ, డీహెచ్‌ల్లో 18 విభాగాల్లో 6,625 అంశాలను పరిశీలిస్తారు. ఉదాహరణకు రోగి సింక్ వద్దకు వెళ్లి చేతులు కడుక్కునే తీరు, ఆహారం తీసుకునే విధానం, వారికి మందులు ఇచ్చే విధానం తదితర విషయాలన్నింటినీ క్షుణ్ణంగా గమనిస్తారు. ఆస్పత్రుల్లో ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్, డయాగ్నోస్టిక్స్ సేవలు, మందుల లభ్యత, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, రోగులకు సౌకర్యాలు, పరిశుభ్రత, వైద్యులు, సిబ్బంది సంఖ్య వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. 70 శాతానికి పైగా పాయింట్లు సాధించిన ఆస్పత్రులకు ఎన్‌క్వాష్ గుర్తింపు ఇస్తారు.

రాష్ట్రంలో ఎన్‌క్వాష్ గుర్తింపు

సంవత్సరం	ఆస్పత్రులు
2017-18	4
2018-19	22
2019-20	46
2020-21	కరోనా కారణంగా సర్టిఫికేషన్ ప్రక్రియ ఆపేశారు
2021-22	306
2022-23	65 (మరో 23 ఆస్పత్రులకు అసెస్‌మెంట్ పూర్తి. ఫలితాలు రావాల్సి ఉంది.)

ఆస్పత్రి వాతావరణంతో రోగి ప్రభావితం

ఆస్పత్రుల్లోని వాతావరణం రోగులను ప్రభావితం చేస్తుంది. వసతుల కొరత ఉంటుందనే ఉద్దేశంతో ప్రజలు ప్రభుత్వాస్పత్రులకు రావడానికి మొగ్గు చూపరు. ఈ క్రమంలో వాటి రూపురేఖలు మార్చడం ద్వారా సర్కారు వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచడానికి సీఎం వైఎస్ జగన్ పలు చర్యలు తీసుకున్నారు. జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆస్పత్రులను తీర్చిదిద్దడంతో ఇన్ఫెక్షన్ల వ్యాప్తి తగ్గుతుంది. ఇది వారు త్వరగా కోలుకోవడానికి దోహదపడుతుంది.

– డాక్టర్ యాదల అశోక్‌బాబు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి

విలేజ్ క్లినిక్‌లకూ ఎన్‌క్వాష్ గుర్తింపు కోసం దరఖాస్తు

ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యత ప్రమాణాల విషయంలో ఏ మాత్రం రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఆ మేరకు నాడు–నేడు కింద ఆస్పత్రులను తీర్చిదిద్దుతున్నాం. ఈ క్రమంలో దేశంలోనే అత్యధిక ఎన్‌క్వాష్ గుర్తింపు కలిగిన ఆస్పత్రులు మన రాష్ట్రంలో ఉన్నాయి. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు కూడా ఎన్‌క్వాష్ గుర్తింపు కోసం చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయడం కోసం 10,032 విలేజ్ క్లినిక్‌లు నెలకొల్పింది. దశల వారీగా వీటికి ఎన్‌క్వాష్ కోసం దరఖాస్తు చేస్తున్నాం.

– ఎం.టి.కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శి వైద్య, ఆరోగ్య శాఖ

ఇది గొప్ప కాన్సెప్ట్



సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న ఉత్తరప్రదేశ్ సీఎం ప్రత్యేక సలహాదారు సాకేత్ మిశ్రా

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు విప్లవాత్మకం అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారు సాకేత్ మిశ్రా అభివర్ణించారు. దీనిని గొప్ప కాన్సెప్ట్‌గా భావిస్తున్నానని ప్రశంసించారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఏపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, మెరుగు పరుస్తున్న తీరును స్వయంగా పరిశీలించానని, ప్రగతి స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. చివరి వ్యక్తికి కూడా లబ్ధి చేకూర్చడానికి ముఖ్యమంత్రి చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించక తప్పదన్నారు. మంగళవారం ఆయన కృష్ణా జిల్లా పెనమలూరు మండలం వణుకూరులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్, డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా కేంద్రాల పనితీరును స్వయంగా పరిశీలించారు. ఆ తర్వాత సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తన అభిప్రాయాలను వైఎస్ జగన్‌తో పంచుకున్నారు. అనంతరం ఐఅండ్‌పీఆర్ ప్రతినిధులకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఏపీని చూసి చాలా నేర్చుకోవచ్చు

ఏపీలో పర్యటన మాకు మంచి అనుభవాన్ని ఇచ్చింది. ఏపీలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాల వెనుక లక్ష్యాలు, ఉద్దేశాలపై సీఎంతో చర్చించాను. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా వారి ఆరోగ్య చరిత్రను నిక్షిప్తం చేయడం బాగుంది. దీనికి ఐటీ, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడం ప్రశంసనీయం. ఏపీలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలి. గ్రామంలో ప్రభుత్వ సేవలపై ఎవరికి ఏ అవసరం వచ్చినా పలు రకాల ఆఫీసుల చుట్టూ తిరిగేకన్నా, గ్రామ సచివాలయం కేంద్రంగా అన్నింటికీ పరిష్కారం లభించడం విప్లవాత్మక ప్రగతిగా భావిస్తున్నా. ఏపీ పర్యటన ద్వారా చాలా నేర్చుకున్నాం. డ్రోన్ల వ్యవస్థ ఆకట్టుకుంది 10 నిమిషాల్లో ఎకరంలో పురుగు మందు పిచికారి చేయడం గొప్ప విషయం. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎన్నో విధాలా ఉపయోగం ఉంది. ఎరువులు, పురుగు మందులు, ఈ–క్రాప్, నష్టపరిహారం ఇలా ఎన్నో విషయాల్లో ఏపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలవడం అభినందనీయం.

ఏపీలో గ్రామ స్వరాజ్యం

- ఉత్తరప్రదేశ్ సీఎం ప్రత్యేక సలహాదారు సాకేత్ మిశ్రా
- వణుకూరు ఆర్బీకే సందర్శన..రైతులతో మాటామంతి
- స్థానిక సచివాలయం, హెల్త్ క్లినిక్ పరిశీలన

పెనమలూరు : 'పౌరులు ఆశించే ప్రతీది వారి ముంగిటకు తీసుకెళ్లగలిగే వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రగతి ఫలాలు అందేలా కృషి చేసినప్పుడే గ్రామ స్వరాజ్యం సిద్ధించినట్లన్న జాతిపిత మహాత్మాగాంధీ మాటలు ఆంధ్రప్రదేశ్‌లో ఆచరణలో కనిపిస్తున్నాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక సలహాదారు సాకేత్ మిశ్రా అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన కృష్ణా జిల్లా పెనమలూరు మండలం వణుకూరు గ్రామంలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్,పశుసంవర్థక శాఖ మొబైల్ వాహనాన్ని సందర్శించారు. క్షేత్ర స్థాయిలో పౌరులు, రైతులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఆర్బీకేలో కియోస్క్ ద్వారా ఇన్‌పుట్స్ బుక్ చేసుకునే విధానాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్ మిషన్ ద్వారా తేమ శాతాన్ని ఎలా లెక్కిస్తారో స్వయంగా చూశారు. ఆర్బీకే సిబ్బంది, బ్యాంకింగ్ కరస్పాండెంట్, రైతులతో మాట్లాడారు. అనంతరం సచివాలయం ద్వారా ఎలాంటి సేవలు అందిస్తున్నారో ఆరా తీశారు. హెల్త్ క్లినిక్‌ను, పశు సంవర్ధక శాఖ మొబైల్ వాహనాన్ని, పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు.


మీ బాబూ మళ్లించారు రామోజీ..

- 2019 జూన్ ముందు నుంచే అనేక పథకాలకు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు
- ఈనాడుకు అవే అంశాలు అప్పుడు ఒప్పుగా నేడు తప్పుగా కనిపిస్తున్నాయి

సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలనలో అన్నీ చక్కగా భేషుగ్గా అనిపించినవి ఇప్పుడు జగన్ పాలనలో అవే అంశాలు బాబు రాజగురువు రామోజీరావుకు పెద్ద తప్పుగా అనిపిస్తున్నాయి. బాబు చేస్తే ఒప్పు.. ఇతరులు చేస్తే తప్పు అన్నట్లుగా ఉన్నాయి ఆయన రాతలు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించి 'పేరుకే చట్టం.. ఎన్నేళ్లున్నా.. ఏం లాభం?' శీర్షికతో గుండెలు బాదుకున్న రామోజీ.. బాబు బాగోతాన్ని దాచేసి ఆ కథనంలో ప్రస్తుత ప్రభుత్వంపై తన పైత్యాన్ని అక్షరక్షరంలో నింపారు.

బాబు పథకాలకూ ఎస్సీ కాంపోనెంట్ నిధులు

చంద్రబాబు పాలనలోనే అనేక పథకాలకు ఎస్సీ, ఎస్టీ కాంపొనెంట్ నిధులు ఖర్చుచేశారు. అప్పట్లో అనేక పథకాలకు ఎస్సీ కాంపొనెంట్ నిధులను కేటాయించారు. నాటి ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు 2018 మార్చిలో అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. ఉదా.. సామాజిక పెన్షన్లలో భాగంగా దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు ఎన్టీఆర్ పెన్షన్ స్కీమ్, పొలంబడి, పొలంబడి–చంద్రన్న రైతు క్షేత్రాలు, జవహర్ నాలెడ్జ్ సెంటర్లలో మెంటార్లకు ఇచ్చే గౌరవ వేతనాలు, మధ్యాహ్న భోజన పథకం (పౌష్టికాహారం), పిల్లలు, తల్లులకు ప్రత్యేక పోషకాహారం, అన్న అమృతహస్తం, డ్వాక్రా మహిళలకు శానిటరీ నాప్‌కిన్స్, ఎన్టీఆర్ జలసిరి, ఎన్టీఆర్ సుజల స్రవంతి, చంద్రన్న పెళ్లికానుక, ఎన్టీఆర్ విద్యావసతి స్కీమ్, మా ఇంటి మహాలక్ష్మి వంటి అనేక పథకాలకు ఎస్సీ కాంపొనెంట్ (ఉప ప్రణాళిక) నిధులను కేటాయించారు. కానీ, ఈ వాస్తవాలను వక్రీకరించి అల్లిన కథనం వెనుక రామోజీకి ఉన్న ఉద్దేశాలు జగమెరిగినవే.




Scheduled Castes Component
(Earlier Scheduled Castes Sub-Plan)
2018-19

Volume VII/3

టీడీపీ హయాంలో ఎస్సీ కాంపోనెంట్ నిధులు పలు పథకాలకు కేటాయిస్తూ 2018 మార్చిలో అప్పటి ఆర్థిక మంత్రి యనమల ప్రవేశపెట్టిన బడ్జెట్

జగన్ పాలనలోనే ఎక్కువ మేలు..

ఇక చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ కాంపొనెంట్‌కు ఖర్చుచేసిన నిధులకు మించి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలోనే ఖర్చుచేసిందన్నది గణాంకాలే చెబుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం 2014–15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018–19 వరకు ఐదేళ్ల కాలంలో ఎస్సీ ఉప ప్రణాళిక కోసం రూ.33,625.49 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019–20 నుంచి 2022 డిసెంబర్ వరకు మూడున్నరేళ్ల కాలంలో రికార్డు స్థాయిలో రూ.48,899.66 కోట్లు ఖర్చుచేసింది. అంటే ఐదేళ్లలో టీడీపీ సర్కార్ కేటాయించిన మొత్తానికంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా రూ.15,274.17 కోట్లు అదనంగా కేటాయించడం రికార్డు. ఎస్టీల కోసం చేసిన ఖర్చుచూస్తే.. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.12,487.48 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం మూడున్నరేళ్లలో రూ.15,589.38 కోట్లు ఖర్చుచేసింది. అంటే గత ప్రభుత్వం ఐదేళ్లలో కేటాయించిన మొత్తంకంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలో రూ.3,101.9 కోట్లు అదనంగా ఖర్చుచేసింది. కానీ, ఇవేమి పరిగణనలోకి తీసుకోని ఈనాడు నిధుల కోత అంటూ వక్రీకరించి గుండెలు బాదుకుంటోంది. బాబు హయాంలో నిధుల మళ్లింపు అంశాన్ని మరుగునబెట్టి ప్రస్తుత ప్రభుత్వంపై బురదజల్లుతోంది.



టీడీపీ హయాంలో ఎస్సీ కాంపోనెంట్ నిధులు పలు పథకాలకు కేటాయించిన తీరిది..

క్లుప్తంగా...

ఏపీ ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది

కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్


మాట్లాడుతున్న దేవుసిన్హ్ చౌహాన్

కర్నూలు కల్చరల్: 'ఉచిత పథకాలతో, నిధుల లేమితో రాష్ట్రం ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉంది. 14, 15 ప్రణాళికా సంఘం ద్వారా గ్రామీణ అభివృద్ధికి గ్రామ పంచాయతీలకు నిధులు ఇస్తే వాటిని ప్రభుత్వం వేరే మార్గంలో వాడుకుంటోంది. ఇది గ్రామ స్వరాజ్యంపై దాడి లాంటిది.' అని కేంద్ర కమ్యూనికేషన్స్, ఐటీ శాఖ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ విమర్శించారు. ప్రవాసీ పార్లమెంట్ యోజన కార్యక్రమంలో భాగంగా కర్నూలు లోక్‌సభ నియోజక వర్గంలో పర్యటించిన ఆయన మంగళవారం కర్నూలులో విలేకరులతో మాట్లాడారు. ప్రతినెలా ఒక కేంద్రమంత్రి ఏపీలో విజిట్ చేస్తారన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు, సిబ్బంది జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఒక్క సీటు కూడా రాదన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ రాయలసీమ డిక్లరేషన్‌లో తీసుకున్న నిర్ణయానికి తగినట్లు కేంద్ర ప్రభుత్వం చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందన్నారు. జనసేన, బీజేపీ సంబంధాలు ఇప్పటి వరకు బాగానే ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో పరిస్థితులను బట్టి నిర్ణయం ఉంటుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్, డాక్టర్ వినూషారెడ్డి పాల్గొన్నారు.

నలుగురు వాణిజ్యపన్నుల ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

- వ్యాపారులతో కుమ్మక్కై ఖజానాకు గండి
- విచారణ నివేదిక ఆధారంగా చర్యలు
- దీర్ఘకాలంగా పనిచేస్తున్న మరో తొమ్మిదిమంది ఉద్యోగుల బదిలీ

సాక్షి, అమరావతి: వ్యాపారులు, డీలర్లతో కుమ్మక్కై రాష్ట్ర ఖజానాకు గండికొడుతున్న వాణిజ్యపన్నుల విభాగం విజయవాడ డివిజన్-1లో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు వాణిజ్యపన్నుల కమిషనర్ గిరిజాశంకర్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. అలాగే దీర్ఘకాలంగా పనిచేస్తున్న మరో తొమ్మిదిమంది ఉద్యోగులను బదిలీ చేశారు. విజయవాడ డివిజన్-1లో పనిచేస్తున్న ఏసీటీవోలు బి.మెహర్‌కుమార్, కె.సంధ్య, జి.ఆర్.వి.ప్రసాద్, సీహెచ్.దుర్గాప్రసాద్‌లను సస్పెండ్ చేశారు. సస్పెండైన ఉద్యోగులపై వ్యక్తిగతంగా ఆరోపణలతోపాటు పలువురు డీలర్ల నుంచి ఫిర్యాదులు కూడా వచ్చాయి. దీంతో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. విచారణ కమిటీలో దీర్ఘకాలంగా వ్యాపారులు, డీలర్లతో కుమ్మక్కై రాష్ట్ర ఖజానాకు రావాల్సిన ఆదాయం రాకుండా గండికొట్టినట్లు తేలింది. ముఖ్యంగా ఈఎస్‌ఐ ఆస్పత్రులకు రూ.200 కోట్ల టర్నోవర్ మందుల సరఫరాకు సంబంధించి పన్ను రూ.30 కోట్లు, అలాగే నీరు-చెట్టు కింద పనుల కాంట్రాక్టులకు సంబంధించి ఖజానాకు రావాల్సిన 20 కోట్లు రాకుండా ఉద్యోగులు గండికొట్టినట్లు విచారణలో తేలింది. దీంతో వారిని సస్పెండ్ చేశారు.

నీట్ ఫౌండేషన్‌తో ఉన్నత విద్యామండలి ఎంవోయూ

సాక్షి, అమరావతి: విద్యార్థులకు ఉపాధి కల్పించే పలు కోర్సులను అందించేందుకు ఢిల్లీకి చెందిన నీట్ ఫౌండేషన్‌తో ఏపీ ఉన్నత విద్యామండలి మంగళవారం ఎంవోయూ కుదుర్చుకుంది. మంగళగిరిలోని ఏపీ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ రామ్మోహనరావు, కార్యదర్శి నజీర్ అహ్మద్, నీట్ ఫౌండేషన్ సీవోవో చారు కపూర్, తరుణ్‌శర్మ, అమర్‌గుప్తా తదితరులు పాల్గొని ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, కమ్యూనిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ అంశాల్లో మరింత ప్రగతి సాధించేందుకు వీలుగా ఈ ఒప్పందం దోహదపడనుంది. ఉన్నత విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ఉపాధి కల్పించే పలు కోర్సులను నీట్ ఫౌండేషన్ ద్వారా అందించనున్నారు.

మైనర్ అని పెళ్లిని రద్దు చేయలేరు: హైకోర్టు

శివాజీనగర: పెళ్లి జరిగే సమయానికి బాలికకు 18 ఏళ్లు నిండలేదనే కారణంతో ఓ వివాహం చెల్లుబాటు కాదనే కుటుంబ కోర్టు ఆదేశాలను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. కర్ణాటకలోని మండ్య జిల్లాకు చెందిన సుశీలకు, మంజునాథ్‌తో హిందూ సంప్రదాయంలో 2012 జూన్‌లో పెళ్లి జరిగింది. ఆ తరువాత ఆమె మైనర్ అని తెలిసి భర్త మంజునాథ్ ఆగ్రహించాడు. ఈ పెళ్లిని రద్దు చేయాలని ఫ్యామిలీ కోర్టులో కేసు వేయగా, వివాహాన్ని కోర్టు రద్దు చేసింది. సుశీల దీన్ని సవాల్ చేస్తూ బెంగళూరు హైకోర్టులో కేసు వేసింది. జస్టిస్ అలోక్ ఆరాధ ధర్మాసనం విచారించింది, కింది కోర్టు తీర్పు హిందూ వివాహ చట్టంలోని షెడ్యూల్ 11 ప్రకారం లేదని పేర్కొంటూ పెళ్లి రద్దు తీర్పును కొట్టివేసింది.

హిందూ మహాసముద్రంలో ట్రోపెక్స్

మూడు నెలలపాటు నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, కోస్ట్‌గార్డు దళాల విన్యాసాలు

దొండపర్తి(విశాఖ దక్షిణ): భారత నావికాదళం నేతృత్వంలో హిందూ మహాసముద్రంలో 'ట్రోపెక్స్' పేరుతో భారీ విన్యాసాలు నిర్వహిస్తున్నారు. హిందూ మహాసముద్రంపై పట్టుసాధించేందుకు చైనా ప్రయత్నిస్తున్న తరుణంలో భారత రక్షణ దళాలు తమ యుద్ధనౌకలు, జలాంతర్గాములు, యుద్ధ విమానాలు వంటి అన్నిరకాల అస్త్ర, శస్త్రాలను మోహరిస్తూ పెద్ద ఎత్తున విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. ఇండియన్ నేవీ ప్రధాన సముద్రయాన వ్యాయామం 'ట్రోపెక్స్-2023' ఎడిషన్ ప్రస్తుతం హిందూ మహాసముద్ర ప్రాంతంలో జరుగుతోంది. నౌకాదళ పోరాట సామర్థ్యాలను, సంసిద్ధతను పరీక్షించేందుకు రెండు రోజుల కిందట ప్రారంభమైన ఈ విన్యాసాలు మార్చి నెల వరకు నిర్వహిస్తారు. ఈ మెగా డ్రిల్‌లో నౌకాదళంతోపాటు ఆర్మీ, వైమానిక దళం, కోస్ట్‌గార్డ్‌కు చెందిన రక్షణ దళాలు భాగస్వాములయ్యాయి. హార్బర్, సముద్ర జలాల్లో జరిగే ఈ విన్యాసాల్లో డెస్ట్రాయర్లు, యుద్ధనౌకలు, కార్వెట్లతోపాటు జలాంతర్గాములు, విమానాలతో నావికాదళానికి చెందిన అన్నిరకాల ఉపరితల పోరాట యోధులు పాల్గొన్నారు. హిందూ మహాసముద్ర తీరంలో జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడంతోపాటు స్థిరత్వం, శాంతిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ విన్యాసాలు చేపడుతున్నట్లు నేవీ అధికారులు తెలిపారు.



హిందూ మహాసముద్రంలో మోహరించిన భారత యుద్ధనౌకలు

తెలంగాణ

2030 నాటికి మూడో ఆర్థిక శక్తిగా భారత్

ఐసీఏఐ స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్

మాదాపూర్(హైదరాబాద్): ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 2030 నాటికి మూడో ఆర్థిక శక్తిగా ఎదగనుందని కేంద్ర పార్లమెంట్ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ అన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో మంగళవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) 2023 స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 2047 నాటికి మనదేశం నెంబర్‌వన్‌గా నిలుస్తుందన్నారు. సీఏ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఆయన పట్టాలను అందజేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ పరిరక్షణలో చార్టెర్డ్ అకౌంటెంట్ (సీఏ)ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రపంచ ఆర్థిక స్థితిగతులపై చర్చలు నిర్వహించే జీ-20 దేశ సమావేశాల్లో ఐసీఏఐ కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. ఐసీఏఐ అధ్యక్షుడు దేబాషిష్ మిత్రా మాట్లాడుతూ ఎంతో క్లిష్టమైన సీఏ పరీక్షలను రాసి ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో 42 శాతం మంది మహిళలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ ఉపాధ్యక్షుడు అనికేత్ సునీల్ తలాటి, ఐసీఏఐ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'వరి'ంచిన పురస్కారం

మార్టేరు వరి పరిశోధన స్థానానికి నేషనల్ అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ మానుకొండ శ్రీనివాస్

పెనుమంట్ర: పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి జాతీయ ఉత్తమ పరిశోధన కేంద్రం పురస్కారం లభించిందని పరిశోధన స్థానం సహసంచాలకులు డాక్టర్ భరత్‌లక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ నెల 21న మహారాష్ట్రలోని మహాత్మా పూలే కృషి విశ్వవిద్యాలయంలో జరిగిన అఖిలభారత సమన్వయ సంఘం సమీకృత వ్యవసాయ విధాన క్షేత్రాల సదస్సులో ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్కే చౌదరి చేతుల మీదుగా మార్టేరు పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ ఈ అవార్డు అందుకున్నారని చెప్పారు. ఏడేళ్లుగా డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని శాస్త్రవేత్తల బృందం సమీకృత వ్యవసాయ విధానాలపై విస్తృత పరిశోధనలు చేసి సన్న, చిన్నకారు రైతులకు ఆచరణ యోగ్యంగా ఉన్న నమూనాలను రూపొందించి రైతులకు అందించినందుకు గాను ఈ అవార్డు లభించినట్టు భరత్‌లక్ష్మి వివరించారు. డాక్టర్ శ్రీనివాస్ బృందాన్ని ఆమె అభినందించారు.

పుల్లరీన్ వెలికితీతపై పరిశోధనకు ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఖనిజ వనరులపై ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వానికి చెందిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ(సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ)తో ఏపీఎండీసీ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రధానంగా బెరైటీస్ మైనింగ్‌లో బ్లాక్ షెల్ నుంచి పుల్లరిన్ ఖనిజాన్ని వెలికితీయడంపై ఐఎంఎంటీ పరిశోధనలు చేయనుంది. తక్కువ గ్రేడ్ బెరైటీస్‌ను శుద్ధిచేసి మార్కెటింగ్ అవకాశాలను పెంచే అంశాన్ని పరిశోధించనుంది. భువనేశ్వర్‌లోని ఐఎంఎంటీ కార్యాలయంలో మంగళవారం ఆ సంస్థ ప్రతినిధులతో ఏపీఎండీసీ వీసీ అండ్ ఎండీ వీజీ వెంకటరెడ్డి ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. పుల్లరిన్ ఖనిజానికి అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉందని చెప్పారు. దీన్ని వెలికితీయడం ద్వారా రాష్ట్రానికి మైనింగ్ ఆదాయం పెరుగుతుందన్నారు. అన్నమయ్య జిల్లా మంగంపేటలో ఏపీఎండీసీ నిర్వహిస్తున్న బెరైటీస్ మైనింగ్ ద్వారా వచ్చే తక్కువ గ్రేడ్ ఖనిజాన్ని శుద్ధిచేసి.. మార్కెటింగ్ అవకాశాలను మరింత పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా పరిశోధన చేయాలని ఐఎంఎంటీని కోరినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలతో మైనింగ్ రంగంలో పలు విజయాలను సాధించామన్నారు. ఏపీఎండీసీ జాతీయ స్థాయిలో తన కార్యకలాపాలను విస్తరించుకుంటోందని తెలిపారు. పుల్లరిన్‌ను ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-మెడికల్ రంగాల్లో ఎక్కువగా వినియోగిస్తారని చెప్పారు.

ఏపీలో 2,000 గ్రామాల్లో భూ రీ సర్వే

- ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేయాలన్నదే లక్ష్యం
- ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజేయ కల్లం


మాట్లాడుతున్న అజేయ కల్లం, పక్కన సిద్ధార్థ జైన్, మాధవీలత

సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి నెలాఖరుకు 2,000 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు, భూహక్కు-భూరక్ష పథకం స్టీరింగ్ కమిటీ చైర్మన్ అజేయ కల్లం చెప్పారు. 'వైఎస్సార్ జగనన్న భూహక్కు-భూరక్ష' పథకం అమలుపై తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లో తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, జేసీలతో మంగళవారం ఆయన సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వివాదాల్లేని శాశ్వత భూహక్కు అందించాలన్న సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో దశల వారీగా రీ సర్వేకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఇది ఇప్పటికే యుద్ధప్రాతిపదికన జరుగుతోందని, తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 2,000 గ్రామాల్లో 100 శాతం సర్వే పూర్తయినట్లు తెలిపారు. రెండో దశలో మరో 2,000 గ్రామాల్లో సర్వే చేపట్టి శాశ్వత హక్కు పత్రాలను సీఎం చేతుల మీదుగా అందిస్తామన్నారు. సర్వేలో ప్రధానంగా విస్తీర్ణం సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, తమకు 2 సెంట్లు, 5 సెంట్లు తగ్గిందని రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. సాధారణంగా రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి, రైతులు సాగు చేసుకునే భూమికి కొద్ది పాటి తేడాలు ఉంటాయని, అంత మాత్రాన తగ్గినట్లు కాదని స్పష్టం చేశారు. సర్వే 100 శాతం పూర్తయితే భవిష్యత్‌లో భూములపై ఎలాంటి వివాదాలు ఉండవన్నారు. సమావేశంలో సీసీఎల్ఏ కమిషనర్ సిద్ధార్థ జైన్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత పాల్గొన్నారు.

ఎర్ర 'తేజం'

గుంటూరు యార్డులో ప్రకాశం జిల్లా మిర్చికి మంచి రేటు

- క్వింటా రూ. 22 వేల నుంచి రూ. 25 వేలు
- రైతుల్లో ఆనందం
- పశ్చిమ ప్రకాశంలో అత్యధిక సాగు



మిర్చి రైతుల పంట పండింది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు పంటకు తెగుళ్లు సోకాయి. సకాలంలో రైతులు స్పందించి ఆర్బీకేల నుంచి వచ్చిన సూచనలను పాటించారు. నాణ్యమైన పురుగుల మందులు వాడి తెగుళ్ల బారి నుంచి బయటపడ్డారు. గుంటూరు మార్కెట్ యార్డులో ఊహించని దాని కంటే ధర ఎక్కువ వస్తుండడంతో మిర్చి రైతుల ఆనందానికి అవధుల్లేవు. ఇప్పటికే మూడు కోతలు కోశారు. ఉగాది వరకు మరో రెండు కోతలు కాయాల్సి ఉంది.

మార్కాపురం: రైతులు ఎర్ర బంగారంగా భావించే మిర్చికి గుంటూరు మార్కెట్‌లో మంచి మద్దతు ధర లభిస్తోంది. ఖరీఫ్, రబీ సీజన్‌లో ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 32,176 హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. అత్యధికంగా పశ్చిమ ప్రకాశంలో సాగు ఎక్కువగా ఉంది. ఈ ఏడాది రైతులు ఎక్కువగా తేజ యూ 5341 రకాన్ని సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ. 1.25 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేశారు. 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రైతులందరూ ఎకరాకు మూడు కోతలు తీశారు. దాదాపుగా 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. ఇంకా రెండు కోతల వరకు మిర్చి కోసే అవకాశం ఉంది. అయితే ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు తెగుళ్ల సోకినప్పటికీ ప్రభుత్వం ఆర్బీకేలో ఉన్న సిబ్బంది ద్వారా సలహాలు, సూచనలు పాటించడంతో రైతులు తెగుళ్ల ముప్పు నుంచి బయటపడ్డారు. అక్కడక్కడ నల్లతామర పురుగు కనిపించినా సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి నల్లతామర పురుగు నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం గుంటూరు మార్కెట్‌యార్డులో మిర్చి నాణ్యతను బట్టి ధర లభిస్తోంది. ఆర్మూరు, సింజెంటా, కొత్త బాడిగి, డీలక్స్, కొత్త వి బంగారం, కొత్త వి తేజతాలు రకాలు, 341 రకాలు మార్కెట్‌కు వస్తున్నాయి. వీటిలో తేజ, ఆర్మూరు, బాడిగి, సింజెంటా రకాలకు క్వింటా రూ.22 వేల నుంచి రూ.25 వేల వరకు ధర పలుకుతున్నాయి. గత సీజన్‌లో ఫిబ్రవరిలో క్వింటా రూ. 19 వేల నుంచి రూ. 21 వేల మధ్య ధర పలికింది. ఈ దఫా ప్రారంభంలోనే మంచి ధర లభిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకాశం జిల్లాలో సాగు ఇలా

ప్రకాశం జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో 32,176 హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. ఒంగోలు సబ్ డివిజన్‌లో 339, దర్శిలో 4,714, మద్దిపాడులో 745, మార్కాపురంలో 5,312, వైపాలెంలో 11,512, గిద్దలూరు పరిధిలో 1510, కనిగిరి పరిధిలో 801, సింగరాయకొండ పరిధిలో 427 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుచేశారు. పశ్చిమ ప్రకాశంలోని మూడు సబ్ డివిజన్‌లలో 18,334 హెక్టార్లలో సాగు చేశారు.

సస్యరక్షణ చర్యలు పాటించండి

ప్రస్తుత పరిస్థితుల్లో మిర్చి రైతులు సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలి. తెగుళ్లకు ఇష్టమొచ్చినట్లుగా మందులు వాడొద్దు. తామర పురుగు సోకితే వ్యవసాయాధికారి సలహాలతోనే మందులు వాడాలి. యార్డుకు తీసుకెళ్లే ముందు కాయ నాణ్యతను చూసుకోవాలి. బయట ఆరబెట్టేటప్పుడు తడవకుండా, మట్టి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

–శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

20 క్వింటాళ్లు అమ్మాను

5 ఎకరాల్లో మిర్చి పంట సాగుచేశాను. మొదటి కోతలోనే దాదాపు 20 క్వింటాళ్లు గుంటూరు మార్కెట్‌యార్డుకు తీసుకెళ్లి అమ్మాను. క్వింటా నాణ్యతను బట్టి రూ.20 వేల నుంచి రూ. 22 వేల మధ్య అమ్మాను. ఇంకా ఉగాది వరకూ పంట కోతలు వస్తాయి.

–ఆవులయ్య, రైతు, వేములకోట

గణతంత్రానికి 'వందన'ం

కడప విద్యార్థిని వందనకు ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం



వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బయోటెక్నాలజీ చదువుతున్న ఎన్.వందన ఈ నెల 26న న్యూఢిల్లీలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పాల్గొనేందుకు ఎంపికైంది. గతేడాది నవంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు గుజరాత్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రీ రిపబ్లిక్ డే వేడుకల్లో వందన చక్కటి ప్రతిభ కనబరచడంతో ఈ అవకాశం దక్కింది. గత డిసెంబర్ 30 నుంచి ఢిల్లీలోనే ఉంటూ పరేడ్‌పై ప్రత్యేక శిక్షణ పొందుతోంది. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవంలో పాల్గొని, అనంతరం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా సరిఫికెట్ అందుకోవడంతో పాటు వారిచ్చే విందుకు హాజరయ్యే అవకాశం దక్కించుకుంది. వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన విద్యార్థిని ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం నిధులు సమకూర్చి బాసటగా నిలిచింది. విద్యార్థిని వందనను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్దన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్బలక్ష్మమ్మ అభినందించారు.


హంద్రీ నదిపై బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

- నెరవేరిన వైఎస్ జగన్ హామీ
- రూ.24కోట్లు మంజూరుచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 12 గ్రామాలకు తీరనున్న వరదకష్టాలు
- పనులు ప్రారంభించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్


భూమిపూజ చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సి.బెళగల్: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గంలోని గోరంట్ల గ్రామం వద్ద హంద్రీ నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులకు మంగళవారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ భూమి పూజ చేశారు. ప్రజాసంకల్పయాత్ర సమయంలో హంద్రీ నది వల్ల వరదల సమయంలో ప్రజల కష్టాలను చూసి చలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే హంద్రీ నదిపై బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు హంద్రీ నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేసింది. దీంతో బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి రాజేంద్రనాథ్ భూమి పూజ చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో గోరంట్ల గ్రామం నుంచి క్రిష్ణగిరి మండలం కొత్తపల్లె, ఎస్‌హెచ్ ఎర్రగుడితోపాటు మరో పది గ్రామాల ప్రజలకు వరద నీటిలో చావుబతుకుల మధ్య ప్రయాణించే ప్రమాదం తప్పనుంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కేఈ కృష్ణమూర్తి డిప్యూటీ సీఎంగా ఉన్నప్పటికీ సొంత జిల్లా ప్రజల కష్టం తీర్చలేకపోయినా... ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అయిన తర్వాత నెరవేర్చారని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సంజీవ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, పాణ్యం, పత్తికొండ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి, కర్నూలు నగర మేయర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, కలెక్టర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భూమయ్యకు 'భూతపురి' పురస్కారం



కడప కల్చరల్ : మహాకవి, శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ 21వ స్మారక సాహిత్య పురస్కారానికి సుప్రసిద్ధ కవి, విమర్శకులు, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య అనుమాండ్ల భూమయ్య ఎంపికయ్యారని డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్రశర్మ తెలిపారు. అల్లసాని పెద్దన సాహిత్య పీఠంతో కలిసి ఫిబ్రవరి 19వ తేదీన కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్న భూతపురి 86వ జయంతి ఉత్సవంలో భూమయ్యకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆచార్య భూమయ్య ఉభయ తెలుగు రాష్ట్రాలలో అనేక పద్యకావ్యాలు, గేయ రచనలు, విమర్శనా గ్రంథాలు వెలువరించారని తెలిపారు. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారాలు పొందారని వివరించారు.

ఖాతాదారులకు గో'ల్డ్'మాల్

- 40 మందికి బ్యాంకు ఉద్యోగి టోకరా
- బంగారం రుణం పేరుతో రూ.2.5 కోట్ల దోపిడీ

కాకినాడ క్రైం: కాకినాడలోని యూకో బ్యాంకు కేంద్రంగా ఓ బ్యాంకు ఉద్యోగి రూ.2.5 కోట్ల భారీ మోసానికి పాల్పడ్డాడు. 40 మంది ఖాతాదారులకు కుచ్చుటోపీ పెట్టాడు. వివరాల్లోకి వెళితే, నగరంలోని ఆనంద భారతి మైదానం ఎదురు వీధిలో ఉన్న యూకో బ్యాంకులో కాకినాడ రామకృష్ణారావు పేటకు చెందిన తాడోజు శ్రీనివాసరావు పదేళ్లుగా గోల్డ్ లోన్ విభాగంలో అప్రయిజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్లుగా చేతి వాటం ప్రదర్శించి సుమారు 40 మంది ఖాతాదారులను నిలువునా ముంచాడు. వారిలో కొందరి అసలు బంగారాన్ని పక్కదారి పట్టించి ఆ స్థానంలో నకిలీ బంగారాన్ని తీసుకొచ్చి గుట్టు చప్పుడు కాకుండా బ్యాంకులో పెట్టాడు. మరికొందరి పరిచయాలను ఆసరాగా చేసుకొని రకరకాల కారణాలను సాకుగా చూపి కొత్త నాటకానికి తెరతీశాడు. తన వద్ద బంగారం ఉందనీ, అయితే తమ బ్యాంకులో తమకి లోన్ ఇవ్వరనీ నమ్మబలికాడు. కాబట్టి మీ డాక్యుమెంట్లతో లోన్ తీసుకుంటాననీ, తన బంగారం తానే తాకట్టు పెట్టుకుంటానని నమ్మించాడు. బ్యాంకుకి వచ్చి సంతకం చేస్తే చాలనీ ..వచ్చే లోన్‌లో కొంత మొత్తాన్ని పర్సంటేజ్‌గా ఇచ్చేస్తానని ఎరవేశాడు. శ్రీనివాస్ మోసాన్ని గుర్తించలేకపోయిన పలువురు ఖాతాదారులు అతడి వలలో చిక్కుకొని సంతకాలు పెట్టి బాధ్యులయ్యారు. భారీ మోసంలో బాధితులయ్యారు. లాకర్ తనిఖీలలో బంగారం నాణ్యతపై అనుమానం వచ్చిన బ్యాంకు యాజమాన్యం ఖాతాదారులకు 'మీ ఆభరణాలు నకిలీవి' అంటూ నోటీసులు జారీ చేసింది. దీంతో ఖాతాదారులంతా మూడు రోజులుగా బ్యాంకుకు క్యూ కట్టారు. నకిలీవి అయితే లోన్ ఎలా ఇచ్చారంటూ ఖాతాదారులు సంధించిన ప్రశ్నలకు బ్యాంకు అధికారులు నీళ్లు నములుతున్నారు. ఈ తంతులో శ్రీనివాస్ నిర్వాకంపై అనుమానం వచ్చిన బ్యాంకు యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారమంతా బట్టబయలైంది. నిందితుడు శ్రీనివాస్ రూ.2.5 కోట్ల మోసానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. బ్యాంకు నుంచి ఇంటికి వెళ్లే మార్గంలో ఏకంగా ఓ బంగారం దుకాణాన్నే పెట్టేశాడు. దుకాణం కేంద్రంగానే క్రయవిక్రయాలకు అసలు బంగారాన్ని వినియోగించి భారీ స్థాయిలో బంగారం మోసానికి పాల్పడ్డాడని పోలీసులు భావిస్తున్నారు. కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలు విచారణ చేపడుతున్నాయి.

సీఎస్‌తో పీఎన్‌జీఆర్‌బీ సభ్యుల భేటీ

సాక్షి, అమరావతి: పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) సభ్యులు ఏకే తివారి, ఏకే పాండాలతో కూడిన ప్రతినిధుల బృందం మంగళవారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా.కేఎస్.జవహర్‌రెడ్డితో భేటీ అయింది. ఏపీలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పైపు లైన్ విస్తరణపై చర్చించారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీజీడీ పైపు లైన్ విస్తరణకు సంబంధించి అన్ని విధాలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు పీఎన్‌జీఆర్‌బీ ప్రతినిధులు సీజీడీ, నేచురల్ గ్యాస్ పైపు లైనుపై సమావేశమై ఈ ప్రాజెక్ట్ ప్రగతిని సమీక్షించారు.

కువైట్ కాన్సులేట్‌లో వీసాల పరిశీలన

- నిబంధనలను మార్చిన ఆ దేశ విదేశాంగ శాఖ
- కాలయాపన, ఆర్థికభారం అంటున్న వలసకార్మికులు

మోర్తాడ్(బాల్కొండ): మనదేశం నుంచి వెళ్లేవారికిగాను కువైట్ వీసా నిబంధనలను సవరించింది. కువైట్ నుంచి వీసాలు జారీ అయిన తరువాత అవి అసలువో నకిలీవో తేల్చడానికి ఆ దేశ కాన్సులేట్‌ల పరిశీలన కోసం పంపాల్సి ఉంది. ఈ కొత్త నిబంధన పదిహేను రోజుల కింద అమలులోకి వచ్చింది. వీసాలను కాన్సులేట్ పరిశీలన కోసం పంపడం వల్ల కాలయాపనతోపాటు ఆర్థికంగా భారం పడుతుందని వలస కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కువైట్‌లో ఉపాధి పొందాలనుకునేవారు లైసెన్స్‌డ్ ఏజెన్సీలు, లేదా తమకు తెలిసిన వారి ద్వారా వీసాలను పొందిన తరువాత పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్(పీసీసీ)తీసుకోవాల్సి ఉంటుంది. గల్ఫ్ దేశాల్లో ఒక్క కువైట్‌కు మాత్రమే పీసీసీ తప్పనిసరి అనే నిబంధన ఉంది. వీసా కాపీల పరిశీలనను ఇప్పుడు అదనంగా చేర్చారు. కువైట్ నుంచి వీసాలను ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తున్నారు. ఈ వీసాలు అన్ని కువైట్ విదేశాంగ శాఖ ద్వారానే జారీ అవుతున్నాయి. విదేశాంగ శాఖ ఆమోదంతోనే వీసాలు జారీ కాగా, వాటిని మరోసారి తమ కాన్సులేట్‌ల్లో పరిశీలనకు పంపాలని కువైట్ ప్రభుత్వం సూచించడం అర్థరహితమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఢిల్లీ, ముంబైలోనే కాన్సులేట్‌లు

కువైట్ విదేశాంగ శాఖకు సంబంధించిన కాన్సులేట్‌లు ఢిల్లీ, ముంబైలలోనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి కువైట్‌కు భారీగానే వలసలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో కాన్సులేట్ ఏర్పాటు చేయాలని కొన్ని సంవత్సరాల నుంచి వలస కార్మికులు కోరుతున్నారు. కువైట్ ప్రభుత్వం గతంలో సానుకూలంగా స్పందించినా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. కువైట్ ప్రభుత్వం కొత్త నిబంధన అమలులోకి తీసుకురావడంతో కాన్సులేట్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలనే డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది.



మనసు స్వచ్ఛంగా ఉన్నప్పుడు ఆనందం ఎప్పటికీ వదలని నీడలా మనల్ని అనుసరిస్తుంది.
- బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, జనవరి, 25

బాయ్‌కాట్ చేయాల్సింది ఇదీ!

ఇది నిజంగా అసాధారణమే. ఒక జాతీయ పార్టీ కీలక సారథి, అందులోనూ ప్రధానమంత్రి హోదాలో దేశాన్ని పాలిస్తున్న వ్యక్తి ఈ తరహా సూచన చేయడం మునుపెన్నడూ కనలేదు, వినలేదు. సినిమాల లాంటి అసంగతమైన వాటిపై అనవసర వ్యాఖ్యలు చేసి, మన కఠోరశ్రమపై నీలినీడలు కమ్ముకొనే పరిస్థితి తేవద్దని ప్రధాని నరేంద్ర మోదీ అధికార బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఇటీవల అన్నారన్న వార్త అందుకే ప్రధానమైనది. మోదీ వ్యాఖ్యలకు తాజా ప్రేరణ - షారుఖ్ ఖాన్ నటించిన తాజా హిందీ చిత్రం 'పఠాన్'పై కొందరు బీజేపీ నేతలు చేస్తున్న విపరీత వ్యాఖ్యలు, వివాదాలు. ఒకపక్క సోషల్ మీడియాలో బాయ్‌కాట్ ప్రచారాలు, మరోపక్క సినీ ప్రముఖుల గత చరిత్రలు, సినిమాల్లో దుస్తులపై అత్యుత్సాహ రాజకీయ దుమారాలు కలసి కొన్నేళ్ళుగా హిందీ చిత్రసీమ ఉక్కిరిబిక్కిరి అవుతున్న వేళ మోదీ మాట ఒకింత ఊరట.

ఏ సందర్భంలో, ఏ ఉద్దేశంతో ఇచ్చినప్పటికీ ఆ స్థాయి వ్యక్తి ఇలాంటి సలహా ఇవ్వాల్సిన పరిస్థితి రావడం దేశంలో నెలకొన్న అసహన వాతావరణానికి అద్దం పడుతోంది. సోషల్ మీడియాలో హిందీ సినీ పరిశ్రమను కొన్నాళ్ళుగా వెంటాడుతున్న భూతం – బాయ్‌కాట్ ప్రచారం. విమర్శలు, ట్రోలింగ్‌ల నుంచి చివరకిది సంక్షోభం స్థాయికి వెళ్ళింది. ఆ మాటకొస్తే కొన్ని సినిమాలపై విద్వేష ప్రచారాలు, బాయ్‌కాట్ పిలుపులతో గడచిన 2022 'బాయ్‌కాట్ బాలీవుడ్' నామ సంవత్సరంగా పాపులరైంది. చిత్రంగా బాయ్‌కాట్లేవీ జనంలో నుంచి తమకు తాము వచ్చినవి కాదు. కొన్ని ట్విట్టర్ ఖాతాలు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల తతంగం. ప్రత్యేకించి నిర్ణీత సినిమాలపైనే, వాటి రిలీజ్ వేళే సోషల్ మీడియా విద్వేషం వెళ్ళగక్కడం, మతోన్మాదపు మాటలతో లక్షలకొద్దీ ట్వీట్లు వెల్లువెత్తడం ఓ పకడ్బందీ పథకమే.

నిరుడు అలియా భట్ 'డార్లింగ్స్', ఆమిర్‌ఖాన్ 'లాల్‌సింగ్ చద్దా', విజయ్ దేవరకొండ 'లైగర్', రణబీర్ కపూర్ 'బ్రహ్మాస్త్ర'- ఇలా అనేకం బాయ్‌కాట్ విద్వేషం బారిన పడ్డవే. ఆ వరుసలో తాజా చేరిక 'పఠాన్'. ఈ యాక్షన్-థ్రిల్లర్ గూఢచారి చిత్రం 57 ఏళ్ళ వయసులో షారుఖ్ కెరీర్‌తో పాటు కరోనా నుంచి కుదేలైన హిందీ చిత్రసీమనూ మళ్ళీ పట్టాలెక్కిస్తుందని ఓ ఆశ. ఆ పరిస్థితుల్లో అందులోని 'బేషరమ్' పాటపై, ఆ పాటలో నాయిక ధరించిన ఆరెంజ్ రంగు బికినీపై, పాటలోని కొన్ని పదాలపై మధ్యప్రదేశ్ మంత్రి సహా విశ్వహిందూ పరిషత్ తదితర మితవాద సంస్థలు నిరసనల మొదలు నిషేధాల బెదిరింపుల దాకా వెళ్ళారు. చివరకు తమ నియామకమైన సెన్సార్ బోర్డ్ ఛైర్మన్ ప్రసూన్ జోషీ చేతనే ధర్మోపన్యాసాలు చెప్పించి, భావప్రకటనా స్వేచ్ఛను గాలికొదిలి సినిమాలో మార్పులు చేయించడం అప్రజాస్వామికమే.

అధికార పక్షానికి దగ్గరైన సినీ పెద్దలకూ ఈ సెగ తగిలి, కథ విదేశీ మీడియా దాకా వెళ్ళిందంటే తప్పెవరిది? ఎప్పుడూ పెదవి విప్పని అమితాబ్ సైతం కోల్‌కతా అంతర్జాతీయ చలన చిత్రోత్సవ వేదికపై పౌరహక్కులు, భావప్రకటనా స్వేచ్ఛ గురించి మాట్లాడాల్సి వచ్చింది. హీరో సునీల్ శెట్టి అస్తుబిస్తయిన చిత్రసీమ అవస్థను యూపీ సీఎంకు మొరపెట్టుకోవాల్సి వచ్చింది. పరిస్థితి చేయిదాటినప్పటికీ, ఇప్పటికైనా ప్రధాని తన వారికి సుద్దులు చెప్పడం చిరు సాంత్వన. అయినా సరే గోల పూర్తిగా సద్దుమణగలేదు. హిందూ స్వామీజీ అవిముక్తేశ్వరానంద సరస్వతి ఏకంగా 'ధర్మ సెన్సార్ బోర్డ్' పెట్టి, సినిమాల్లో సనాతన ధర్మ వ్యతిరేకత ఉంటే అడ్డుకుంటామనడం పరాకాష్ఠ.

జన్మనిచ్చిన తల్లితండ్రుల నుంచి ఇస్లామ్ ధర్మాన్ని గ్రహించి, క్రైస్తవ పాఠశాలలో చదువుకొని, ఢిల్లీ రామ్‌లీలా ఉత్సవాల్లో వానర వీరుడిగా నటించి, 'జై సీతారామ్‌కీ' అని నినదించి, హిందూస్త్రీని వివాహమాడి, పిల్లల్ని లౌకిక భారతీయులుగా పెంచుతున్న షారుఖ్ ఇవాళ ఈ ఉన్మాదులకు తన నిజాయతీని నిరూపించుకోవాల్సి రావడం సమాజానికే సిగ్గుచేటు. సెన్సారైన సినిమాలు సైతం కొన్నేళ్ళుగా చిక్కుల్లో పడుతున్నాయి. ఇందిరా గాంధీ కాలపు 'ఆంధీ', 'కిస్సా కుర్సీకా' నుంచి టీవీ సీరియల్ 'తమస్' (1988) మీదుగా ఇటీవలి 'పద్మావత్' (2018) దాకా అనేక చిత్రాలు కుల, మత, రాజకీయాల పేర అభ్యంతరకర చిత్రీకరణ అంటూ మూకస్వామ్యం పాలబడ్డాయి.

సెన్సార్ సర్టిఫికెట్లకూ, చట్టానికీ అతీతంగా వ్యవహరిస్తున్న రాజకీయ, నైతిక పోలీసు మూకల ముందు మోకరిల్లాల్సి వస్తున్న సినీసీమ ఇకనైనా ఒక్కతాటిపైకి రావాలి. సెన్సార్ బోర్డ్ సంస్కరణలపై మళ్ళీ చర్చ లేవనెత్తాలి. ఒకప్పుడు సెన్సార్ బోర్డ్ నిర్ణయాలపైనా అప్పీల్ చేసుకొనేందుకు అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉండేది. ఘనత వహించిన సర్కార్ గత ఏడాది దాన్ని ఏకపక్షంగా రద్దు చేసేసింది. ఇక, 2016 నాటి శ్యామ్‌బెనెగల్ కమిటీ, 2013 నాటి జస్టిస్ ముకుల్ ముద్గల్ కమిటీల సిఫార్సులకు అతీగతీ లేదు. వాటిని అమలు చేసేలా పాలకులను ఒప్పిస్తే మంచిది.

ఏమైనా, దేశంలో అన్నిటికీ అసహనం పెరిగిపోతున్న వేళ కళను కళగా చూడడం నేర్చుకోవాలి. అసభ్యాలు, అభ్యంతరాలుంటే అడ్డుకోవడానికి ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన సెన్సార్ బోర్డ్, పోలీసు వ్యవస్థ ఉండనే ఉన్నాయి. వాటిని తోసిరాజని రాజ్యాంగేతర నైతిక సెన్సారింగ్, పోలీసింగ్ చేయాలనుకోవడమే పెద్ద తప్పు. వీటికి తక్షణం అడ్డుకట్ట పడకపోతే... అనేక కులాలు, ధర్మాలు, భావజాలాల సహజీవనంతో రంగురంగుల ఇంద్రచాపమైన మన సంస్కృతి మొత్తానికీ ఒకే దేశం - ఒకే భావజాలం - ఒకే సంస్కృతి అనే దురవస్థ పడుతుంది. అప్పుడు కళ కాంతి తప్పుతుంది. వేల ఏళ్ళ చరిత్ర గల భారతావని కళవళ పడుతుంది. తస్మాత్ జాగ్రత్త!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.చవితి రా.6.32 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.2.06 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** ఉ.9.23 నుండి 10.54 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.51 నుండి 12.33 వరకు, **అమృతఘడియలు:** సా.6.30 నుండి 8.01 వరకు

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.47
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

డాక్యుమెంటరీ అంతా డొల్లతనమే!

విశ్లేషణ



వెంపటి శశి శేఖర్

భారత ప్రధాని నరేంద్ర మోదీపై బీబీసీ గతవారం ప్రసారం చేసిన డాక్యుమెంటరీ.. 'ఇండియా : ది మోదీ క్వశ్చన్' ప్రపంచవ్యాప్తంగా పెను వివాదాన్ని రాజేసింది. డాక్యుమెంటరీపై ఇండియా తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆ లింకులను తక్షణం బ్లాక్ చేయాలని ట్విట్టర్, యూట్యూబ్‌లను ఆదేశించింది. బ్రిటన్ ప్రధాని రుషి సునాక్ డాక్యుమెంటరీలోని అంశాలను తాను పూర్తిగా అంగీకరించడం లేదని ఇప్పటికే ప్రకటించగా, తాజాగా అమెరికా స్పందించింది. 'భారత్-అమెరికా' భాగస్వామ్య విలువలే తమకు ముఖ్యం అంటూ.. వివాదానికి దూరంగా జరిగింది! కాగా, 2002 నాటి గుజరాత్ అల్లర్లు కేంద్ర బిందువుగా బీబీసీ ఈ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన సమయంలోనే భారత్‌లోని ఆ సంస్థ రిపోర్టర్ ఒకరు గత 20 ఏళ్లలో దేశంలో భారీస్థాయి హింసాత్మక సంఘటనలు తగ్గిపోయాయని ఒక కథనం ప్రసారం చేయడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ డాక్యుమెంటరీ వ్యవహారం చూస్తుంటే... మిగతా విపరిణామాలతో పాటూ భారత్‌తో యూకే సంబంధాలూ దెబ్బతినే ప్రమాదం ఉందేమో అనిపిస్తోంది.

'ద బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్' (బీబీసీ) యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వ అధికార ప్రజా ప్రసార సంస్థ. రాయల్ ఛార్టర్ కింద ఏర్పాటైంది. బీబీసీకి ఆర్థిక నిధులు ప్రధానంగా యూకే ప్రజల నుంచి వసూలు చేసే లైసెన్స్ ఫీజు ద్వారా అందుతాయి. ఇలా ప్రజల సొమ్ము బీబీసీకి ఇవ్వడంపై ఇటీవల విమర్శలూ వచ్చాయి. ఇందుకు కారణాలు లేకపోలేదు. ప్రేక్షకులు, వీక్షకులు.. ఓటీటీలతో పాటు, ఇతర డిజిటల్ మాధ్యమాల వైపు మళ్లుతూండటం, బీబీసీ సంపాదకీయ వర్గ పోకడలపై తీవ్రమైన ప్రశ్నలు వస్తూండటం, రాజకీయ వివక్ష వంటివి ఆ కారణాల్లో కొన్ని. తాము స్వతంత్రంగానే ఉన్నామని, నిష్పాక్షికంగానే వ్యవహరిస్తున్నామని బీబీసీ చెబుతున్నా దేశపు వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు అది బ్రిటిష్ నిఘా వర్గాలకు సాయంగా నిలవడం దశాబ్దాలుగా జరుగుతున్న విషయం బహిరంగ రహస్యం కూడా.

వివక్షాపూరితం

భారత్‌లో ఇటీవలి కాలంలోనూ బీబీసీ సంపాదకీయ వర్గం పోకడలు వివక్షాపూరితంగా ఉన్న ఆరోపణలు వచ్చాయి. మరీ ముఖ్యంగా 'సిటిజన్ షిప్ ఎమెండ్‌మెంట్ యాక్ట్'పై ఢిల్లీలో జరిగిన అల్లర్ల విషయంలో బీబీసీ రెచ్చగొట్టేలా వ్యవహరించిందని, కోవిడ్ మరణాలపై కూడా సున్నితంగా వ్యవహరించలేదని ఆరోపణలున్నాయి. అందుకే.. బీబీసీ ప్రధాని నరేంద్రమోదీ, ముస్లిం సమాజాలను కేంద్రంగా చేసుకుని రెండు భాగాల డాక్యుమెంటరీ ప్రసారం చేయాలని నిర్ణయించడం పెద్దగా ఆశ్చర్యం కలిగించదు.

ఈ డాక్యుమెంటరీల్లో తొలి భాగం జనవరి 17వ తేదీ ప్రసారమైంది. ఆ డాక్యుమెంటరీని చూస్తే ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. యూకే ప్రజల సొమ్ముతో నడిచే బీబీసీ... భారత్ లాంటి దేశాల్లో వాణిజ్య అవసరాల కోసమే పనిచేస్తూండవచ్చునని అనుకోవచ్చు. మరిన్ని ఎక్కువ క్లిక్‌లు వచ్చేలా శీర్షికలు పెట్టడం కూడా అందుకే. అయితే 2002 నాటి గుజరాత్ అల్లర్లు కేంద్ర బిందువుగా బీబీసీ ఒక డాక్యుమెంటరీని ప్రసారం చేసిన సమయంలోనే భారత్ లోని ఆ సంస్థ రిపోర్టర్ ఒకరు గత 20 ఏళ్లలో దేశంలో భారీస్థాయి హింసాత్మక సంఘటనలు తగ్గిపోయాయని ఒక కథనం ప్రసారం చేయడం ఆసక్తి రేకెత్తిస్తోంది. భారత్‌లో మతాల మధ్య అంతరాన్ని ఉపయోగించుకోవాలని బీబీసీ ఎందుకు అనుకుంటోందన్నది పెద్ద ప్రశ్న. అది కూడా పెద్దపెద్ద ఘర్షణలనేవి దాదాపుగా లేని ఈ పరిస్థితుల్లో?

ఈ విషయాలను కాసేపు పక్కనబెట్టినా ఈ డాక్యుమెంటరీలో గుజరాత్ అల్లర్ల విషయాన్ని చూపిన విధానంపై మాత్రం నిశిత పరిశీలన జరపాల్సిందే. ఎందుకంటే.. ఈ దేశపు అత్యున్నత న్యాయస్థానం తన అభిప్రాయాన్ని స్పష్టం చేసిన అంశంపై ఈ డాక్యుమెంటరీ మళ్లీ ప్రశ్నలు లేవనెత్తుతోంది. అంతేకాదు.. భారత్, యూకేల మధ్య దౌత్య సంబంధాలను కూడా దెబ్బతీసేలా ఉందీ డాక్యుమెంటరీ. తొలి భాగం మొత్తం 2002 నాటి గుజరాత్ మతఘర్షణలు తరువాతి పరిణామాలపై తీశారు. బీబీసీ ఆ కాలంలో తీసిన వీడియో ఫుటేజ్‌లు, అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీతో జరిపిన ఇంటర్వ్యూలను ఈ డాక్యుమెంటరీలో వాడుకున్నారు. ఇది ఓ తప్పుడు వాదన తాలూకూ పునరుక్తి మినహా మరోటి కాదు. ఈ రకమైన వాదనతోనే అల్లర్లపై ఇరవై ఏళ్లపాటు కోర్టు కేసులు నడిచాయి. ఆ తరువాత సుప్రీంకోర్టు వాటిని చెత్తబుట్టలో వేసేసింది. గుర్తు తెలియని మోదీ వ్యతిరేకులపై ఆధారపడుతూ చేసిన ఈ డాక్యుమెంటరీ కొత్తగా చెప్పేదేమీ లేదు... పాతగాయాలను మళ్లీ రెచ్చగొట్టి కోపం, విద్వేషాలను పెంపొందించడం మినహా!



ఘటనల క్రమాన్ని మార్చింది

ఈ డాక్యుమెంటరీలోని మొత్తం విషయంలో ఐదు అంశాల గురించి వివరణ అవసరమవుతుంది. మొట్టమొదటగా చెప్పుకోవాల్సింది ఘటనల క్రమాన్ని మార్చిన విధం. 2002 ఫిబ్రవరిలో జరిగిన గోధ్రా ఘటన తరువాత డిసెంబరులో గుజరాత్ ఎన్నికలు జరిగినట్లు చూపించారు. వర్గాలుగా చీల్చే ప్రయత్నం అన్నమాట. ఈ క్రమంలో సెప్టెంబరులో అక్షరధామ్‌పై జరిగిన ఉగ్రదాడి గురించి అస్సలు ప్రస్తావనే లేదు. అలాగే అక్షరధామ్ దాడి తరువాత పరిస్థితిని అత్యద్భుతంగా చక్కదిద్దిన వైనమూ లేకుండా పోయింది. ఇక రెండో విషయానికి వద్దాం. అది.. హింసకు సంబంధించిన లెక్కల్లోని డొల్లతనం. కొన్ని ఘటనలను పెద్దవిగా చూపేందుకు గ్రాఫిక్‌లు కూడా వేశారు కానీ.. 2002 అల్లర్లను పోలీసులు ఎలా అదుపు చేశారన్న విషయంలో వాస్తవాలను విస్మరించారు. మొత్తం 4,247 కేసులు నమోదయ్యాయనీ, 26,974 మందిని అరెస్ట్ చేశారనీ, గుంపులను చెదరగొట్టేందుకు ఏకంగా 15,369 భాష్పవాయు గోళాలు వాడారనీ, తొలి 72 గంటల్లోనే పోలీసులు 5450 రౌండ్ల బుల్లెట్లు ప్రయోగించిన ఫలితంగా 101 మంది ఆందోళనకారులు మరణించారనీ బీబీసీకి తెలియకుండా ఏమీ ఉండదు. బీబీసీ డాక్యుమెంటరీతో వచ్చిన మూడో చిక్కేమిటంటే.. వాళ్లూ వీళ్లూ చెప్పిన విషయాలపై ఎక్కువగా ఆధారపడటం. సాక్షులు, సాక్ష్యాలు ఏవీ కొత్తగా లేకపోవడం.

నిజానికి రెండు దశాబ్దాలపాటు నరేంద్ర మోదీని ఏదో ఒక రకంగా వ్యక్తిగతంగానైనా 2002 అల్లర్లలో ఇరికించాలని బోలెడన్ని ప్రయత్నాలు జరిగాయి. ఇవన్నీ కూడా తప్పుడు ఆరోపణలు, సందేహాస్పద వ్యక్తుల మాటలపై ఆధారపడి చేసినవే. న్యాయస్థానాలు వీటి డొల్లతనాన్ని ఎప్పుడో తేల్చేశాయి. ఊరూపేరూ లేని వారి మాటలను వ్యాప్తి చేయడం.. అపవాదులు మోపడం మాత్రమేనని స్పష్టం చేశాయి. నాలుగవ సమస్య గురించి చూద్దాం. ఇందులో వ్యక్తులను ఉదాహరించిన పద్ధతి ప్రశ్నార్థకమైంది. సుప్రీంకోర్టు సమగ్రతను ప్రశ్నించేలా ఉన్నాయి ఇవి. చివరదైన ఐదవ సమస్య... బ్రిటిష్ దౌత్య కార్యాలయం నిర్వహించిందని చెబుతున్న రహస్య విచారణ. ఇందులో సత్యమెంతో, అవాస్తవాలెన్నో ఎవరికీ తెలియదు.

చిచ్చు పెట్టేందుకే...

అయితే.. ఈ డాక్యుమెంటరీలో బ్రిటిష్ విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి రహస్య విచారణపై అధికారికంగా ప్రకటన చేయడం వివాదాస్పద పోకడకు శ్రీకారం చుట్టినట్టు అవుతుంది. బీబీసీ తనదైన విదేశీ విధానాన్ని అమలు చేయాలని.. దౌత్యపరమైన ఇబ్బందులతో తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. భారత్‌లో మరోసారి మత ఘర్షణల చిచ్చు పెట్టేందుకు బీబీసీ చేసిన ఈ ప్రయత్నం.. తుది శ్వాస తీసుకుంటున్న తరుణంలో మనుగడ కోసం చేసిన నిష్ఫల ప్రయత్నంగా తోస్తోంది. బీబీసీ అధ్యక్షుడు ఇటీవల బీబీసీ ఏర్పాటు ఉద్దేశాల్లో పబ్లిక్ సర్వీస్ అన్నది తొలిగి పోయేలా ఉందని వ్యాఖ్యానించడం ఇక్కడ చెప్పుకోవాలి. ఈ డాక్యు మెంటరీ వ్యవహారం చూస్తుంటే... భారతీయ ప్రజాస్వామ్య సుస్థిరతను, అత్యున్నత ప్రభుత్వ సంస్థల సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నం చేస్తూ.... బీబీసీ పబ్లిక్ సర్వీసును పూర్తిగా వదులుకోవడమే కాకుండా.. భారత్‌తో యూకే సంబంధాలను కూడా దెబ్బతీస్తున్నట్లు కనిపిస్తోంది.

వ్యాసకర్త ప్రసార భారతి మాజీ ఛైర్మన్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గోధ్రా కథే కదా!



భారత్‌లోని అన్ని వర్సిటీలలో బీబీసీ డాక్యుమెంటరీ 'ఇండియా : ది మోదీ క్వశ్చన్'ను ప్రదర్శించనున్నట్లు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. అందులో కొత్తగా మళ్లీ ఏం ఉంటుందని?!

– కోరా అబ్రహాం, జర్నలిస్ట్

ఎవరి మీద కోపం?



టర్కీలో స్వీడిష్ జెండాలను తగలబెడుతున్నా, స్వీడన్‌లో ఎవరూ దాని గురించి పట్టించుకోరని వారికెవరైనా చెప్పారా? దేశం బలహీనంగా, అనిశ్చితంగా ఉన్నప్పుడు మాత్రమే జెండాలు శక్తిమంతమౌతాయి.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

మీరే మిగిలిన ఆశ



కశ్మీరీ పండిట్‌లు రాహుల్ గాంధీతో ఏమన్నారో వినండి : "మోదీ ప్రభుత్వం మమ్మల్ని ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఉపయోగించుకుంది. మా సంక్షేమం కోసం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాకు చేసిన వాటిని మోదీ ప్రభుత్వం తీసేసింది".

– ప్రశాంత్ భూషణ్, యాక్టివిస్ట్

గుండెబలం కావాలి



మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు భారతీయ క్రీడల్లో చీకటి కోణాన్ని బహిర్గతం చేశాయి. ముఖ్యంగా రెజ్లింగ్ ఫెడరేషన్‌కు నేతృత్వం వహిస్తున్న బి.జె.పి. ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్ వంటి ఘరానా వ్యక్తికి వ్యతిరేకంగా మాట్లాడటానికి ఎంతో ధైర్యం అవసరం.

– నిధీ రజ్దాన్, సంపాదకురాలు

జగమే మాయ



ఒక అపరిచితుడు బెంగళూరు కె.ఆర్. పురం ఫ్లై ఓవర్ పైనుంచి రోడ్డు మీదికి పది రూపాయల నోట్లను వెదజల్లడంపై పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. చివరకది ఒక కొత్త స్టార్టప్ కంపెనీ మార్కెటింగ్ వ్యూహం అని తేలినా ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. ఇది బెంగళూరు బాబూ..!

– వినయ్ అరవింద్, సోషలిస్ట్

బుల్ షిట్ (బి.ఎస్)



సంచలన వార్త! మరింత ప్రమాదకరమైన కొత్త కోవిడ్ వేరియంట్ బయటపడింది. దాని పేరు బి.ఎస్-24/7. ఇది ఇంగిత జ్ఞానంపై దాడి చేస్తుంది. సాక్ష్యాల ఆధారంగా ఔషధం అని రుజువైన వాటిని నాశనం చేస్తుంది. ఈ కొత్త వేరియంట్ ప్రధాన స్రవంతి మీడియా, ఫాక్స్, సీడీసీ ద్వారా వ్యాపిస్తుంది.

– డాక్టర్ ఎలి డేవిడ్, పరిశోధకుడు

ఈ అహంకారాన్ని ఏమనాలి?



తనకు కుర్చీ తీసుకురావడంలో కాస్త జాప్యం అయినందుకు తమిళనాడు మంత్రి ఆవడి నాసర్ తమ పార్టీ కార్యకర్తపై గట్టిగా రాయి విసిరారు! ఆరు బయట తాత్కాలిక టెంట్‌లో ఏర్పాటైన సమావేశంలో తనకు వేయాల్సిన కుర్చీ కోసం ఆయన కొద్ది క్షణాలైనా వేచి వుండలేకపోయారు. ఇదీ మన నేతల తీరు. నీతులు చెప్పటానికే కానీ, ఆచరించడానికి మాత్రం కాదు!

– షబ్బీర్ అహ్మద్, ఎక్స్-పేపర్‌బాయ్

ఇన్‌బాక్స్

ఒక దేశం – ఒకే పువ్వు

ఎవరో ఒక కొత్త చట్టం తీసుకొచ్చారు
వీచే ముందు గాలులు అనుమతి తీసుకోవాలని
వీచే ముందు గాలులు తమ దిశ దశ ఏమిటో ఎటో
వివరాలు తెలియ జేయాలని
ఎవరో కొత్త చట్టం తెచ్చారు

గాలులు ఎంత దూరం పోవాలనుకున్నాయో
అవి ఎంత వేగంగా వీచాలనుకున్నాయో
వివరాలు సమర్పించనిదే అనుమతి దొరకదని
ఎవరో కొత్త చట్టం తెచ్చారు
ఇప్పుడిక్కడ సుడిగాలులకు అనుమతి లేదు

మేం కదుతున్న ఆ పేకమేడల్ని
సంరక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది
అందువల్ల ఈ చట్టాలు
సత్వరమే అమల్లోకొస్తున్నాయి!
తమ చుట్టాలకు అనుగుణంగా
ఎవరో ఇక్కడ కొత్త చట్టాలు తెచ్చారు

ఒడ్డును తాకే కెరటాలక్కూడా ఒక హెచ్చరిక!
ఎగిసెగిసి పడటం మళ్లీ తిరిగి వెళ్ళడం
బలం పుంజుకుని మళ్లీ నీటి పిడికిళ్ళతో
తిరిగి రావడం ఇవన్నీ ఇప్పుడిక కుదరదు
తిరుగుబాట్లు, ఉద్యమాలు,
హోరెత్తిపోవడాలు నిషిద్ధం
ఎంతటి ఉధృతి ఉన్నా బుద్ధిగా ఒడ్డులోపల మాత్రమే
నిశ్శబ్దంగా ప్రవహించాల్సి ఉంటుంది!

తోటలోని మొక్కలన్నీ ఒకే విధంగా పూయాలని
పూచే పూల రంగు కూడా ఒకటిగానే ఉండాలని
కొత్త చట్టం అమలులో కొచ్చింది
ఒకే రంగు మాత్రమే కాదు
ఏ పువ్వు రంగు ఎంత గాఢంగా ఉండాలో కూడా
వారు నియమించిన వారి అధికారులే నిర్ణయిస్తారట!

ఒక దేశం - ఒకే పువ్వు!!
ఈ చట్టాలు చేసిన గౌరవనీయులకు ఎవడు చెప్పాలి?
తోటలో అన్ని మొక్కల పూలు ఒకే రకంగా ఉండవని -
ఉండటానికి వీలే లేదని -
ఒక రంగులో అనేక రంగులుంటాయని కూడా
వారికి ఎవడు చెప్పాలి?

గాలులు, కెరటాలు ఎవరి చట్టాలకూ లొంగవనీ
గాలి ఎవరి పిడికిలిలోనో ఖైదీగా ఉండదని
కెరటం ఎవరి జీవోలతోనో వెనక్కి మళ్ళదని
ఎంతటి వారైనా సరే, వాటిని గమనిస్తూ
వాటికి అనుగుణంగా బతకాల్సిందే తప్ప
మరో మార్గం లేదని!
లేకపోతే, అవి సృష్టించే సునామీలో
అడ్రసు లేకుండా గల్లంతు కావల్సిందేనని
నామరూపాలు లేకుండా నశించాల్సిందేనని
వారికి ఎవరైనా చెప్పండి!
కనీస గౌరవమైనా... కాపాడుకొమ్మని!!

– డాక్టర్ దేవరాజు మహారాజు
(దేశవ్యాప్తంగా జరిగిన రైతు ఉద్యమ నేపథ్యంలో)

ప్రజల చేతిలోని పాశుపతాస్త్రం

సందర్భం



రాజీవ్ కుమార్

ఈ రోజు భారత ఎన్నికల సంఘాన్ని స్థాపించిన రోజు. 2011 నుండి జాతీయ ఓటర్ల దినోత్సవంగా కూడా జనవరి 25ను జరుపుకొంటున్నాం. దీని ఉద్దేశం ఓటర్లుగా భారత పౌరులకు ఉన్న హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించడమే. ఎన్నిల సంఘం (ఈసీ) పనితీరు, నిర్ణయం తీసుకునే స్వతంత్రతను నిర్ధారించడానికి రాజ్యాంగ సభ ఆర్టికల్ 324 ద్వారా రాజ్యాంగ హెూదాను ఇచ్చింది. తక్కువ అక్షరాస్యత, ఉనికిలో లేని ఓటర్ల జాబితా యుగంలో వయోజన ఓటు హక్కు ఆధారంగా ఎన్నికలను నిర్వహించడానికి శాశ్వతమైన స్వయంప్రతిపత్తి గల కమిషన్‌ను ఏర్పాటు చేయడం రాజ్యాంగ సభ దూరదృష్టికి ప్రతీక. ఈసీ నిష్పాక్షికత , విశ్వసనీయత ఆధారంగా ఇప్పటివరకు 17 లోక్‌సభ ఎన్నికలు; రాష్ట్రపతి ఎన్నికలు 16 సార్లు, అదే విధంగా ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి మరో 16 సార్లు ఎన్నికలు నిర్వహించింది. అలాగే 399 సార్లు శాసనసభ ఎన్నికలు నిర్వహించింది. 400వ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. చాలావరకు రాజకీయపార్టీల, ప్రజల విశ్వాసాన్ని ఎన్నికల సంఘం చూరగొన్నదనే చెప్పాలి.

పటిష్ఠమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి బలమైన, సమ్మిళిత ఎన్నికల భాగస్వామ్యం చాలా కీలకం. శక్తిమంతమైన ప్రజాస్వామ్యంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, సక్రమంగా, విశ్వసనీయంగా ఉండాలి. అదే సమయంలో ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఈ సందర్భంగా 'మనం విధులను నిర్వర్తించకుండా వదిలేస్తే, హక్కుల కోసం పరుగు తీయాల్సి ఉంటుంది. అవి మనల్ని ఇష్టానుసారంగా తప్పించుకుంటాయి' అన్న మహాత్మాగాంధీ మాటలు గుర్తు కొస్తున్నాయి.

94 కోట్లకు పైగా నమోదిత ఓటర్లను కలిగి ఉన్న భారత్... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. గత సార్వత్రిక ఎన్నికలలో (2019) 67.4 శాతం ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. మిగిలిన 30 కోట్ల మంది ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకురావడం ఇప్పుడు మనముందున్న పెద్ద సవాల్. యువత లోనూ, పట్టణ ఓటర్లలోనూ ఉన్న ఉదాసీనత; బతుకుదెరువు కోసం ఎక్కడెక్కడికో వలసపోవడం వంటి అనేక కారణాల వల్ల ఇంతమంది ఓటింగ్‌లో పాల్గొనలేదని చెప్పవచ్చు.

2022 నవంబర్ 5న హిమాచల్‌ప్రదేశ్ కల్పాలో మరణించిన మొట్టమొదటి భారత ఓటర్ శ్యామ్ శరణ్ నేగీకి నివాళులు అర్పించే గౌరవం నాకు లభించింది. ఆయన తన 106వ ఏట మరణించే ముందు కూడా ఓటు హక్కును ఉపయోగించుకుని ఓటు వేయకుండా ఉండే ఉదాసీన పౌరులకు తమ విధి ఏమిటో తెలియచేశారు. ఆయన స్ఫూర్తిని అందరూ అందుకోవాలి.



యువ ఓటర్లే భారత ప్రజాస్వామ్యానికి భవిష్యత్తు. 2000 సంవత్సరం తర్వాత జన్మించిన తరం మన ఓటర్ల జాబితాలో చేరడం ప్రారంభించింది. ఓటర్లుగా వారి భాగస్వామ్యం మొత్తం శతాబ్దమంతా ప్రజాస్వామ్య భవిష్యత్తును రూపుదిద్దబోతోంది. అందువల్ల ఓటు వేసే వయస్సు వచ్చేలోపు పాఠశాల స్థాయిలోనే ప్రజాస్వామ్య బీజం విద్యార్థుల్లో నాటడం అత్యంత క్లిష్టమైనదే కాదు, ముఖ్యమైనది కూడా.

ప్రజాస్వామ్యంలో, ఓటర్లకు తాము ఓటు వేసే అభ్యర్థి నేపథ్యం గురించి తెలుసుకునే హక్కు ఉంది. ఈ కారణంగానే అభ్యర్థులపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల గురించి వార్తాపత్రికల్లో తెలియజేయాలి. ఇప్పటికీ ఎన్నికల్లో కండబలాన్ని ఉపయోగించడానికి ప్రయత్నించేవారు కొన్ని రాష్ట్రాల్లో ఉన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం ఉండకూడదు. ఎన్నికల్లో ధనబలాన్ని అరికట్టడం పెద్ద సవాల్‌గా మిగిలిపోయింది. చట్టాన్ని అమలు చేసే సంస్థల కఠినమైన నిఘా కారణంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో చాలా వరకు ఇటువంటి విపరీత ధోరణులకు అడ్డుకట్ట పడింది. ఎన్నికలను ప్రభావితం చేయగల స్థాయిలో ఇవ్వాళ సోషల్ మీడియా ఉంది. అందులో నకిలీ వార్తల ప్రచారం జరగకుండా చూడాల్సి ఉంది.

ఎన్నికలను అన్ని జాగ్రత్తలతో నిర్వహించడం ఎన్నికల సంఘం విధి. ఎన్నికల ప్రక్రియలో ఓటరే ప్రధాన భాగస్వామి. అందుకే ఓటు వేయడానికి కావలసిన స్నేహపూర్వక, సుహృద్భావ వాతావరణాన్ని కల్పించడం ద్వారా ఓటర్లు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనేలా ఈసీ తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించడానికి కంకణబద్ధమై ఉంది. పౌరులు ఓటరుగా తన కర్తవ్యాన్ని నిర్వహించడానికి గర్వపడగలిగితే అది వారు ఎన్నుకున్న ప్రభుత్వ పాలనా స్థాయి మీద కూడా ప్రభావం చూపుతుంది. పౌరులందరికీ జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు!

వ్యాసకర్త భారత ప్రధాన ఎన్నికల కమిషనర్
(నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం)


వైఎస్సార్ జిల్లా కూనవారిపల్లెలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


కాకినాడ జిల్లా పిఠాపురం 27వ వార్డులో లబ్ధిదారుకి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

గడప గడపకు మన ప్రభుత్వం


ఏలూరు జిల్లా గోగుంటలో వృద్ధురాలికి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

క్లుప్తంగా...

నేటి నుంచి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: బీఈడీ తదితర ఉపాధ్యాయ విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎడ్‌సెట్–2022 వెబ్ కౌన్సెలింగ్ ఈ నెల (25న) బుధవారం నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె.రామ్మోహన రావు మంగళవారం విడుదల చేశారు. బుధవారం నుంచి 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 28న ఆప్షన్లలో సవరణకు అవకాశమిచ్చి, 30న సీట్లు కేటాయిస్తామన్నారు. 31 నుంచి ఫిబ్రవరి 3 లోపు కాలేజీల్లో చేరాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

స్ఫూర్తిదాయక పుస్తకం 'ఎగ్జామ్ వారియర్స్'

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రచించిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ స్పష్టం చేశారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకం తెలుగు అనువాదాన్ని రాజ్‌భవన్‌లో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. గవర్నర్ మాట్లాడుతూ పరీక్షల సమయంలోనే కాకుండా జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ పుస్తకం ఓ నేస్తం వంటిదన్నారు. బోధనలా కాకుండా విద్యార్థుల్లో ఆలోచనలను రేకెత్తించేలా మార్గదర్శిగా నిలుస్తుందని చెప్పారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఎ.సాంబశివారెడ్డి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పన కమిషనర్ కాటంనేని భాస్కర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డితో పాటు పలువురు వీసీలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చంద్ర 'గ్రహణం'

849వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: బహుజనులను వివక్షకు గురి చేస్తూ వారికి చట్టబద్ధంగా అందాల్సిన హక్కులు అందకుండా కోర్టుల్లో తప్పుడు కేసులు వేసి రాష్ట్రాభివృద్ధిని టీడీపీ అధినేత చంద్రబాబు అడ్డుకుంటున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో 849 రోజు మంగళవారం పలువురు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రచార ఆర్భాటాలకు వాడుకుని దిగమింగిన బాబు వేదికలపై బహుజనులపై ప్రేమను కురిపిస్తుండడం ధృతరాష్ట్ర కౌగిలి కాదా అని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ఆదర్శంగా తీసుకుని దేశంలో పలు రాష్ట్రాలు పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. పేదల ప్రాణాలను పణంగా పెడుతూ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్న వ్యవహారంపై ప్రభుత్వం జీఓ నం1ను విడుదల చేస్తే దానిపై కోర్టుల్లో కేసులు వేసి అడ్డదారిలో స్టే ఇప్పించాలని చూసిన బాబుకు కోర్టు చీవాట్లు పెట్టడం హర్షణీయమని, ఇకనైనా తన పద్ధతి మార్చుకుంటే మంచిదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడి తల్లికి రూ.1.61 లక్షల లబ్ధి

పెళ్లకూరు: తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం టీడీపీ మండలాధ్యక్షుడు, కొత్తూరు పంచాయతీ సర్పంచ్ సంచి కృష్ణయ్య తల్లి రమణమ్మకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు రూ.1,61,678 సంక్షేమ ఫలాలు అందాయి. మంగళవారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆమెను కలిసి సంక్షేమ ఫలాల బుక్‌లెట్‌ను అందజేశారు. కృష్ణయ్య తల్లికి ప్రత్యేకంగా రేషన్ కార్డు ఉండటంతో ఆమెకు వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.1,795, రైతు భరోసా కింద రూ.25,000, వితంతు పింఛన్ ద్వారా రూ.82,000, డ్వాక్రా సున్నా వడ్డీ రూపంలో రూ.5,513, వైఎస్సార్ ఆసరా కింద రూ.47,370 కలిపి మొత్తం రూ.1,61,678 మేరకు సంక్షేమ ఫలాలు అందినట్లు బుక్‌లెట్‌లో నమోదైంది.

జేఈఈ మెయిన్‌లో కష్టంగా మ్యాథ్స్

దీర్ఘస్థాయి ప్రశ్నలతో అభ్యర్థులకు చిక్కులు

- ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రశ్నలు ఒకింత సులభం
- ఫిజిక్స్‌లో గతేడాది ప్రశ్నలే పునరావృతం

సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)ల్లో ప్రవేశానికి మంగళవారం నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ పరీక్ష తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 290 పట్టణాల్లో, విదేశాల్లో 25 పట్టణాల్లో ఈ పరీక్షను ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించారు. రాష్ట్రంలో 70 పట్టణాల్లో పరీక్ష జరిగింది.

దీర్ఘంగా మ్యాథ్స్ ప్రశ్నలు..

తొలిరోజు పరీక్షలో మ్యాథ్స్ ప్రశ్నలు దీర్ఘంగా ఉండి ఒకింత కఠినంగా ఉన్నాయని పలువురు అభ్యర్థులు పేర్కొన్నారు. మ్యాథ్స్‌తో పోల్చుకుంటే ఫిజిక్స్ కొంచెం సులభంగా ఉందన్నారు. కెమిస్ట్రీలో కూడా ప్రశ్నలు సులువుగానే ఉన్నాయని వివరించారు. మ్యాథ్స్‌లో త్రీ డైమెన్షనల్ జామెట్రీలో ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని విజయవాడలోని ప్రముఖ ప్రైవేటు కార్పొరేట్ కాలేజీ అధ్యాపక నిపుణుడు జి.వెంకటేశ్వరరావు తెలిపారు. 3డీ అండ్ ఇంటిగ్రేషన్, వెక్టార్ విభాగాల్లో ప్రశ్నలు ఇచ్చారన్నారు. కెమిస్ట్రీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో ప్రశ్నలు ఎక్కువగా అడిగారని వెల్లడించారు. ఇనార్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో ప్రశ్నలు తక్కువగానే ఉన్నాయని చెప్పారు. ఫిజిక్స్‌లోని ప్రశ్నల్లో అత్యధికం గతేడాది జేఈఈ మెయిన్‌లో వచ్చినవే ఉన్నాయన్నారు. థర్మోడైనమిక్స్, సెమీ కండక్టర్, కైనమేటిక్స్ అంశాల్లో ప్రశ్నలు అడిగారని తెలిపారు. మొత్తంగా చూస్తే గతేడాది మాదిరిగానే ఈసారీ జేఈఈ మెయిన్ ప్రశ్నలు ఉన్నాయన్నారు. పాత ప్రశ్నపత్రాలను బాగా సాధన చేసినవారికి ఈసారి ఎక్కువ మార్కులు వచ్చే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. మొత్తంగా చూస్తే ఈసారి మెయిన్ పరీక్ష మధ్యస్తంగా ఉందన్నారు. కొన్ని ప్రశ్నలు చాలా సులభంగా ఉన్నాయని చెప్పారు. తొలిరోజు పరీక్ష రాసిన అభ్యర్థులు 152 నుంచి 200 వరకు మార్కులు సాధించగలుగుతారని అభిప్రాయపడ్డారు.


విశాఖపట్నంలోని షీలానగర్ డిజిటల్ అయాన్ పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు

ఏపీ నుంచి పెరిగిన అభ్యర్థులు

కాగా దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ తొలివిడత పరీక్షకు 8.8 లక్షల మంది నమోదు చేసుకున్నారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్ నుంచి ఎక్కువమంది దరఖాస్తు చేశారు. మహారాష్ట్ర నుంచి 1,03,039 మంది, ఉత్తరప్రదేశ్ నుంచి 99,714 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 91,799 మంది, తెలంగాణ నుంచి 86,840 మంది, రాజస్థాన్ నుంచి 59,641 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధిక శాతం మంది పరీక్షకు హాజరయ్యే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు ఫిబ్రవరి 1 వరకు రోజుకు రెండు సెషన్లలో కంప్యూటరాధారితంగా నిర్వహిస్తారు. కాగా ఈ పరీక్షకు కొంతమంది బహుళ దరఖాస్తులందించారు. ఇలాంటి వారిని తిరిగి స్క్రూటినీ చేశాక పరీక్షకు అనుమతించనున్నారు. వీరందరినీ హోల్డ్‌లో పెట్టామని ఎన్‌టీఏ తెలిపింది. పరిశీలన పూర్తయిన అభ్యర్థులకు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఉన్న రోజుల్లో పరీక్షకు అనుమతించనున్నట్లు పేర్కొంది.

సాధారణ షరతులతో అనుమతి

- లోకేశ్ పాదయాత్రకు కొత్తగా ఎలాంటి నిబంధనలు విధించని పోలీసులు
- ర్యాలీలు, సమావేశాలకు దేశవ్యాప్తంగా ఉన్నవే వర్తింపు

సాక్షి, అమరావతి: టీడీపీ నేత నారా లోకేశ్ పాదయాత్రకు పోలీసులు అతి సాధారణ షరతులతో అనుమతి ఇచ్చారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేటప్పుడు అంబులెన్స్‌లకు దారి ఇవ్వాలని, మారణాయుధాలతో సంచరించరాదని దేశవ్యాప్తంగా పోలీసులు షరతులు విధిస్తున్నారు. దశాబ్దాలుగా అమలులో ఉన్న ఈ నిబంధనలను అనుసరించే లోకేశ్ పాదయాత్ర, బహిరంగ సభలకు పోలీసులు మంగళవారం విడివిడిగా అనుమతులు జారీ చేశారు. ఆయా ప్రాంతాల్లోని డీఎస్పీలకు దరఖాస్తు చేసుకుంటే అన్ని అంశాలను పరిశీలించి అనుమతులు జారీ చేస్తామని పోలీసుశాఖ తెలిపింది. లోకేశ్ పాదయాత్ర ప్రారంభించనున్న కుప్పం నియోజకవర్గం పలమనేరు డీఎస్పీ అనుమతి ఇచ్చారు. పాదయాత్ర, బహిరంగ సభల్లో పాల్గొనేవారి భద్రత కోసమే నిబంధనల మేరకు అనుమతి జారీ చేశామని పోలీసులు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల సౌలభ్యం, భద్రత దృష్ట్యా నిబంధనలను సక్రమంగా పాటిస్తే పూర్తిగా సహకరిస్తామన్నారు.

అతి సాధారణ షరతులు ఇవీ..

- పాదయాత్రతో అత్యవసర సేవలకు ఆటంకం కలిగించరాదు.
- ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ప్రదేశాల్లో ముఖాముఖి నిర్వహించుకోవాలి.
- పురుషులు, మహిళా వలంటీర్లను తగినంత మందిని ఏర్పాటు చేసుకుని ప్రత్యేక యూనిఫాం కేటాయించాలి. రోప్‌లు అందచేసి నియంత్రించాలి.
- పాదయాత్రలో పాల్గొనేవారు, సభలకు హాజరయ్యేవారు ఎలాంటి మారణాయుధాలు, రాళ్లు తదితరాలను తేకూడదు.
- మద్యం, మత్తు పదార్థాలను సేవించరాదు.
- పాదయాత్రలో పాల్గొనేవారి వ్యక్తిగత భద్రత, ఆరోగ్య బాధ్యతలను నిర్వాహకులు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాలు, ఇతర దుర్ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. తగినంత మంది వైద్య సిబ్బంది, అత్యవసర మందులతో కూడిన అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలి. రాత్రి బస చేసే ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి తగినంత లైటింగ్ సమకూర్చుకోవాలి.
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల విధ్వంసం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- బహిరంగ సభలను రోడ్లపై కాకుండా ఏదైనా మైదానంలోగానీ ప్రత్యేక ప్రదేశంలోగానీ ఏర్పాటు చేసుకోవాలి. అంచనా కంటే 20 శాతం మంది అధికంగా పట్టేందుకు వీలున్న ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలి.
- ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్తు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలి.
- స్థల యజమానులు ఎన్‌వోసీ సమర్పించాలి.
- సభలకు హాజరయ్యే వారికి ఆహారం, నీళ్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలి.

ఆరుగురు టీడీపీ వర్గీయులకు జీవితఖైదు

వైఎస్సార్ సీపీ నేత చెన్నారెడ్డి హత్యకేసులో సంచలన తీర్పు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఓ హత్యకేసులో ఆరుగురు టీడీపీ వర్గీయులకు జీవిత ఖైదు పడింది. ఈమేరకు మంగళవారం అనంతపురం జిల్లా జడ్జి శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే.. 2017 డిసెంబర్ 6వ తేదీన ధర్మవరం సమీప గ్రామమైన బడన్నపల్లికి చెందిన ఎర్రగుంట చెన్నారెడ్డి తన టీవీఎస్ మోపెడ్‌లో యూరియా బ్యాగుతో తోటకు వెళుతుండగా... అదే గ్రామానికి చెందిన కపాడం గంగాధర్, కపాడం సూర్యనారాయణ, దాసరి పెద్దన్న, దాసరి శివయ్య, దాసరి గంగాప్రసాద్, కపాడం నాగరాజు దారి కాచి వేటకొడవళ్లు, గొడ్డళ్లతో దారుణంగా నరికి చంపారు. చెన్నారెడ్డి.. గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున క్రియాశీలంగా వ్యవహరించేవారు. అంతేకాదు మరో రెండ్రోజుల్లో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో భాగంగా ఆ గ్రామానికి రావాల్సి ఉంది. దీనికి సంబంధించి చెన్నారెడ్డి ఏర్పాట్లు భారీగా చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చెన్నారెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారని, ఇతన్ని చంపితే రాజకీయంగా తమకు ఎదురుండదని భావించి దుర్బుద్ధితో దారుణంగా నరికి చంపారు. చెన్నారెడ్డిని హత్యపై అదే రోజు ఆయన భార్య భాగ్యలక్ష్మి ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు (క్రైం నెం.118/2017/యుఎస్.302 ఆర్/డబ్ల్యు 34 ఐపీసీ) చేశారు. ఈ ఫిర్యాదుతో ధర్మవరం రూరల్ పోలీసులు ఎనిమిది మందిపై చార్జిషీటు దాఖలు చేశారు. ఇద్దరిపై నేరం రుజువు కాకపోవడంతో జడ్జి వారిని నిర్దోషులుగా ప్రకటించారు. మిగతా ఆరుగురికి జీవితఖైదుతో పాటు ఒక్కొక్కరికీ రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

వైద్యుల సేవాభావం

- ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు
- భవన నిర్మాణానికి ఆరోగ్యశ్రీ ప్రోత్సాహకాలు రూ.49 లక్షలు ఇచ్చిన వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. నాడు–నేడు ద్వారా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఈ తరుణంలో తమకు అవసరమైన వసతులు కల్పించుకునేందుకు మేము సైతం అంటూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల వైద్యులు ముందుకు వచ్చారు. కోవిడ్ సమయంలో విధులు నిర్వహించిన వైద్యులకు వచ్చిన ఆరోగ్యశ్రీ ప్రోత్సాహకాలు రూ.49 లక్షలను వైద్య కళాశాలలో క్యాంటీన్‌భవన నిర్మాణం కోసం ఇచ్చి తమ సేవాభావం చాటుకున్నారు. క్యాంటీన్ భవనాన్ని జీ+1 అంతస్తుల్లో 1,350 చదరపు అడుగుల్లో నిర్మించాలని అంచనాలు సిద్ధం చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో క్యాంటీన్, మొదటి అంతస్తులో అన్ని వసతులతో ఆరు గదులు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను రూ.65 లక్షల వరకూ ఖర్చు అవుతుందని అంచనాలు వేశారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ప్రోత్సాహకాలు రూ.49 లక్షలు ఉండగా, మిగిలిన మొత్తాన్ని వైద్యులందరూ కలిసి సమీకరించేందుకు సిద్ధమవుతున్నారు. భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులను కోరనున్నారు.

అభినందనీయం

క్యాంటీన్ ఏర్పాటు ఆవశ్యకత ఎంతో ఉంది. ప్రస్తుతం పరీక్షల సమయంలో ఎగ్జామినర్స్ ఉండేందుకు, భోజనాలకు బయటకు వెళ్లాల్సి వస్తుంది. అలా కాకుండా ఇక్కడే క్యాంటీన్ ఏర్పాటు చేయడం ద్వారా భోజనాలకు, ఎగ్జామినర్స్ ఉండేందుకు ఇబ్బంది ఉండదు. అందుకోసం వైద్యులందరూ కలిసి ముందుకురావడం అభినందనీయం.

– డాక్టర్ నత్తా శ్రీనివాస విఠల్‌రావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల

తిరుమల లడ్డూ కౌంటర్‌లో రూ.2 లక్షలు చోరీ

తిరుమల: తిరుమలలోని లడ్డూ కౌంటర్లలో విధులు నిర్వహిస్తున్న కార్పొరేషన్ ఉద్యోగి నుంచి రూ.2 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు సీసీ కెమెరాల ఫుటేజి ద్వారా అనుమానితుడిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ద్వారా తిరుమల లడ్డూ కాంప్లెక్సులో నెల కిందట రాజా కిషోర్ కౌంటర్ బాయ్‌గా విధుల్లో చేరాడు. సోమవారం రాత్రి 36వ కౌంటర్‌లో విధులు ముగించుకుని లడ్డూల విక్రయం ద్వారా వసూలైన రూ.2 లక్షలను తన వద్దే ఉంచుకుని గడియ పెట్టడం మరిచిపోయి కౌంటర్‌లోనే నిద్రపోయాడు. ఉదయం నిద్ర లేచి చూసేసరికి నగదు సంచి కనిపించలేదు. విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించారు. పాత నేరస్తుడైన సీతాపతి అనే అనుమానితుడిని గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. నిందితుని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

'మువ్వన్నెల' ముస్తాబు


విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లలో భాగంగా మువ్వన్నెల జెండాతో ప్రాంగణం తీర్చిదిద్దారు. త్రివర్ణ పతాకం రెపరెపలతో ముస్తాబైన స్టేడియం అందరినీ ఆకట్టుకుంటుంది.

–విజయ్‌కృష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అమ్మ పండగ..గుండె నిండుగా

- వైభవంగా శంబర పోలమాంబ సిరిమానోత్సవం
- అమ్మవారిని దర్శించుకున్న 2 లక్షల మంది భక్తులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం కనుల పండువగా సాగింది. సిరిమానోత్సవాన్ని భక్తులు వీక్షించి అమ్మవారికి జేజేలు పలికారు. సిరిమాను పూజారి ఆశీర్వచనాలను అందుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలంలోని శంబర గ్రామంలో కొలువైన పోలమాంబ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. తలనీలాలు సమర్పించి చీరలు చూపించారు. మొక్కుబడులు చెల్లించారు. అమ్మవారిని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు దర్శించుకున్నారు.


శంబర పోలమాంబ అమ్మవారు

వైభవంగా సిరిమాను తిరు వీధి

మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ మధ్యాహ్నం 3.49 గంటలకు పూజారి జన్నిపేకాపు రామారావు సిరిమానును అధిరోహించారు. ఆనవాయితీ ప్రకారం గ్రామంలో ముందుగా గిరడ వారింటికి, ఆ తరువాత మునసబు, కరణాలు ఇళ్లకు సిరిమానును తీసుకువెళ్లారు. గ్రామంలో సిరిమాను తిరువీధి ఉత్సవం సాయంత్రం 5.21 గంటల వరకు జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన రెండు లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు దేవదాయ శాఖ అధికారుల అంచనా. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, పోలీస్, దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఆర్టీసీ అధికారులు 150 బస్సులను నడిపారు. పార్వతీపురం మన్యం జిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ దిలీప్‌కిరణ్, ఆర్డీవో హేమలత పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు జాతర సాఫీగా సాగేందుకు కృషి చేశారు. ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీలు జగదీశ్వరరావు, సుభాష్, నళిని పర్యవేక్షణలో 700 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.

బీసీలకు ఆత్మగౌరవాన్నిచ్చిన ఏకైక సీఎం జగన్

బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, వేదికపై చైర్మన్లు, డైరెక్టర్లు

- జగనన్న ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలి
- ఎవరూ చేయలేని విధంగా బీసీల అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలి
- చంద్రబాబు అబద్ధాలతో బీసీలను మభ్య పెట్టారు
- బీసీల అభ్యున్నతికి వైఎస్ జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారు
- సీఎం జగన్‌కు కృతజ్ఞతాభివందనలు తెలిపిన బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): బీసీలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనకు మనమంతా భరోసాగా నిలబడాలని బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చెప్పారు. తమకు మరోసారి అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతాభివందనలు తెలుపుతూ 55 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు మంగళవారం విజయవాడలోని బీసీ సంక్షేమ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత ప్రభుత్వంలో బీసీలలో నైరాశ్యం ఉండేదని మంత్రి చెప్పారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత బీసీలకు అండదండగా నిలబడి, వారి అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. జగనన్న ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకొని, ఎవరూ చేయలేని విధంగా బీసీల అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి అందరికీ రోల్ మోడల్‌గా నిలవాలన్నారు. నిబద్ధత, నిజాయితీ అలవాటు చేసుకుంటే ప్రమోషన్ దానంతట అదే వస్తుందన్నారు. జెడ్పీటీసీ నుంచి మంత్రి స్థాయికి వచ్చిన తానే అందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, ఆశయాలను నెరవేర్చే దిశలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బీసీల పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకునేందుకు అవసరమైన విద్య లేకపోవడానికి చంద్రబాబు కారణం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు అబద్ధాలతో బీసీలను మభ్యపెట్టారని చెప్పారు. బీసీలు ఎదగాలంటే విద్య తప్పనిసరి అని భావించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగడుగులు ముందుకు వేసి బీసీల అభ్యున్నతికి మరిన్ని పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే గతంలో ఇచ్చే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగన్‌దే అని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగించడంలో బీసీల పాత్ర ప్రధానమైనదని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ కార్పొరేషన్ల సమన్వయకర్త అగ్రహారం ప్రవీణ్, వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉమెన్ ఫ్రెండ్లీ విశాఖ

మహిళలు దర్జాగా జీవించడానికి అనువైన నగరం

- దేశంలోని టాప్–10 నగరాల్లో 7వ స్థానం
- టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: మహిళలు దర్జాగా ఉద్యోగాలు చేసుకోవడంతో పాటు జీవించడానికి అత్యంత అనుకూలమైన టాప్–10 నగరాల్లో ఒకటిగా విశాఖపట్నం నిలిచింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలు రాణించడానికి దేశంలో అనుకూలమైన నగరాలపై జరిపిన అధ్యయనంలో ఇది వెల్లడైంది. 'టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా' పేరుతో అవతార్ గ్రూప్ అనే సంస్థ దేశంలోని 111 నగరాల్లో ఈ అధ్యయనం నిర్వహించింది. ఆయా నగరాల్లో నేరాల రికార్డు, లివింగ్ ఇండెక్స్, మహిళా, శిశు సంక్షేమ శాఖ వార్షిక నివేదికలు, ఇతర విభాగాల నుంచి సేకరించిన 200కు పైగా అంశాలను విశ్లేషించారు. 10 లక్షల జనాభా పైబడిన(కేటగిరి–1), 10 లక్షల లోపు జనాభా నగరాలు (కేటగిరి–2) అనే రెండు విభాగాలుగా అధ్యయనం చేశారు. కేటగిరి–1లో 49, కేటగిరి–2లో 62 నగరాలను అధ్యయనం చేశారు. కాగా, కేటగిరి–1 నగరాల్లో చెన్నై మొదటి స్థానంలో ఉంది. పుణె, బెంగళూరు, హైదరాబాద్ నగరాలు వరుసగా తరువాతి స్థానాల్లో ఉన్నాయి. విశాఖకు ఏడో స్థానం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీ నగరం 14వ స్థానంలో ఉండటం గమనార్హం. విజయవాడ నగరం 19వ స్థానంలో ఉంది. మరోవైపు కేటగిరి–2లో తమిళనాడుకు చెందిన తిరుచిరాపల్లి, వెల్లూర్, ఈరోడ్, సేలం, తిరుప్పూర్ నగరాలు వరుసగా ఐదు స్థానాల్లో నిలిచాయి. ఈ విభాగంలో కాకినాడ నగరం 12వ స్థానంలో నిలిచింది.

ఇన్‌క్లూజన్ స్కోర్ ఆధారంగా

సోషల్ ఇన్‌క్లూజన్ స్కోర్ (మహిళల భద్రత, ప్రాతినిధ్యం, సాధికారత, ఈజ్ ఆఫ్ లివింగ్, ఇండస్ట్రియల్ ఇన్‌క్లూజన్ స్కోర్ (సంస్థలు, పరిశ్రమలు, మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు) ఈ రెండింటిని విశ్లేషించి నగరాల వారీగా సిటీ ఇన్‌క్లూజన్ స్కోర్‌ను ఇవ్వడం ద్వారా నగరాలకు ర్యాంకులు ఇచ్చారు.

మనుషుల కంటే తుపాకులెక్కువ!

3 వారాలు.. 38 కాల్పులు.. 70 ప్రాణాలు • ఇదీ అమెరికా...

మీకు ఒక విషయం తెలుసా..? అమెరికాలో నిప్పులు గక్కిన తుపాకీ తూటాలకు 1968–2017 మధ్య 15 లక్షల మంది అమాయకులు బలయ్యారు. ఈ సంఖ్య అమెరికా స్వాతంత్ర్య సంగ్రామం నుంచి ఆ దేశం చేసిన యుద్ధాల్లో కోల్పోయిన సైనికుల కంటే ఎక్కువ. గత ఏడాదే అమెరికా తుపాకుల విక్రయానికి సంబంధించి బైడెన్ ప్రభుత్వం కఠిన చట్టాన్ని తెచ్చింది. అయినప్పటికీ కొత్త సంవత్సరంలో కేవలం మూడు వారాల్లో 38 కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. దాదాపుగా 70 మంది ప్రాణాలు కోల్పోయారు. అగ్రరాజ్యంలో ఈ దారుణ మారణకాండను ఇక అరికట్టలేరా ?

అమెరికా నెత్తురోడుతోంది. గన్ కల్చర్ విష సంస్కృతి మరింతగా విస్తరిస్తోంది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో కాల్పుల శబ్దాలు భయపెడుతున్నాయి. అయితే చంపడం, లేదంటే ఆత్మహత్య చేసుకొని చావడం. కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకోవడానికి బయటకు వెళితే క్షేమంగా వెనక్కి వస్తారో లేదో తెలీదు. చదువుకోవడానికి బడికి వెళితే ఏ ఉన్మాది ఏం చేస్తాడోనని హడలిపోవాలి. నైట్ క్లబ్బుల్లో విందు వినోదాలైనా, రాత్రి పూట ఒంటరిగా బయటకు వెళ్లినా ఎటు వైపు నుంచి ఈ తూటా దిగుతుందో చెప్పలేము. విచక్షణారహితంగా కాల్పులకు తెగబడుతున్న వాళ్లలో యువత ఎక్కువ మంది ఉన్నారని తేలడంతో గత ఏడాది జూన్‌లో అమెరికా అధ్యక్షుడు బైడెన్ వారి చేతుల్లోకి తుపాకులు వెళ్లకుండా విక్రయాలపై ఆంక్షలు విధిస్తూ కొత్త చట్టాన్ని తెచ్చారు. అయినా కాల్పులు పెరిగాయే తప్ప తగ్గలేదు. 2023కి అగ్రరాజ్యం కాల్పులతో స్వాగతం పలికింది. ఒహియో, ఫ్లోరిడా, షికాగో, కరోలినా, పెన్సిల్వేనియాలలో తుపాకీల మోత మోగింది. అప్పట్నుంచి 38 సార్లు కాల్పులు జరిగితే 70 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 21న కాలిఫోర్నియాలో మాంటెరీ పార్క్‌లో చైనీయుల కొత్త సంవత్సరం వేడుకల్లో జరిగిన కాల్పుల్లో 11 మంది మరణిస్తే 48 గంటలు తిరక్కుండానే కాలిఫోర్నియా హాఫ్ మూన్ బే వ్యవసాయక్షేత్రంలో ఏడు గురు తూటాలకు బలయ్యారు. షికాగోలో జరిగిన మరో కాల్పుల ఘటనలో ఇద్దరు మరణించారు.

100 మంది పౌరులకి 120 తుపాకులు

అమెరికాలో నివసించే పౌరుల కంటే వారి దగ్గర ఉండే తుపాకులే ఎక్కువ. అగ్రరాజ్యం జనాభా 30 కోట్లు ఉంటే అక్కడ ఉన్న తుపాకుల సంఖ్య 39 కోట్లు. అపరిమితమైన స్వేచ్ఛ, ఆత్మరక్షణ పేరుతో సాధారణ పౌరులు విచ్చలవిడిగా తుపాకులు కొనుగోలు చేస్తున్నారు. కారణం లేకుండానే ట్రిగ్గర్ నొక్కేస్తున్నారు.

ఎన్నాళ్లీ నెత్తుటి మోత ..!

అమెరికా రాజ్యాంగానికి రెండో సవరణ పౌరులు తుపాకులు కలిగి ఉండే హక్కుని కల్పించింది. రెండు ప్రధాన పార్టీల్లో రిపబ్లికన్లు తుపాకీలు కలిగి ఉండడానికి మద్దతుగా ఉండడం ఈ విషసంస్కృతిని కూకటి వేళ్లతో పెకిలించివేయడానికి వీల్లేకుండా చేస్తోంది. ప్రభుత్వం గన్ కల్చర్‌పై కఠిన ఆంక్షలు విధించాలని భావించిన సమయంలో సుప్రీం కోర్టు బహిరంగంగా తుపాకీ తీసుకువెళ్లే హక్కు అమెరికన్లకు ఉందంటూ గత ఏడాది సంచలన తీర్పు ఇచ్చింది. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ప్రజాప్రతినిధులతో బలమైన లాబీయింగ్ చేస్తూ తుపాకుల నిషేధానికి ఎప్పటికప్పుడు అడ్డం పడుతూ ఉంటుంది. టెక్సాస్ పాఠశాలలో ఒక టీనేజర్ జరిపిన కాల్పుల ఘటనలో 21 మంది విద్యార్థులు బలవడంతో ఒక్కసారిగా ప్రజల్లో కూడా తుపాకీ సంస్కృతిపై వ్యతిరేకత వచ్చి అదొక ప్రజా ఉద్యమంగా మారింది. అమెరికా ప్రజల్లో 60శాతం మంది తుపాకుల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టీనేజర్లకి తుపాకులు విక్రయిస్తే వారి నేరచరితను విచారించాలంటూ ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని రిపబ్లికన్లు అధికారంలో ఉన్న రాష్ట్రాలు పకడ్బందీగా అమలు చేయడం లేదు. శక్తిమంతమైన రాష్ట్రాలు తలచుకుంటేనే ఈ తుపాకుల హింసకు అడ్డుకట్టపడుతుందనే అభిప్రాయాలున్నాయి. **- సాక్షి, నేషనల్ డెస్క్**



- అమెరికాలో తుపాకీ తూటాలకు రోజుకి సగటున 53 మంది ప్రాణాలు కోల్పోతున్నారు.
- కరోనా సమయంలో కాల్పుల ఘటనలు ఎక్కువగా జరిగాయి. ఆ సమయంలో తుపాకుల అమ్మకాలు ఏకంగా 63% పెరిగాయి.
- 2013 నుంచి ఏఆర్–15 రైఫిల్స్ అమ్మకాలు ఏడాదికి కోటికి పైగా జరగడం ఆందోళన కలిగిస్తోంది.
- 2020లో కాల్పులు దేశ చరిత్రలో మాయని మచ్చగా నిలిచాయి. ఆ ఏడాది 610 కాల్పులు జరగ్గా 45,222 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో హత్యలు, ఆత్మహత్యలు కూడా ఉన్నాయి.
- 2021లో రైఫిళ్లు, పిస్తోళ్లు వంటి చిన్న ఆయుధాల మార్కెట్ 370 కోట్ల డాలర్లుగా ఉంది.

అత్యధిక తుపాకులున్న దేశాలు
(ప్రతి 100 మంది పౌరుల దగ్గరున్న తుపాకుల సంఖ్య)

అమెరికా	120.5
యెమెన్	52.8
సెర్బియా	39.1
మాంటెగ్రో	39.1
ఉరుగ్వే	34.7
కెనడా	34.7

కాల్పుల ఘటనలు ఇలా

2019	417
2020	610
2021	690
2022	647
2023	38

క్లుప్తంగా

దేశంలో 4.90 కోట్ల పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో దాదాపుగా 4.90 కోట్ల పెండింగ్ కేసులు ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. పెండింగ్ కేసుల త్వరితగతి విచారణ కోసం ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కలసికట్టుగా కృషి చేయాలన్నారు. అప్పుడే కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని కేసుల విచారణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో రిజిజు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఈ–కమిటీ చీఫ్‌గా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై. చంద్రచూడ్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. "4.90 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇది చాలా పెద్ద సంఖ్య. అంటే చాలా మంది న్యాయం కోసం ఎదురు చూస్తున్నారన్నమాట. న్యాయం జరగడం ఆలస్యమవుతోందని అంటే న్యాయం చెయ్యడం తిరస్కరించడంగానే భావించాలి. వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా చూడాలి" అని రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం, న్యాయస్థానాల ఉమ్మడి కృషి కారణంగానే పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించగలమని వివరించారు.

జిందాల్‌కు బెదిరింపు

రాయ్‌గఢ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్ సెంట్రల్ జైలు ఖైదీ ఒకడు పారిశ్రామిక వేత్త, కాంగ్రెస్ మాజీ ఎంపీ నవీన్ జిందాల్‌కు బెదిరింపు లేఖ రాశాడు. రూ.50 కోట్లను 48 గంటల్లోగా పంపాలని, లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని అందులో హెచ్చరించాడు. ఈ మేరకు గత వారం రాయ్‌గఢ్‌లోని పత్రపాలి గ్రామంలో ఉన్న జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్(జేఎస్‌పీఎల్)కు లేఖ అందింది. దీనిపై కోట్రా రోడ్ పోలీసులు సెక్షన్లు 386, 506 కింద కేసు నమోదు చేశారు. సదరు బెదిరింపు లేఖను బిలాస్‌పూర్ జైలులోని ఖైదీ పోస్టు ద్వారా పంపినట్లు తేలిందని దర్యాప్తులు పోలీసులు చెప్పారు.

నేపాల్‌లో భూకంపం

న్యూఢిల్లీ: నేపాల్‌లో మంగళవారం మధ్యాహ్నం రిక్టర్ స్కేల్‌పై 5.9 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ ప్రభావంతో ఢిల్లీ తోపాటు రాజస్తాన్‌లోని జైపూర్‌లో ప్రకంపనలు సంభవించాయి. నేపాల్‌లోని సుదూర్ పశ్చిమ్ ప్రావిన్స్‌లోని బజురా జిల్లాలో భూకంప కేంద్రం ఉందని నేపాల్ అధికారులు చెప్పారు. భూకంపం ధాటికి కొండపై నుంచి బండరాయి దొర్లుకుంటూ వచ్చి మీదపడగా ఒక మహిళ చనిపోయింది. రెండిళ్లు కూలిపోగా, పలు ఇళ్లకు, ఒక ఆలయానికి పగుళ్లు వచ్చాయి. కొండచరియలు విరిగిపడి ఒకరు గాయపడగా, 40 గొర్రెలు చనిపోయాయి. ప్రకంపనలతో భయాందోళనలకు గురయ్యామని నోయిడా, ఢిల్లీ వాసులు చెప్పారు. ఆస్తి, ప్రాణనష్టం సంభవించినట్లు ఎటువంటి సమాచారం లేదు.

మోదీపై బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శిస్తాం

కేరళలో పార్టీల అనుబంధ విభాగాల ప్రకటన

తిరువనంతపురం/వాషింగ్టన్: ప్రధాని మోదీపై 'ఇండియా: ద మోదీ క్వశ్చన్' పేరిట బ్రిటిష్ వార్తా సంస్థ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శిస్తామని కేరళలోని వివిధ రాజకీయ పార్టీల అనుబంధ విభాగాలు మంగళవారం వెల్లడించాయి. దీనిపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం విజయన్ జోక్యం చేసుకోవాలని, వివాదాస్పద డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకోవాలని డిమాండ్ చేసింది. డాక్యుమెంటరీని ప్రదర్శించబోతున్నామంటూ సీపీఎం యువజన విభాగమైన డీవైఎఫ్ఐ ఫేసుబుక్‌లో పేర్కొంది. అనంతరం సీపీఎం విద్యార్థి విభాగం ఎస్ఎఫ్ఐ, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(కేపీసీసీ) అనుబంధ విభాగాలు ప్రకటించాయి. రాష్ట్రంలో బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనకు ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వొద్దని బీజేపీ కేరళ అధ్యక్షుడు కె.సురేంద్రన్ కోరారు. మత కలహాలు సృష్టించడానికే ఈ డాక్యుమెంటరీని తెరపైకి తెచ్చారని మండిపడ్డారు.



తిరువనంతపురంలో డాక్యుమెంటరీ ప్రదర్శన

దాక్యుమెంటరీ గురించి తెలియదు: అమెరికా

బీబీసీ డాక్యుమెంటరీ గురించి తమకేమీ తెలియదని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ స్పష్టం చేసింది. అమెరికా, భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలని పేర్కొంది. ఇరు దేశాల నడుమ బలమైన సంబంధ బాంధవ్యాలను తాము కోరుకుంటున్నామని వెల్లడించింది. ఇరు దేశాలు విలువలను కలిసి పంచుకోవాలన్నదే తమ ఆకాంక్ష అని ఉద్ఘాటించింది. బీబీసీ డాక్యుమెంటరీ విషయంలో బ్రిటిష్ ప్రధానమంత్రి రిషి సునాక్ గతవారం ప్రధాని మోదీకి అనుకూలంగా మాట్లాడారు. మోదీపై అసత్యాలు ప్రచారం చేయొద్దని హితవు పలికారు.

కొన్ని ప్రాంతాల్లో ప్రదర్శన

డాక్యుమెంటరీని ఎస్ఎఫ్ఐతోపాటు పలు సంఘాలు మంగళవారం కేరళలో కొన్ని ప్రాంతాల్లో ప్రదర్శించాయి. ఈ ప్రదర్శనలను వ్యతిరేకిస్తూ బీజేపీ యువమోర్చా కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి, నిరసన వ్యక్తం చేశారు. పాలక్కాడ్, ఎర్నాకుళం తదితర ప్రాంతాల్లో యువమోర్చా కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. పోలీసులు రంగంలోకి దిగి, వారిని అడ్డుకున్నారు. కేవలం కేరళలోనే కాదు, దేశవ్యాప్తంగా డాక్యుమెంటరీని ప్రదర్శిస్తామని సీపీఎం యువజన విభాగం డీవైఎఫ్ఐ మంగళవారం తేల్చి చెప్పింది.

కాల్పులతో దద్దరిల్లిన అమెరికా

హాఫ్‌మూన్ బే/డెస్‌మోయిన్స్: అగ్రరాజ్యం అమెరికా మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. కాలిఫోర్నియా రాష్ట్రం శాన్‌ఫ్రాన్సిస్కోకు 30 మైళ్ల దూరంలోని హాఫ్‌మూన్ బేలో జరిగిన కాల్పుల్లో ఏడుగురు చనిపోగా ఒకరు గాయపడ్డారు. అయోవా రాష్ట్రం డెస్‌మోయిన్స్‌లోని ఓ స్కూల్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. హాఫ్ మూన్ బేలోని మష్రూమ్ ఫాం, ట్రక్కింగ్ ఫాంలలో కాల్పులకు తెగబడినట్లు అనుమానిస్తున్న చున్‌లి ఝూవో(67) పోలీసుల అదుపులో ఉన్నాడు. ఆ రెండు ఫాంలలో ఏదో ఒక దానిలో అతడు పనిచేస్తూ ఉండి ఉంటాడని పోలీసులు చెప్పారు. కాల్పుల్లో చనిపోయిన వారు అక్కడి పనివారని, అసంతృప్తితోనే అతడు ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటాడని భావిస్తున్నామన్నారు. మష్రూమ్ ఫాంలో కాల్పులు జరిగినట్లు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. వారు అక్కడికి చేరుకోగా నలుగురు విగతజీవులుగాను, ఒకరు గాయపడి కనిపించారు. కొద్దిసేపటికే అక్కడికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్రక్కింగ్ ఫాంలోనూ కాల్పులు జరిగాయి. పోలీసులు అక్కడ మరో మూడు మృతదేహాలను కనుగొన్నారు. దాదాపు రెండున్నర గంటల సమయం తర్వాత హాఫ్‌మూన్ బే పోలీస్‌స్టేషన్ పార్కింగ్ స్థలంలో అనుమానితుడు చున్ లిను అదుపులోకి తీసుకున్నారు.

20 నిమిషాల్లో దొరికారు

అయోవాలోని డెస్‌మోయిన్స్ స్కూల్‌లో లాభాపేక్ష లేని సంస్థ ఒకటి చదువులో వెనకబడిన వారి కోసం ప్రత్యేకంగా 'స్టార్ట్స్ రైట్ హియర్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై కాల్పులు జరిపి పరారయ్యారు. ఘటనలో ఇద్దరు విద్యార్థులు చనిపోగా టీచర్ ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన జరిగిన 20 నిమిషాల్లోనే పోలీసులు అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో అనుమానితులున్న కారును అడ్డగించి, అందులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

స్నేహితుడిని కలిసిందనే శ్రద్ధాను చంపాడు

మెహ్రౌలీ హత్య కేసులో పోలీసుల చార్జిషీట్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన మెహ్రౌలీ హత్య కేసులో ఢిల్లీ పోలీసులు మంగళవారం సాకేత్ కోర్టులో 6,629 పేజీల భారీ చార్జిషీట్ దాఖలు చేశారు. మరో స్నేహితుడిని కలిసిందనే కోపంతోనే సహజీవన భాగస్వామి శ్రద్ధా వాకర్‌ను అఫ్తాబ్ పూనావాలా చంపేసినట్లు తేలిందని అందులో పేర్కొన్నారు. గత ఏడాది మేలో శ్రద్ధ స్నేహితుడిని కలిసిందని, అది తనకు ఇష్టం లేదని అఫ్తాబ్ తెలిపాడు. ఆ కోపంతోనే అదే రోజు ఆమెను చంపినట్లు అంగీకరించాడు. ఇందుకోసం అతడు పలు ఆయుధాలను వాడాడని, కొన్నిమాత్రం తమకు లభ్యమయ్యాయని పేర్కొన్నారు. విచారణ అనంతరం పోలీసులు గత ఏడాది నవంబర్ 12వ తేదీన అరెస్ట్ చేశారు. వివిధ బృందాలను ఏర్పాటు చేసి, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, గురుగ్రామ్, హరియాణాల్లో విచారణ జరిపినట్లు ఈ ఘటనకు సంబంధించి 150 మంది నుంచి వివరాలను సేకరించామన్నారు. లభించిన ఆధారాలను, నిర్వహించిన పరీక్షల ఫలితాలను పరిశీలించాకే నిందితుడిపై సెక్షన్లు 302, 201 కింద కేసు నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్ మీను చౌదరి చెప్పారు. కాగా, కోర్టు మంగళవారం అఫ్తాబ్ జుడీషియల్ కస్టడీని ఫిబ్రవరి 7వ తేదీ వరకు పొడిగించింది. శ్రద్ధను చంపిన అనంతరం అఫ్తాబ్ ఆమె శరీర భాగాలను 35 ముక్కలుగా నరికి, ఫ్రిజ్‌లో దాచి తర్వాత రహస్యంగా పడేస్తూ వచ్చిన విషయం తెలిసిందే.



రసాభాసగా ఢిల్లీ మేయర్ ఎన్నిక తంతు

న్యూఢిల్లీ: మూడు కార్పొరేషన్లను విలీనం చేస్తూ కొత్తగా ఏర్పాటైన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) సమావేశం ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ కౌన్సిలర్ల వాగ్వాదంతో అర్ధంతరంగా ముగిసింది. మేయర్, డెప్యూటీ మేయర్‌ను ఎన్నుకునేందుకు మంగళవారం మొదలైన ఎంసీడీ సమావేశం జనవరి ఆరో తేదీ తరహాలోనే మళ్లీ పరస్పర ఆరోపణలతో వాయిదాపడింది. సభ మొదలైన కొద్దిసేపటికే బీజేపీ కౌన్సిలర్లు సభ నుంచి వెళ్లిపోయి బయట నినాదాలు చేయడం మొదలుపెట్టారు. వెంటనే బీజేపీ అనుకూలురైన వారికి చట్టవిరుద్ధంగా మేయర్ ఓటింగ్ ప్రక్రియలో చాన్స్ ఇచ్చేందుకు కుట్ర పన్నారని ఆప్ నేతలు ఆందోళన చేపట్టారు. దీంతో వీరితో బీజేపీ సభ్యులు కొందరు వాగ్వాదానికి దిగారు. పరస్పర ఆరోపణలు, నినాదాలతో సభ దద్దరిల్లింది. దీంతో ప్రిసైడింగ్ ఆఫీసర్ సత్య శర్మ(బీజేపీ కౌన్సిలర్) సభను అర్ధంతరంగా వాయిదావేశారు. 'దమ్ముంటే బీజేపీ సభ్యులంతా సభలోకి వచ్చి ఓటింగ్‌ను పూర్తిచేయండి' అని ఆప్ నేత దుర్గేశ్ పాఠక్ సభలో డిమాండ్‌చేశారు.

కొలీజియం తీర్మానం తీవ్ర ఆందోళనకరం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కొలీజియంపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ), రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా)కు చెందిన రహస్య పత్రాల్లో కొన్ని భాగాలను బహిర్గతం చేయాలని కొలీజియం తీర్మానించడం తీవ్ర ఆందోళనకర అంశమని అన్నారు. నిఘా విభాగాల సిబ్బంది దేశ హితం కోసం రహస్యంగా కార్యకలాపాలు సాగిస్తుంటారని, వారి రిపోర్టులను బయటపెడితే భవిష్యత్తులో కార్యాచరణపై ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాల్సి వస్తుందని చెప్పారు. తద్వారా కొన్ని చిక్కులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మద్రాసు హైకోర్టు, ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి ఐబీ, 'రా' ఇచ్చిన నివేదికల్లోని కొన్ని భాగాలను ప్రజా సమూహంలోకి తీసుకురావాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవలే తీర్మానించింది. దీనిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తొలిసారిగా మంగళవారం మాట్లాడారు. కొలీజియం వ్యవహారంపై సరైన సమయంలో పూర్తిస్థాయిలో స్పందిస్తానని, ఇది తగిన సమయం కాదని అన్నారు.

బెంగళూరులో రూ.10 నోట్ల వాన

బెంగళూరు: అతడికి ప్రచారం పిచ్చి. కొద్ది సమయంలోనే పాపులారిటీ సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం వేసిన పథకంలో భాగంగానే కరెన్సీ నోట్లను వెదజల్లాడు. బెంగళూరులోని రద్దీగా ఉండే కేఆర్ మార్కెట్ ఏరియాలో కరెన్సీ నోట్ల వర్షం వెనుక అసలు కథ ఇది. మంగళవారం ఉదయం నల్లని బ్లేజర్‌ను ధరించి మెడలో గోడ గడియారం వేసుకుని ఓ వ్యక్తి(30) మార్కెట్ ఏరియాలోని ఫ్లై ఓవర్‌పైకి వచ్చాడు. వెంట తెచ్చుకున్న సంచీలోని రూ.10 నోట్లను విసిరేస్తుండటంతో ఆశ్చర్యపోవడం వాహనదారుల వంతైంది. ఫ్లై ఓవర్ కింద రోడ్డుపై వెళ్తున్న వారు నోట్ల కోసం ఎగబడటంతో గందరగోళం ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వచ్చి అతడిని అదుపులోకి తీసుకుని, పరిస్థితిని చక్కదిద్దారు. యాంకర్‌గా పనిచేస్తూ మార్కెటింగ్ రంగంలో ఉన్న అతడు వీడియోల ద్వారా పాపులారిటీ సంపాదించాలని ప్లాన్ వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నోట్ల వర్షం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

12 శాతం పెరిగిన ధాన్యం సేకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా ధాన్యం సేకరణలో గణనీయమైన వృద్ధి నమోదయ్యింది. గత ఏడాది సీజన్‌లో సేకరించిన ధాన్యంతో పోలిస్తే ఈసారి 12 శాతం అధికంగా సేకరించడం విశేషం. గత ఏడాది జనవరి మూడో వారానికి 5.50 కోట్ల మెట్రిక్ టన్నులు సేకరించగా, ఈ ఏడాది ఏకంగా 6.20 కోట్ల మెట్రిక్ టన్నులు సేకరించారు. మద్దతు ధరకు అనుగుణంగా రూ.1.28 లక్షల కోట్ల మేర చెల్లింపులు సైతం చేసినట్లు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సీజన్ మొత్తం ముగిసే నాటికి 9 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే అవకాశం ఉన్నట్లు తెలియజేసింది. నిజానికి గత ఏడాది ఖరీఫ్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.1.42 లక్షల కోట్ల విలువైన 7.25 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఈసారి విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో పంజాబ్, హరియాణా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో భారీగా ధాన్యం సేకరణ జరుగుతోంది. పంజాబ్‌లో 1.81 కోట్ల మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్‌లో 92 లక్షలు, హరియాణాలో 58.97 లక్షలు, తెలంగాణలో 59 లక్షల మెట్రిక్ టన్నుల మేర సేకరణ జరిగింది.

నేడు 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం

సాక్షి, న్యూఢిల్లీ: 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను'అనే ఇతివృత్తంతో నేడు 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం జరుగనుంది. 2011లో ప్రారంభమైన జాతీయ ఓటర్ల దినోత్సవం ఏటా జనవరి 25న కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఢిల్లీలో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా 2022 ఎన్నికల సమయంలో ఐటీ, భద్రత, ఓటరు జాబితా, ఓటర్లకు అవగాహన వంటి అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు రాష్ట్రపతి జాతీయ అవార్డులను ప్రదానం చేయనున్నారు.



కేంద్ర గిరిజన శాఖ, రక్షణ శాఖలు సంయుక్తంగా తొలిసారిగా నిర్వహిస్తున్న ఆది శౌర్య కార్యక్రమంలో విన్యాసాలు చేస్తున్న ఆర్మీకి చెందిన డేర్‌డెవిల్స్ మోటార్‌సైకిల్ బృంద సభ్యుడు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని రెండ్రోజులపాటు ఢిల్లీలో ఈ వేడుకలు నిర్వహించారు.

నిషేధాలు, అణచివేతలు నిజాన్ని ఆపలేవు

మోదీపై బీబీసీ డాక్యుమెంటరీని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్య

జమ్మూ: గుజరాత్ అల్లర్లకు నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోదీనే బాధ్యుడని బ్రిటన్ వార్తాసంస్థ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ పరోక్షంగా సమర్థించారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా మంగళవారం జమ్మూ పట్టణంలో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. ' భగవద్గీత, ఉపనిషత్తులు మనకో విషయం చెప్తాయి. నిజాలను దాచడం అసాధ్యం. అవి ఏనాటికైనా ప్రజ్వలిస్తూ బహిర్గతమవుతాయి. మీరు(కేంద్ర ప్రభుత్వం) మీడియాను అణచివేయొచ్చు. కానీ, నిషేధాలు, అణచివేతలతో నిజాన్ని దాచలేము' అని రాహుల్ వ్యాఖ్యానించారు. 'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పేరిట రూపొందిన డాక్యుమెంటరీ తొలి భాగంలో గోధ్రా అల్లర్లకు మోదీ బాధ్యుడని బీబీసీ పేర్కొనడం, దానిని కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీవ్రంగా ఖండించడం తెల్సిందే. యూట్యూబ్, ట్విటర్‌లలో సంబంధిత లింకులను బ్లాక్‌చేయాలని ఇప్పటికే కేంద్ర సమాచార, ప్రసార శాఖ ఆదేశాలు ఇవ్వడం విదితమే. కొత్తగా ఎవరైనా ట్వీట్లు చేస్తే వాటినీ తొలగించాలని కేంద్రం మంగళవారం ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, 370 ఆర్టికల్ రద్దు తర్వాత జమ్మూకశ్మీర్ కష్టాలు పెరిగాయని, మళ్లీ రాష్ట్ర హోదాను పునరుద్ధరించి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందని రాహుల్ అన్నారు.

కోట్లు కుమ్మరిస్తున్నారు

తన పరువు ప్రతిష్టలను దిగజార్చేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యవస్థీకృతంగా వేల కోట్లు ఖర్చుపెడుతున్నాయని, అయినా అంతిమంగా సత్యమే విజయం సాధిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదయం నగ్రోటా పట్టణంలో మొదలైన భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీతోపాటు మాజీ కాంగ్రెస్ నాయకురాలు, ఒకప్పటి బాలీవుడ్ హీరోయిన్ ఊర్మిళా మతోండ్కర్ కొద్దిసేపు కలిసి నడిచారు. భారత సైన్యం సరిహద్దు దాటి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో సర్జికల్ దాడులు చేసిందనడానికి మోదీ సర్కార్ రుజువులు చూపదెందుకని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హాస్యాస్పదంగా అభివర్ణించారు.

దేశీయ ఓఎస్ 'భరోస్' పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: ఐఐటీ–మద్రాస్ అభివృద్ధి చేసిన దేశీయ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్(ఓఎస్) 'భరోస్'ను కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్ మంగళవారం విజయవంతంగా పరీక్షించారు. డేటా ప్రైవసీ విషయంలో ఇది కీలకమైన ముందడుగు అని ప్రధాన్ చెప్పారు. బలమైన, దేశీయ, నమ్మకమైన డిజిటల్ మౌలిక సదుపాయాలతో పేద ప్రజలు ప్రయోజనం పొందుతారని తెలిపారు. ఇలాంటి స్వదేశీ ఆపరేటింగ్ సిస్టమ్‌తో 'డిజిటల్ ఇండియా' కల సాకారమయ్యే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. భరోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఐఐటీ–మద్రాస్‌కు చెందిన జండ్ కే ఆపరేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అభివృద్ధి చేసింది. మొదట కొన్ని సంస్థలకే భరోస్ సేవలు అందిస్తున్నారు. భరోస్‌తో ఎలాంటి డిఫాల్ట్ యాప్‌లు రావు. అంటే కొన్ని యాప్‌లు తప్పనిసరిగా వాడాలంటూ యూజర్లపై ఎలాంటి ఒత్తిడి ఉండదు.

పరిష్కార సామర్థ్యం పెంచుకోండి

బాల పురస్కార్ గ్రహీతలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: సమస్యలను సమర్థంగా ఎదుర్కొనేలా సామర్థ్యాలు పెంచుకోవాలని బాలలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్బోధించారు. ఆయన మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' విజేతలతో సమావేశమయ్యారు. పిల్లల మానసిక ఆరోగ్యం, వారికి ఎదురయ్యే సమస్యలపై చర్చించారు. జీవితంలో ముందుకు వెళ్లడానికి తొలుత చిన్న సమస్యలను పరిష్కరించుకోవడం ప్రారంభించాలని, ఆ పెద్ద సమస్యలను సైతం సులువుగా పరిష్కరించుకొనేలా సామర్థ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని క్రమంగా పెంపొందించుకోవాలని సూచించారు. చదరంగం ఆడడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కళలు, సంస్కృతి, పరిశోధనలు, ఆవిష్కరణలు, ఆధ్యాత్మికతను కెరీర్‌గా మార్చుకోవాలని చెప్పారు. బాల పురస్కార్ గ్రహీతల అనుభవాలను ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. అవార్డు గ్రహీతలు పలు అంశాలపై మోదీ సలహాలు సూచనలు తీసుకున్నారు. బాల పురస్కారాలకు ఈసారి 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మొత్తం 11 మంది ఎంపికయ్యారు. వీరిలో ఆరుగురు బాలలు, ఐదుగురు బాలికలు ఉన్నారు. బాల పురస్కార్ విజేతలు ఎం.గౌర వీరెడ్డి, కోలగట్ల అలనా మీనాక్షి తదితరుల ఘనతలను ప్రధాని మోదీ ట్విట్టర్‌లో ప్రశంసించారు.



బాలపురస్కార్ గ్రహీత మీనాక్షితో మోదీ

'పరీక్షా పే చర్చ'లో 38 లక్షల మంది!

ప్రధాని మోదీ ఏటా స్వయంగా పాల్గొని, విద్యార్థులతో సంభాషించే 'పరీక్షా పే చర్చ' కోసం ఈ ఏడాది ఏకంగా 38 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. గత ఏడాది కంటే ఈసారి అధికంగా 15 లక్షల మంది పాల్గొనబోతున్నారు. 155 దేశాల నుంచి రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. 27న ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరుగనుంది. కొందరు స్టేడియంలో, మిగతావారు ఆన్‌లైన్‌లో పాల్గొంటారు. పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనే విషయంలో మోదీ మార్గనిర్దేశం చేస్తారు.

ఆవు పేడతో కట్టిన ఇళ్లతో అణుధార్మికత నుంచి రక్షణ

వియారా(గుజరాత్): ఆవు పేడతో నిర్మించిన ఇళ్లు అణుధార్మికత నుంచి రక్షణ ఇస్తాయనే విషయం సైన్సు నిరూపించిందని గుజరాత్‌లోని తాపి జిల్లా సెషన్స్ జడ్జి సమీర్ వ్యాస్ పేర్కొన్నారు. గో మూత్ర ఎన్నో వ్యాధుల నుంచి కాపాడుతుందని తెలిపారు. అందుకే దేశంలోని గోవులను, వధించడం మానేసి రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గోవుల అక్రమ రవాణాకు పాల్పడిన ఓ వ్యక్తికి శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పులో ఈ విషయాలను ఆయన పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్‌లో ఇచ్చిన తీర్పు వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ప్రపంచంలోని అన్ని సమస్యలకు గోవధే కారణమని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన మహ్మద్ అమీన్ అంజుమ్(20) 2020లో గుజరాత్ నుంచి ఆవులను తరలిస్తూ పట్టుబడ్డాడు.

ఆకలి ఊరుకోదు



కోటి విద్యలు కూటి కొరకే అన్నట్లు ఎంత పెద్ద ధర్నా చేసినా క్షుద్బాధను మరచిపోలేరు. బెంగళూరు ఫ్రీడంపార్క్ వద్ద నిరసన మధ్యలో ఆకలి తీర్చుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు.

న్యూస్‌రీల్

స్కూటర్‌పైకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు

- మహిళా అకౌంటెంట్ దుర్మరణం

యశవంతపుర: స్కూటర్‌ను ప్రైవేట్ బస్ ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం యశవంతపుర ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. సుబ్రమణ్య నగరకు చెందిన వినూత (32) అకౌటెంట్‌గా పని చేస్తుంది. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో స్కూటర్‌పై విధులకు వెళ్తుండగా తుమకూరు రోడ్డు ఆర్‌ఎంసీ యార్డ్ సమీపంలో ఫోన్ రావడంతో ఆగి మాట్లాడుతుండగా అతివేగంగా వచ్చిన బస్ ఆమెపైకి దూసుకెళ్లింది. దీంతో వినూత అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పాలనాధికారి నియామకంపై వాదనలు

శివాజీనగర: చిత్రదుర్గ మురుఘ రాజేంద్ర బృహన్మఠానికి పాలనాధికారి నియామకం చర్యలను ప్రభుత్వం సమర్థించుకుంది. మురుఘ మఠానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీ.ఎస్. వస్త్రదను పాలనాధికారిగా నియామకాన్ని ప్రశ్నిస్తూ మఠం ఇన్‌చార్జి బసవప్రభు స్వామి పిటిషన్ సమర్పించారు. విచారించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్.దీక్షిత్ నేతృత్వంలోని ధర్మాసనం వద్ద ప్రభుత్వ ఏజీ ప్రభులింగ నావడగి ఆ నియామకాన్ని సమర్థించుకున్నారు. బసవప్రభు స్వామి ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో నగదు లావాదేవీల్లో అక్రమాలు జరిగాయని తెలిసిందన్నారు.

అన్నదాత ఆత్మహత్య

మైసూరు: అప్పుల భారంతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా బన్నికుప్పె గ్రామంలో చోటు చేసుకుంది. శివణ్ణనాయక (56) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శివణ్ణనాయకకు గ్రామంలో రెండు ఎకరాల భూమి ఉంది. వ్యవసాయం కోసం స్థానిక గ్రామీణ బ్యాంకులో రూ. 7.5 లక్షల రుణం తీసుకున్నాడు. బయటి వ్యక్తుల నుంచి వడ్డీకి కూడా తెచ్చాడు. సాగు చేసిన పొగాకు పంట సరిగా రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కుతోచని స్థితిలో తన పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



సిరి ధాన్యాల సాగుపై మంగళవారం బెళగావిలో జరిగిన జాగృతి జాతా

ప్రేమ గొడవలో యువకునిపై కత్తితో దాడి

మైసూరు: యువతి విషయంలో జరిగిన గొడవలో ముగ్గురు కలిసి ఒక యువకున్ని చాకుతో పొడిచారు. ఈ సంఘటనలో మైసూరు విజయనగర పోలీసులు వారిని అరెస్టు చేశారు. విజయనగరలోని 4వ స్టేజ్‌లో నివాసం ఉంటున్న వినాయక్, మరొక ఇద్దరు నిందితులు. వివరాలు... సుచిత్ అనే యువకుడు ఒక యువతిని ప్రేమించాడు. 20 రోజులుగా ఆమెను నిందితుడు వినాయక్ వేధించడంతో సుచిత్ అతన్ని హెచ్చరించాడు. దీనిపై వాగ్వాదం కూడా జరిగింది. మరోసారి యువతి జోలికి వస్తే బాగుండదని వినాయక్‌కు సుచిత్, అతని మిత్రుడు అసిత్ హెచ్చరించారు. దమ్ముంటే నా ఇంటికి రావాలని అసిత్‌కు వినాయక్ కాల్ చేయగా అసిత్ వెళ్లాడు. వినాయక్, అతని మిత్రులు కలిసి చాకుతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అసిత్‌ను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి ముగ్గురినీ అరెస్టు చేశారు.

పాక్ యువతి కేసులో.. ఇంటి యజమాని విచారణ

బనశంకరి: పాకిస్తాన్ యువతి, యూపీ యువకునికి ఇంటిని అద్దెకు ఇచ్చిన గోవిందరెడ్డి(50)ని బెళ్లందూరు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పాక్ యువతి ఇక్రా జీవని గురించి విదేశాంగ శాఖకు సమాచారం అందించి మహిళా పునరావాస కేంద్రానికి పంపించారు. ప్రేయసిని బెంగళూరుకు తీసుకురావడానికి భారత పౌరురాలు అని ఆమె భర్త ములాయంసింగ్ తప్పుడు పత్రాలను తయారు చేశాడు. ఇందులో ఆమె పేరును రావా యాదవ్‌గా మార్చాడు. ఈ పేరుతో ఆధార్, ఓటరు కార్డులను తయారు చేయించి పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేశాడని పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది.

చీటింగ్, ఫోర్జరీ, విదేశీ చట్టం ఉల్లంఘన తదితరాల కింద ఈ జంటపై కేసు నమోదు చేశారు. ఎలాంటి ఆధారాలు తీసుకోకుండా ఇంటిని బాడుగకు ఇచ్చినందున గోవిందరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు వైట్‌ఫీల్డ్ డీసీపీ గిరీశ్ తెలిపారు.

మళ్లీ ఎస్‌ఐ కుంభకోణం గడబిడ



విచారణాధికారి రూ. 3 కోట్లు లంచం..

- అడిగారన్న సూత్రధారి రుద్రేగౌడ
- ఇవ్వనందుకు మళ్లీ కేసులు పెట్టారని వీడియో
- చర్యలు తప్పవన్న సీఎం, హోంమంత్రి



పోలీసు నియామకాలపై ఆగని రచ్చ

శివాజీనగర: గత ఏడాది రాష్ట్ర రాజకీయాలను అతలాకుతలం చేసిన ఎస్‌ఐ పరీక్షల కుంభకోణం ఈ సంవత్సరం కూడా వదిలేలా లేదు. మళ్లీ కొత్త ఆరోపణలు వినిపిస్తూ అటు పోలీసులు, ఇటు సర్కారుకు కునుకు లేకుండా చేస్తోంది. ఈ స్కాంపై విచారణ జరుపుతున్న ఒక డీఎస్పీ తనను లంచం డిమాండ్ చేశాడని ప్రధాన నిందితుడు రుద్రేగౌడ అలియాస్ ఆర్‌డీ పాటిల్ విడుదల చేసిన వీడియోపై కలకలం సృష్టిస్తోంది. ఈ వీడియోలోని విషయాలపై విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ధారించింది.

శంకరగౌడ రూ.3 కోట్లు అడిగారని వీడియో

ఎస్‌ఐ పరీక్షల కుంభకోణంపై సీఐడీ అధికారులు సమగ్ర తనిఖీ చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు ఆర్.డీ.పాటిల్ ఇటీవల బెయిల్‌పై బయటికి వచ్చి పలు ఆరోపణలు చేశారు. దీంతో కేసు కొత్త మలుపు తిరిగింది. నన్ను పోలీసులు ఇబ్బంది పెట్టారు, విచారణ బృందంలోని డీఎస్పీ శంకరగౌడ రూ.3 కోట్లు ఇవ్వాలని నన్ను ఒత్తిడి చేశారు అని వీడియోలో ఆరోపించాడు. ఇప్పటికే రూ.76 లక్షలు ఇచ్చానని, మిగతా సొమ్ము ఇవ్వకపోవటంతో తనను మళ్లీ అరెస్ట్ చేసి తప్పుడు కేసులను నమోదు చేశారని చెప్పాడు.

ఎవరినీ వదిలిపెట్టం: హోం మంత్రి జ్ఞానేంద్ర

ఆర్‌డీ పాటిల్ వద్ద పోలీసులు లంచం డిమాండ్ చేయడం నిజమైతే ఆ అధికారి మీద చట్టపరమైన చర్యలు తీసుకొంటామని రాష్ట్ర హోం శాఖ మంత్రి అరగ జ్ఞానేంద్ర తెలిపారు. బెంగళూరులో మాట్లాడిన ఆయన, పీఎస్‌ఐ నియామకాల్లో నిందితుడు ఆర్‌డీ పాటిల్ ఏ విధంగానైనా మాట్లాడవచ్చు. అతని వీడియోలో సీఐడీ అధికారి శంకరగౌడ రూ.3 కోట్లు డిమాండ్ చేసినట్లు చెప్పాడు. ఇది వాస్తవమైతే ఆ అధికారిని ఒక్క క్షణం కూడా విడిచిపెట్టేది లేదు. సీఐడీ అధికారి కావచ్చు, ఐపీఎస్ అధికారి కావచ్చు, ఎవరినీ కాపాడేందుకు అవకాశం లేదని చెప్పారు. వాస్తవాలను పరిశీలించి ఆ తరువాత చర్యలు తీసుకొంటామన్నారు.

ఏమిటీ ఎస్‌ఐ స్కాం?

2021 అక్టోబరులో సుమారు 545 ఎస్‌ఐ ఉద్యోగాల భర్తీకి రాష్ట్రమంతటా 90 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. రుద్రేగౌడ కలబుర్గిలోని తమ ప్రైవేటు స్కూలు సెంటర్‌లో అభ్యర్థుల నుంచి పెద్దమొత్తాల్లో డబ్బులు తీసుకుని సమాధానాలు చెప్పించాడని, ఇంకా అనేకచోట్ల అభ్యర్థులకు బ్లూటూత్ ద్వారా సమాధానాలు చేరవేశాడని 2022 మార్చి-ఏప్రిల్‌లో గుప్పుమంది. దీంతో పరీక్షలను ప్రభుత్వం రద్దు చేసింది. ఆపై రుద్రేగౌడ, దివ్య హగరగి సహా అదనపు డీజీపీ అమృత్ పాల్, అనేకమంది ఎస్‌ఐలు, డీఎస్పీలు కూడా జైలుముఖం చూశారు. ఇటీవలే రుద్రేగౌడ, దివ్యలకు బెయిలు వచ్చింది.



సూత్రధారి రుద్రేగౌడ పాటిల్

రుద్రేగౌడకు కస్టడీ

ఈ నెల 19న ఈడీ అధికారులు దాడి చేసినప్పుడు ఇంటి నుంచి పరారైన రుద్రేగౌడ సోమవారం కలబుర్గి కోర్టులో లొంగిపోయాడు. కోర్టు అతనికి 2 వారాల జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో జైలుకు తరలించారు. అతన్ని విచారణ కోసం కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతామని సీఐడీ అధికారులు తెలిపారు.

నిజమైతే కఠిన చర్యలు: సీఎం బొమ్మై

ఆర్‌డీ పాటిల్ వీడియో ను తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై ఈ ఆరోపణలపై విచారణ చేయిస్తానని తెలిపారు. మంగళవారం కల్బుర్గిలో విలేకరులతో మాట్లాడిన ఆయన నిందితుడు ఏమి చెప్పాడనేది విచారణాధికారులకు సమాచారం ఉంటుంది, ఒకవేళ సదరు డీఎస్పీ లంచం డిమాండ్ పెట్టినట్లు రుజువైతే ఆ అధికారిపై చర్యలు తీసుకొంటామని తెలిపారు. చర్యలు తీసుకునే ముందుగా వీడియోలో, ఆడియోలో ఏముందనేది విచారణ చేయిస్తామన్నారు.

వైరల్ కావాలని నోట్లు విసిరాడు

బనశంకరి: ఇప్పుడు నడుస్తున్నది సోషల్ మీడియా యుగం. ఏదో ఒకటి చేసి వైరల్ కావాలన్నది కొందరి ఆరాటం. ఇందుకోసం కొత్త కొత్త విన్యాసాలు చేస్తూ ఉంటారు. అలాంటి ఉదంతమే ఇది నగరంలో కేఆర్ మార్కెట్ ఫ్లై ఓవర్ పై నుంచి ఓ యువకుడు పది రూపాయలు నోట్లు వెదజల్లడంతో జనం వాటిని తీసుకునేందుకు ఎగబడ్డారు. వివరాలు... నాగరబావికి చెందిన ఈవెంట్ మేనేజ్‌మెంట్ చేస్తున్న యువకుడు అరుణ్.. మంగళవారం స్కూటర్‌లో వంతెనపైకి వచ్చాడు. ఒక పెద్ద గోడ గడియారం, సంచి తెచ్చాడు. సంచిలో నుంచి పది రూపాయల నోట్లను విసిరాడు. నోట్లను చూడగానే వంతెన కింద జనం ఏరుకోవడానికి కిందా మీద పడ్డారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొందరు దీనిని వీడియో తీసి సోషల్ మీడియాలో వ్యాప్తి చేశారు. కేఆర్.మార్కెట్ పోలీసులు నోట్ల ఉదంతంపై ఆరా తీశారు. ఎందుకు అలా విసిరాడోనని తెలుసుకునే పనిలో ఉన్నారు. ఇతడు సోషల్ మీడియాలో వైరల్ కావడానికి ఇలాంటి విన్యాసం చేసి ఉండవచ్చని అనుమానాలున్నాయి. ఇతడు ఒక యూట్యూబ్ చానెల్ కూడా నడుపుతుంటాడని తెలిసింది.



నోట్లు వెదజల్లుతున్న అరుణ్

ఏనుగులకు తేనెటీగలతో చెక్

- రైతుల వినూత్న ప్రయోగం



యశవంతపుర: కొండంత గజరాజుకు సూక్ష్మమైన తేనెటీగంటే భయం. ఏనుగుల దాడులను నివారించడానికి రైతులు ఈ గుట్టును అర్థం చేసుకున్నారు. తోటలు, పొలాల్లోకి ఏనుగులు రాకుండా అక్కడక్కడ తేనెపట్ల పెట్టెలను పెట్టి గజరాజులను బెదిరించి దూరం చేస్తున్నారు. దక్షిణ కన్నడ జిల్లా సుళ్య తాలూకా మండేకోలు, అజ్జావర, అలెట్టి గ్రామాలలో రైతులు దీనిని పాటిస్తున్నారు. ఏనుగులు తరచూ పంటలను నాశనం చేయడం జరుగుతోంది. సోలార్ కంచె, సిమెంట్ గోడలను పెట్టినా ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పుడు తేనెటీగల పెట్టెలను పొలాల్లో చుట్టూ అమర్చారు. తేనెటీగలంటే ఏనుగులకు చాలా భయం. అవి తొండం, చెవుల్లో కుట్టి ఇబ్బంది పెడతాయి. మేఘాలయ, అసోంలో రైతులు ఇదే పద్ధతిని అవలంబిస్తున్నట్లు తెలుసుకున్నారు. తేనెటీగలు ఉన్నట్లు తెలిసి గజరాజులు అటువైపు రావడం లేదని రైతులు తెలిపారు. ఉడుపి, మంగళూరు ప్రాంతాలలో తేనెటీగల పెంపకానికి కేంద్ర హనీ మిషన్ యోజన ద్వారా తోడ్పాటు అందుతోంది.

లోకాయుక్తలో ప్రభుత్వ జోక్యం ఉండకూడదు

- విశ్రాంత లోకాయుక్త సంతోష్ హెగ్డే



మైసూరు: లోకాయుక్త వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం ఉండకూడదని, తాను లోకాయుకగా ఉన్నప్పుడు ఉన్నంత స్వేచ్ఛ నేడు కనిపించడం లేదని విశ్రాంత లోకాయుక్త న్యాయమూర్తి సంతోశ్ హెగ్డే అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం మైసూరులో జిల్లా విలేకరుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో లోకాయుక్త స్థానంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ని తీసుకువచ్చారని, ఏసీబీ వచ్చిన తరువాత రాజకీయ నాయకులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. లోకాయుక్త ఉన్న సమయంలో రాజకీయ నాయకులపై ఎన్నో కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత లోకాయుక్తను తీసుకువచ్చినా ఎలాంటి ప్రభావం చూపించలేదని అన్నారు. భారత రాజ్యాంగంలో శాసన వ్యవస్థకు ఎంతో విలువ ఉందని, వారు తప్పులు చేస్తే లోకాయుక్త కట్టడి చేస్తుందన్నారు. అయితే లోకాయుక్తను ప్రభుత్వాలు కూడా అడ్డుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎయిర్ షోకు సన్నాహాలు



యలహంకలో వైమానిక ప్రదర్శన (ఫైల్)

శివాజీనగర: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో బెంగళూరులో రెండేళ్లకు ఒకసారి జరిగే ఏరో ఇండియా అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనకు సన్నాహాలు సాగుతున్నాయి. ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు బెంగళూరు యలహంక వైమానిక స్థావరంలో జరుగుతుంది. ఇందులో పాల్గొననున్న యుద్ధ విమానాల తొలి బ్యాచ్ ఫిబ్రవరి 7న చేరుకుంటాయి. మరో ఐదురోజుల్లో తరువాతి బ్యాచ్‌వి వస్తాయి. ఫిబ్రవరి 8 నుంచి మూడు రోజులు విమానాల సాధన జరుగుతుంది. అనివార్య కారణాల వల్ల తేదీలు మారినా మారవచ్చని రక్షణ వర్గాలు తెలిపాయి.

దంపతుల ఆత్మహత్య

- వెంటాడిన పేదరికం, అనారోగ్యం

గంగావతి: ఆరోగ్యం బాగాలేదు, మందులు కొనడానికి ఆర్థిక స్థోమత లేక జీవితంపై విరక్తిచెందిన దంపతులు పురుగుల మందును ఆశ్రయించారు. ఈ దుర్ఘటన కొప్పళ జిల్లా గంగావతి శివార్లలోని వడ్డరహట్టిలో చోటు చేసుకుంది. రెక్కాడితే డొక్కాడని నిరుపేద భార్యాభర్తలు వెంకటేశ్వరరావు (55) కుమారి (50) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వెంకటేశ్వర రావు కడుపునొప్పి సమస్యతో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నారు. భార్య కు కూడా కడుపులో గడ్డ ఉందని, శస్త్రచికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచించారు. నిరుపేదలైన దంపతులు మందులు, చికిత్సలకు డబ్బుల్లేక చావే శరణ్యమని భావించి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. గంగావతి పోలీసులు మృతదేహాలను ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘోరంతో వడ్డరహట్టిలో విషాదం తాండవించింది.

స్యాంట్రో రవిపై మరదలి ఫిర్యాదు

శివాజీనగర: భార్యను వేధించడంతో పాటు అనేక నేరారోపణలు ఉన్న స్యాంట్రో రవిపై మరో కేసు నమోదైంది. స్యాంట్రో రవి, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, కాటన్‌పేట పోలీసులపై రవి రెండో భార్య సోదరి (మరదలు) నగర పోలీస్ కమిషనర్, మానవ హక్కుల కమిషన్, చిక్కపేట ఏసీపీ తదితరులకు ఫిర్యాదు చేసింది. తనపై, తన సోదరిపై అప్పుడు కేసులు బనాయించారు. దీని వల్ల నా విద్యాభ్యాసానికి ఇబ్బంది కలిగింది. నేను జైలుకు వెళ్లిన కారణంతో పరీక్షలు రాయలేకపోయాను. ఒక సంవత్సరం చదువులు నష్టపోయానని తెలిపింది. ఈ ఫిర్యాదును ప్రస్తుతం ఉన్న కేసులను విచారిస్తున్న సీఐడీకి బదిలీ చేసినట్లు తెలిసింది. బెదిరించి డబ్బు, బంగారు లాక్కున్నారని స్యాంట్రో రవి భార్య రశ్మిపై కాటన్‌పేట పోలీస్ స్టేషన్‌లో గత సంవత్సరం డిసెంబర్‌లో కేసు నమోదైంది. ఇది తప్పుడు కేసని రశ్మి ఫిర్యాదు చేశారు. రవి ప్రస్తుతం మైసూరులో జైల్లో ఉన్నాడు.

మా అవినీతి నిరూపించాలి

శివాజీనగర: అవినీతిలో కాంగ్రెస్ గంగోత్రి అన్న ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై వ్యాఖ్యలపై సీఎల్‌పీ నేత సిద్దరామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బెంగళూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...అవినీతిలో గంగోత్రి బీజేపీయే గాని కాంగ్రెస్ కాదని ఎదురుదాడికి దిగారు. తమ ప్రభుత్వం, బీజేపీ ప్రభుత్వం అక్రమాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో విచారణకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. కాంట్రాక్టర్లు 40 శాతం కమీషన్ ఆరోపణలు చేసింది ఎవరిపైన అని మండిపడ్డారు. ఏ ఆధారంతో ముఖ్యమంత్రి ఈ విధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంత్రి సుధాకర్ తన ప్రభుత్వంపై చేసిన ఆరోపణలో దమ్ములేదన్నారు. రూ.35 వేల కోట్ల అక్రమాలు జరగలేదు. కాగ్ నివేదికలో మాత్రం తారతమ్యం ఉందన్నారు. మంత్రి సుధాకర్ ఒకప్పుడు తమ పార్టీలో ఉన్నాడు, అప్పుడు ఎందుకు చెప్పలేదు అన్నారు.

భూ వివాదం, వేటకొడవలితో దాడి



బాధితుడు చన్నరాజు

- మండ్య జిల్లా మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో ఘోరం

మండ్య: భూ వివాదంలో విచారణ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఓ వ్యక్తిపై వేట కొడవలితో దాడి చేసిన ఘటన మండ్య జిల్లా మద్దూరు పట్టణంలో మంగళవారం కలకలం రేగింది. వివరాలు... మండ్య జిల్లా మద్దూరు తాలూకా కొప్ప హోబ్లిలోని మూడు ఎకరాల భూమి విషయంలో చన్నరాజుకు, నందన్‌కుమార్ మధ్య వివాదం ఉంది. దీనిపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరుగుతోంది. ఇటీవల చెన్నరాజు ఈ స్థలాన్ని తన భార్య పద్మ, కుమార్తె సృష్టి పేరుతో దానపత్రం రాశాడు.

విచారణ సందర్భంగా ఉదయమే నందకుమార్ అక్కడికి చేరుకున్నాడు. అదే సమయంలో చెన్నరాజు భార్యతో అక్కడికి రాగానే నందకుమార్ తను ముందుగానే తెచ్చుకున్న వేటకొడవలితో చెన్నరాజుపై విచక్షణా రహితంగా దాడిచేశాడు. దాదాపు 40 సార్లు ఇష్టానుసారం నరికాడు. దీంతో ప్రజలు ఆగ్రహంతో నందకుమార్‌పై రాళ్లతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది.

కనువిందుగా గణతంత్ర సాధన



బైక్‌పై ఆర్మీ జవాన్ల సాహసకృత్యం



బడి బాలికల కవాతు సాధన



కేరళ కళాకారుల వాయిద్యాల మధ్య యువకుల విన్యాసాలు



పోలీస్ కమిషనర్ ప్రతాప్‌రెడ్డి, బీబీఎంపీ కమిషనర్ గిరినాథ్ తదితరులు

- మానెక్‌షా మైదానం కళకళ
- ఉత్సవాలకు భారీ భద్రత: సీపీ

బనశంకరి: మానెక్‌షా మైదానం గణతంత్ర వేడుకకు ముస్తాబు అయ్యింది. ఈసారి గణతంత్ర దినోత్సవానికి భారీ భద్రత కల్పించామని నగరపోలీస్ కమిషనర్ సీహెచ్.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మానెక్‌షా పరేడ్ మైదానంలో పూర్తిస్థాయి సాధనను పరిశీలించి బలగాల నుంచి గౌరవవందనం స్వీకరించారు. బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్, నగర జిల్లా కలెక్టర్ దయానంద్‌తో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీహెచ్.ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టారని, ఎలాంటి అసాంఘిక సంఘటనలకు అవకాశమిచ్చేదిలేదన్నారు. 2 వేల మందికి పైగా పోలీసులతో మైదానం చుట్టూ భద్రత ఉంటుందని, వందకుపైగా సీసీ కెమెరాలతో నిఘా ఉంటుందన్నారు. 26న ఉదయం 9 గంటలకు గవర్నర్ గెహ్లాట్ జాతీయ జెండాను ఎగురవేస్తారని తెలిపారు.

ఇవి తీసుకురావద్దు

మైదానానికి వచ్చే ప్రముఖులు, అధికారులకు గేట్ నం 2, వీవీఐపీ పాస్ కలిగిన వారికి గేట్- 3, వీఐపీ పాస్‌లకు గేట్ - 4లో అనుమతిస్తారు. గేట్ వద్ద ప్రతి ఒక్కరినీ తనిఖీ చేస్తారు. వేడుకకు వచ్చేవారు ఉదయం 8.30 లోగా సీట్లలో కూర్చోవాలి. సాధారణ ప్రజలు సిగరెట్, అగ్గిపెట్టె, కరపత్రాలు, రంగు ద్రవణాలు, కెమెరాలు, టపాసులు, జెండాలు, దుస్తులు, ఆహార పదార్థాలు, మద్యం బాటిల్స్ తదితరాలను తీసుకురాకూడదు. కేవలం పర్సు, మొబైల్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. మరోవైపు నగరంలో మైసూరు సర్కిల్‌లోని ఈద్గా మైదానంలో గణతంత్ర వేడుకలను నిర్వహించాలని ఎమ్మెల్యే జమీర్ అహ్మద్. సీఎంకి లేఖ రాశారు.

కనువిందుగా రిహార్సల్స్

ఇక మంగళవారం మానెక్ షా మైదానంలో పూర్తిస్థాయి రిహార్సల్స్ రిపబ్లిక్ డే ఉత్సవాలను తలపించాయి. పాఠశాలల బాలలు, ఆర్మీ జవాన్లు, పోలీసులు, కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. కొన్ని గంటలపాటు రిహార్సల్స్ సాగాయి.

క్లుప్తంగా

మంచి భవిష్యత్తు ఏర్పరచుకోండి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బళ్లారిఅర్బన్: విద్యార్థులు మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని విద్యా శాఖ రిటైర్డ్ అధికారి మల్లికార్జున స్వామి పేర్కొన్నారు. మంగళవారం గాంధీనగర్‌లోని శ్రీగురు తిప్పేరుద్ర పీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన నైరా ఫెస్ట్ వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. 150 మంది విద్యార్థులు ర్యాంక్‌లు, 35 మంది స్వర్ణ పతకాలు పొందడం హర్షనీయం అన్నారు. పీయూలో 5వ స్థానం పొందిన కీర్తిని అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాలలో చదివిన విద్యార్థులు సీఏ నందకిషోర్, సీఏ ప్రకాష్ తమ అనుభవాలను పంచుకున్నారు. కళాశాల చైర్మన్ ఎస్ఎస్.రుద్రప్ప, ప్రిన్సిపాల్ జీ.నాగరాజ్, వైస్ ప్రిన్సిపాల్ జీ.తిప్పేరుద్ర, డైరెక్టర్ మంజుల, ఉపన్యాసకులు కృష్ణప్ప, శశిధర్‌గౌడ, లేపాక్షి, శారద, రాజేష్, ఆకాష్, రాజు పాల్గొన్నారు.

'గాలి'కి గ్లోబల్ పీస్ అవార్డు ప్రదానం

సాక్షి,బళ్లారి: రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాను రెండు రోజులుగా సందర్శించిన గాలి జనార్దనరెడ్డికి అజ్మీర్‌లోని చిస్తీ ఫౌండేషన్ తరఫున గ్లోబల్ పీస్ అవార్డు ప్రదానం చేశారు. బళ్లారి, కొప్పళ జిల్లాల నుంచి దాదాపు 30 మందికి పైగా ఆయనతో పాటు అజ్మీర్ దర్గాను సందర్శించి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గాలి జనార్దనరెడ్డి 1000 మందికి పైగా దర్గా వద్ద అన్నదానం చేశారు. చిస్తీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రముఖులు మాట్లాడుతూ గాలి జనార్దనరెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం గాలి మాట్లాడుతూ తనకు ఈ అవార్డుతో మరింత బాధ్యతలు పెరిగాయని, మరింతగా పేదల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా గాలి జనార్దనరెడ్డి సతీమణి లక్ష్మీ అరుణ, చిస్తీ ఫౌండేషన్ చైర్మన్ సయ్యద్ సల్మాన్ చిస్తీ, బళ్లారికి చెందిన ఆలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో సౌభ్రాతృత్వం పెంపొందించాలి



మాట్లాడుతున్న జేఎంఎఫ్‌సీ జడ్జి హాజీ హుసేన్

సిరుగుప్ప: పిల్లలపై ఎలాంటి కుల, మత, వర్గ, భాష, ప్రాంత వివక్ష చూపకుండా అందరినీ సమానంగా చూస్తూ సౌభ్రాతృత్వం, భావైక్యతతో నడుచుకొనేలా తల్లిదండ్రులు, గురువులు మార్గదర్శనం ఇవ్వాలని తాలూకా జేఎంఎఫ్‌సీ జడ్జి హాజీ హుసేన్ యాదవాడ తెలిపారు. ఆయన నగరంలోని బీఈ రామయ్య మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు తమ హక్కుల రక్షణకు చట్టాలను ఉపయోగించుకోవాలన్నారు. బీపీఎల్ కార్డు కలిగిన పేద మహిళలకు, 13 ఏళ్ల లోపు బాలికలకు తాలూకా న్యాయ సేవా సమితి ఉచితంగా న్యాయ సలహాలను ఇస్తుందన్నారు. తహసీల్దార్ మంజునాథస్వామి, తాలూకా వైద్యాధికారి ఈరణ్ణ, సీడీపీఓ జలాలెప్ప, ఎస్ఈఎస్ కార్యదర్శి బీఈ అవినాష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పార్టీ చిహ్నం విడుదల

శివాజీనగర: ఈ నెల 26న ఆర్‌పీఐ (బీ) పార్టీ గుర్తును విడుదల చేయనున్నట్లు పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మూర్తి ప్రకటించారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భారత్)ను స్థాపించినట్లు తెలిపారు. వసంతనగరలో ఉన్న బిడ్కర్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో పార్టీ చిహ్నాన్ని విడుదల చేస్తామని చెప్పారు. ఈసారి అన్ని అసెంబ్లీ సీట్లలో తమ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారని, త్వరలోనే జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. దేశంలో ఇప్పటికీ అనేక సమస్యలు అలాగే ఉన్నాయని, మద్యం, ధనం ద్వారా పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు.

ఉద్యోగ కల్పనకు వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థులు

రాయచూరు రూరల్ : వ్యవసాయ వర్సిటీలో చదివిన వ్యవసాయ ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగాలు కల్పించాలని పట్టభద్రులు డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ వర్సిటీ వద్ద చేపట్టిన ఆందోళనలో విద్యార్థులు మాట్లాడారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో పట్టభద్రులకు 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వర్సిటీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

మహిమాన్వితుడు..తింథిణి మౌనేశ్వరుడు

• నేడు రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు

రాయచూరు రూరల్: దేవదుర్గ తాలూకా కేంద్రానికి 15 కి.మీ.ల దూరంలో తింథిణి మౌనేశ్వరుని ఆలయం ఉంది. మహిమాన్వితుడిగా పేరొందిన మౌనేశ్వరుని క్షేత్రం దక్షిణ కాశీ పుణ్య క్షేత్రంగా ప్రవర్ధమానమవుతోంది. యాదగిరి జిల్లా సురపుర తాలూకా తింథిణి వంతెన వద్ద 16వ శతాబ్దంలో శివుడి అవతారంలో మౌనేశ్వరుడు జన్మించాడు. తన జీవితంలో మౌనేశ్వరుడు అనేక మహిమలతో భక్తుల మన్ననలను చూరగొన్నాడు. చనిపోయిన బిడ్డలను తిరిగి బతికించిన కీర్తి మౌనేశ్వరుడికి దక్కింది. విజయపుర ఆదిల్ షాకి ఖురాన్‌లో ఖుదాను చూపించాడు. మౌనేశ్వరుడి శిష్యుడైన గంగయ్యకు అరచేతిలో కైలాసాన్ని చూపించాడు. హిందూ ముస్లింల సౌహార్దతకు సంకేతంగా జీవితాన్ని రూపొందించిన మహానుభావుడిగా ప్రజల్లోని మౌఢ్యాన్ని, అజ్ఞానాన్ని తొలగించడంలో మహా మేధావిగా ఇక్కడి భక్తుల విశ్వాసం. కృష్ణానది ప్రవహించే చోట ఎగువ నుంచి ప్రజలు భయపడేంతగా గలగల గంగమ్మ, బిరబిర కృష్ణమ్మ వస్తున్న తరుణంలో ప్రజలు మౌనేశ్వరుడిని ఆశ్రయించి నది నుంచి వస్తున్న భీకర శబ్దాన్ని మౌనం చేయాలని వేడుకున్నారు. దీంతో కృష్ణమ్మ తల్లిని పిలిచి ప్రజలకు ఎలాంటి ఆపద కలగకుండా, శబ్దం చేయకుండా మౌనంగా ప్రవహించాలని చెప్పడంతో ఆమె శాంతించింది. దీనికి గుర్తుగా అక్కడ మౌనేశ్వరుడు, కృష్ణమ్మల విగ్రహాలను ఏర్పాటు చేశారు. కాగా ఈనెల 25న తింథిణిలో మౌనేశ్వరుని రథోత్సవానికి ఆలయధర్మకర్తలు అన్ని ఏర్పాట్లు చేశారు.


తింథిణిలోని మౌనేశ్వరాలయం, మౌనేశ్వరుని విగ్రహం, కృష్ణమ్మ తల్లికి ఉపదేశిస్తున్న మౌనేశ్వరుడు

నిధుల వినియోగంలో సర్కార్ విఫలం

• మాజీ సీఎం కుమారస్వామి


మాట్లాడుతున్న కుమారస్వామి

రాయచూరు రూరల్ : కళ్యాణ కర్ణాటక ప్రాంతానికి కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి ఆరోపించారు. మంగళవారం జిల్లాలోని లింగసూగూరు తాలూకా ముదుగల్‌లో పంచరత్న యాత్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో పేదలు నిరుపేదలుగా, శ్రీమంతులు మరింత శ్రీమంతులయ్యారన్నారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం బడా నేతలకు కొమ్ము కాస్తోందన్నారు. ఎస్‌ఐల నియామకాల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరపాలన్నారు. నిజమైన అభ్యర్థులకు న్యాయం లభించలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే మానప్ప వజ్జల్ రూ.1700 కోట్ల మేర నీటిపారుదల నిధులు కాజేశాడన్నారు. ఈ నియోజకవర్గం నుంచి రెండుసార్లు సిద్దూ బండికి అవకాశం కల్పించలేదని, ఈసారి ఎన్నికల్లో బండిని ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. తమకు అధికారం అప్పగిస్తే 24 గంటల విద్యుత్, నీటి సరఫరా, పేదలకు రూ.50 లక్షల వరకు ఉచిత వైద్యం, రుణాలను మాఫీ చేస్తామన్నారు. నారాయణపుర కుడి కాలువ విస్తరణ, ఆధునీకరణ పనులకు జేడీఎస్ సర్కార్ శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావ్ నాడగౌడ, రామనగౌడ, జిల్లాధ్యక్షుడు విరుపాక్షి, శివశంకర్, మహంతేష్ పాటిల్‌లున్నారు.

హత్య వెనుక న్యాయవాది

• నిందితుడు, అనుచరుడు అరెస్టు


అరెస్ట్ చేసిన నిందితులు, సీజ్ చేసిన కారు

యశవంతపుర: వ్యక్తి హత్య కేసులో న్యాయవాదిని పోలీసులు అరెస్టు చేశారు. దేవనహళ్లి తాలూకా విజయపుర వద్ద జనవరి 2న ముత్యాలప్ప అనే వ్యక్తిని ఎవరో హత్య చేశారు. మొదట అపరిచిత శవంగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. 22 రోజుల తరువాత వేలి ముద్రల ద్వారా హతుడు ముత్యాలప్పగా బయటపడింది. విజయపుర పోలీసులు తెలిపిన మేరకు... హతుడు, నిందితులందరూ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ప్రాంతవాసులు. ముత్యాలప్ప, స్థానిక న్యాయవాది నాగేశ్‌ల మధ్య గొడవ జరిగింది. ఎలాగైన ముత్యాలప్పను హత్య చేయాలని నాగేశ్ అనుకున్నాడు. అనంతపురానికి చెందిన సోమశేఖర్ అనే వ్యక్తికి రూ.2500 ఇచ్చి హత్య చేయాలని సూచించాడు. దీంతో సోమశేఖర్ జనవరి ఒకటిన ముత్యాలప్పను అనంతపురానికి పిలిపించి ఫుల్లుగా మద్యం తాగి ఆ మత్తులో కొట్టిచంపాడు. కారులో మృతదేహాన్ని వేసుకుని దేవనహళ్లి తాలూకా విజయపుర పోలీసుస్టేషన్ పరిధిలోను బుళ్లహళ్లి గ్రామం సమీపంలో పడేశాడు. ముఖం మీద బండ రాయి వేసి గుర్తుపట్టకుండా నుజ్జునుజ్జు చేశారు. వేలి ముద్రలు దొరకరాదని వేళ్లను కత్తిరించి దూరంగా విసిరేశారు. పోలీసులు గాలించగా రెండు వేళ్లు దొరికాయి. వాటి ఆధారంగా పోలీసు రికార్డుల సాఫ్ట్‌వేర్‌లో పరిశీలించగా మృతుడు అనంతపురం జిల్లా కంబదూరు పోలీసుస్టేషన్‌లో ఒక కేసులో నిందితుడని తెలిసింది. విచారణ జరిపి నిందితులు నాగేశ్, సోమశేఖర్‌లను అరెస్ట్ చేసి కారును స్వాధీనం చేసుకున్నారు.

హంపీ ఉత్సవాలకు జోరుగా ఏర్పాట్లు


మాట్లాడుతున్న జిల్లాధికారి వెంకటేష్, ఎస్పీ శ్రీహరిబాబు

హొసపేటె: ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతున్న హంపీలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజులు పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లాధికారి టీ.వెంకటేష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఉత్సవాల్లో మొత్తం నాలుగు వేదికల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. హంపీ ఉత్సవాలను వీక్షించేందుకు వచ్చే వారికి ఒన్‌వే సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలకు వెళ్లేవారు కడ్డిరాంపుర మీదుగా వెళ్లవలసి ఉంటుందని, ఉత్సవాల వీక్షణ అనంతరం తిరిగి వెళ్లే వారు కమలాపురం మీదుగా వెళ్లవలసి ఉంటుందని తెలిపారు. ఉత్సవాలను వీక్షించే వారికి కడ్డిరాంపుర నుంచి వేదిక వద్ద వరకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారన్నారు. అదే విధంగా తిరిగి వెళ్లే వారికి కూడా కమలాపురం వరకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారన్నారు. సుమారు 120 ఆర్టీసీ బస్సులు ఉచితంగా సంచరిస్తాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో హంపీ బైసైకి, కుస్తీ, వాటర్ బోటింగ్, చిత్రలేఖన పోటీలతో పాటు ఫలపుష్ప ప్రదర్శన, పుస్తకాల ప్రదర్శన, కవిగోష్ఠి తదితర వినూత్న కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

భారీగా ఆశావహుల జాబితా

• కేరళ ఎంపీ జేబీ మాథుర్


పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

గంగావతి రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆశావహ అభ్యర్థుల జాబితా చాలా పెద్దదిగా ఉందని, అభ్యర్థుల ఎంపికలో అంతిమ నిర్ణయం హైకమాండ్‌దేనని కేరళ ఎంపీ, కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి జేబీ మాథుర్ అన్నారు. ఆమె మంగళవారం మాజీ మంత్రి ఎం.నాగప్ప ఇంటిలో పాత్రికేయులతో మాట్లాడారు. గంగావతిలో ముగ్గురు మాత్రమే రేసులో ఉన్నారన్నారు, వీరిలో కూడా అంతిమంగా హైకమాండ్ ఎవరికి టికెట్ ఇవ్వాలో నిర్ణయిస్తుందని, వారే పార్టీ అభ్యర్థిగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉంటారని సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎం.నాగప్ప, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అప్పాని నారాయణరావు, కాళప్ప, యువ నాయకులు సర్వేష్, రెడ్డి శ్రీనివాస్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటంకం కారాదు


రాయచూరు రూరల్: పేద విద్యార్థుల చదువుకు ఎలాంటి అడ్డంకి రాకూడదని ఈడీఆర్టీ సంస్థ సంచాలకురాలు రత్న పేర్కొన్నారు. మంగళవారం తాలూకాలోని పంచముఖి ప్రాథమిక పాఠశాలకు 250 బ్యాగులు, 1080 నోట్ పుస్తకాలు, 100 ప్లేట్లు, 100 గ్లాసులను పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యకు ప్రాధాన్యత కల్పించి వారిని బావి భారత పౌరులుగా తీర్చిద్దాలన్నారు.

బైక్‌పై స్టంట్: ఇద్దరికి గాయాలు


ఘటనాస్థలంలో ప్రమాద దృశ్యం

హొసపేటె: బైక్‌పై స్టంట్ చేస్తూ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో బైక్ రోదకుడితో పాటు వెనుక కూర్చొన్న యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. చిత్తవాడిగిలోని హోం గార్డ్స్ కార్యాలయం ముందు ఉన్న బైపాస్ రోడ్డులో విరుపాక్ష, మల్లికార్జున అనే యువకులు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై స్టంట్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. తీవ్రంగా గాయపడిన వీరిద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బైక్‌ను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

తల్లీ కూతురు అదృశ్యం


మహంతమ్మ, లక్ష్మి(ఫైల్)

గంగావతి: తల్లి కూతురు అదృశ్యమైన ఘటన కొప్పళ జిల్లా అళవండిలో జరిగింది. ఈనెల 11న మహంతమ్మ(24) చీర ఫాల్స్ తెచ్చేందుకు వెళ్లి అంగన్‌వాడీ కేంద్రంలోని తన కుమార్తె లక్ష్మి(4)ని పిలుచుకుని వెళ్లిపోయి ఇంతవరకు తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కూడా తెలియలేదని కొప్పళ పోలీసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం


ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హైదరాబాద్‌కు చెందిన అవేర్ గ్రూప్, జిల్లా లారీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బీపీసీఎల్ వార్షిక మహోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని లారీ టర్మినల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదని, ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు, కీళ్ల నొప్పులు, ఆర్థోపెడిక్, హెచ్ఐవీ తదితరాలను ప్రముఖ వైద్యులు రేణుకా రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మహమ్మద్ ఇర్ఫాన్, విజయ్ నాగరాజ్ నిర్వహించారు. బీపీసీఎల్, ఏడబ్ల్యూఆర్ఈ ప్రాజెక్ట్ నిర్వాహకులు రామ్‌రాజ్, విద్యాదాస్, వెంకటరమణ, నందిని, లారీ యజమానులు, డ్రైవర్ల సంఘం అధ్యక్షులు పెద్దన్న, కార్యదర్శి బసవరాజ్, పాండురంగ, చల్లా మహేష్ తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో సుమారు 500 మంది లారీ డ్రైవర్లు, క్లీనర్లతో పాటు స్థానికులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు.

కార్మికులకు వేతనాలు పెంచండి


వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్ : జిల్లాలోని లింగసూగూరు తాలూకా హట్టి బంగారు గనుల కంపెనీలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మంగళవారం బెంగళూరు హట్టి బంగారు గనుల కంపెనీ వద్ద ఆందోళన చేపట్టిన సంచాలకుడు అసనత్ అలీ మాట్లాడారు. ఒప్పందం ప్రకారం పెంచిన వేతనాలు 22 నెలలైనా చెల్లించలేదన్నారు. ఐటీఐ, డిప్లమా చేసిన అభ్యర్థులకు, సానుభూతి ఆధారంగా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేలా చూడాలన్నారు. హట్టిలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కంపెనీ అసిస్టెంట్ మేరీకి వినతిపత్రం సమర్పించారు.

విమ్స్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా


వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం విమ్స్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సంఘం కార్యదర్శి ఏ.దేవదాస్ మాట్లాడుతూ విమ్స్ పాలక మండలి, అధికారులు కాంట్రాక్ట్ ఉద్యోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి వారికి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ధర్నాలో ఏఐయూటీయూసీ ఎం.శాంత, కార్మిక నాయకుడు హొన్నూర్, పార్వతమ్మ, దుర్గమ్మ, వెంకటలక్ష్మి, నిర్మలమ్మ, నాగమ్మ, అంజిని, జయరామ్ పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

నిరంతర ప్రయత్నమే సాధనకు పునాది


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు : నిరంతర ప్రయత్నం ద్వారానే జీవితంలో దేన్నయినా సాధించవచ్చని బెంగళూరు కళాశాల విద్యా శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ సీవీసీ రావ్ తెలిపారు. మంగళవారం నగరంలోని నందవరీక భవనంలో ట్రస్టు 15వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. సముదాయ విద్యార్థులను విద్యాపరంగా ప్రోత్సహించడానికి ప్రతిభా పురస్కార కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ కె రఘునాథరావ్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి ట్రస్టు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ప్రతియేటా సముదాయంలోని సీనియర్ దంపతులను గౌరవించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ప్రతిభావంత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. మాజీ ఎమ్మెల్యే కెఆర్ శ్రీనివాసయ్య, ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ జయరాం, ఉపాధ్యక్షుడు డీఎస్ శంకరనారాయణ పాల్గొన్నారు.

జీపీ కార్యాలయం ప్రారంభం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తదితరులు

కేజీఎఫ్ : గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ఎస్ మునిస్వామి తెలిపారు. మంగళవారం కమ్మసంద్ర జీపీ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. కిసాన్ సమ్మాన్ పథకంలో భాగంగా రైతులకు ప్రతి నెలా నేరుగా వారి ఖాతాలకు 11 కంతుల్లో రూ.22 వేలను జమ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పేదలకు ఇళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, వీధి దీపాలు, చెక్‌డ్యాంలను నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ గ్రామ వాస్తవ్య ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే రూపా శశిధర్, మామిడి అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎం.వాసుదేవ, జీపీ అధ్యక్షుడు బి.సురేష్, తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.

వారి మార్క్స్‌కార్డు నాకొద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య

హుబ్లీ: బీజేపీ వారి మార్క్స్‌కార్డు నాకు అక్కరలేదని హుబ్లీ ధార్వాడ తూర్పు అసెంబ్లీ ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య తెలిపారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తన క్షేత్ర అభివృద్ధి కోసం రెండు హయాంల్లో సుమారు రూ.1200 కోట్లకు పైగా నిధులను తెచ్చానన్నారు. అయిన అభివృద్ధి మరచిన బీజేపీ నేతలకు తనపై ఆరోపణలు చేయడానికి ఏ విషయం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అబద్ధాన్ని వారు వంద సార్లు చెప్పి నిజం చేయాలనుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

ఉద్యోగుల క్రీడా పోటీల జయప్రదానికి పిలుపు

కోలారు : నగరంలోని విశ్వేశ్వరయ్య స్టేడియంలో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీల్లో అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడానికి ఉత్సాహం చూపేవారు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రవిచంద్ర, జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నేగిలయోగి నాటకం


నాటకంలోని ఓ సన్నివేశం

బళ్లారిటౌన్: కన్నడ సంస్కృతి శాఖ, రమేశ్‌గౌడ పాటిల్ కళా ట్రస్టు ఆధ్వర్యంలో మాఘమాస సంస్కృతి సంభ్రమలో భాగంగా సోమవారం రాత్రి హొంగిరణ కళామందిరంలో ప్రదర్శించిన నేగిలయోగి అనే రైతు నాటకం ఎంతో ఆకట్టుకుంది. ప్రస్తుతం రైతులు అప్పుల వల్ల ఎదుర్కొంటున్న బాధలపై ప్రభుత్వాలు స్పందించని తీరును కళాకారులు నాగభూషణ, రామచంద్ర, శిల్పా, రమేశ్‌గౌడ, శివరుద్రయ్య, సరోజ, నాగరాజు, నాగనగౌడ తదితరులు కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. నాటకాన్ని ట్రస్టు అధ్యక్షుడు కోటేశ్వరరావు, రాఘవ మెమోరియల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చెన్నప్ప, కసాప జిల్లాధ్యక్షుడు నిష్టి రుద్రప్ప, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

ఆప్ కార్యవర్గం ఎంపిక


ఆప్ నూతన అధ్యక్షుడికి ఆదేశపత్రం అందిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా నూతన అధ్యక్షులుగా టీ.కిరణ్‌కుమార్, కార్యదర్శిగా పంపనగౌడలు నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టరేట్ ఆవరణలోని పత్రికా భవనంలో ఆ పార్టీ పదాధికారులు శేఖర్‌యాదవ్, ఖలందర్‌బాషా, నాగప్పయాదవ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. గతంలో ఉన్న అధ్యక్షుడు మల్లప్పను రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 224 క్షేత్రాల్లో తమ పార్టీ పోటీ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమీర్‌ఖాద్రి, మంజునాథ్, నూర్ మహమ్మద్ పాల్గొన్నారు.

బలిజలకు 2ఏ కోసం 27న ధర్నా


మాట్లాడుతున్న ఇంగళగి నారాయణప్ప

కంప్లి: రాష్ట్రంలో బలిజ సమాజాన్ని కేటగిరి–2ఏలో చేర్చాలని ఒత్తిడి చేస్తూ ఈ నెల 27న బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో చేపట్టనున్న ధర్నాలో బలిజ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పట్టణ బలిజ సంఘం కార్యదర్శి ఇంగళగి నారాయణప్ప తెలిపారు. పట్టణంలోని యోగి నారాయణ యతీంద్ర బలిజ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1994కు ముందు కేటగిరి–2ఏలో ఉన్న బలిజలను 3ఏలో చేర్చి అన్యాయం చేశారన్నారు. 2011లో తమ పోరాట ఫలితంగా అప్పటి సీఎం యడియూరప్ప విద్యాభ్యాసానికి మాత్రం 2ఏ రిజర్వేషన్ అందించారన్నారు. సంఘం అధ్యక్షులు బసవరాజ్, మహిళా అధ్యక్షురాలు శారదా లోకేష్, పదాధికారులు అనిల్, విద్య పాల్గొన్నారు.

వైభవంగా ఆత్మార్పణ దినోత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శ్రీనివాసపురం : నగరంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సముదాయం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, పలు ధార్మిక కార్యక్రమాలను జరిపారు. అభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, దేవి మూల విగ్రహానికి 108 కలశాలతో విశేష అభిషేకం చేశారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం ఉయ్యాలోత్సవం, ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు లఘు ఉపహార వ్యవస్థ ఏర్పాటు చేశారు. కాగా ఆర్యవైశ్య సముదాయం వారి దుకాణాలకు సెలవు ప్రకటించారు.

వేతన సవరణ కోసం ఆందోళన


ధర్నా చేస్తున్న కేఎస్ఆర్టీసీ కార్మికులు

కోలారు : వేతన సవరణతో పాటు ఇతర డిమాండ్లను నెరవేర్చాలని మంగళవారం కేఎస్ఆర్టీసీ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డివిజనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ వైస్ ప్రెసిడెంట్ నారాయణస్వామి మాట్లాడుతూ వేతన సవరణ ఇతర 11 డిమాండ్ల సాధన కోసం 6 సంఘాల సభ్యులు రాష్ట్రంలోని అన్ని డివిజనల్ కార్యాలయాల ముందు ఏకకాలంలో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చని పక్షంలో పోరాటాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్మిక నాయకుడు బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి కార్మికుల డిమాండ్లను తీర్చాలన్నారు. ధర్నాలో కార్మిక మహామండలి విభాగ కార్యాధ్యక్షుడు ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ప్రజాపతి సముదాయం వార్షికోత్సవం


పూజలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు

బొమ్మనహళ్లి: నగరంలోని బెంగళూరు దక్షిణ విభాగం ప్రజాపతి సముదాయం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మనహళ్లి పరిధిలోని జగరనహళ్లిలో ఉన్న ప్రజాపతి సముదాయ భవనంలో సముదాయానికి చెందిన దేవతా మూర్తులకు ఆ వర్గానికి చెందిన పెద్దలతో పాటు ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి సైతం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వామీజీల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పురుషోత్తం (రవి)తో పాటు స్థానిక నాయకులు, ప్రజాపతి సముదాయం ప్రజల పాల్గొన్నారు.

హోదాను మరచి మాట్లాడొద్దు

మైసూరు: సీఎల్‌పీ నేత సిద్దరామయ్య తన హోదాను మరచి మాట్లాడుతున్నారని, దీంతో చులనకయ్యే ప్రమాదం ఉందని నటుడు, బీజేపీ రాజ్యసభ ఎంపీ జగ్గేశ్ అన్నారు. మంగళవారం మైసూరు జిల్లా హుణసూరులో జరిగిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర కార్యక్రమంలో జగ్గేశ్ మాట్లాడుతూ... మాజీ సీఎం సిద్దరామయ్యకు పోటీ చేయడానికి ఒక మంచి నియోజకవర్గం కూడా లభించడం లేదని, మైసూరులో రాజకీయం ప్రారంభించిన ఆయనకు ఎక్కడ నుంచి పోటీ చేయాలో ఒక నిర్ణయానికి కూడా రాలేదని అన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధిలోని బిళ్లెకహళ్లి వార్డు పరిధిలోని విజయా బ్యాంక్ లేఔట్‌లోని అనంతకుమార్ క్రీడా మైదానంలో స్థానిక బిళ్లెకహళ్లి ప్రో టెన్నిస్ బాల్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే క్రికెట్ పోటీలకు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 35కు పైగా జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బిళ్లెకహళ్లి సమాజ సేవకుడు బీ.వై. రమేష్, వార్డు బీజేపీ అధ్యక్షుడు ముకుందరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టు దుర్మరణం

మైసూరు: బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మైసూరు–మానందవాడు రోడ్డులో చోటు చేసుకుంది. మృతుడిని హెచ్.డి.కోటె తాలూకా మాదాపుర గ్రామానికి చెందిన సిద్దరాజు (50)గా గుర్తించారు. ఇతను బైక్‌పై మైసూరు నుంచి స్వగ్రామం వెళ్తుండగా ఆరనకెరె గేట్ మూల మలుపు వద్ద లారీ ఢీకొంది. తీవ్ర గాయాలతో సిద్దరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె


- యథావిధిగా రవాణా

శివాజీనగర: వేతన పెంపుతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం కేఎస్ ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం ప్రారంభమైంది. అయితే బస్సుల సంచారంలో ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్ల డివిజన్ కార్యాలయాల ముందు రవాణా ఉద్యోగులు ధర్నా చేపట్టినా రవాణా యథావిధిగా కొనసాగింది. 16 డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామని కేఎస్ఆర్‌టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనంత సుబ్బారావు తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొన్నారు.

దొడ్డబళ్లాపురలో ప్రజాధ్వని

యశవంతపుర: బెంగళూరులో ఒక నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు వస్తున్న వార్తలను హాస్యనటుడు సాధుకోకిల కొట్టి పారేశారు. ఆయన మంగళవారం దొడ్డబళ్లాపురలో విలేకర్లతో మాట్లాడారు. తనకు కాంగ్రెస్ పార్టీ అప్పగించిన పనులను తు.చ తప్పకుండా పాటిస్తాన్నారు. దొడ్డబళ్లాపుర పట్టణంలో కాంగ్రెస్ నిర్వహిస్తున్న ప్రజాధ్వని కార్యక్రమం మంగళవారం సాయంత్రం జరిగింది. మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌తో పాటు అనేక మంది పార్టీ ఎమ్మెల్యేలు నాయకులు పాల్గొన్నారు. పట్టణం కాంగ్రెస్ జెండాలతో నిండిపోయింది.

ఆంజనేయస్వామి ఊరేగింపు


ఊరేగింపు దృశ్యం

మైసూరు: మైసూరు శారదాదేవి నగరలో హనుమజ్జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీఆంజనేయ స్వామి ఊరేగింపు, 101 పూర్ణకుంభ కలశాల ప్రదర్శన వైభవంగా జరిగింది. జానపద కళాకారుల బృందాల మధ్య ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తిని ఊరేగించారు. నందికోలు, కుణిత, మహిళ వీరగాసె, పూజా కుణిత తదితర నృత్య బృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రూ 57 లక్షల విలువైన..

స్మార్ట్ వాచీలు స్వాధీనం

- ఈనెల 15న 23 బాక్సులను ఎత్తుకెళ్లిన దోపిడీ దొంగలు


స్వాధీనం చేసుకున్న వాచీలను పరిశీలిస్తున్న అదనపు పోలీస్ కమిషనర్ సందీప్ పాటిల్ తదితరులు

బనశంకరి: టెంపోను అడ్డగించి స్మార్ట్ వాచీలను దోచుకున్న ఇద్దరిని మంగళవారం రాజరాజేశ్వరి నగర పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 57 లక్షల విలువైన 1282 టైటాన్ స్మార్ట్ వాచీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నగర అదనపు పోలీస్ కమిషనర్ సందీప్ పాటిల్ మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

సిగిరెట్ల బండిళ్ల లోడ్ కోసం వస్తే...

అశోక్ లైలాండ్ టెంపోలో కోలారు మాలూరు ఫ్లిప్‌కార్ట్స్ ద్వారా రూ.57 లక్షల విలువచేసే 23 బాక్సులు (1282) టైటాన్ స్మార్ట్ గడియారాలను లోడ్ చేసుకుని జవరేగౌడ నగరంలో గల జయదీప్ ఎంటర్‌ప్రైజెస్ అనే కొరియర్ కార్యాలయం ముందు ఈనెల 15న నిలిపారు. అదేరోజు రాత్రి 10 గంటల సమయంలో కొరియర్ వేర్‌హౌస్‌లో విధులు నిర్వహించే జాన్, బిసాల్ కిసాన్ అనే ఇద్దరు సిగరెట్ బండిళ్లు తీసుకురావడానికి వాచీలను సేకరించిన వాహనాన్ని తీసుకుని నాయండహళ్లికి వెళ్లి రాత్రి 10.30 సమయంలో రాజరాజేశ్వరినగర జవరేగౌడదొడ్డి రోడ్డు మహారాజ బార్ వద్ద వస్తుండగా కారు, మూడు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఐదుగురు దోపిడీదొంగలు టెంపోను అడ్డుకుని జాన్, బిసాల్‌కిసాన్‌పై దాడి చేయడంతో వారు పారిపోయారు. దోపిడీదొంగలు టెంపోలో ఉన్న సుమారు రూ.57 లక్షల విలువచేసే గడియారాలను తీసుకుని ఉడాయించారని కొరియర్ కార్యాలయం వేర్‌హౌస్ మేనేజర్ హనుమేగౌడ ఆర్‌ఆర్‌నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి వివిధ ప్రాంతాల్లో గాలించి జమీర్, షాహిద్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. రూ.57 లక్షల విలువచేసే వాచీలను స్వాధీనం చేసుకున్నారు.

మానవ జన్మ ఉత్తమమైనది


హోమంలో పాల్గొన్న రాంబాబు దంపతులు

బనశంకరి: ఈ సృష్టిలోకెల్లా మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని వేదపండితుడు విద్వాన్ అరవింద్‌భట్ అన్నారు. మంగళవారం జేపీ.నగర్ మూడోస్టేజ్‌లోని శ్రీ శివబాలయోగి మహరాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివబాలయోగి మహారాజ్ 88వ జయంత్యుత్సవాలను భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ప్రతిమనిషి మంచి గుణాలను మాత్రమే స్వీకరించాలని, తల్లిదండ్రులు తరువాత స్థానం గురువుదేనన్నారు. భగవంతుడు ప్రసాదించిన ఈ జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. నగరంతో పాటు ఇతర ప్రాంతాలనుంచి భక్తులు విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. 5 గంటల నుంచి ధ్యానం, భజన, కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు, పదాధికారులు ట్రస్టీలు పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

సోడిగద్దె జాతర ప్రారంభం

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా భట్కళ తాలూకాలోని అతిపెద్ద జాతర సోడిగద్దె మహసతిదేవి జాతర సోమవారం నుంచి ప్రారంభమైంది. 9 రోజుల పాటు జరుగుసుంది. తాలూకా పాలన అధికారి, తహశీల్దార్ అశోక్‌భట్ సోమవారం విశేష పూజలు చేసి జాతర ప్రారంభించారు.

బాలికలకు స్వేచ్ఛ కల్పించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చిన్నారులు

తుమకూరు: సమాజంలో స్త్రీ, పురుష అనే బేధాలు ఉండకూడదని, వారి మధ్య అసమానతలను పోగొట్టడానికి 2008 నుంచి జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని మహిళ, శిశు సంక్షేమ శాఖ సహాయక డైరెక్టర్, బాల భవనం సమితి కార్యదర్శి ఎం.ఎస్. శ్రీధర్ తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని బాలభవన్‌లో ఏర్పాటు చేసిన జాతీయ బాలిక దినోత్సంలో ఆయన మాట్లాడుతూ...బాలికలకు అన్ని విధాలా స్వేచ్ఛను కల్పించాలని, వారి సంరక్షణ, విద్య, హక్కులు విషయంలో ఆటంకం కలిగించకూడదన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే నీటి పథకాలు


మాట్లాడుతున్న సిద్దరామయ్య

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం జిల్లాకు ఎత్తినహొళె హెచ్ఎన్ వ్యాలీ, కేసీ వ్యాలీ నీరావరి పథకాలను అమలు చేసింది తానేనని సీఎల్‌పీ నేత సిద్దరామయ్య అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని బిబిరోడ్డు పూల మార్కెట్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రజాధ్వని కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజాధ్వని అంటే ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి కష్ట సుఖాలను తెలుసుకుంటామని అన్నారు. ఇక మంత్రి సుధాకర్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజకీయ జన్మనిచ్చిన కాంగ్రెస్‌పై సుధాకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇతను డాక్టరో కాదో తెలియదు కాని, కోవిడ్ సమయంలో చామరాజనగర ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరతతో 36 మంది చనిపోతే కేవలం ముగ్గురు మాత్రమే చనిపోయారని చెప్పారని, అలాంటి వ్యక్తి కాంగ్రెస్‌పై అభాండాలు వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డీకే శివకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సుర్జివాలా, నేతలు ఎంబి పాటిల్, కెహెచ్ మునియప్ప, వీరప్పమొయిలీ, కృష్ణ బైరేగౌడ, రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి


విద్యా పండుగలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తుమకూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ రామచంద్రప్ప అన్నారు. మంగళవారం తుమకూరు జిల్లా పట్టనాయకనహళ్లి కర్ణాటక పబ్లిక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కలిక హబ్బ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థిలోనూ నిగూఢంగా ప్రతిభ దాగి ఉంటుందని, వారిని ప్రోత్సహించాలని అన్నారు.

హాసన నుంచి పోటీ చేస్తా

యశవంతపుర: హాసన నుంచి వచ్చే విధానసభ ఎన్నికలలో తాను పోటీ చేస్తానని మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ భార్య భవాని ప్రకటించారు. హాసన తాలూకా సాలగామె వద్దనున్న అణ్ణప్పస్వామి దేవస్థానాన్ని ప్రారంభించి మాట్లాడారు. తన భర్త రేవణ్ణ మంత్రిగా ఉన్న కాలంలో తాను అనేక అభివృద్ధి పనులను చేపట్టినట్లు వివరించారు. బీజేపీ అభ్యర్థి గత ఎన్నికలలో గెలవటం వల్ల పనులు ముందుకు సాగలేదని ఆరోపించారు. తను పోటీ చేస్తే గెలుపు జేడీఎస్‌దే అన్నారు.

ఎన్నికలు బహిష్కరిస్తాం

యశవంతపుర: వచ్చే విధానసభ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు చిక్కమగళూరు జిల్లా కళస తాలూకాలోని పలు గ్రామాలు ప్రజలు గ్రామంలో బోర్డులు పెట్టి తమ ఆక్రోశాన్ని వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామలు అభివృద్ధికి నోచుకోక పోవటంతో కళస తాలూకా శంకరకోడి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అనేక సార్లు రోడ్డు పనులు చేయాలని ప్రజా ప్రతినిధులకు విన్నపం చేసిన పట్టించుకోక పోవటంతో వచ్చే ఎన్నికలలో ఎవరికీ ఓటు వేయకుండా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు గ్రామంలో బ్యానర్లు కట్టారు.

నేడు తెలుగు పాస్టర్ల సమావేశం

శివాజీనగర: నగరంలోని మత్తికెర హెచ్‌ఎంటీ లేఔట్‌లో ఉన్న రసెల్ మెమోరియల్ తెలుగు చర్చిలో బుధవారం కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో తెలుగు పాస్టర్ల సమావేశం జరగనుందని కేటీసీఎంఎఫ్ సంస్థాపక అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఎం.బెంజమిన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర తదితర జిల్లాల్లో సేవలందిస్తున్న పాస్టర్లను ఆధ్యాత్మికంగా బలపరచాలనే ఉద్దేశ్యంతో కేటీసీఎంఎఫ్ పని చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం జరిగే పాస్టర్ల సమావేశంలో ప్రసంగీకులు డాక్టర్ జాన్‌పాల్, డాక్టర్ రెవరెండ్ జేడీ మోజస్ దైవ వర్తమానాన్ని వినిపిస్తారని తెలిపారు.

రెండో రోజుకు అంగన్‌వాడీల ధర్నా

శివాజీనగర: వివిధ డిమాండ్ల సాధన కోసం వేలాది మంది అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరుకుంది. మంగళవారం నగరంలోని ఫ్రీడం పార్క్ మైదానంలో రాష్ట్ర అంగనవాడీ కార్యకర్తల సంఘం (సీఐటీయు) నేతృత్వంలో రాష్ట్ర నలమూలల నుండి 10 వేల మందికి పైగా అంగనవాడీలు పాల్గొన్నారు. రూ. 31 వేల జీతం, మినీ అంగన్‌డీ కేంద్రాలను ఉన్నత స్థాయికి పెంచాలని, గ్రాచ్యుటీ సొమ్ము, పింఛన్, ఈఎస్ఐ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి సునంద మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగనవాడీ కేంద్రాలను బంద్ చేసి ధర్నా చేస్తున్నామని, తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

783 మందిపై రౌడీషీట్ తొలగింపు

యశవంతపుర: సత్ప్రవర్తన కారణంగా మంగళూరు పట్టణంలో 783 మందిపై రౌడీషీట్లు తొలగిస్తూ మంగళూరు పోలీసు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలో ఇప్పటి వరకు 2305 కేసులు రౌడీలపై ఉన్నాయి. ఇందులో 1205 కేసులను రద్దు చేయాలని వివిధ పోలీసుస్టేషన్ల నుంచి సిఫార్సులు అందగా అందులో పరివర్తన కలిగిన 783 మందిని రౌడీషీటర్ల జాబితా నుంచి తొలగించారు.

హోసూరు వార్తలు..

తేరుపేటలో వసతులపై పరిశీలన

హోసూరు: హోసూరు పట్టణలోని తేరుపేటలో ప్రసిద్ధ శ్రీ మరకతాంబ సమేత చంద్రచూడేశ్వర స్వామి ఆలయ రథోత్సవం సమీపిస్తుండడంతో మౌలిక వసతులపై మంగళవారం హోసూరు మేయర్ ఎస్.ఏ. సత్య, కమిషనర్ బాలసుబ్రమణ్యం, అధికారులు పరిశీలించారు. రథోత్సవంలో పాల్గొనే భక్తులకు మెరుగైన రోడ్ల వసతి, పచ్చ కొలను శుద్ధీకరణ, ఇతర సౌకర్యాల గురించి చర్చించారు. స్థానిక ప్రజల వద్ద సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ఆనందయ్య, కార్పొరేటర్లు ఎన్.ఎస్. మాదేశ్వరన్, పార్వతీనాగరాజ్, క్రిష్ణవేణిరాజు, పురుషోత్తమరెడ్డి, శిల్పాశివకుమార్, దిషాత్ పాల్గొన్నారు.

అధికారుల జీపును ఢీకొన్న కారు

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి– హోసూరు జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కారు రోడ్డుపక్కన నిలిపి ఉన్న రహదార్ల శాఖ వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకొంది. క్రిష్ణగిరి నుంచి హోసూరు వైపు వెళ్తున్న టయోటా కారు సూళగిరి సమీపంలోని చిన్నారు వద్ద రోడ్డు పక్కన రహదార్ల శాఖ జీపును ఢీకొట్టగా అది పల్లంలోకి బోల్తా పడింది. జీపులోని అధికారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు కూడా దెబ్బతింది. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరగడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. సూళగిరి పోలీసులు వచ్చి రహదార్ల శాఖ వాహనాన్ని బయటకు తీశారు.

రోడ్డు భద్రతపై చైతన్య ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హోసూరు: రోడ్డు భద్రత దినోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థినులు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జేసీఐ హోసూరు సిఫ్‌కాట్, ఆర్ఎస్‌పి, వైఆర్‌సి, రోటరీక్లబ్ స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. ర్యాలీకి కళాశాల అధ్యాపకులు హేలన్, మేరిలూసిజూలసియట్‌లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రోడ్డు భద్రతలు పాటించి వాహనాలు నడపాలని సూచిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ర్యాలీలో జేసీఐ సిప్‌కాట్ అధ్యక్షుడు వెంకటేష్, బాషా, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

కారులో మృతదేహం



క్రిష్ణగిరి: కురుబరపల్లి సమీపంలో ఓ కారులో అనుమానాస్పద స్థితిలో మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... హోసూరు–క్రిష్ణగిరి జాతీయ రహదారి కురుబరపల్లి సమీపంలోని మేలుమల్లై వద్ద ఓ కారులో వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. గుండెపోటుతో మృతి చెందాడా? ఆత్మహత్య, లేక హత్య చేసి కారులో పడేసి వెళ్లారా అనే కోణంలో పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

లంచం ఇస్తే ఇళ్లు రద్దు చేస్తాం


మాట్లాడుతున్న మంత్రి సుధాకర్

చిక్కబళ్లాపురం: ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్ల కోసం ఎవరైనా డబ్బులు ఇవ్వాలని చూస్తే అటువంటి వారికి ఇళ్లను రాకుండా రద్దు చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సుధాకర్ హెచ్చరించారు. మంగళవారం తాలూకా పరిధిలోని హొసహుడ్య గ్రామంలో ఇల్లు లేని లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు అందజేస్తామన్నారు. ఎంపికైన లబ్ధిదారులకు ఫిబ్రవరి 15లోపు హక్కుల పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ నరసమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

కెంగేరి- మైసూరు రోడ్డు మెట్రో సేవలు నిలిపివేత

బనశంకరి: మైసూరు రోడ్డు నుంచి కెంగేరి మధ్య మెట్రో సేవలు 27 నుంచి 30 తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. మంగళవారం ఈ విషయంపై బీఎంఆర్‌సీఎల్ అధికారులు మీడియాతో మాట్లాడుతూ కెంగేరి నుంచి చల్లఘట్ట వరకు విస్తరణ మార్గం ప్రారంభానికి సంబంధించిన పనులు పూర్తిచేయాలి. ఈ నేపథ్యంలో పర్పుల్‌లైన్ కెంగేరి నుంచి మైసూరురోడ్డు మెట్రో సంచారం నాలుగురోజులు పాటు నిలిపివేశామని తెలిపారు. కానీ బయప్పనహళ్లి నుంచి మైసూరు రోడ్డు మెట్రోస్టేషన్ మధ్య మెట్రో సంచారం యథాప్రకారం ఉంటుందన్నారు. బయప్పనహళ్లి నుంచి కెంగేరి వరకు మార్గంలో రైలు సేవలు 31 తేదీ ఉదయం 5 గంటలు నుంచి ప్రారంభం అవుతాయని తెలిపారు.

రైతులకు రూ. 5 లక్షల వడ్డీ రహిత రుణాలు

తుమకూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు రూ. 5 లక్షల వడ్డీ రహిత రుణాలను ఇస్తామని మాజీ సీఎం సిద్దరామయ్య తెలిపారు. మంగళవారం తుమకూరు నగరంలోని గ్లాస్‌హౌజ్‌లోని ప్రజాధ్వని కార్యక్రమంలో ఆయన కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌తో కలిసి మాట్లాడుతూ... రాష్ట్రంలో కొబ్బరి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, రైతులకు అండగ ఉండాల్సిన బీజేపీ ప్రభుత్వం వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, దోచుకుంటున్నారని మండిపడ్డారు. హలాల్, హిజాబ్ పేరుతో మతాలు విడగొడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడ ప్రశాంతత లేదన్నారు.

పాత్రికేయులకు సాయం చేస్తాం

శివాజీనగర: పాత్రికేయులకు ట్యాబ్ పంపిణీ చేస్తామని, వారికి అన్ని విధాలా సాయం చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రెవెన్యూ శాఖ మంత్రి ఆర్.అశోక్ అన్నారు. మంగళవారం బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో కర్ణాటక మాధ్యమ అకాడమి చేపట్టిన ప్రత్యేక విభాగ పథకం, గిరిజన ఉపయోగ పథకం కింద ఎస్సీ–ఎస్టీ పాత్రికేయులకు ట్యాబ్ పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోరాటం ద్వారా తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఆరోజు ప్రెస్‌క్లబ్‌కు వచ్చి కాఫీ తాగి వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. ఆనాటి నుంచి తనకు, పాత్రికేయులకు అవినాభావ సంబంధముందని అన్నారు. సీఎం కార్యదర్శి మంజునాథ్ ప్రసాద్, మాధ్యమ అకాడమి అధ్యక్షుడు సదాశివ శెణై, నటి ప్రేమ, కార్యదర్శి రూప పాల్గొన్నారు.

ముగిసిన ప్రచారోత్సవం


కార్యక్రమాలను తిలకిస్తున్న ప్రజలు


కీలుబొమ్మలాట

హోసూరు: క్రిష్ణగిరి ప్రభుత్వ బాలికల ఉన్నతోన్నత పాఠశాలలో ప్రజా సంబంధ శాఖ ద్వారా తమిళనాడు ప్రభుత్వ ఏడాది సాధనలపై 14వ తేదీ నుంచి ప్రారంభమైన ఫోటో ప్రదర్శన, కళా ప్రదర్శన సోమవారంతో ముగిసింది. డీఆర్‌వో రాజేశ్వరి పాల్గొని మాట్లాడుతూ గత 10 రోజులుగా నిర్వహించిన ఫోటో ప్రదర్శన, కళాశా ప్రదర్శనను సుమారు 20 వేల మంది తిలకించారని, ఈ ప్రదర్శనకు మంచి స్పందన లభించిందని తెలిపారు. అధికారులు మహమ్మద్‌అస్లాం, విజయలక్ష్మి, జయంతి, గౌరీశంకర్, ప్రసన్న బాలమురుగన్ పాల్గొన్నారు.

కేంద్రం కార్మిక వ్యతిరేక పాలన


ఆందోళన చేస్తున్న దృశ్యం

హోసూరు: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను అమలుచేస్తోందని ఆరోపిస్తూ మంగళవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ ఆందోళన చేసింది. జిల్లా కార్యదర్శి మాదయ్యన్ అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్, సీపీఐ నేత లగుమయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తోందని ఆరోపించారు. తపాలా, విమానాశ్రయాలు, రైల్వే సంస్థలను ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తూ కార్పొరేట్ సంస్థలకు మద్దతు పలుకుతోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 21 వేలు అందజేయాలని, వృద్ధాప్య పెన్షన్ రూ. 6000 అందజేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఆందోళనలో పాల్గొన్న కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

రథోత్సవానికి చిన్న తేరు సిద్ధం


రథం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు తేరుపేటలోని శ్రీ మరకతాంబ సమేత చంద్రచూడేశ్వరస్వామి ఆలయ రథోత్సవం మార్చి 7న జరుగనుంది. ఈ రథోత్సవంలో రెండు తేరులను లాగడం ఆనవాయితీ. చిన్నతేరు శిథిలావస్థకు చేరుకోవడంతో దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ చిన్నతేరు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కే.ఏ.మనోహరన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... శ్రీ మరకతాంబ చంద్రచూడేశ్వరస్వామి ఆలయానికి చెందిన చిన్న తేరు శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త తేరు నిర్మాణానికి దాతలు ముందుకు రావడంతో రూ. 64 లక్షలతో రథం పనులు పూర్తి అయ్యాయని తెలిపారు.

డ్రైనేజీ పనులకు భూమిపూజ

హోసూరు: హోసూరు తాలూకా తొరపల్లి గ్రామపంచాయతీలో రూ. 7 లక్షల వ్యయంతో మురికి కాల్వ నిర్మాణానికి హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తొరపల్లి గ్రామంలో మురికి కాల్వ ఏర్పాటుకు స్థానికులు కోరుతూ వచ్చారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు జిల్లా కౌన్సిలర్ అభివృద్ధి నిధుల నుంచి రూ. 7 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో హోసూరు కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ ఆనందయ్య, పంచాయతీ అధ్యక్షుడు రాము, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జీవ ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ

హోసూరు: హోసూరు తాలూకా ఇచ్చంగూరు గ్రామంలో అత్తిముగం వ్యవసాయ కళాశాల విద్యార్థులు జీవ ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ అధ్యక్షుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొని రైతులు పండించే పంటలకు జీవ ఎరువులు ప్రధానమని, జీవ ఎరువుల వినియోగం వల్ల పంటలకు సోకే చీడపీడలను నివారించేందుకు సాధ్యమని, రసాయన ఎరువుల వినియోగంతో పంటలకు వింత రోగాలు సోకి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై చైతన్యం పెంచుకోవాలని, రసాయన ఎరువుల వినియోగానికి మట్టి పరిశోధనలు చేసి తగిన మోతాదులో మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అత్తిముగం వ్యవసాయ కళాశాల విద్యార్థులు, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొని రైతులకు శిక్షణ ఇచ్చారు.

కొడవ సంప్రదాయ దుస్తుల్లో కొత్త జంట



బనశంకరి: శాండల్‌వుడ్ బ్యూటీ శుభ్ర అయ్యప్ప, పారిశ్రామికవేత్త విశాల్‌కు ఈనెల 19న వివాహం జరిగింది. మంగళవారం కొడవ సంప్రదాయ దుస్తుల్లో ఫొటోషూట్ చేశారు. కొత్తజంట ఫొటోలుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శుభ్ర పింక్ కలర్ చీరలో విశాల్ కొడవ సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. ఈ జోడిని చూసిన ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.

ఈ-వ్యర్థాలతో అనర్థాలే!



దేశంలో ఏటా 35 శాతం పెరుగుతున్న ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలు

- ఏటా పెరుగుతున్న 33 శాతం ఈ-వ్యర్థాలు
- వీటిలో కేవలం 22 శాతం మాత్రమే రీసైక్లింగ్
- 2021-22లో 17.86 లక్షల టన్నుల ఈ-వ్యర్థాలు
- వీటి ప్రభావంతో గాలి, నీరు, భూమి కాలుష్యం
- ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు, జంతువులు

సాక్షి, అమరావతి: దేశంలో ఎలక్ట్రానిక్ (ఈ)-వ్యర్థాల నిర్వహణ సవాల్‌గా మారుతోంది. ఏటా టీవీలు, ఏసీలు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌ల కొనుగోలు 35 శాతం పెరుగుతోంది. మరోవైపు పాత వస్తువుల రూపంలో 33 శాతం వ్యర్థాలుగా మారిపోతున్నాయి. 2021-22లో 17,86,396.65 టన్నుల ఈ-వ్యర్థాలు వెలువడ్డాయి. వీటిలో కేవలం 3,93,007.26 టన్నులను ((22 శాతం) మాత్రమే సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించడం లేదా రీసైక్లింగ్ (పునర్వినియోగంలోకి తేవడం) చేశారు. ఏటా ఇదే పరిస్థితి ఉంటోంది. దీంతో ఈ-వ్యర్థాలు దేశంలో కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఈ-వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వదిలేయడం వల్ల భూమి, నీరు, గాలి కాలుష్యానికి గురవుతున్నాయి. దీనివల్ల భూమి వేడెక్కి ఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతోంది. ఇది రుతుపవనాల గమనాన్ని దెబ్బతీయడానికి దారితీస్తోంది. మరోవైపు ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో వినియోగించే ప్లాస్టిక్‌తోపాటు నికెల్, లెడ్, క్రోమియం, అల్యూమినియం వంటి విషతుల్యమైన లోహాలు భూమిలో కలుస్తున్నాయి. దీంతో భూగర్భజలాలు కలుషితమై ప్రజలు చర్మ, శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులతోపాటు ప్రాణాంతక క్యాన్సర్‌ల బారినపడుతున్నారు. జంతువులు సైతం మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది.


కోట్ల టన్నుల్లో ఈ-వ్యర్థాలు..

ఈ-వ్యర్థాలను సేకరించడం, శాస్త్రీయంగా నిర్మూలించడం లేదా రీసైక్లింగ్ చేయడంలో ఆంధ్రప్రదేశ్ ముందుండగా అధిక శాతం రాష్ట్రాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఏటా 22 శాతం ఈ-వ్యర్థాలను మాత్రమే సేకరించి రీసైక్లింగ్ చేస్తున్నారు. దీంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కోట్ల టన్నుల్లో ఈ-వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ-వ్యర్థాల నిర్మూలనకు సంబంధించి 2016లో రూపొందించిన చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని అన్ని రాష్ట్రాల కాలుష్య నియంత్రణ మండళ్లకు సీపీసీబీ మార్గదర్శకాలు జారీ చేసింది.

2029 నాటికి ఏటా 32.30 లక్షల టన్నుల వ్యర్థాలు..

దేశంలో ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరుగుతున్నట్టే వాటి వ్యర్థాలు కూడా అంతకంతకూ పెరుగుతున్నాయి. ప్రపంచంలో ఈ-వ్యర్థాలను వెలువరించే దేశాల్లో అమెరికా, చైనాల తర్వాత భారత్ మూడో స్థానంలో నిలిచింది. 2028-29 నాటికి దేశంలో ఈ-వ్యర్థాలు ఏటా 32.30 లక్షల టన్నులు వెలువడే అవకాశం ఉందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) అంచనా వేసింది. 2021-22లో 17.86 లక్షల టన్నుల ఈ-వ్యర్థాలు వెలువడడం గమనార్హం. ఈ-వ్యర్థాలను అత్యధికంగా వెలువరించే రాష్ట్రాల్లో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నిలుస్తున్నాయి. ఈ-వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్మూలించడం, రీసైక్లింగ్ చేయడం కోసం 2016లో కేంద్రం చట్టం తెచ్చినా.. అమలులో అధిక శాతం రాష్ట్రాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి.

గత నాలుగేళ్లలో దేశంలో ఈ-వ్యర్థాలు లక్షల టన్నుల్లో ఇలా..



బాబు, నారాయణ వ్యాజ్యాలను విచారించలేను

- విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ శ్రీనివాసరెడ్డి

సాక్షి, అమరావతి: అమరావతి అసైన్డ్ భూముల వ్యవహారంలో సీఐడీ నమోదు చేసిన కేసులను కొట్టేయాలని కోరుతూ మాజీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి పి.నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యాల విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి తప్పుకున్నారు. ఈ వ్యాజ్యాలను మరో జడ్జికి నివేదించేందుకు ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచాలని రిజిస్ట్రీని మంగళవారం ఆదేశించారు. తాను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న సమయంలో ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు అధికారులు తనను సంప్రదించారని, అందువల్ల ఈ వ్యాజ్యాలపై తాను విచారణ జరపడం సబబు కాదని జస్టిస్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అమరావతే రాజధాని అని అప్పటి ప్రభుత్వ పెద్దల ద్వారా తెలుసుకున్న పలువురు టీడీపీ నేతలు, కీలక వ్యక్తులు సమీప గ్రామాల పేదల నుంచి అసైన్డ్ భూములను చట్ట విరుద్ధంగా నామమాత్రపు ధరకే కొన్నారు. ఈ భూములను భూ సమీకరణ కింద ప్రభుత్వానికి ఇచ్చి ప్రతిగా ఖరీదైన నివాస, వాణిజ్య ప్లాట్లు పొందారు. ఈ భారీ అసైన్డ్ భూముల క్రయ, విక్రయాల కుంభకోణంపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీంతో చంద్రబాబు, పి.నారాయణ, మరికొందరిపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసు కొట్టేయాలని కోరుతూ చంద్రబాబు, నారాయణ వేర్వేరుగా 2021లో పిటిషన్లు దాఖలు చేయగా, ఈ కేసులో తదుపరి చర్యలన్నీ నిలుపుదల చేస్తూ అప్పట్లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా తాను విచారించలేనని జస్టిస్ శ్రీనివాసరెడ్డి చెప్పారు.

క్లుప్తంగా...

పోలవరం ఎమ్మెల్యే బాలరాజుకు తీవ్ర అస్వస్థత

- రాజమండ్రిలోని ఆస్పత్రికి తరలింపు
- గుండెలో స్టంట్ అమర్చిన వైద్యులు... నిలకడగా ఆరోగ్యం



చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నీరసంగా ఉన్న బాలరాజు జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు బాలరాజుకు మెరుగైన వైద్యం కోసం రాజమండ్రికి రిఫర్ చేశారు. కుటుంబ సభ్యులు ఆయన్ను రాజమండ్రిలోని సాయి ఆస్పత్రికి తరలించగా, అక్కడ వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు గుండెకు స్టంట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఎమ్మెల్యే బాలరాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలరాజును లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ తదితరులు పరామర్శించారు.

వివేకా హత్య కేసు విచారణకు హాజరవుతా

- సీబీఐకి అన్ని విధాలా సహకరిస్తా
- నా పైన, నా కుటుంబంపైన ఒక వర్గం మీడియా అసత్య ఆరోపణలు
- నాపై వచ్చిన అభియోగాలు జీర్ణించుకోలేకపోతున్నా
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



వేంపల్లె: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి సీబీఐ విచారణకు తప్పకుండా హాజరవుతానని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం వైఎస్సార్ జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన గండి క్షేత్రం వద్ద మీడియాతో మాట్లాడారు. సోమవారం మధ్యాహ్నం పులివెందులలో సీబీఐ నుంచి నోటీసులు అందాయని, మంగళవారం మధ్యాహ్నం విచారణకు హాజరుకావాలని వాటిలో పేర్కొన్నారని తెలిపారు. అయితే జిల్లాలో ముందే కార్యక్రమాలు ఫిక్స్ అయినందున ఐదు రోజులపాటు గడువు అడిగానన్నారు. తదుపరి నోటీసులు అందాక తప్పకుండా సీబీఐ సందేహాలకు, ప్రశ్నలకు సమాధానమిచ్చి అన్ని విధాలా సహకరిస్తానని చెప్పారు. రెండున్నరేళ్లుగా తనపైన, తన కుటుంబంపైన ఒక వర్గం మీడియా అసత్యపు ఆరోపణలు చేస్తోందన్నారు. కోర్టులో ట్రయల్ మొదలుకాక మునుపే ఆ మీడియా తనను, తన దగ్గరివాళ్లను చాలా బాధకు గురి చేసిందన్నారు. ఇవన్నీ భరించానే తప్ప ఏ రోజూ ఒక్క విమర్శ కూడా చేయలేదని అన్నారు. ఈ అంశంపై మాట్లాడాలంటే తన మనసు ఒప్పుకోదని, తనపై వచ్చిన అభియోగాలను జీర్ణించుకోలేకపోతున్నానని చెప్పారు. తానేమిటో, తన వ్యవహార శైలి ఏమిటో జిల్లా ప్రజలందరికీ తెలుసునన్నారు. అసత్యపు ఆరోపణలు చేస్తే ఎంతమంది మనసులు బాధపడతాయో మీరే ఆలోచించుకోండని, మీ కుటుంబాల్లో ఇలా జరిగితే మీకు తెలుస్తుందని అన్నారు. బాధ్యత కలిగిన వ్యక్తులుగా ప్రవర్తించాలని సూచించారు. నిజం గెలవడానికి ఏమేమి చేయాలో తప్పకుండా చేయండి అంటూ ఎంపీ అవినాష్ రెడ్డి వ్యాఖ్యానించారు.

'విద్యుత్' సంస్థల పనితీరు భేష్

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ సంస్థలు అత్యుత్తమ పనితీరుతో వరుసగా ప్రతిష్టాత్మక అవార్డులు సాధించడంపై రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ట్రాన్స్‌మిషన్ రంగంలో ఏపీ ట్రాన్స్‌కో దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని మంత్రి ప్రశంసించారు. ఏపీ ట్రాన్స్‌కోకు 'స్కోచ్' బంగారు, వెండి పతకాలతో పాటు గతనెలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 'జాతీయ ఇంధన పరిరక్షణ' అవార్డు అందుకున్న విషయాన్ని అధికారులు మంగళవారం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ శ్రీధర్, జేఎండీ పృథ్వీతేజ్, అధికారులను, సిబ్బందిని మంత్రి అభినందించారు. వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి రెండు నెలల్లో ఎన్‌టీటీపీఎస్‌లోని మరో 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి యూనిట్‌ను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. రానున్న 25 ఏళ్లపాటు వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం కంకణం కట్టుకుందని చెప్పారు. ఇందుకోసం కేవలం యూనిట్ రూ.2.49 ధరతో 7 వేల మెగావాట్ల సౌరవిద్యుత్ కొనుగోలుకు 'సెకీ'తో ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు.

పనికిమాలిన కొడుకుతో పాదయాత్రా..?

- ఈ పాదయాత్రతో టీడీపీ భూస్థాపితం ఖాయం
- తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి



సాక్షి విశాఖపట్నం: ఎమ్మెల్యేగా ఓడిపోయిన పనికిమాలిన కొడుకుతో చంద్రబాబు పాదయాత్ర చేయిస్తున్నారని తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. ఈ పాదయాత్రతో టీడీపీ పూర్తిగా భూస్థాపితం అవుతుందని అన్నారు. ఆమె మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో పరిపాలన రాజధాని ఏర్పాటుచేస్తే బాబుకి కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు. అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌తో రైతుల నుంచి భూములను లాక్కొని ఆయన పార్టీ నేతలకు, బంధువులకు అప్పగించడమే కాకుండా రైతుల పేరిట దొంగ పాదయాత్ర చేయించి దొరికిపోయాడని విమర్శించారు. సింహాచలం అప్పన్న సాక్షిగా చంద్రబాబు మోసాలకు, పాపాలకు శిక్ష పడుతుందని, ఇప్పటికే తింగరి కొడుకుని ఇచ్చి దేవుడు సగం శిక్ష వేశాడని అన్నారు. బాబు కారణంగా ఎంతో మంది చనిపోయారని, మరికొందరు జీవచ్ఛవంలా ఉన్నారని చెప్పారు. వారి ఉసురుతో బాబు పతనం తప్పదన్నారు. తండ్రి రూ.వేలకోట్లు మింగేస్తే.. కొడుకు లోకేశ్ రూ.లక్షల కోట్లు మింగేశాడన్నారు. చంద్రబాబు అక్రమ ఆస్తులన్నీ కేరళ, తమిళనాడు, కర్ణాటక, విజయవాడ, హైదరాబాద్‌లలో ఉన్నాయన్నారు. వీరి ఆస్తులపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయిస్తే తండ్రీకొడుకు జైలు ఊచలు లెక్కిస్తారని అన్నారు. దుర్మార్గుడు, వాడుకుని వదిలేసే చంద్రబాబుతో కలిస్తే పవన్ కళ్యాణ్ భవిష్యత్ అంధకారంగా మారుతుందని, రాజకీయ జీవితం పతనమైపోతుందని హితవు పలికారు.

ఆస్కార్‌కు 'నాటు.. నాటు..'

తొలిసారి నామినేషన్ దక్కించుకున్న తెలుగు సినిమా, పాట

మన దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉర్రూతలూగించిన తెలుగు పాట 'నాటు.. నాటు..'కు ఆస్కార్ నామినేషన్ లభించింది. ఆస్కార్ బరిలో నిలిచిన తొలి తెలుగు సినిమాగా 'ఆర్‌ఆర్‌ఆర్' నిలిచి చరిత్ర సృష్టించింది. దాదాపు 22 ఏళ్ల తర్వాత భారతీయ సినిమా ఈ అవార్డుల బరిలో నిలిచింది. మొత్తంగా 95 ఆస్కార్ అవార్డుల బరిలో మన దేశం నుంచి.. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు.. నాటు..' పాటతోపాటు బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో షార్ట్‌లిస్ట్ అయిన షౌనక్ సేన్ 'ఆల్ దట్ బ్రీత్స్', డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో 'ది ఎలిఫెంట్ విష్పరర్స్'కు నామినేషన్స్ దక్కాయి. మార్చి 12న (భారతీయ కాలమానం ప్రకారం 13న) ఆస్కార్ అవార్డుల ప్రదానం జరగనుంది.

మొత్తం 23 విభాగాల్లో ప్రకటన

ఈసారి ఆస్కార్ అవార్డుల కోసం మొత్తం 23 విభాగాల్లో నామినేషన్లను వ్యాఖ్యాతలు రిజ్ అహ్మద్, అల్లిసన్ విలియమ్స్ మంగళవారం ప్రకటించారు. ఈసారి 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రం 11 విభాగాల్లో నామినేషన్లతో హవా కొనసాగించింది. తర్వాత 'ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్', 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్' చిత్రాలు తొమ్మిది విభాగాల్లో.. 'ఎల్విస్' సినిమా ఎనిమిది విభాగాల్లో.. 'ది ఫేబుల్ మ్యాన్స్' ఏడు, 'టార్' అండ్ 'టాప్‌గన్: మ్యావరిక్' చిత్రాలు ఆరు, 'బ్లాక్ పాంథర్:వకాండ ఫరెవర్' ఐదు, 'అవతార్:ద వే ఆఫ్ వాటర్' నాలుగు విభాగాల్లో నామినేషన్స్ సాధించాయి.

తెలుగులో తొలి నామినేషన్

బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో మొత్తం 15 పాటలు షార్ట్‌లిస్ట్‌లో నిలవగా.. 'నాటు.. నాటు.. (ఆర్‌ఆర్‌ఆర్)' పాటతోపాటు 'టెల్ ఇట్ లైక్ ఎ ఉమెన్ (అప్లాజ్)', 'హోల్డ్ మై హ్యాండ్ (టాప్‌గన్ మ్యావరిక్)', 'లిఫ్ట్ మీ అప్ (బ్లాక్ పాంథర్)', 'దిస్ ఈజ్ ఏ లైఫ్ (ఎవ్రీథింగ్ ఎవ్రీ వేర్ ఆల్ ఎట్ వన్స్)' పాటలు నామినేషన్ దక్కించుకున్నాయి. ఇక ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్న తొలి తెలుగు సినిమాగా 'ఆర్‌ఆర్‌ఆర్' చరిత్ర సృష్టించింది. అలాగే 'లగాన్'(2001) తర్వాత మరో భారతీయ చిత్రానికి ఆస్కార్ నామినేషన్ దక్కడం మళ్లీ ఇప్పుడే కావడం విశేషం. బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇప్పటివరకు 'మదర్ ఇండియా'(1957), 'సలామ్ బాంబే'(1988), 'లగాన్'(2001) చిత్రాలకు నామినేషన్స్ దక్కినా అవార్డులు రాలేదు.



'ఆల్ దట్ బ్రీత్స్'



'ది ఎలిఫెంట్ విష్పరర్స్'

ఉత్సాహంలో 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్..

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్‌ఆర్‌ఆర్'కు ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. 'నాటు నాటు..' పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా.. కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రఫీ చేశారు. ఈ పాటకు నామినేషన్ దక్కడంపై 'ఆర్‌ఆర్‌ఆర్' యూనిట్ ఆనందం వ్యక్తం చేసింది. పలువురు సినీ ప్రముఖులు 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌ను సోషల్ మీడియా వేదికగా ప్రశంసిస్తూ

ఆ సినిమాలకు రాని చాన్స్!

ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగానికి ఇండియా తరఫున అధికారికంగా పంపిన గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' షార్ట్‌లిస్ట్‌లో ఉన్నా నామినేషన్ దక్కలేదు. దానికి బదులు 'ఆర్‌ఆర్‌ఆర్'ను అధికారిక ఎంట్రీగా పంపి ఉంటే నామినేషన్ దక్కేదేమోనని సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక 'కాంతార', 'ది కశ్మీరీ ఫైల్స్', 'విక్రాంత్ రోణ', 'గంగూబాయి కతియావాడి', 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్' తదితర ఎనిమిది భారతీయ చిత్రాలు ఆస్కార్ రిమైండర్ లిస్ట్‌లో ఉన్నా.. నామినేషన్ దక్కలేదు.

ప్రధాన విభాగాల్లో పోటీదారులు..

- ఆస్కార్ ఉత్తమ చిత్రం విభాగంలో ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్, ది బన్షీష్ ఆఫ్ ఇనిషెరిన్, ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్, అవతార్: ది వే ఆఫ్ వాటర్, టాప్‌గన్ మ్యావరిక్, ఎల్విస్‌ది ఫేబుల్ మ్యాన్స్, టార్, ట్రయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్, ఉమెన్ టాకింగ్ చిత్రాలు నామినేషన్ దక్కించుకున్నాయి.
- ఉత్తమ నటుడి విభాగంలో ఆస్టిన్ బట్లర్ (ఎల్విస్), కొలిన్ ఫారెల్ (ది బన్షీష్ ఆఫ్ ఇనిషెరిన్), బ్రెండన్ ఫ్రాసెర్ (ది వేల్), బిల్ నిగీ (లివింగ్), పాల్ మెస్కల్ (ఆఫ్టర్‌సన్) పోటీలో ఉన్నారు.
- ఉత్తమ నటి విభాగంలో కేట్ బ్లాంచెట్ (టార్), అన్నా డె అర్మాస్ (బ్లాండ్), ఆండ్రియా రైజ్‌బరో (టు లెస్లీ), మిషెల్ యో (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్), మిషెల్ విలియమ్స్ (ది ఫేబుల్ మ్యాన్స్) బరిలో నిలిచారు.
- ఉత్తమ దర్శకుడి విభాగంలో మార్టిన్ మెక్‌డొనాగ్ (ది బన్షీష్ ఆఫ్ ఇనిషెరిన్), డానియల్ క్వాన్, డానియెల్ స్కీనెర్ట్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్), స్టీఫెన్ స్పీల్‌బర్గ్ (ది ఫేబుల్‌మ్యాన్స్), రూబెన్ ఆస్ట్లండ్ (ట్రయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్), టడ్ ఫీల్డ్ (టార్) నామినేషన్ దక్కించుకున్నారు.

– సాక్షి సినిమా డెస్క్

జోరుగా 'నాటు.. నాటు..' వేస్తున్నా

ఆస్కార్ వస్తుందని కలలో కూడా ఊహించలేదు. అభిమానులే నమ్మకంగా ఉన్నారు. ప్రస్తుతం తారక్, చరణ్‌ల కంటే జోరుగా నాటు నాటు చేస్తున్నాను. నా సినిమాలో నా పెద్దన్న పాటకు ఆస్కార్ నామినేషన్ వచ్చింది. చంద్రబోస్, ప్రేమ్ మాస్టర్, రాహుల్, భైరవల సహకారం అమూల్యమైనది. తారక్, చరణ్‌ల సింక్, స్టైల్ సూపర్. వాళ్లు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్లోకి నృత్యం చేశారు. సినిమా, పాట ప్రమోషన్ కోసం పనిచేసిన అందరికీ ధన్యవాదాలు. ఇక మరో అడుగు ముందుకు వేయాలి

– రాజమౌళి, ఆర్‌ఆర్‌ఆర్ సినిమా దర్శకుడు

తెలంగాణ

బీఆర్‌ఎస్ 'పరేడ్'!

- వచ్చే నెల 17న తెలంగాణ నూతన సచివాలయం ప్రారంభోత్సవం
- తర్వాత సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బీఆర్‌ఎస్ సభ
- తమిళనాడు, జార్ఖండ్ సీఎంలు స్టాలిన్, సోరెన్‌లకు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభం రోజున బీఆర్‌ఎస్ బల ప్రదర్శనకు సిద్ధమవుతోంది. ఈ నెల 13న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీతో బీజేపీ సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. అంతకు మించేలా 17వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. దీనికి భారీగా జన సమీకరణ చేయడంతోపాటు పలు రాష్ట్రాల సీఎంలు, జాతీయ స్థాయి నేతలను ఆహ్వానించనుంది. మొత్తంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఫిబ్రవరిలో సికింద్రాబాద్ పరేడ్ మైదానం వేదికగా భారీ బహిరంగ సభలతో సత్తా చాటేందుకు సన్నద్ధమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయాన్ని వచ్చే నెల 17న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజున ప్రారంభించనున్నారు. తర్వాత పరేడ్ మైదానంలో బహిరంగ సభ జరగనుంది. ఈ సభలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌తోపాటు బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్, ఆ రాష్ట్ర సీఎం నితీశ్‌కుమార్ తరఫున జేడీయూ జాతీయ అధ్యక్షుడు లలన్ సింగ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్, మరి కొందరు ముఖ్య నేతలు పాల్గొంటారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

లోకేశ్ పాదయాత్ర టీడీపీకి 'పాడె'యాత్ర

- పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా లోకేశ్ తీరు
- ఎంతమంది కలిసొచ్చినా మా జెండా గద్దెను కూడా కదపలేరు
- అబద్ధాలతో పాదయాత్ర చేస్తే చెప్పులతో తరిమి కొడతారు
- ఎప్పటికీ యూత్ ఐకాన్ సీఎం జగన్
- 2024లో టీడీపీ కనుమరుగవడం ఖాయం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వరుదు కల్యాణి



సాక్షి, విశాఖపట్నం: లోకేశ్ పాదయాత్రను టీడీపీకి 'పాడెయాత్ర'గా ప్రజలంతా భావిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి చెప్పారు. ఆమె మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ లోకేశ్ యాత్రకు వైఎస్సార్‌సీపీ భయపడుతోందని టీడీపీ నేతలు ప్రగల్భాలు పలకడం ఆశ్చర్యంగా ఉందన్నారు. చంద్రబాబుకే తమ పార్టీ భయపడలేదని, ఏ పదవీ లేని, ఎమ్మెల్యేగా ఓడిపోయిన లోకేశ్ యాత్రకు ఎవరైనా భయపడతారా.. అని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ అబద్ధపు వాగ్దానాలు చేసి యువతను దారుణంగా వంచించిన తండ్రీకొడుకులను ఎవరు నమ్ముతారన్నారని ప్రశ్నించారు. దత్తపుత్రుడు సహా ఎంత మందితో కలిసి వచ్చినా తమ పార్టీ జెండా గద్దెను కూడా కదిలించలేరన్నారు. టీడీపీ దుష్ట పాలనకు భిన్నంగా 2019 నుంచి రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ మేలు చేస్తూ సీఎం వైఎస్ జగనన్న యూత్ ఐకాన్‌గా నిలిచారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఎప్పటికీ యూత్ ఐకాన్ అని చెప్పారు. సీఎం జగన్ మూడున్నరేళ్లలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అండగా నిలిచారని, మహిళలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పెద్దపీట వేశారన్నారు. ఎన్నికల హామీల్లో 98.4 శాతం నెరవేర్చి, అత్యంత విశ్వసనీయత కలిగిన ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు.

వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టో తీసేసిన చరిత్ర టీడీపీది

గత టీడీపీ హయాంలో 600కు పైగా అబద్ధపు హామీలు ఇచ్చి, ఎన్నికల తర్వాత వెబ్‌సైట్ నుంచి ఆ మేనిఫెస్టోనే తీసేసిన విషయం ప్రజలు మరిచిపోరని పేర్కొన్నారు. అబద్ధాలతో పాదయాత్ర చేస్తే ఈసారి ప్రజలంతా తండ్రీ కొడుకులిద్దరినీ చెప్పులతో తరమి కొడతారని అన్నారు. చంద్రబాబు చేసిన.. బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ కార్యక్రమాలన్నీ విఫలమయ్యాయన్నారు. అమరావతి నుంచి అరసవెల్లి యాత్ర కూడా బెడిసికొట్టిందని చెప్పారు. లోకేశ్ యాత్ర కూడా ఇలాగే విఫలమవుతుందని, తాము అడ్డుకోవాల్సిన పనే లేదని అన్నారు. 2024 ఎన్నికల్లో జగన్ మరోసారి అఖండ విజయం సాధించి తీరతారని, టీడీపీ కనుమరుగవడం ఖాయమని కల్యాణి అన్నారు.

మీ సొంతూళ్లలో చర్చిద్దామా?

- రామోజీ, చంద్రబాబుకు ఎంపీ నందిగం సురేష్ సవాల్
- నాడు సబ్‌ప్లాన్ నిధులను మళ్లిస్తుంటే రామోజీకి కనపడలేదా?



సాక్షి, అమరావతి: ఈనాడు రామోజీ, చంద్రబాబు సొంత గ్రామాల్లో ఎస్సీలకు ఎవరి హయాంలో ఎంత మేలు జరిగిందో చర్చించేందుకు సిద్ధమేనా? అని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్ సవాల్ విసిరారు. టీడీపీ హయాంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించినప్పుడు రామోజీ కలం కదల్లేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో పొలంబడి, చంద్రన్న పెళ్లి కానుక, ఎన్టీఆర్ ఉద్యోగోన్నతి, మాఇంటి మహాలక్ష్మి తదితర పేర్లతో సబ్ ప్లాన్ నిధులను మళ్లిస్తే రామోజీ కళ్లకు కనిపించలేదా? అని నిలదీశారు. చివరకు ఎన్టీఆర్ సుజల స్రవంతిని కూడా ఎస్సీ సబ్‌ప్లాన్‌లో చేర్చారని గుర్తు చేశారు. చంద్రబాబు ఐదేళ్లలో ఎస్సీల కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తే సీఎం వైఎస్ జగన్ మూడున్నరేళ్లలోనే రూ.48వేల కోట్లకు పైగా వ్యయం చేశారని తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీలంటే చిన్నచూపు చూసే చంద్రబాబు, రామోజీరావు కలిసి ఇప్పుడు కపట ప్రేమ ఒలకబోస్తున్నారని విమర్శించారు. రామోజీరావు బొజ్జ రాక్షసుడిలా పాఠకులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ ఏనాడైనా సభల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలను పక్కన కూర్చోబెట్టుకున్నారా? అని ప్రశ్నించారు. లోకేశ్ పాదయాత్ర వల్ల ఆయన శరీరంలో మాత్రమే మార్పు వస్తుందని సురేష్ వ్యాఖ్యానించారు.

తెలంగాణ

ఎవరితోనైనా పొత్తులకు సిద్ధం

- తెలంగాణలో పోటీ చేస్తాం
- జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్
- కొండగట్టు అంజన్న సన్నిధిలో 'వారాహి'కి పూజలు
- కొండగట్టు ఆలయానికి గతంలో ప్రకటించిన రూ.11లక్షల విరాళం ఊసెత్తని పవన్



వారాహి వాహనానికి పూజలు చేస్తున్న పవన్ కళ్యాణ్

మల్యాల/కొడిమ్యాల(చొప్పదండి)/ధర్మపురి: ప్రజాస్వామ్యంలో ఓట్లు చీలకూడదన్నదే తన అభిమతమని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలిపారు. ఇందుకోసం ఎవరితోనైనా పొత్తులకు సిద్ధమని ఆయన వెల్లడించారు. తెలంగాణలోని జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. తన ప్రచారరథం వారాహి వాహనానికి పూజలు చేయించారు. 32 నృసింహ దివ్యక్షేత్రాల్లో ఒకటైన ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో అనుష్టుప్ నృసింహ యాత్రకు శ్రీకారం చుట్టారు. అంతకుముందు కొడిమ్యాలలోని ఓ రిసార్ట్‌లో మీడియాతో, ఆ తర్వాత ముఖ్య కార్యకర్తల సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. తెలంగాణ సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్‌తో జాతీయ రాజకీయాల్లోకి వెళ్లడాన్ని మన స్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని చెప్పారు. తెలంగాణలో 7 నుంచి 14 లోక్‌సభ స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. మిగతా స్థానాల్లోనూ విజయాలను ప్రభావితం చేసేలా వ్యవహరిస్తామన్నారు. కాగా, గతంలో కొండగట్టు వచ్చిన పవన్ ఆలయ అభివృద్ధికి రూ.11 లక్షల విరాళం అందిస్తానని ఇచ్చిన హామీపై పెదవి విప్పలేదు.

పవన్ పర్యటనలో అపశ్రుతి.. రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పవన్ పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. వెల్గటూర్ మండలం ముక్కట్రావుపేటకు చెందిన కూస రాజ్‌కుమార్, అతడి స్నేహితుడు జక్కుల అంజి ద్విచక్ర వాహనంపై పవన్ కళ్యాణ్ కాన్వాయ్‌ను అనుసరిస్తూ ముందుకుసాగారు. కాన్వాయ్‌ను ఓవర్ టేక్ చేయాలని ముందుకు వెళ్తుండగా.. కిషన్‌రావుపేట స్టేజీ వద్ద ఏడో నంబరు రాష్ట్ర రహదారిపై ఎదురుగా వస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్, నీలం సాగర్ ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టారు. దీంతో అదుపు తప్పిన బైక్ కరీంనగర్ వైపు నుంచి జన్నారం వెళ్తున్న కారును ఢీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో కూస రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. జక్కుల అంజి, మరో ద్విచక్రవాహనంపై వెళ్తున్న బొలిశెట్టి శ్రీనివాస్, నీలం సాగర్ కాళ్లు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు.

పండుగకు బొమ్మలను కొలువుదీర్చడం లేదామె.
బొమ్మల తయారీ 'కొలువు'ను పండగ చేస్తున్నారు.
బొమ్మలతో 'చక్కటి కొలువు'కు మార్గం వేస్తున్నారు.
మన బొమ్మల నుంచి మన చేనేతల వరకు...
సంప్రదాయ కళల పురోగతికి బాట వేస్తున్నారామె.

బొమ్మల కొలువు


చిత్రాసూద్



''కళకు రాజ పోషణ అవసరమే. కానీ కళ జీవించాల్సింది కేవలం దాతల దయాదాక్షిణ్యాల మీద మాత్రమే కాదు. కళ స్వయంసమృద్ధి సాధించాలి. అప్పుడే ఆ కళకు గుర్తింపు, కళాకారులకు గౌరవం లభిస్తాయి'' అన్నారు చిత్రా సూద్. ఆమె హైదరాబాద్‌లో కార్పొరేట్ రంగంలో ఉన్నతస్థాయిలో ఉద్యోగం చేస్తున్నారు. సమాజానికి చేయాలనుకున్న పనులను ఒక సుమహారంగా మలుచుకున్నారు. తన ప్రవృత్తిలో భాగంగా గొల్లభామ చీరలు, బొబ్బిలి నేత, ఇకత్ లక్ష వత్తుల చీర వంటి తెలుగు వారి సిగ్నేచర్ వీవింగ్‌కు సహజ రంగులను మేళవిస్తున్నారు. కొండపల్లి బొమ్మల కళాకారులు వృత్తిని వదిలి ఇతర ఉపాధి మార్గాల వైపు మరలుతున్న పరిస్థితిని గమనించి ఆ కళను పరిరక్షించే పనిలో పడ్డారామె. ఆ వివరాలతోపాటు తాను ఈ మార్గాన్ని ఎంచుకోవడానికి ప్రభావితం చేసిన పరిస్థితులను సాక్షితో పంచుకున్నారు చిత్రాసూద్.

తమిళనాడు నుంచి తెలంగాణకు

''మా పూర్వీకులది పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి. అమ్మవైపు విశాఖపట్నం. ఇరువైపుల కుటుంబాలూ తమిళనాడులో స్థిరపడ్డాయి. నాన్న కుటుంబం చెన్నైలో, అమ్మ వాళ్లు మధురైలో. అలా నేను పుట్టిన ప్రదేశం మధురై, పెరిగింది చెన్నై. నా చిన్నప్పుడే నాన్న ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కి వచ్చేశాం. ఆ తర్వాత స్పాంజ్ ఐరన్ ఇండస్ట్రీ కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో స్థిరపడ్డారు. అలా నా చదువు సింగరేణిలో, పాల్వంచలో సాగింది. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే... నేను నా బాల్యంలోనే నాగరక భారతాన్ని, గ్రామీణ భారతాన్ని దగ్గరగా చూడగలిగాను. అప్పట్లో తలెత్తిన అనేక సందేహాలే ఇప్పుడు నేను చేస్తున్న పనుల కారకాలు. గ్రామీణ మహిళలు, పిల్లల్లో చైతన్యం లేకపోవడం, చదువు లేకపోవడం, అవకాశాలు లేకపోవడం అప్పట్లో నాలో ఆలోచనను రేకెత్తించేవి, కానీ వాటిని ఎలా పరిష్కరించాలో తెలియదు. అలాగే నా తొలి ఉద్యోగంలో నేను చూసిన పరిస్థితులు కూడా ఆందోళనకరమైనవే. అది హైదరాబాద్ శివారులో ఉన్న కెమికల్ ఇండస్ట్రీ. ఆ జిలెటిన్ తయారీ పరిశ్రమలో ఏడెనిమిదేళ్ల పిల్లలు పని చేసేవాళ్లు. పొడులను జల్లెడ పట్టడం వంటి పనిని ఆటలా ఎంజాయ్ చేస్తూ ఉండేవాళ్లు. తామెంత విపత్కరమైన పని చేస్తున్నారనేది తెలియని అమాయకత్వం వారిది. నా చదువు నా ఉన్నతికి మాత్రమే పరిమితం కాకూడదు, ఇంకా ఏదైనా చేయాలని గట్టిగా అనిపించిన సందర్భం కూడా అదే. నాలో అస్పష్టంగా ఉన్న ఆలోచనలకు ఒక రూపాన్ని ఇవ్వడం పదేళ్ల కిందట మొదలైంది. చదువులో రాణిస్తూ ఉన్నత చదువులకు కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడంతో సమాజానికి మా వంతు చారిటీ మొదలు పెట్టాం. ఆ టాస్క్‌లో మా హస్బెండ్ అనిల్ సూద్ సహకరిస్తున్నారు. చేనేతల్లో నాచురల్ కలర్స్ వాడకం, కొండపల్లి బొమ్మల కళ పరిరక్షణలో 'అభిహార' సంస్థ నిర్వాహకురాలు చిత్ర అనుభవాన్ని కలుపుకుని ముందుకుపోతున్నాను.

ఈ సైన్స్ ఏ పుస్తకంలోనూ లేదు!

కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రానికి అనుబంధంగా సహజ రంగుల తయారీ పరిశ్రమను కూడా ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. సొరకాయ ఆకులతో చెక్కకు రంగు అద్దవచ్చని ఇంతవరకు ఏ పుస్తకమూ చెప్పలేదు. కొండపల్లి బొమ్మల కళాకారులకు మాత్రమే తెలిసిన సైన్స్ అది. ఇక చేనేతల్లో గొల్లభామ, బొబ్బిలి, ఇకత్ చీరల్లలోనూ నేచురల్ కలర్స్ ప్రయోగం మొదలైంది. ఈ రంగాల్లో ఉన్న జ్ఞానాన్ని నిక్షిప్తం చేయడం కూడా మా తదుపరి ప్రాజెక్టుల్లో ఒకటి. భూమండలాన్ని ప్రమాదం అంచుల్లోకి నెట్టివేస్తున్న కారకాల్లో టెక్స్‌టైల్ ఇండస్ట్రీ కాలుష్యం ప్రధానమైనది. అందుకే మనవంతుగా కొన్ని అడుగులు వేయగలిగితే, మరికొందరి చేత వేయించగలిగితే... ఆ తర్వాత ఈ నేచర్ మూవ్‌మెంట్ దానంతట అదే ముందుకు సాగుతుంది.

– చిత్రాసూద్, యాక్టివిస్ట్,
రివైవల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్
కో – ఫౌండర్, అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ కాంప్లెక్స్ చాయిసెస్



కళలో సామాజిక మార్పు!

ఏ కళలనైనా దాతల సహకారంతో ఎంతకాలమని పరిరక్షించగలం? కళ తనకు తానుగా స్వయంసమృద్ధి సాధించాలి. అప్పుడే కళకు, కళాకారులకు గౌరవం. అందుకే మహిళలకు శిక్షణ ఇవ్వడం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేసి ఇవ్వడంతోపాటు మార్కెట్ సౌలభ్యత కోసం పని చేస్తున్నాను. కొండపల్లిలో ఉండే మహిళలను తీసుకువచ్చి హైదరాబాద్‌లోని సప్తపర్ణిలో ఎగ్జిబిషన్ పెట్టించడంలో నా ఉద్దేశాలు రెండు నెరవేరాయి. ఒకటి గ్రామీణ మహిళలకు తమ బొమ్మలకు ప్రపంచంలో ఉన్న ఆదరణ ఎలాంటిదో తెలియాలి, అలాగే కొనేవాళ్లు ఏం కోరుకుంటున్నారో అర్థం కావాలి. అలాగే ఒక అద్భుతమైన కళను సంపన్నుల లోగిళ్లను చేరగలిగితే ఆ కళకు రాజపోషణకు దారి వేసినట్లే. ఈ రెండూ సాధ్యమయ్యాయి. ఎప్పుడూ చేసే దశావతారాలు, ఎడ్లబండ్ల నుంచి కళాకారుల నైపుణ్యాన్ని టేబుల్ టాప్స్, మొబైల్ ఫోన్ స్టాండ్ వంటి రోజువారీ వాడుక వస్తువుల తయారీకి విస్తరించగలిగాం. అలాగే ఒక కళ ఆవిర్భవించినప్పుడు అప్పటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఒక రూపం సంతరించుకుని ఉంటుంది. ఆ రూపాలను కాలానుగుణంగా మార్చుకోవాలి. అందుకే కళను ధార్మికత పరిధి నుంచి సామాజిక పరిధికి విస్తరించాల్సిన అవసరాన్ని నేర్పిస్తున్నాం. ఈ బొమ్మలను లాంకో కంపెనీ, ఏపీ, తెలంగాణ ప్రభుత్వ హస్తకళాకృతుల సంస్థలు లేపాక్షి, గోల్కొండలు పెద్ద ఆర్డర్‌లతో ప్రోత్సహిస్తున్నాయి. ఇక్కడ నేను నమ్మే సిద్ధాంతం ఏమిటంటే... కళను పరిరక్షించడం అనేది పెద్దమాట. కళ ద్వారా ఉపాధి పొందడం ప్రధానం. అప్పుడే కళ కలకాలం నిలుస్తుంది, కళాకారులు తమ ఉనికిని గర్వంగా చాటుకోగలుగుతారు. నా సర్వీస్‌తో ఎన్ని కుటుంబాలు, ఎన్ని కళారూపాలు స్వయంసమృద్ధి సాధించాయనేది నాకు మిగిలే సంతృప్తి'' అన్నారు చిత్రాసూద్.

వృత్తులకు, కళలకు ఇల్లే యూనివర్సిటీగా ఉండేది. పుస్తకం–కలం లేకుండానే విస్తృతమైన జ్ఞానం ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అయ్యేది. కాలం మారింది, ప్రపంచీకరణ మన సంప్రదాయ వృత్తులను కాలగర్భంలో కలిపేస్తున్న తరుణంలో మన కళల జ్ఞానాన్ని గ్రంథస్థం చేయాల్సిన అవసరం ఉంది. దానికి శాస్త్రబద్ధత కల్పించాల్సిన అవసరం వచ్చింది.

– వాకా మంజులారెడ్డి

'మహిళ' శ్రమ చర్చకే రాదు!



మహిళ స్థితిగతులు మారాలంటే ఆర్థిక స్వావలంబన సాధించాలనేది జగమెరిగిన సత్యం. మన వ్యవస్థలన్నింటిలోనూ మహిళలను సహాయక పనులకే పరిమితం చేయడంతో వారి శ్రమ గుర్తింపునకు నోచుకోవడం లేదు. మహిళలకు కూడా ఆర్టిజన్ కార్డ్ ఇప్పించడానికి పని చేస్తున్నాను. అలాగే వేతనపెంపు విషయంలో మహిళల పని గురించి చర్చ కూడా ఉండడం లేదు. ఎంతగా శ్రమించినప్పటికీ మహిళకు గుర్తింపు ఉండదు. ఆదాయం తక్కువ. ఈ పరిస్థితిని మార్చడానికి 'అభిహార' అనే వేదిక ద్వారా పని చేస్తున్నాను. కొండపల్లి బొమ్మలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంచి సహకారం అందిస్తోంది. ఏపీ ప్రాథమిక పాఠశాలల్లో బోధన పరికరాలు కొండపల్లి కళాకృతులే. నేను హార్టికల్చర్ విద్యార్థిని కావడంతో నాకు తెలిసిన సైన్స్‌ని హస్తకళల రంగానికి మేళవిస్తున్నాను. హస్తకళల రంగంలో విశేషమైన కృషి చేస్తున్న ఉత్రమ్మ, సురయ్యా హసన్‌బోస్, జగదరాజప్పలు నాకు గురువులు. నా ఆకాంక్షలు, చిత్ర ఆలోచనలు ఒకే తీరుగా సాగడంతో మా ప్రయాణం విజయవంతంగా సాగుతోంది.

– సుధారాణి ముళ్లపూడి,
సీఈవో, అభిహార సోషల్ ఎంటర్‌ప్రైజ్

మహిళా శక్తి

ఒకేసారి ఇద్దరు డీజీపీలు


గురుప్రీత్ కౌర్ డియో, శశిప్రభ ద్వివేది

ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన మహిళా శక్తి గురించి తెలిసినప్పుడు ఒక కొత్త ఊపిరి వచ్చినట్టు అనిపిస్తుంది. ఇప్పుడా ఊపిరిని, ఉత్సాహాన్నీ రెట్టింపు చేస్తూ పంజాబ్‌లో ఒకేసారి ఇద్దరు మహిళలు డీజీపీలుగా పదోన్నతులు పొందారు. మహిళా శక్తికి నిదర్శనంగా నిలిచారు.

పంజాబ్‌లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) స్థాయికి పదోన్నతి పొందిన ఏడుగురు పోలీసు అధికారుల పేర్లను హోం వ్యవహారాల శాఖ ప్రకటించింది. ఆ ఏడుగురు అధికారుల్లో ఇద్దరు మహిళా ఐపీఎస్‌లు గౌరవప్రదమైన పాత్రను కైవసం చేసుకున్నారు. శశిప్రభ ద్వివేది, గురుప్రీత్ కౌర్ ఇద్దరు మహిళలు ఇలా ఒకేసారి డీజీపీలుగా పదోన్నతులు పొందడం ఇదే మొదటిసారి. ఈ పదోన్నతులు ఇప్పుడు పంజాబ్ పోలీసు ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్న అధికారుల సంఖ్యకు సంబంధించి అత్యంత శక్తిమంతమైన శక్తులలో ఒకటిగా మారడానికి మార్గం సుగమం చేశాయి.

గురుప్రీత్ కౌర్ డియో

1993 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అదే సంవత్సరం అధికారిగా నియమితులయ్యారు. గురుప్రీత్ ఇటీవల పదోన్నతి పొందిన బ్యాచ్‌లో అత్యంత సీనియర్ అధికారి. పంజాబ్ పోలీస్‌లో భాగమైన మొదటి మహిళా ఐపీఎస్ అధికారి. గతంలో మహిళా వ్యవహారాలను కవర్ చేసే బాధ్యతలు, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదాను కలిగి ఉన్న కమ్యూనిటీ వ్యవహారాల విభాగానికి బాధ్యత వహించారు. చీఫ్ ఆఫ్ డ్రగ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (క్రైమ్)గా, బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అడిషనల్ డీజీపీగా పనిచేశారు. తన పదోన్నతిపై ఆమె స్పందిస్తూ 'డీజీపీగా పనిచేసే అవకాశం లభించినందుకు ఆనందం'గా ఉందన్నారు.

శశిప్రభ ద్వివేది

అడిషనల్ ఛార్జ్ ఆఫ్ మోడర్నైజేషన్ (రైల్వేస్) అడిషనల్ డిజిపిగా పదోన్నతి పొందిన ద్వివేది 1993 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. 1994లో ఆమె విధుల్లో చేరారు. 2021లో పంజాబ్ లోక్‌పాల్ ఏడీజీపీగా నియమితులయ్యారు. ఆగస్టు 2022లో ద్వివేది గౌరవ వందనం స్వీకరించి, పోలీసుల పాసింగ్ ఔట్ పరేడ్‌ను పరిశీలించారు. ఏడీజీపీగా ఆమె ఇండియన్ రిజర్వ్ బెటాలియన్‌కు అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా జవాన్లందరిపై ప్రశంసల వర్షం కురిపిస్తూ, 'నిజాయితీగా, నిర్భయంగా విధులు నిర్వర్తించాలని, చట్టాన్ని గౌరవించాల'ని ఆమె సూచించారు. పంజాబ్ రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగాన్ని ఎత్తిచూపుతూ, దశాబ్దాలుగా రాష్ట్రంలో కొనసాగుతున్న డ్రగ్స్ రాకెట్‌ను అంతమొందించేందుకు తగిన కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా చెప్పారు.

యూత్ పల్స్

బుల్లెట్ జర్నల్‌కు నువ్వొస్తవా నువ్వొస్తవా!



మొన్నటి 'హ్యాండ్ రైటింగ్ డే' సందర్భంగా చేతిరాత గత వైభవాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ చాలామంది వాపోయారు. 'మా రోజుల్లో' అంటూ గతంలోకి కూడా వెళ్లిపోయారు. 'ఈ తరానికి కీబోర్డ్‌ల టిక్‌టక్‌లు తప్ప, అందమైన చేతిరాతతో అట్టే సంబంధం లేదా?' అని అడిగితే 'లేదు' అని చెప్పడానికి సోషల్ మీడియా ట్రెండ్ 'బుల్లెట్ జర్నల్' అడ్డొస్తుంది. బుజో కల్చర్‌లో భాగంగా యూత్ పెన్, కాగితానికి దగ్గరైంది. ఆర్ట్ థెరపీగా పేరున్న 'బుల్లెట్ జర్నల్'లోని మజాను రుచి చూస్తోంది...

బుల్లెట్ జర్నల్ లేదా బుజో అనేది షెడ్యూలింగ్, రిమైండర్స్, టు–డూ లిస్ట్... మొదలైన వాటికి ఉపకరించే పర్సనల్ ఆర్గనైజేషన్ మెథడ్. రోజు, వారం, నెల, సంవత్సరం... ఇలా షెడ్యూల్ చేసుకోవచ్చు. ఒకప్పుడు పెన్ లేదా పెన్సిల్ మాత్రమే ఉపయోగించి రాసేవారు. ఆ తరువాత క్రియేటివిటీలో భాగంగా రూలర్, కలర్ పెన్స్, స్టిక్కర్స్, స్టెన్సిల్స్, వాషి టేప్... మొదలైన వాటిని ఉపయోగిస్తున్నారు.

ఇండెక్స్ (విషయసూచిక), ర్యాపిడ్ ల్యాగింగ్ (సింబల్స్ ఉపయోగించడం), లాగ్స్ (టు–డూ లిస్ట్), కలెక్షన్స్ (కంటెంట్ ఇన్‌ఫర్‌మేషన్), మైగ్రేషన్ (న్యూ లిస్ట్) అనే కీలకమైన టూల్స్ దీనిలో ఉంటాయి.

షెడ్యూలింగ్, టు–డూ లిస్ట్‌కు మాత్రమే పరిమితమై ఉంటే బుల్లెట్ జర్నల్‌కు అంతగా ప్రాధాన్యత ఉండేది కాదు.

ఒకవిధంగా చెప్పాలంటే మన మనసులోని భావాలు, బాధలు, సంతోషాలు, సంక్షోభాలను అక్షరాల రూపం లో కాగితంపై పెట్టడం. అలా అని ఇదేమీ డైరీ కాదు. పొడవాటి వాక్యాలేవీ ఉండవు. ఉదాహరణకు మై గోల్స్. డైరీలో అయితే పెద్ద పెద్ద వాక్యాలు రాసుకుంటారు. అయితే బుల్లెట్ జర్నల్ పేజీలో మాత్రం 'మై గోల్స్' అని పెద్ద అక్షరాలతో కలర్ పెన్సిల్స్ లేదా స్కెచ్‌లతో రాస్తారు. 'మార్నింగ్ రొటీన్ ఫర్ ఎవ్రీ డే' అని పెద్ద అక్షరాలతో డిజైన్ చేసి బాక్స్‌లు, వృత్తాలలో దీనికి సంబంధించిన పాయింట్స్ రాస్తారు. కొందరు బొమ్మలు గీస్తారు. ఉదయాన్నే లేవాలి అనేదానికి సింబల్‌గా అలారమ్ బొమ్మ గీస్తారు. బొమ్మలు గీయలేని వారు స్టిక్కర్స్ అంటిస్తారు.

'ఇలా మాత్రమే' అనే రూల్ లేదు. ఒక్కొక్కరి సృజనాత్మకత ప్రకారం అది కొత్త రూపాల్లో కనిపిస్తుంది.

'మీడియం ఫర్ మెడిటేషన్'గా కూడా పేరు తెచ్చుకుంది బుల్లెట్ జర్నల్.

మనసు బాగోలేకపోతే, మానసిక ప్రశాంతత కోసం దీన్ని ఆశ్రయిస్తుంటారు.

> **గతాన్ని ట్రాక్ చేసి, వర్తమానాన్ని ఆర్గనైజ్ చేసి, భవిష్యత్‌ను ప్లాన్ చేసే మెథడ్‌గా పేరున్న 'బుల్లెట్ జర్నలింగ్' కోసం రకరకాల డిజిటల్ యాప్స్ కూడా వచ్చాయి.**

కొందరి విషయంలో ఇది ట్రబుల్ షూటర్. ఒక సమస్యకు సంబంధించిన పరిష్కార మార్గాలు ఆలోచించే క్రమంలో బుల్లెట్ జర్నల్‌ను వాడుకొని వృత్తాలు, బాక్స్‌లు, బొమ్మల రూపంలో ఐడియాలు రాసుకోవడం. న్యూయార్క్‌కు చెందిన రైడర్ కరోల్ డెవలప్ చేసిన మెథడ్ ఇది. కరోల్‌కు ఏకాగ్రత లోపానికి సంబంధించిన సమస్యలు ఉండేవి. దీంతో చదువు దెబ్బతినేది. ఈ నేపథ్యంలో 'బుల్లెట్ జర్నల్' మెథడ్‌కు రూపకల్పన చేసి మంచి ఫలితాలు సాధించాడు కరోల్. తన అనుభవాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తే అనూహ్యమైన స్పందన లభించింది. ఆ తరువాత క్లిక్‌స్టార్టర్ (గ్లోబల్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్) ఫండింగ్‌తో 'బుల్లెట్ జర్నల్'కు సంబంధించిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌కు శ్రీకారం చుట్టాడు కరోల్.

'ది బుల్లెట్ మెథడ్' పేరుతో పుస్తకం రాస్తే మంచి ఆదరణ పొందింది.

'మొదట్లో గందరగోళంగా అనిపించేది. ఆ తరువాత మాత్రం దీనికి బాగా అలవాటు పడిపోయాను. బుజో కల్చర్ ప్రపంచవ్యాప్తంగా ఎందుకు ఆదరణ పొందిందో తెలిసి వచ్చింది' అంటుంది దిల్లీకి చెందిన అంజలి.

లాక్‌డౌన్ టైమ్‌లో మన యూత్‌కు బాగా దగ్గరైన యాక్టివిటీ ఇది.

'చదువు, హాబీ, వ్యాయామం, భవిషత్ లక్ష్యం... ఇలా స్టూడెంట్ జీవితంలో రకరకాల విభాగాలు ఉంటాయి. అయితే రోజువారీ హడావిడిలో కొన్ని నిర్లక్ష్యానికి గురవుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిర్మాణాత్మకమైన సమన్వయానికి బుజో కల్చర్ ఉపయోగపడుతుంది' అంటుంది పుణెకు చెందిన 22 సంవత్సరాల ప్రియరాగ.

'ఆర్గనైజేషన్, టైమ్ మేనేజ్‌మెంట్‌కు మాత్రమే కాదు మూడ్, ఫీలింగ్స్, ఎనర్జీ లెవెల్స్ మానిటర్‌లా కూడా ఉపయోగపడుతుంది' అంటుంది ప్రియరాగ స్నేహితురాలు హనీ.

గతాన్ని ట్రాక్ చేసి, వర్తమానాన్ని ఆర్గనైజ్ చేసి, భవిష్యత్‌ను ప్లాన్ చేసే మెథడ్‌గా పేరున్న 'బుల్లెట్ జర్నలింగ్' కోసం రకరకాల డిజిటల్ యాప్స్ కూడా వచ్చాయి. బుజో కల్చర్‌కు ఆన్‌లైన్ కమ్యూనిటీ డిఫరెంట్ స్టైల్స్‌ను జత చేసినప్పటికీ 'పెన్ను, పేపర్ వాడితే ఆ మజాయే వేరబ్బా' అనే వాళ్లే ఎక్కువ!

ఇది 'వేగన్'న్యువరీ!



సమాజంలో చాలామందిలో మాంసాహారపు అలవాట్లు ఉన్నప్పటికీ... శాకాహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్న భావన ఎప్పట్నుంచో ఉన్నదే. శాకాహార అలవాటు తాలూకు విప్లవంగా రూపొందిందే ఈ 'వేగన్యువరీ'. జనవరి (జాన్యువరీ) లాగే 'వేగన్'న్యువరీ అనే ఓ దీక్ష తీసుకుని నెల్లాళ్లపాటు శాకాహారపు అలవాటు పెంపొందించుకుని, అది మంచి ఫలితాలనే ఇస్తే దాన్నే కొనసాగించాలని కోరుతూ నడుస్తున్న ఉద్యమమే ఈ 'వేగన్'న్యువరీ. దీని గురించి కొన్ని వివరాలు....

దాదాపు 2014 నుంచి ఈ వేగన్ ఉద్యమం కొనసాగుతున్నప్పటికీ మనదేశంలో మాత్రం ఇది అధికారికంగా 2021 డిసెంబరు 9న ప్రారంభమైంది. 'వేగన్'న్యువరీ అనే పేరుతో తొలుత భూతదయా, అటు తర్వాత మొక్కలనుంచే శాకాహారం తీసుకుంటూ మంచి ఆరోగ్యం పెంపొందించుకోవడం, జీవావరణాన్నీ, జీవవైవిధ్యాన్నీ కాపాడుకోవడం కోసం కృషి చేయడం వంటి కార్యకలాపాలతో ప్రపంచవ్యాప్తంగా ఈ 'వేగన్'న్యువరీ ఉద్యమానికి మంచి ఆదరణే వస్తోంది. జనవరి మాసమంతా శాకాహారానికి మళ్లుతామంటూ ప్రతినబూనడమే ఈ 'వేగన్'న్యువరీ మాసపు ప్రత్యేకత అన్నమాట.

పెద్ద సంఖ్యలో చేరువవుతున్న ప్రజలు

గతేడాది అంటే 2022లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 6,20,000 మందికి పైగా ప్రజలు ఈ ఉద్యమానికి మద్దతిచ్చారు. కేవలం మాంసాహారంలోనే మంచి రుచులు అందుతాయనే వాదనను తోసిరాజంటూ... ఈ ఉద్యమాన్ని తారస్థాయికి తీసుకెళ్లడం కోసం శాకాహారాల్లో కొత్త కొత్త రుచులు అన్వేషిస్తున్నారు. దీనికి తార్కాణమే గతేడాది కొత్తగా అందుబాటులోకి వచ్చిన శాకాహార ఉత్పాదనలు! ఒక అంచనా ప్రకారం 2022లో దాదాపు 1,540 కొత్త శాకాహార ఉత్పాదనలు (వేగన్ ప్రాడక్ట్స్) అందుబాటులోకి వచ్చాయి. 'వేగన్'న్యువరీ ఉద్యమానికి అత్యద్భుతంగా ప్రచారాలను కల్పించే ఆ శాకాహార ప్రాధాన్యానికి గతేడాది ప్రపంచవ్యాప్తంగా 4,351 మీడియా కథనాలు వెలువడ్డాయనేది మరో అంచనా. దీనికితోడు ఎన్నో కార్పొరేట్ సంస్థలు సైతం అనేక ప్రచార కార్యకలాపాల ద్వారా ఈ ఉద్యమానికి తోడు నిలుస్తున్నాయి.

మన దేశానిది మూడోస్థానం...

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 6.3 లక్షల మంది ఈ ఉద్యమంలో భాగస్వామ్యం తీసుకుంటే అందులో 65,000 మంది మన భారతీయులే. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడీ ప్రచార కార్యకలాపాల్లో 228 దేశాలు పాలుపంచుకుంటుండగా... వీటన్నింటిలో మన దేశం మూడో స్థానంలో ఉండటం కూడా ఓ విశేషం. మనకంటే ముందు స్థానంలో ఉన్న దేశాల్లో మొదటిది యునైటెడ్ కింగ్‌డమ్ (ఇంగ్లాండ్) కాగా... రెండోది యూఎస్‌ఏ.

వీళ్లే మన దేశపు బ్రాండ్ అంబాసడర్లు...

ఈ ఉద్యమపు పదో వార్షికోత్సవం సందర్భంగా మనదేశం నుంచి దాదాపు పదిమంది ప్రముఖులు ఈ క్యాంపెయిన్‌లో విస్తృతంగా పాలు పంచుకుంటున్నారు. వీరిలో ప్రముఖ నటి, బిగ్ బాస్ ఫేమ్ సౌందర్యశర్మ, మరో ప్రముఖ నటుడు, ప్రో–బాస్కెట్‌బాల్ ఆటగాడు అరవింద్‌కృష్ణ, మ్యూజీషియన్, నటి మోనికా డోగ్రా, ప్రముఖ మౌంటెనీరింగ్ నిపుణురాలు ప్రకృతి వర్షిణీ, మరో మౌంటనీరింగ్ నిపుణుడు కుంతల్ జోయిషర్, ప్రో–టెన్నిస్ ఆటగాడు విశ్వజిత్ సాంగ్లే, గాయని అనుష్కా మన్‌చందా, మరో ప్రముఖ నటీమణులు స్నేహా ఉల్లాల్, సదా సయీద్ మన దేశం నుంచి ఈ ఉద్యమానికి బ్రాండ్ అంబాసిడర్లుగా, ప్రచారకులుగా వ్యవహరిస్తున్నారు. మరో వారంలో జనవరి అయిపోతోంది. కనీసం ఆఖరి వారంలో నైనా వేగన్యువరీని అనుసరిద్దాం.



'వేగనిజం' అనేది ఓ సంస్కృతి. ఈ సంస్కృతితో మనం తోటి జీవులకు ఎలాంటి హానీ కలగకుండా చూడవచ్చు. అందుకే నేను శాకాహార ఉద్యమాన్ని సమర్థిస్తుంటాను. అంతేకాదు... శాకాహారం తీసుకోవడం వల్ల మన చర్మానికి మంచి నిగారింపు రావడంతో పాటు మన ఆరోగ్యమూ బాగుంటుంది. ఏ జీవికీ హాని లేకుండా మనమూ బతికి, ఇతరులనూ బతకనివ్వడం అనే భావనే ఎంతో ఉన్నతమైనదని నా ఉద్దేశం.

– స్నేహా ఉల్లాల్,
సినీ నటి

– సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



సాయిప్రణీత్‌కు నిరాశ

ఇండోనేసియా మాస్టర్స్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ పురుషుల సింగిల్స్‌లో మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయాడు. ప్రపంచ 53వ ర్యాంకర్ సాయిప్రణీత్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో 18–21, 19–21తో టిమ్ జూన్ వె (మలేసియా) చేతిలో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి–రోహన్ (భారత్), పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు (భారత్) మెయిన్ 'డ్రా'కు అర్హత పొందారు.



మెరిసిన స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్

ముక్కోణపు మహిళల టి20 క్రికెట్ టోర్నీలో భారత్ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. ఈస్ట్ లండన్‌లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 56 పరుగులతో నెగ్గింది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 2 వికెట్లకు 167 పరుగులు చేసింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (51 బంతుల్లో 74 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 56 నాటౌట్; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసి ఓడిపోయింది.



అదరగొట్టి అగ్రస్థానానికి

న్యూజిలాండ్‌పై భారత్ క్లీన్‌స్వీప్

- 3–0తో సిరీస్ కైవసం
- 'టాప్' ర్యాంక్‌లోకి టీమిండియా
- 'శత'క్కొట్టిన గిల్, రోహిత్ శర్మ
- చివరి వన్డేలో 90 పరుగులతో గెలుపు

ఇండోర్: మళ్లీ భారత బ్యాట్లు గర్జించాయి. న్యూజిలాండ్ బంతులు డీలా పడ్డాయి. దీంతో పరుగుల తుఫాన్‌లో కివీస్ క్లీన్‌స్వీప్ అయ్యింది. ఫలితంగా మంగళవారం న్యూజిలాండ్‌తో జరిగిన చివరిదైన మూడో వన్డేలో భారత్ 90 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 3–0తో దక్కించుకుంది. అంతేకాకుండా వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా ఉన్న ఇంగ్లండ్‌ను వెనక్కి నెట్టి రోహిత్ శర్మ బృందం మూడో స్థానం నుంచి మళ్లీ అగ్రస్థానానికి ఎగబాకింది. మొదట భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 385 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (85 బంతుల్లో 101; 9 ఫోర్లు, 6 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (78 బంతుల్లో 112; 13 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. తర్వాత న్యూజిలాండ్ 41.2 ఓవర్లలో 295 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ కాన్వే (100 బంతుల్లో 138; 12 ఫోర్లు, 8 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు శార్దుల్‌కు దక్కగా... శుబ్‌మన్ గిల్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం అందుకున్నాడు.

ఓపెనర్ల ధనాధన్

ఫామ్‌లో ఉన్న భారత ఓపెనర్లు రోహిత్, గిల్ కష్టమైన బంతిని, ఓవర్‌ను గౌరవిస్తూ... అదుపు



కాన్వే

తప్పిన బంతులకు బౌండరీనే శిక్షగా విధించారు. డఫీ ఐదో ఓవర్లో గిల్, రోహిత్ చెరో సిక్సర్ బాదారు. ఫెర్గూసన్ 8వ ఓవర్‌ను గిల్ 4, 0, 4, 4, 6, 4లతో చితగ్గొట్టాడు. ఏకంగా 22 పరుగుల్ని పిండుకున్నాడు. డఫీ పదో ఓవర్లో రోహిత్ ఒక బౌండరీ రెండు సిక్స్‌లు బాదాడు. ఓపెనర్ల ధాటికి భారత్ స్కోరు 12.4 ఓవర్లలో వంద దాటింది. గిల్ 33 బంతుల్లో (8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రోహిత్ 41 బంతుల్లో (4 ఫోర్లు, 4 సిక్సర్లు) ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. కానీ కివీస్ బౌలర్లే జోడీని విడగొట్టలేకపోయారు. ఓవర్‌కు 8 పైచిలుకు పరుగుల రన్‌రేట్‌తో భారత్ 24.1 ఓవర్లోనే 200 పరుగుల మైలురాయి చేరుకుంది. ఆ వెంటనే రోహిత్ 83 బంతుల్లో, గిల్ 72 బంతుల్లో శతకాలు పూర్తిచేసుకున్నారు. రోహిత్‌ను బౌల్డ్ చేసి బ్రేస్‌వెల్ 212 పరుగుల ఓపెనింగ్ వికెట్‌కు తెరదించాడు. కాసేపటికే గిల్ జోరుకు టిక్నర్ చెక్ పెట్టాడు. తర్వాత కోహ్లి (36; 3 ఫోర్లు, 1 సిక్స్), ఇషాన్ (17; 1 ఫోర్, 1 సిక్స్), సూర్య (14; 2 సిక్సర్లు) విఫలమయ్యారు. పాండ్యా (38 బంతుల్లో 54; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), శార్దుల్ (17 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) అండతో చెలరేగాడు.

కాన్వే సెంచరీ వృథా

న్యూజిలాండ్ ఖాతా తెరువక ముందే అలెన్ (0)ను పాండ్యా డకౌట్ చేశాడు. మరో ఓపెనర్ కాన్వే ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. నికోల్స్ (42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అండతో సిక్సర్లతో మెరిపించాడు. నికోల్స్ ఆటను కుల్దీప్ ముగించగా.. ఆ తర్వాత మిచెల్ (24; 2 ఫోర్లు), లాథమ్ (0), ఫిలిప్స్ (5)లు శార్దుల్ పేస్‌కు తలవంచారు. కాన్వే 71 బంతుల్లో సెంచరీ సాధించాడు. అతన్ని ఉమ్రాన్ అవుట్ చేశాడు. బ్రేస్‌వెల్ (26; 3 ఫోర్లు, 1 సిక్స్), సాన్‌ట్నర్ (34; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాసేపు క్రీజులో నిలిచారు.

30 వన్డేల్లో రోహిత్ శర్మ సెంచరీలు. అత్యధిక శతకాలు చేసిన క్రికెటర్ల జాబితాలో పాంటింగ్‌తో కలిసి రోహిత్ సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు. సచిన్ (49), కోహ్లి (46) టాప్–2లో ఉన్నారు.

360 న్యూజిలాండ్‌తో సిరీస్‌లో గిల్ చేసిన రన్స్. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా బాబర్ ఆజమ్ (పాక్; 2016లో విండీస్‌పై) పేరిట ఉన్న రికార్డును గిల్ సమం చేశాడు.

19 న్యూజిలాండ్‌తో మూడో వన్డేలో భారత బ్యాటర్ల సిక్స్‌ల సంఖ్య. 2013లో ఆస్ట్రేలియాపై కూడా భారత్ 19 సిక్స్‌లు కొట్టింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) బ్రేస్‌వెల్ 101; గిల్ (సి) కాన్వే (బి) టిక్నర్ 112; కోహ్లి (సి) అలెన్ (బి) డఫీ 36; ఇషాన్ (రనౌట్) 17; సూర్యకుమార్ (సి) కాన్వే (బి) డఫీ 14; పాండ్యా (సి) కాన్వే (బి) డఫీ 54; సుందర్ (సి) మిచెల్ (బి) టిక్నర్ 9; శార్దుల్ (సి) లాథమ్ (బి) టిక్నర్ 25; కుల్దీప్ (రనౌట్) 3; ఉమ్రాన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం** (50 ఓవర్లలో 9 వికెట్లకు) 385. **వికెట్ల పతనం:** 1–212, 2–230, 3–268, 4–284, 5–293, 6–313, 7–367, 8–379, 9–385. **బౌలింగ్:** డఫీ 10–0–100–3, ఫెర్గూసన్ 10–1–53–0, టిక్నర్ 10–0–76–3, సాన్‌ట్నర్ 10–0–58–0, మిచెల్ 4–0–41–0, బ్రేస్‌వెల్ 6–0–51–1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (బి) పాండ్యా 0; కాన్వే (సి) రోహిత్ (బి) ఉమ్రాన్ 138; నికోల్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 42; మిచెల్ (సి) ఇషాన్ (బి) శార్దుల్ 24; లాథమ్ (సి) పాండ్యా (బి) శార్దుల్ 0; ఫిలిప్స్ (సి) కోహ్లి (బి) శార్దుల్ 5; బ్రేస్‌వెల్ (స్టంప్డ్) ఇషాన్ (బి) కుల్దీప్ 26; సాన్‌ట్నర్ (సి) కోహ్లి (బి) చహల్ 34; ఫెర్గూసన్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 7; డఫీ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహల్ 0; టిక్నర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం** (41.2 ఓవర్లలో ఆలౌట్) 295. **వికెట్ల పతనం:** 1–0, 2–106, 3–184, 4–184, 5–200, 6–230, 7–269, 8–279, 9–280, 10–295. **బౌలింగ్:** పాండ్యా 6–0–37–1, సుందర్ 6–0–49–0, శార్దుల్ 6–0–45–3, ఉమ్రాన్ 7–0–52–1, కుల్దీప్ 9–0–62–3, చహల్ 7.2–0–43–2.

పదేళ్ల తర్వాత మళ్లీ సెమీస్‌లోకి

ఆకట్టుకున్న అజరెంకా • మూడో సీడ్ పెగూలాపై వరుస సెట్‌లలో విజయం

మెల్‌బోర్న్: తన పూర్వ వైభవాన్ని గుర్తుకు తెచ్చేలా ఆడిన బెలారస్ టెన్నిస్ స్టార్ విక్టోరియా అజరెంకా పదేళ్ల తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ దశకు అర్హత సాధించింది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రపంచ 24వ ర్యాంకర్ అజరెంకా మూడోసారి సెమీఫైనల్‌కు చేరింది. 2012, 2013లో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచిన అజరెంకా 2013లో ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరాక మరే గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో అజరెంకా 6–4, 6–1తో మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా)పై అలవోకగా గెలిచింది. 97 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అజరెంకా 17 విన్నర్స్ కొట్టి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో క్వార్టర్ ఫైనల్లో 22వ సీడ్ రిబాకినా (కజకిస్తాన్) 6–2, 6–4తో 17వ సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా)ను ఓడించి సెమీస్‌లో అజరెంకాతో పోరుకు సిద్ధమైంది.

పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), 18వ సీడ్ ఖచనోవ్ (రష్యా) సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో సిట్సిపాస్ 6–3, 7–6 (7/2), 6–4తో లెహచ్కా (చెక్ రిపబ్లిక్)పై నెగ్గగా... ఖచనోవ్ 7–6 (7/5), 6–3, 3–0తో ఆధిక్యంలో ఉన్న దశలో అతని ప్రత్యర్థి సెబాస్టియన్ కోర్డా (అమెరికా) గాయంతో వైదొలిగాడు.



అజరెంకా

'మిక్స్‌డ్' సెమీస్‌లో సానియా–బోపన్న జోడీ

సానియా మీర్జా–రోహన్ బోపన్న (భారత్) ద్వయం కోర్టులోకి అడుగు పెట్టకుండానే మిక్స్‌డ్ డబుల్స్‌లో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నారు. సానియా–బోపన్నలతో ఆడాల్సిన ఒస్టాపెంకో (లాత్వియా)–వెగా హెర్నాండెజ్ (స్పెయిన్) జోడీ గాయం కారణంగా బరిలోకి దిగకపోవడంతో భారత జంటను విజేతగా ప్రకటించారు.

ఆంధ్రకు ఆధిక్యం



విహారి

సాక్షి, విజయనగరం: అస్సాం జట్టుతో మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు 47 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అస్సాం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 37.5 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. ఆంధ్ర బౌలర్లు మాధవ్ రాయుడు (4/12), శశికాంత్ (3/34) అస్సాం జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర ఆట నిలిచే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. అభిషేక్ రెడ్డి (75; 11 ఫోర్లు), విహారి (80; 11 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు.

వరుసగా 12వసారి సెమీస్‌లోకి ఆస్ట్రేలియా



భువనేశ్వర్: పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీలో ఆస్ట్రేలియా జట్టు వరుసగా 12వసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. స్పెయిన్ జట్టుతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆస్ట్రేలియా 4–3 తో గెలిచింది. ఆసీస్ తరఫున హేవార్డ్ (33వ, 37వ ని.లో) రెండు గోల్స్ చేయగా... జెలెవ్‌స్కీ (32వ ని.లో), ఫ్లిన్ ఒగిల్వీ (30వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఒక దశలో ఆస్ట్రేలియా 0–2తో వెనుకబడినా ఏడు నిమిషాల వ్యవధిలో నాలుగు గోల్స్ సాధించింది. మరో క్వార్టర్ ఫైనల్లో బెల్జియం 2–0తో న్యూజిలాండ్‌ను ఓడించి సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది.

సినిమా



• బాలకృష్ణ

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

• అక్కినేని ఫ్యాన్స్ డిమాండ్

''మా ఆర్టిస్టులు అంతా నాకు మంచి టైమ్‌పాస్. వేదాలు.. శాస్త్రాలు.. నాన్నగారు. ఆ డైలాగులు... ఆ రంగారావుగారు, ఈ అక్కినేని తొక్కినేని... ఇవన్నీ కూర్చొని మాట్లాడుకునేవాళ్లం'' అంటూ 'వీరసింహారెడ్డి విజయోత్సవం'లో నందమూరి బాలకృష్ణ మాట్లాడిన మాటలు హాట్ టాపిక్ అయిన విషయం తెలిసిందే. పాత సినిమాలకు సంబంధించిన విషయాలను చర్చించుకున్నామని చెప్పే క్రమంలో బాలకృష్ణ ఇలా 'అక్కినేని తొక్కినేని' అంటూ మాట్లాడారు. ఏయన్నార్ స్థాయిని దిగజార్చేలా 'అక్కినేని తొక్కినేని' అని బాలకృష్ణ మాట్లాడటం ఏంటి? అని ఏయన్నార్ ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. కాగా ఈ విషయంపై అక్కినేని వారసులు అక్కినేని నాగచైతన్య, అక్కినేని అఖిల్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

''నందమూరి తారక రామారావుగారు, అక్కినేని నాగేశ్వర రావుగారు, ఎస్వీ రంగారావుగారు తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డలు. వారిని అగౌరవపరచడం మనల్ని మనమే కించపరుచుకోవడం'' అంటూ నాగచైతన్య, అక్కినేని అఖిల్ ట్వీట్ చేశారు.

ఎన్టీఆర్ లివ్స్ ఆన్ - నాగార్జున

ఏయన్నార్ గురించి బాలకృష్ణ మాట్లాడిన మాటలు వైరల్ అవుతున్న నేపథ్యంలో ఎన్టీఆర్‌ని ప్రశంసిస్తూ నాగార్జున మాట్లాడిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. నాగార్జున, నాగచైతన్య హీరోలుగా నటించిన 'బంగార్రాజు' సినిమా గత ఏడాది జనవరి 14న విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచింది. దీంతో 'బంగార్రాజు' సక్సెస్ సెలబ్రేషన్స్‌ను నిర్వహించారు. ఈ వేదికపై ఎన్టీఆర్ వర్ధంతిని గుర్తు చేసుకుని నాగార్జున మాట్లాడుతూ – ''జనవరి 18.. నందమూరి తారక రామారావుగారి వర్ధంతి. తెలుగు సినిమా ఉన్నంతవరకు మనం ఆయన్ను గుర్తు చేసుకోవాలి. గుర్తు చేసుకుంటాం. ఎన్టీఆర్ లివ్స్ ఆన్.. అలాగే ఏయన్నార్ లివ్స్ ఆన్'' అన్నారు.

'ఎన్టీఆర్ వర్ధంతి నాడు నాగార్జున అంత బాగా మాట్లాడితే, జనవరి 22న అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి నాడు అక్కినేని తొక్కినేని అంటూ బాలకృష్ణ మాట్లాడటం సబబేనా? ఇదేనా బాలకృష్ణ సంస్కారం అంటూ అప్పటి నాగార్జున వీడియోను, ఇప్పటి బాలకృష్ణ వీడియోను అక్కినేని ఫ్యాన్స్ షేర్ చేశారు.

మెంటల్ హ్యాష్‌ట్యాగ్

''అక్కినేని నాగేశ్వరరావుపై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు'' అంటూ సోషల్ మీడియా వేదికగా వివిధ ప్రాంతాల నుంచి అక్కినేని ఫ్యాన్స్ స్పందించారు. దీంతో 'మెంటల్ బాలకృష్ణ, ముద్దుల మామయ్య కాదు.. మెంటల్ మామయ్య' అనే హ్యాష్‌ట్యాగ్స్ ట్విటర్ వేదికగా ట్రెండింగ్‌లోకి వచ్చాయి. అలాగే వివిధ సందర్భాల్లో బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలు, అభ్యంతరకర ప్రవర్తనలకు సంబంధించిన వీడియోలను అక్కినేని ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. 'ఈ మెంటల్‌కి సర్టిఫికెట్ రెన్యూవల్ చేయలేదా? మళ్ళీ పిచ్చి పిచ్చిగా వాగుతున్నాడు.. ఎస్వీ రంగారావుగారు, అక్కినేని నాగేశ్వర రావుగారి గురించి మాట్లాడే స్థాయి నీకు ఉందా అసలు?' అంటూ ఓ నెటిజన్ ట్వీట్ చేశారు. ''బహిరంగ సభల్లో మాట్లాడకుండా బాలకృష్ణపై నిషేధం విధించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వివిధ కారణాల వల్ల ఆయన నాలుకకు అడ్డూ అదుపు ఉండటం లేదు' అంటూ ఓ ఫ్యాన్ ట్వీట్ చేశారు. ఇటు ఎస్వీ రంగారావు అభిమానులు కూడా బాలకృష్ణ వైఖరిని తప్పుపడుతూ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు.

•••

రామారావుగారి చివరి రోజుల్లో ఆయనకు పట్టెడన్నం కూడా నందమూరి వారసులు పెట్టలేదన్న విషయం నందమూరి బాలకృష్ణగారు గ్రహించాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా స్వర్గీయ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డిగారు ఉన్న సమయంలో బాలకృష్ణగారి ఇంట్లో కాల్పులు జరిగినప్పుడు ఏ విధంగా ఆ కేసు నుంచి బాలకృష్ణగారు బయటపడ్డారనే నిజం ఆయనకే (బాలకృష్ణ) తెలియాలి. ఈ కేసు విషయాలను బాలకృష్ణగారు బయటపెడితే మేం కూడా స్వాగతిస్తాం. ఇకనైనా బాలకృష్ణగారు సీనియర్ నటులను గౌరవించడాన్ని నేర్చుకోవాలి. అక్కినేని నాగేశ్వరరావుగారిపై ఇకపై ఏ నటుడైనా విమర్శలు చేస్తే అభిమానులు కూడా ప్రతి విమర్శలు చేస్తారు'' అంటూ కడప జిల్లా నాగార్జున యువశక్తి అధ్యక్షుడు ఓ వీడియో షేర్ చేశారు. ఇంకా ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ – ''అక్కినేని నాగేశ్వరరావుగారికి ఎన్నో అవార్డులు రాకుండా చేసింది ఎవరో అందరికీ తెలుసు. సినీ ఇండస్ట్రీ హైదరాబాద్‌కు రావడానికి ముఖ్య కారకులు నాగేశ్వరరావుగారు. అలాంటి నటుడిపై బాలకృష్ణ విమర్శలు చేయడం దారుణం. సొంతంగా సంపాదించిన డబ్బుతో అక్కినేని నాగేశ్వరరావుగారు అన్నపూర్ణ స్టూడియోను నిర్మించాలనుకుంటే ఆ స్థలాన్ని కూడా నందమూరి రామారావుగారు కబ్జా చేయాలని చూస్తే, కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. అయినప్పటికీ తన చివరి రోజుల్లో కూడా రామారావుగారు అక్కినేని నాగేశ్వరరావుగారిని బ్రదర్ అంటూ పిలిచారు. తన తండ్రి వయసుగల అక్కినేని నాగేశ్వరరావుగారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇకనైనా మానుకోవాలి'' అన్నారు.

''బాలకృష్ణ గారు వాళ్ల నాన్నగారి ముందు వీళ్లంతా ఎవరూ అక్కినేని, తొక్కినేని అంటూ అసభ్యకర పదజాలంతో మాట్లాడటం అహంకారపూరిత అవలక్షణంగా భావించాల్సి వస్తోంది'' అంటూ అక్కినేని ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. సర్వేశ్వరరావు ఓ ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ''తెలుగు సినిమా ఇండస్ట్రీ కళాకారులను మదరాసులోనే అంతం అవకుండా మొట్టమొదట హైదరాబాద్‌కు తీసుకువచ్చి మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో సేవలు చేసేలా చేసి, తన నటనతో, సేవాభావంతో ఎంతోమందికి, ఆర్టిస్ట్‌లకు అవకాశాలు కల్పిస్తూ ఎంతో ఉన్నత స్థాయికి చేరుకున్న స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు గారిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన నందమూరి బాలకృష్ణగారి అహంకారపు మాటలను ఖండిస్తున్నాం. మీ (బాలకృష్ణని ఉద్దేశించి) నాన్నకు అన్యాయం చేసి అధికారం లాక్కుంటే, మీ నాన్న మాటల్లో ఆ నీచుడిని చంపి నా దగ్గరికి రా బాలయ్య అంటూ ఆ రోజు మీ నాన్న నీకు చెప్తే ఈ రోజుకీ ఒక కొడుకుగా నెరవేర్చలేని నీ హీరోయిజం ఏ మాత్రానికి అని మేం ప్రశ్నించవచ్చు. కానీ మా అక్కినేని ఫ్యాన్స్‌కు ఆ సంస్కారం ఉంది. ఇక మీద మీ అహంకార కుల మత్తు మాటలు కట్టిపెట్టి అక్కినేని కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. లేకుంటే అక్కినేని ఫ్యాన్స్ అసోసియేషన్ వారు చేసే విభిన్న కార్యక్రమాలకు మీరు చాలా బాధపడాల్సి వస్తుందని అక్కినేని ఫ్యాన్స్ అసోసియేషన్ హెచ్చరిస్తూ ఉంది'' అని ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు.

పవన్ స్పందించాలి

ఎప్పుడూ ఇండస్ట్రీకి ఏదో మేలు చేసే వ్యక్తిలా మాట్లాడే పవన్ కల్యాణ్ ఇప్పుడు 'అక్కినేని నాగేశ్వరరావుగారి'పై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై స్పందించాలని ఓ అక్కినేని ఫ్యాన్ ట్వీట్ చేశారు. ఇక పవన్ కల్యాణ్ ఎవరో తనకు తెలియదని బాలకృష్ణ ఓ సందర్భంలో పేర్కొన్నారు. కానీ బాలకృష్ణ వ్యాఖ్యాతగా 'ఆహా' ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'అన్‌స్టాపబుల్' టాక్ షో సెకండ్ సీజన్‌లోని ఓ ఎపిసోడ్‌కు పవన్ గెస్ట్‌గా వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ ఎపిసోడ్ త్వరలోనే స్ట్రీమింగ్ కానుంది.

ఇటీవలే క్షమాపణలు చెప్పిన బాలకృష్ణ

దేవబ్రాహ్మణులకు నాయకుడు రావణబ్రహ్మ అంటూ ఇటీవల బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. దీంతో తన పొరపాటును మన్నించాల్సిందిగా కోరుతూ బాలకృష్ణ ఓ లేఖను విడుదల చేసిన విషయం గుర్తుండే ఉంటుంది.

అందుకే డూప్స్.. రోప్స్ వాడలేదు

\- సుధీర్‌బాబు



"హంట్' మూవీ ఎంగేజింగ్ థ్రిల్లర్‌గా ఉంటుంది. స్నేహం నేపథ్యంలో వచ్చే భావోద్వేగ సన్నివేశాలు కూడా ఆకట్టుకుంటాయి. ప్రేక్షకులు నా పాత్రతో ప్రయాణిస్తూ కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఈ సినిమా ఆడియన్స్‌కి కొత్త అనుభూతిని పంచుతుంది" అని హీరో సుధీర్‌బాబు అన్నారు. మహేశ్ దర్శకత్వం వహించిన చిత్రం 'హంట్'. శ్రీకాంత్, భరత్ కీలక పాత్రలు చేశారు. వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుధీర్ బాబు పంచుకున్న విశేషాలు.

• ఓ సినిమా కోసం 50, 60 కథలు వింటుంటే ఒక మంచి పాయింట్ నచ్చుతుంది. దాన్ని ఎందుకు వదులుకోవడం? కొత్త దర్శకుడైనా మనం ఎందుకు సపోర్ట్ చేయకూడదు? అని ఆలోచిస్తాను. నాకు డౌట్స్ ఉంటే ముందు ప్రశ్నలు అడుగుతా.. ఆ తర్వాత టెస్ట్ షూట్ చేయమని చెబుతా. 'హంట్' సరికొత్త కథ. పైగా, భవ్య క్రియేషన్స్‌లాంటి అనుభవం ఉన్న నిర్మాతలున్నారు. ఆ నమ్మకంతోనే ఈ సినిమా చేశాను. • ఈ మూవీలో పోలీస్ ఆఫీసర్ అర్జున్ పాత్ర చేశాను. గతం మర్చిపోవడానికి ముందు, గతం మర్చిపోయిన తర్వాత.. ఇలా రెండు వేరియేషన్స్ ఉంటాయి. ఇందులో యాక్షన్ రియల్‌గా ఉండాలనుకున్నాం. అందుకే డూప్స్, రోప్స్ వాడలేదు. 'జాన్ విక్ 4'కు వర్క్ చేసిన యాక్షన్ కొరియోగ్రాఫర్లు మా మూవీకి పని చేశారు. ఫారిన్‌లో ఫైట్లు షూట్ చేశాం. నాలుగు రోజుల్లో యాక్షన్ సీక్వెన్సులు తీశాం. • 'హంట్'లో హీరోయిన్ లేదు. మేం అక్కడే రూల్ బ్రేక్ చేశాం. రెండు నిమిషాల్లో కథలో లీనమవుతారు. నాకు, నా కుటుంబ సభ్యులకు, ప్రీమియర్ చూసిన వందల మందికి సినిమా నచ్చింది. అయితే ప్రతి హీరో అటెంప్ట్ చేసే స్టోరీ కాదు ఇది. • మా మామయ్య కృష్ణగారు చాలా ప్రయోగాలు చేశారు. నేను కొత్తగా చేసిన 'హంట్' చూసి అభినందిస్తారనే నమ్మకం ఉండేది. కానీ, ఆయన మన మధ్య లేకపోవడంతో వెలితిగా ఉంది. ప్రస్తుతం హర్షవర్ధన్ దర్శకత్వంలో 'మామా మశ్చీంద్ర' సినిమా, యూవీ క్రియేషన్స్‌లో అభిలాష్ దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నాను'' అన్నారు.

ఓ రచయిత ప్రయాణం - షణ్ముఖ ప్రశాంత్



''రైటర్ పద్మభూషణ్' హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. విజయవాడలోని ఓ మధ్య తరగతి యువకుడి కథ ఇది'' అని దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ అన్నారు. సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా తెరకెక్కిన చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. జి. మనోహర్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా షణ్ముఖ ప్రశాంత్ మాట్లాడుతూ– ''నా దృష్టిలో కథని అమ్మలానే చూస్తాను. ఎంత బడ్జెట్ పెట్టినా మొదట కంటెంట్ రాయాల్సింది రచయితనే. అలాంటి ఒక రచయిత ప్రయాణం ఈ చిత్రంలో ఉంటుంది. ఇందులో హీరో పాత్ర పేరు పద్మభూషణ్. తను రైటర్ కావాలనుకుంటాడు. మరి అయ్యాడా? లేదా అనేదే కథ. దర్శకులు జంధ్యాల, ఈవీవీ, శ్రీను వైట్లగార్ల సినిమాలంటే ఇష్టం. నా బలం కూడా కామెడీనే. మా సినిమాలో మంచి వినోదం ఉంటుంది'' అన్నారు.

ఆరు జంటల కథ



• లావణ్య, చైతన్యా రావు

సునీల్, చైతన్య రావు మదాడి ప్రధాన పాత్రల్లో అనిల్ గోపిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాలెంటైన్స్ నైట్'. స్వాన్ మూవీస్ సమర్పణలో ఫన్ సాగ బ్యానర్‌పై తృప్తి పాటిల్, సుధీర్ యాళంగి మహీంధర్ నారల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అనిల్ గోపిరెడ్డి మాట్లాడుతూ–''ఆరు జంటల కథ ఇది. ఒకరి కథలోకి ఒకరు ప్రవేశించిన తర్వాత వాలెంటైన్స్ నైట్ నాడు ఏం జరిగింది? అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు అనిల్ గోపిరెడ్డి. ''ఈ సినిమాలో దాదాపు పది కథలు చూడొచ్చు'' అన్నారు చైతన్యా రావు. ఈ చిత్రానికి సహనిర్మాత: సాయిబాబు వాసిరెడ్డి, కెమెరా: జయపాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: స్వాతి రాపేటి.

నక్సలిజం నేపథ్యంలో...



• శివ బాలాజీ, బ్రిగిడ, ధర్మ మహేశ్

శివ బాలాజీ, ధర్మ మహేశ్, బ్రిగిడ సాగ ప్రధాన పాత్రల్లో శ్యామ్ తుమ్మలపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సిందూరం'. శ్రీ లక్ష్మీ నరసింహా మూవీ మేకర్స్‌పై ప్రవీణ్ రెడ్డి జంగా నిర్మించిన ఈ సినిమా రేపు(గురువారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో శ్యామ్ తుమ్మలపల్లి మాట్లాడుతూ–''నక్సల్స్ ఉద్యమం నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. కొన్ని వాస్తవ సన్నివేశాలను మా సినిమాలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మంచి సినిమా తీశామనే సంతృప్తి ఉంది'' అన్నారు ప్రవీణ్ రెడ్డి జంగా. ''ఈ కథ విన్నప్పుడు ఇంటెన్స్ జానర్ అనిపించింది. ఫస్ట్ టైమ్ నక్సలైట్‌గా చేశాను'' అన్నారు శివ బాలాజీ. ఈ చిత్రానికి సహనిర్మాతలు: చైతన్య కందుల, సుబ్బారెడ్డి .ఎం, కెమెరా: కేశవ్, సంగీతం: హరి గౌర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామ బాలాజీ .డి.

సాక్షి బిజినెస్
బుధవారం
25-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	37	60,979
నిఫ్టీ	0	18,118

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,336	▽	28
డోజోన్స్	33,631	△	2
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,757	▽	10
డాక్స్	15,093	▽	28
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,265	△	25
నికాయ్	27,299	△	393

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	57,322	△ 278
బంగారం (99.5 స్వచ్ఛత)	57,092	△ 278
వెండి (కిలో)	68,137	▽ 136

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతదేశ	80.80	82.47
£	బ్రిటన్ పౌండ్	భారతదేశ	87.21	90.32
€	యూరో	భారతదేశ	99.37	102.73
¥	జపాన్ ఎన్ (100)	భారతదేశ	61.62	63.64
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతదేశ	56.27	58.64
S$	సింగపూర్ డాలర్	భారతదేశ	60.88	62.89
SAR	సౌదీ రియాల్	భారతదేశ	20.80	22.47
UAE D	యూఏఈ దిర్హామ్	భారతదేశ	21.35	23.15
¥	చైనా యువాన్	భారతదేశ	10.92	13.00

మారుతీ లాభం హైజంప్

క్యూ3లో రూ. 2,351 కోట్లు

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా జంప్ చేసి రూ. 2,351 కోట్లను తాకింది. గతేడాది (2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 1,011 కోట్లు ఆర్జించింది. కొత్త ప్రొడక్టుల విడుదల నేపథ్యంలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గ్రాండ్ విటారా, బ్రెజ్జా కొత్త వెర్షన్ తదితర మోడళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఇక నికర అమ్మకాలు సైతం రూ. 22,188 కోట్ల నుంచి రూ. 27,849 కోట్లకు ఎగశాయి.

విక్రయాలు అప్: తాజా సమీక్షా కాలంలో మారుతీ 4,65,911 వాహనాలను విక్రయించింది. వీటిలో 61,982 యూనిట్లను ఎగుమతి చేసింది. గతేడాది క్యూ3లో 4,30,668 వాహనాలు మాత్రమే విక్రయంకాగా.. 64,995 వాహనాలను ఎగుమతి చేసింది. అంటే దేశీ అమ్మకాలు 3,65,673 యూనిట్ల నుంచి 4,03,668కు ఎగశాయి. కాగా.. ఈ కాలంలో ఎలక్ట్రానిక్ విడిభాగాల కొరత కారణంగా 46,000 యూనిట్ల ఉత్పత్తిపై ప్రభావం పడినట్లు మారుతీ పేర్కొంది. 2022 డిసెంబర్ 31 కల్లా 3,63,000 ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. వీటిలో 1,19,000 ఆర్డర్లు కొత్తగా ప్రవేశపెట్టిన మోడళ్లకు సంబంధించినవని తెలియజేసింది.



ఫలితాల నేపథ్యంలో మారుతీ సుజుకీ షేరు 3.3 శాతం జంప్‌చేసి రూ. 8,696 వద్ద ముగిసింది.

ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

- ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- సెన్సెక్స్ లాభం 37 పాయింట్లు
- నిఫ్టీ యథాతథ ముగింపు
- బ్యాంక్స్, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఊగిసలాటకు లోనైన దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. ఇంట్రాడేలో 431 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 37 పాయింట్ల లాభంతో 60,979 వద్ద స్థిరపడింది. నిఫ్టీ లాభ, నష్టాలకు లోనవకుండా సోమవారం ముగింపు 18,118 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 18,201 వద్ద గరిష్టాన్ని, 18,079 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. ప్రపంచ మార్కెట్లలోని సానుకూల సంకేతాలను అందిపుచ్చుకున్న దేశీయ సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఆటో షేర్ల అండతో తొలి దశలో దూసుకెళ్లాయి. అయితే అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(1.50%)తో పాటు బ్యాంకింగ్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో ఆరంభ లాభాలు హరించుకుపోయాయి. మెటల్, ఫార్మా, రియల్టీ షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. వాహన రంగానికి చెందిన కీలక కంపెనీలు ఆర్థిక ఫలితాలను వెల్లడిస్తున్న తరుణంలో ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు అర శాతం చొప్పున నష్టపోయాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 81.70 స్థాయి వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.761 కోట్ల షేర్లను విక్రయించగా, దేశీయ ఇన్వెస్టర్లు రూ.1,145 కోట్లు కొన్నారు. ద్రవ్యోల్బణ కట్టడికి ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను తగ్గించవచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

హైదరాబాద్ నుంచి ఆకాశ ఎయిర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విమానయాన రంగ సంస్థ ఆకాశ ఎయిర్ హైదరాబాద్ నుంచి సర్వీసులను నేటి (బుధవారం) నుండి ప్రారంభిస్తోంది. హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–గోవా మధ్య ఇవి నడవనున్నాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు మరో రెండు సర్వీసులను ఫిబ్రవరి 15 నుంచి జోడించనున్నారు. విశాఖపట్నం సహా ప్రస్తుతం ఆకాశ ఎయిర్ దేశంలోని 13 నగరాలకు సేవలను అందిస్తోంది. ఈ ఏడాది మరో నాలుగైదు నగరాలు తోడవనున్నాయని కంపెనీ కో–ఫౌండర్ ప్రవీణ్ అయ్యర్ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. సంస్థ వద్ద 14 విమానాలు ఉన్నాయని చెప్పారు. మార్చి నాటికి మరో నాలుగు వచ్చి చేరుతున్నాయని వెల్లడించారు. 2023 రెండవ అర్ధ భాగంలో అంతర్జాతీయ సర్వీసులు నడుపుతామని తెలిపారు. నాలుగేళ్లలో ఆకాశ ఎయిర్ ఖాతాలో 72 ఎయిర్‌క్రాఫ్ట్లు ఉంటాయని కో–ఫౌండర్ బెల్సన్ కొటినో పేర్కొన్నారు.



బెల్సన్ కొటినో, ప్రవీణ్ అయ్యర్ (కుడి)

టీవీఎస్ మోటార్ లాభం ప్లస్

క్యూ3లో రూ. 304 కోట్లు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజం టీవీఎస్ మోటార్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 28 శాతం ఎగసి రూ. 304 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 237 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,606 కోట్ల నుంచి రూ. 8,075 కోట్లకు జంప్ చేసింది. వాటాదారులకు షేరుకి రూ. 5 చొప్పున కంపెనీ బోర్డు మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ కాలంలో మొత్తం ద్విచక్ర వాహన విక్రయాలు 8.35 లక్షల నుంచి స్వల్పంగా పెరిగి 8.36 లక్షలకు చేరాయి. ఎగుమతులు 2.53 లక్షల నుంచి 2.07 లక్షలకు క్షీణించాయి. మొత్తం త్రిచక్ర వాహన అమ్మకాలు 44,000 యూనిట్ల నుంచి 43,000 యూనిట్లకు నీరసించాయి.



ఫలితాల నేపథ్యంలో టీవీఎస్ మోటార్ షేరు యథాతథంగా రూ. 982 వద్ద ముగిసింది.

ఎస్‌బీఐ కార్డ్ లాభం జూమ్



క్యూ3లో రూ. 509 కోట్లు

న్యూఢిల్లీ: క్రెడిట్ కార్డ్ దిగ్గజం ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 509 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో ఆర్జించిన రూ. 386 కోట్లతో పోలిస్తే ఇది 32 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ. 3,140 కోట్ల నుంచి రూ. 3,656 కోట్లకు ఎగసింది. అయితే నిర్వహణ వ్యయాలు 15 శాతం పెరిగి రూ. 1,974 కోట్లను తాకాయి. ఈ కాలంలో స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.4 శాతం నుంచి 2.22 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.83 % నుంచి 0.80 శాతానికి తగ్గాయి.

క్యూ3 ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ కార్డ్స్ షేరు 2.4 శాతం క్షీణించి రూ. 749 వద్ద ముగిసింది.

క్రోమా రిపబ్లిక్ డే సేల్స్ ఆఫర్లు

హైదరాబాద్: టాటా గ్రూప్ రిటైలర్ క్రోమా 'రిపబ్లిక్ డే సేల్స్' ఆఫర్లు ప్రకటించింది. కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ జాయ్ ప్రచారంతో ఇప్పటికే మొదలైన మెగా ఆఫర్ల సందడి ఈ జనవరి 29న వరకు కొనసాగనుంది. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, టీవీలు, సౌండ్ బార్స్, హెడ్‌ఫోన్లు, స్పీకర్లు, ట్యాబ్లెట్లు తదితర ఎలక్ట్రానిక్స్ గృహోపకరణలపై 50 శాతం వరకూ రాయితీ పొందొచ్చు. స్టోర్ల వద్ద కన్జూమర్ ఫైనాన్స్‌పై రూ.5వేల వరకూ క్యాష్‌బ్యాక్, ఎంపిక చేసిన బ్యాంక్‌కార్డుల ద్వారా కొనుగోలు చేస్తే పదిశాతం వరకు తక్షణ డిస్కౌంట్‌ను అందిస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-1-2023	
విశాఖ	530–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510–00
విజయవాడ	510–00
రిటైల్ ధర (డజను)	78.00
24-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

విండ్‌ఫాల్ ట్యాక్స్ రద్దు చేయండి

- దీనివల్ల చమురు–గ్యాస్ అన్వేషణకు విఘాతం
- ప్రీ–బడ్జెట్ నివేదికలో కేంద్రానికి ఫిక్కీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: దేశీయంగా ఉత్పత్తి అయిన ముడి చమురుపై విండ్‌ఫాల్ ప్రాఫిట్ టాక్స్‌ను 2023–24 వార్షిక బడ్జెట్‌లో రద్దు చేయాలని కేంద్రానికి పరిశ్రమల వేదిక- ఫిక్కీ తన ప్రీ–బడ్జెట్ కోర్కెల మెమోరాండంలో విజ్ఞప్తి చేసింది. ఈ పన్ను విధింపు చమురు, గ్యాస్ అన్వేషణకు సంబంధించిన పెట్టుబడులకు ప్రతికూలమని తన సిఫారసుల్లో పేర్కొంది. భారతదేశం 2022 జూలై 1వ తేదీన విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తద్వారా అంతర్జాతీయంగా ధరల పెరుగుదల వల్ల ఇంధన కంపెనీలకు అనూహ్యంగా వచ్చే భారీ లాభాలపై పన్ను విధిస్తున్న పలు దేశాల సరసన చేరింది. తొలుత దేశీయ ముడిచమురు ఉత్పత్తిపై టన్నుకు రూ.23,250 (బ్యారెల్‌కు 40 డాలర్లు) విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ విధింపు జరిగింది. పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై కూడా కొత్త పన్ను అమలు జరుగుతోంది. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ప్రతి పదిహేను రోజులకు ఈ పన్ను మదింపు, నిర్ణయం జరుగుతోంది. అటువంటి లెవీ ప్రస్తుతం ఉన్న అన్ని ఇతర పన్నులకు అదనం. ఇంధన రంగానికి సంబంధించి ఫిక్కీ తాజా నివేదికలో ముఖ్యాంశాలు..



- పెట్రోలియం క్రూడ్‌పై స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ (ఎస్ఏఈడీ)ని కూడా రద్దు చేయాలి. లేదా అసాధారణ చర్యగా కొంత కాలం లెవీని కొనసాగించాల్సిన అవసరం ఉన్నట్లయితే, ఆ రేటును యాడ్–వాల్లెమ్ లెవీగా మార్చాలి. ఇది 100 డాలర్ల పైన పెరిగే క్రూడ్ ధరలో 20 శాతంగా ఉండాలి.
- రాయల్టీ (ఆన్‌షోర్ ఫీల్డ్‌లకు చమురు ధరలో 20%, ఆఫ్‌షోర్ ప్రాంతాలకు 10%) అలాగే చమురు పరిశ్రమ అభివృద్ధి (ఓఐడీ) సెస్ (చమురు ధరలో 20%) ఇప్పటికే భారం అనుకుంటే, విండ్‌ఫాల్ పన్ను ఈ భారాన్ని మరింత పెంచుతోంది.
- విండ్‌ఫాల్ టాక్స్ వాస్తవ ధరపై కాకుండా, టన్ను ఉత్పత్తిపై మదింపు జరుగుతోంది. దీనివల్ల ధరలు తగ్గినప్పుడు ఉత్పత్తిదారులను దెబ్బతీస్తోంది.

ప్రపంచ ప్రమాణాలు పాటించాలి..



ప్రస్తుతం దేశీయ ముడి చమురు ఉత్పత్తిదారులపై దాదాపు 70% పన్ను విధిస్తున్నారు. ప్రపంచ ప్రమాణాల ప్రకారం, 35–40% పన్ను మాత్రమే విధించాలి. ఈ రంగంలో కీలక పెట్టుబడులకు ఇది పన్ను దోహదపడుతుంది. ఇంధన రంగానికి మద్దతు ఇవ్వడానికి, అస్థిర ప్రపంచ ముడి మార్కెట్ల నుండి దేశాన్ని రక్షించడానికి కీలకమైన విధాన సంస్కరణలు తెచ్చేందుకు ఈ బడ్జెట్ మంచి అవకాశం.

– సునీల్ దుగ్గల్, వేదాంత గ్రూప్ సీఈఓ

ఎయిర్‌టెల్ కనీస రీచార్జ్ రూ.155

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం రంగ సంస్థ భారతీ ఎయిర్‌టెల్ అన్‌లిమిటెడ్ ప్యాక్స్‌లో కనీస రీచార్జ్ ధరను రూ.155కు చేర్చింది. తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ సహా ఎనిమిది సర్కిళ్లలో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్యాక్ కాలపరిమితి 24 రోజులు. 1 జీబీ డేటా, 300 ఎస్ఎంఎస్, అపరిమి త కాల్స్ చేసుకోవచ్చు. హెలోట్యూన్స్, వింక్ మ్యూజిక్ ఉచితం. రూ.99 రీచార్జ్ ప్లాన్‌ను ఎయిర్‌టెల్ నిలిపివేసింది.

జాబ్ పాయింట్

ఏపీ సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో 37 ఉద్యోగాలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ కార్యాలయంలో.. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
- **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్–13, డేటాఎంట్రీ ఆపరేటర్లు–10, ఆఫీస్ సబార్డినేట్ –14.
- **జూనియర్ అసిస్టెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్లు:** **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్/పీజీడీసీఏ/డీసీఏ/ఇంజనీరింగ్ సర్టిఫికేట్/కంప్యూటర్‌తో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఆఫీస్ సబార్డినేట్: అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తెలుగు, ఇంగ్లిష్ భాషలు చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
- **వయసు:** 30.11.2022 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు రూ.23,500, డేటాఎంట్రీ ఆపరేటర్‌కు రూ.23,500, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు రూ.15,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** జేఏ, డీఈఓ ఖాళీలకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులు, స్కిల్ టెస్ట్ ఆధారంగా, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2023.
- **స్కిల్‌టెస్ట్‌కు అర్హత సాధించిన అభ్యర్థుల వివరాల వెల్లడి తేది:** 03.02.2023.
- **ధ్రువపత్రాల పరిశీలన తేది:** 06.02.2023, 07.02.2023.
- **స్కిల్ టెస్ట్ తేది:** 11.02.2023, 12.02.2023.
- **ఎంపిక జాబితా వెల్లడి తేది:** 13.02.2023.
- **వెబ్‌సైట్:** apssa.aptonline.in

నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా, హైదరాబాద్‌లో 12 రీసెర్చ్ పోస్టులు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా రీసెర్చ్ కేంద్రాల్లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
- **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్–06, రీసెర్చ్ అసిస్టెంట్–06.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎల్ఎల్ఎం, ఎల్ఎల్బీ, బీఎల్, ఎంఏ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వేతనం:** నెలకు రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.40,000, రీసెర్చ్ అసిస్టెంట్‌కు రూ.35,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తులకు చివరితేది:** 29.01.2023.
- **వెబ్‌సైట్:** www.nalsar.ac.in

యూపీఎస్సీలో 111 ఉద్యోగాలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు/విభాగాల్లో శాశ్వత ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 111
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ కమిషనర్(హార్టికల్చర్)–01, అసిస్టెంట్ డైరెక్టర్(టాక్సికాలజీ)–01, రబ్బర్ ప్రొడక్షన్ కమిషనర్(రబ్బరు బోర్డు)–01, సైంటిస్ట్ బి(నాన్ డిస్ట్రక్టివ్)–01, సైంటిఫిక్ ఆఫీసర్(ఎలక్ట్రికల్)–01, ఫిషరీస్ రీసెర్చ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్–01, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్(టెక్నికల్)–06, అసిస్టెంట్ డైరెక్టర్(ఐటీ)–04, సైంటిస్ట్ బి(టాక్సికాలజీ)–01, సైంటిస్ట్ బి(సివిల్ ఇంజనీరింగ్)–09, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్(ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్)–76, డిప్యూటీ లెజిస్లేటివ్ కౌన్సిల్(హిందీ బ్రాంచ్)–03, అసిస్టెంట్ ఇంజనీర్ గ్రేడ్1–04, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్–02.
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.02.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింటింగ్‌కు చివరితేది:** 03.02.2023.
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

ఎన్ఐఆర్‌డీపీ, హైదరాబాద్‌లో 135 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 135
- » **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.02.2023.
- » **వెబ్‌సైట్:** nirdpr.org.in

గ్రూప్ 4.. గెలుపు ఇలా!

నిరుద్యోగుల ఎదురుచూపులకు తెరదించుతూ తెలంగాణ ప్రభుత్వం 8039 గ్రూప్-4 ఉద్యోగాలకు ప్రకటన విడుదల చేసింది. టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసే ఈ కొలువులకు పోటీ తీవ్రంగా ఉండే అవకాశముంది. దాదాపు పది లక్షల మంది దరఖాస్తు చేసుకుంటారని అంచనా. ఇంతటి పోటీలోనూ మెలకువలు పాటిస్తే విజయం సాధించవచ్చు అంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో.. గ్రూప్ 4 పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ గైడెన్స్..



టీఎస్‌పీఎస్సీ జాబ్స్

» మొత్తం 8039 పోస్టులకు గ్రూప్ 4 నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు
» దరఖాస్తులకు చివరి తేది 30.01.2023

టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 4 నోటిఫికేషన్ ప్రకారం– మొత్తం 8039 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో వివిధ విభాగాల్లో జూనియర్ అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఆడిటర్, వార్డ్ ఆఫీసర్ తదితర పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 4 పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. కొన్ని రకాల పోస్టులకు మాత్రం బీకామ్ అర్హతగా పేర్కొన్నారు.
- **వయసు:** 01.07.2022 నాటికి 18–44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు లభిస్తుంది.

గ్రూప్–4 పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. ఇందులో పేపర్ 1లో జనరల్ నాలెడ్జ్–150, పేపర్–2లో సెక్రటేరియల్ ఎబిలిటీస్ 150 మార్కులకు ఉంటుంది. పీవో, క్లరికల్ వంటి బ్యాంకింగ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతోపాటు, మ్యాథ్స్ నేపథ్యం ఉన్న వారు కొద్దిగా కష్టపడితే పేపర్–2లో మంచి స్కోర్ చేయొచ్చు. అలాగే ఉన్న తక్కువ సమయాన్ని సరైన ప్రణాళికతో సద్వినియోగం చేసుకోగలిగితే.. పేపర్–1లో కూడా మంచి మార్కులు సాధించొచ్చు.

పేపర్-1 జనరల్ స్టడీస్

ఈ పేపర్‌లో మొత్తం 11 విభాగాల్లో తెలంగాణకు సంబంధించి.. తెలంగాణ భౌగోళిక అంశాలు, తెలంగాణ ఉద్యమం, సమాజం, సంస్కృతి, వారసత్వం, కళలు, సాహిత్యం, పాలన విధానాలు, ఆర్థిక వ్యవస్థ తదితరాలపై ప్రశ్నలు అడుగుతారు.

భారత రాజ్యాంగం

ఈ విభాగం నుంచి 10–15 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఎక్కువ మార్కులు సాధించే అవకాశమున్న విభాగం ఇది. కరెంట్ అఫైర్స్‌ను అనుసంధానించుకుంటూ, చాప్టర్ల వారీగా చదవాలి. అలాగే గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి. కొన్ని సందర్భాల్లో అవి రిపీట్ అయ్యే అవకాశం కూడా ఉంది. వీటితోపాటు మాక్ టెస్ట్‌లు రాయాలి.

జాగ్రఫీ

భారతదేశ భౌగోళిక అంశాలపై ప్రశ్నలుంటాయి. బేసిక్ స్థాయిలోనే వీటిని అడిగే అవకాశం ఉంటుంది. ప్రిపరేషన్‌లో స్కూల్, డిగ్రీ స్థాయి పుస్తకాలకు ప్రాధాన్యం ఇవ్వడం మేలు చేస్తుంది.

భారత ఆర్థిక వ్యవస్థ

ఈ విభాగం నుంచి 10–15 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. పాఠశాల స్థాయి బేసిక్ అంశాలతో ప్రారంభించి, భారత ఆర్థిక సర్వే, బడ్జెట్లపైన స్థూలంగా అవగాహన పెంచుకోవాలి. స్థూల గణంకాలపై అవగాహన ఉండాలి. ప్రణాళిక వ్యవస్థ, నీతి ఆయోగ్, సాంఘిక ఆర్థిక సమస్యలైన నిరుద్యోగం ,పేదరికం, మౌలిక భావనలు తెలుసుకోవాలి. వాటిని నిర్మూలనకు ప్రభుత్వం తీసుకునే చర్యలు, ప్రస్తుతం అందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. విత్త, ద్రవ్య వ్యవస్థలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ఆధునిక భారతదేశ చరిత్ర-జాతీయోద్యమం

ఈ విభాగం నుంచి 10–15 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఇందులో ఎక్కువ శాతం ప్రశ్నలు భారత జాతీయోద్యమం నుంచి ఉంటాయి. సంవత్సరాల వారీగా ఉద్యమంలోని వివిధ దశలు, వాటి ఫలితాలు, ఉద్యమాన్ని నడిపిన వ్యక్తుల జీవిత చరిత్ర, జాతీయోద్యమం నాటి గవర్నర్ జనరల్స్, ఆ కాలంలో విడుదలైన బ్రిటిష్ చట్టాలు, వాటిపై భారతీయుల స్పందన, జాతీయోద్యమ కాలంలో తెలంగాణలో జరిగిన సంఘటనలు వంటి వాటిపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశముంది. జాతీయోద్యమ చరిత్రకు సంబంధించి తెలుగు అకాడమీ పుస్తకాలు ఉపయోగపడతాయి.

జనరల్ సైన్స్

- ఈ విభాగంలో సైన్స్ అనువర్తనాలపై ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం పాఠశాల స్థాయి భౌతిక, జీవ, రసాయన శాస్త్ర అనువర్తనాలను చదువుకుంటే సరిపోతుంది. పాఠ్యపుస్తకాల్లోని సైద్ధాంతిక అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా.. మౌలిక అంశాలను చదువుకుని అనువర్తనాలపై దృష్టి పెట్టాలి.
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** ఈ విభాగాన్ని సిలబస్‌లో పేర్కొనపోయినప్పటికీ ప్రశ్నలు అడిగే అవకాశముంది. కరెంట్ అఫైర్స్‌లో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రశ్నలు వస్తాయి. నిత్య జీవితంలో అంతర్భాగంగా సైన్స్ టెక్నాలజీపై ప్రశ్నలు ఎదురవుతాయి.

పర్యావరణం-విపత్తుల నిర్వహణ

ఈ రెండు అంశాలపై 10 వరకు ప్రశ్నలు అడిగే వీలుంది. కొంతవరకు పాఠశాల స్థాయి పాఠ్యపుస్తకాలతోపాటు 12వ తరగతి స్థాయి విపత్తు నిర్వహణ, పర్యావరణ అంశాలు చదివితే మంచి ఫలితం సాధించవచ్చు.

అంతర్జాతీయ సంబంధాలు, సంఘటనలు

మన దేశానికి ఇతర దేశాలతో ఉన్న సంబంధాలపై ప్రధానంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో ముఖ్యంగా సరిహద్దు దేశాలతో భారతదేశానికి ఉన్న సత్సంబంధాలపై ప్రశ్నలు వచ్చే వీలుంది. అంతర్జాతీయ సంఘటనలు, ప్రపంచ వేదికల్లో భాగస్వామ్యం తదితర అంశాలను అధ్యయనం చేయాలి. కరెంట్ అఫైర్స్ అనుసంధానించుకొని చదివితే మేలు. వివిధ అంతర్జాతీయ వేదికలు, వాటి ప్రారంభం, పలు అంతర్జాతీయ వేదికలపై భారతదేశ పాత్ర, ఆయా వేదికల సభ్య దేశాలు, వాటి పూర్వ, ప్రస్తుత అధ్యక్షులు, తాజా సమావేశాలు, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

కరెంట్ అఫైర్స్

ఈ విభాగంలో పరీక్ష తేదీకి ముందు 6 నుంచి 9 నెలల కాలానికి సంబంధించిన కరెంట్ అఫైర్స్‌ను చదవాలి. ప్రశ్నలు ఏ విధంగా అడిగినా.. సమాధానాలు గుర్తించేలా ప్రిపరేషన్ సాగించాలి.

పేపర్-2(సెక్రటేరియల్ ఎబిలిటీస్)

శ్రద్ధగా ప్రాక్టీస్ చేస్తే పేపర్–2లోఎక్కువ మార్కులు సాధించేందుకు అవకాశముంది. ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న వారు మంచి స్కోర్ చేయొచ్చు. అలాగే ప్రతి రోజు రెండు, మూడు గంటల ప్రాక్టీస్ ద్వారా తాజా అభ్యర్థులు కూడా అధిక మార్కులు సాధించవచ్చు. పేపర్–2లో ఐదు విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

మెంటల్ ఎబిలిటీ

కోడింగ్, డీకోడింగ్, రక్త సంబంధాలు, పజిల్స్, వర్గీకరణ, అనాలజీ, అసర్షన్–రీజన్, వెర్బల్–నాన్ వెర్బల్, రీజనింగ్ తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి. ఈ ప్రశ్నల్లో ఉన్న లాజిక్, సమస్య పరిష్కార పద్ధతిని తెలుసుకుంటే.. మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. సైద్ధాంతిక భావనలను అర్థం చేసుకొని, విస్తృత స్థాయిలో సాధన చేస్తే ఈ విభాగంలో రాణించవచ్చు.

న్యూమరికల్, అర్థమెటికల్ ఎబిలిటీస్

వడ్డీ లెక్కలు, కాలం–పని, కాలం–వేగం, నిష్పత్తులు, వాటాల లెక్కింపు మొదలైన పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ప్రశ్నలు అర్థం చేసుకుంటే.. సమాధానాలు సులువే. ఇందుకోసం వీలైనన్నీ ఎక్కువ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. దత్తాంశ విశ్లేషణ, సాంఖ్యక శాస్త్ర పాఠ్యాంశాల సగటు, మధ్యమం, బహుళకం తదితర అంశాలను సాధన చేయడం ద్వారా.. వాటిపై వచ్చే ప్రశ్నలకు సులభంగా సమాధానాలను గుర్తించవచ్చు. బోడ్‌మాస్, అంకెల మధ్య ఉండే సహసంబంధాలు, అంకెల వరుసక్రమాలు మొదలైన సూత్రాల మీద ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.

కాంప్రహెన్షన్

సమాచారాన్ని ఒక పేరాగ్రాఫ్‌లో ఇస్తారు. దాన్ని చదివి వివిధ రకాలైన ప్రశ్నలకు సమాధానం గుర్తించాల్సి ఉంటుంది. ఈ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేందుకు ప్రాక్టీస్ బిట్స్ కలిగిన పేరాగ్రాఫ్‌లు చదివి సాధన చేయాలి. పేరాను వేగంగా ఏకాగ్రతతో చదవడం, అర్థం చేసుకోవడం, సంక్షిప్తీకరించుకోవడం అనే అంశాలపై ఆధారపడి ఈ విభాగంలో మంచి మార్కులు పొందవచ్చు.

సెంటెన్స్ రీ-అరేంజ్‌మెంట్

ఈ విభాగం కోసం ప్రత్యేకంగా సన్నద్ధం కావాల్సిన అవసరం లేదు. వరస మార్చిన వివిధ వాక్యాలను అర్థవంతమైన రూపంలో తిరిగి అమర్చాలి. ఎక్కువ ప్రాక్టీస్ ద్వారా ఇందులో సులభంగా మార్కులు సాధించొచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 30.01.2023
- **పరీక్ష తేదీలు:** ఏప్రిల్/మే 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.tspsc.gov.in

క్లుప్తంగా...

ఇక గంటకు 130 కి.మీ. వేగంతో రైళ్లు

విజయవాడ–దువ్వాడ ట్రాక్ ఆధునికీకరణ పూర్తి

సాక్షి, అమరావతి: విజయవాడ–విశాఖపట్నం మధ్య ఇక గంటకు గరిష్ఠంగా 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఆ మేరకు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ నుంచి విశాఖపట్నం శివారులోని దువ్వాడ వరకు రైల్వేట్రాక్‌ను ఆధునికీకరించి సామర్థ్యాన్ని పెంచింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని స్వర్ణ చతుర్భుజి, స్వర్ణ వికర్ణి విభాగాల పరిధిలో ట్రాక్ సామర్థ్యాన్ని 130 కిలోమీటర్ల వేగానికి పెంచే ప్రక్రియ పూర్తయింది. స్వర్ణ వికర్ణి విభాగం పరిధిలోని బల్హార్ష–కాజీపేట–గూడూరు మధ్య రైల్వేట్రాక్ సామర్థ్యాన్ని గత ఏడాది సెప్టెంబర్‌లో పెంచారు. ప్రస్తుతం స్వర్ణ చతుర్భుజి పరిధిలోని విజయవాడ–దువ్వాడ ట్రాక్ సామర్థ్యాన్ని పెంచారు. దీన్లో భాగంగా తగినంత బరువైన పట్టాలు వేయడంతోపాటు 260 మీటర్ల పొడవుగల వెల్డెడ్ రైలు ప్యానళ్లు ఏర్పాటు చేశారు. ట్రాక్ మార్గంలో వంపులు, ఎత్తుపల్లాలను సరిచేశారు. ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు ట్రాక్షన్ పంపిణీ పరికరాలను మెరుగుపరిచారు. గరిష్ఠంగా 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేందుకు వీలుగా రైళ్ల లోకోమోటివ్, కోచ్‌లను అందుబాటులోకి తెచ్చారు.

కర్ణాటక రెవెన్యూ మంత్రితో ఏపీ మంత్రుల భేటీ



కర్ణాటక మంత్రి ఆర్.అశోక్‌కు నందివిగ్రహం అందజేస్తున్న మంత్రి ధర్మాన

సాక్షి, అమరావతి/బనశంకరి: అసైన్డ్ భూములపై ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ మంగళవారం బెంగళూరులో కర్ణాటక రెవెన్యూ శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో చర్చించింది. బెంగళూరు సచివాలయంలో కర్ణాటక రెవెన్యూ మంత్రి ఆర్.అశోక, రెవెన్యూ ఉన్నతాధికారులతో ఏపీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, పలువురు ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. అసైన్డ్ భూములకు బదలాయింపు హక్కులు ఎలా కల్పించాలనే దానిపై చర్చించారు. కర్ణాటకలో అమలవుతున్న అసైన్డ్ భూముల చట్టం, విధానాలపై వివరాలు సేకరించారు. అసైన్డ్ భూములకు బదలాయింపు హక్కులు కల్పించిన తర్వాత ఆ భూములకు సంబంధించిన రైతుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో వచ్చిన మార్పుల గురించి తెలుసుకున్నారు. ఏపీలో అసైన్డ్ భూముల (బదిలీ నిషేధం) చట్టం, 1977 (9/77) చట్టం అసైన్డ్ భూముల బదిలీపై జీవితకాలం నిషేధం విధించడంతో ఆ భూముల రైతులు.. సాధారణ రైతులు పొందే ప్రయోజనాలు పొందలేకపోతున్నారనే అంశంపై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో కర్ణాటకలో అమల్లో ఉన్న అసైన్డ్ భూముల చట్టం, మార్గదర్శకాలను కమిటీ సభ్యులు పరిశీలించారు. కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలతోపాటు అదనపు సీసీఎల్ఏ ఇంతియాజ్, సీసీఎస్ఏ సహాయ కార్యదర్శి గణేష్‌కుమార్ పాల్గొన్నారు. తమిళనాడు, కర్ణాటకలో పర్యటించడంతో అధ్యయన కమిటీ రెండు రాష్ట్రాల పర్యటన ముగిసింది.



కొల్లేట్లో కొండచిలువ

కొల్లేరంటే కిక్కిస పొదలు.. పెద్దింట్లమ్మ ఆలయం.. విభిన్న రకాల చేపలు.. వలస పక్షులు.. నీటి పిల్లులు.. అరుదైన కుక్కలకు మాత్రమే ప్రసిద్ధి అనేది మొన్నటి మాట. ఆ జాబితాలో ఇప్పుడు కొండ పాములుగా పిలిచే కొండచిలువలు(ఇండియన్ రాక్ పైథాన్లు) సైతం చేరిపోయాయి. సుమారు మూడు దశాబ్దాల క్రితం ఎగువ అరణ్య ప్రాంతాల నుంచి బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, గుండేరు వంటి వాగుల ద్వారా కొల్లేరుకు వలస వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. ఉప్పుటేరుల మధ్య పొదలు.. చేపల చెరువుల గట్లపై ఆవాసాలను ఏర్పాటు చేసుకుని మనుగడ సాగిస్తున్నాయి.

మూడు దశాబ్దాలుగా ఇండియన్ రాక్ పైథాన్ల సంచారం

- ఇక్కడే సంతానాభివృద్ధి చేస్తున్న కొండ చిలువలు
- చేపల చెరువుల గట్లు, ఉప్పుటేర్ల మధ్య పొదలే వీటి ఆవాసాలు
- భయంతో హతమారుస్తున్న ప్రజలు
- ఐయూసీఎన్ రెడ్ లిస్టులో 'రాక్ పైథాన్'

కైకలూరు: కొండ చిలువలు చెట్లపై మాత్రమే ఉంటాయని భావిస్తుంటారు. ఇవి నీటిలో సైతం వేగంగా ఈదగలవు. ఎక్కువ సమయం ఇవి నీటిలోనే గడుపుతుంటాయి. చిత్తడి నేలలు, గడ్డి భూములు, రాతి పర్వతాలు, నదీ లోయల్లో ఇవి నివసిస్తుంటాయి. పాడుబడిన క్షీరదాల బొరియలు, చెట్లు, మడ అడవుల్లో దాక్కుంటాయి. కోళ్లు, పక్షులు, ఎలుకలు, అడపాదడపా ఇతర జంతువులను సైతం ఆహారంగా తీసుకుంటాయి. అలాంటి కొండచిలువలు ఇప్పుడు కొల్లేరుకు అతిథులయ్యాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని 9 మండలాల పరిధిలో.. 77,138 ఎకరాల విస్తీర్ణంలో కొల్లేరు అభయారణ్యం విస్తరించి ఉంది. ఇక్కడ 2.80 లక్షల ఎకరాల్లో చేపల చెరువులు సాగవుతున్నాయి. ఈ చెరువుల చెంతకు సుమారు మూడు దశాబ్దాల క్రితం అరణ్య ప్రాంతాల నుంచి బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, గుండేరు వంటి వాగుల ద్వారా కొండచిలువలు వలస రావటం మొదలైంది. కిక్కిస పొదలు, చేపల చెరువుల గట్లపై ఆవాసాలను ఏర్పాటు చేసుకుని ఇక్కడే తిష్ట వేశాయి.



గుడ్లు పొదుగుతున్న కొండ చిలువ

ఇట్టే పెరిగిపోతాయి

ఏలూరు జిల్లా కలిదిండి మండలం కొండంగి, మట్టగుంట, పడమటిపాలెం, కైకలూరు మండలం ఆటపాక, వరాహపట్నం, భుజబలపట్నం, ముదినేపల్లి, పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు ప్రాంతాల్లో కొండచిలువల సంచారం కనిపిస్తోంది. చేపల చెరువులపై కొండచిలువలు సంతానోత్పత్తి చేస్తున్నాయి. ఇండియన్ రాక్ పైథాన్‌గా పిలిచే కొండచిలువల శాస్త్రీయ నామం పైథాన్ మోలురూస్. ఇవి 12 అడుగుల పొడవు, 52 కేజీల బరువు పెరుగుతాయి. వీటి జీవిత కాలం గరిష్ఠంగా 21 సంవత్సరాలు. ఇవి పుట్టిన తర్వాత త్వరగా పెద్దవి అవుతాయి. ఏడాది వయసు దాటిన తర్వాత నుంచి జత కడుతుంటాయి. సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇవి జత కట్టి 2 నుంచి 3 నెలల్లో గర్భం దాలుస్తాయి. అనంతరం మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో రోజుకు 20 నుంచి 30 గుడ్ల చొప్పున కనీసం 100 గుడ్ల వరకు పెడతాయి. నాలుగు నెలల పాటు గుడ్లను పొదుగుతాయి. పొదిగిన గుడ్లలో 80 శాతానికి పైగా పిల్లలు అవుతాయి. పుట్టిన పిల్లలు 18–24 అంగుళాల వరకు పొడవు ఉంటాయి. అయితే, పుట్టిన వాటిలో 25 శాతం పిల్లల్ని వరకు తల్లే తినేస్తుంది. ఆహారం అందక ఇంకొన్ని చనిపోతాయి. చివరకు 10–15 పిల్లలు మాత్రమే బతికే అవకాశం ఉంటుంది. ఇవి మాంసాహారులు. క్షీరదాలు, పక్షులు, సరీసృపాలు, ఉభయచరాలను తింటాయి. ఒకసారి ఆహారం తీసుకున్న తర్వాత వారం పాటు ఏమీ తినకుండా ఉండగలవు. ఎక్కువగా ఒంటరి జీవితం గడుపుతాయి. సంభోగ సమయంలో మాత్రమే జత కడతాయి. ప్రపంచంలో అతి పెద్ద పాముల్లో ఇది కూడా ఒకటి.

కొండచిలువలకు అండ ఏదీ!

కొండచిలువలు విషసర్పాలు కానప్పటికీ ప్రజల చేతిలో హతమవుతున్నాయి. వీటి ఆకారం భారీగా ఉండటంతో ప్రజలు భయపడి చంపేస్తున్నారు. కొద్ది ఘటనల్లో మాత్రమే అటవీ శాఖ అధికారులు వీటిని రక్షించి చింతలపూడి ఎగువన అడవుల్లో వదులుతున్నారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) హాని కలిగే జాతుల జాబితా (రెడ్ లిస్ట్)లో వీటిని చేర్చింది. ఐయూసీఎన్ సంస్థ దాదాపు 40 శాతం రాక్ పైథాన్ జాతి అంతరించిందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. కొల్లేరు గ్రామాల్లో ఏటా 30 నుంచి 40 కొండచిలువలు ప్రజల చేతిలో హతమవుతున్నట్టు అంచనా. అటవీ శాఖ కొండచిలువలను కూడా షెడ్యూల్–1లో చేర్చింది. వీటిని చంపటం నేరమని ప్రకటించింది.



కొండ చిలువను పట్టుకున్న ఫారెస్టు సిబ్బంది

చంపొద్దు.. సమాచారం ఇవ్వండి..



ఇండియన్ రాక్ పైథాన్‌లు అరుదైన సరీసృపాలు. ఇవి విషపూరితం కావు. చేపల చెరువుల వద్ద ఇవి సంచరిస్తున్నాయి. అరుదుగా జనాలకు తారసపడుతున్నాయి. ఇటీవల మత్స్యకారుల వలల్లో ఇవి చిక్కాయి. అటవీ శాఖ సిబ్బంది వీటిని అడవుల్లో సురక్షితంగా వదులుతున్నారు. కొండచిలువలు కనిపిస్తే వాటిని చంపొద్దు. వీటిని చంపటం నేరం. అందువల్ల ఎక్కడైనా కొండచిలువలు కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం తెలియజేయండి.

– జె.శ్రీనివాస్, అటవీ శాఖ రేంజర్, కైకలూరు

పోలవరానికి నిపుణుల బృందం

నేటినుంచి డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చే పరీక్షలు

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: గోదావరి వరదలకు దెబ్బతిన్న పోలవరం ప్రాజెక్టు ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్–2 పునాది డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చే పరీక్షలు నిర్వహించడానికి నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) బృందం సిద్ధమైంది. ఎన్‌హెచ్‌పీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ఎల్.కపిల్ నేతృత్వంలో జియోఫిజిక్స్ విభాగంలో నిపుణులైన ఆ సంస్థ సీనియర్ మేనేజర్లు ఎ.విపుల్ నాగర్, ఎస్.కె.పాండే, ఎం.పి.సింగ్ మంగళవారం పోలవరం చేరుకున్నారు. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ ప్రాంతాన్ని పరిశీలించారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న వివరాలను ఎస్ఈ నరసింహమూర్తి వారికి వివరించారు. వీరు బుధవారం నుంచి డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు హైరెజల్యూషన్ జియోఫిజికల్ రెసిస్టివిటీ ఇమేజింగ్ విధానంలోను, సెస్మిక్ టోమోగ్రఫీ విధానంలోను పరీక్షలు నిర్వహిస్తారు. ఈ రెండు పరీక్షలను ఒకేసారిగానీ, ఒకదాని తర్వాత మరొకటిగానీ నిర్వహిస్తారు. ఈ పరీక్షలు 15 నుంచి 20 రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. ఈ పరీక్షల ఫలితాలను విశ్లేషించి డయాఫ్రమ్ వాల్ భవితవ్యంపై కేంద్ర జల్‌శక్తి, రాష్ట్ర జలవనరుల శాఖలకు ఎన్‌హెచ్‌పీసీ బృందం 45 రోజుల్లోగా నివేదిక ఇవ్వనుంది. ఆ నివేదిక ప్రకారం డయాఫ్రమ్ వాల్‌పై తుది నిర్ణయం తీసుకుని, తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

హైరిజల్యూషన్ జియోఫిజికల్ రెసిస్టివిటీ విధానం: ఈ విధానం ప్రకారం పరీక్షలు నిర్వహించడానికి గ్యాప్–2లో నిర్మించిన 1,750 మీటర్ల డయాఫ్రమ్ వాల్ పొడవున ప్రతి మీటరుకు ఒకచోట 20 మిల్లీమీటర్ల (ఎంఎం) వ్యాసంతో 1.5 అడుగుల లోతు వరకు జలవనరుల శాఖ అధికారులు రంధ్రాలు వేశారు. ఈ రంధ్రాల్లోకి ఎన్‌హెచ్‌పీసీ బృందం ఎలక్ట్రోడ్‌లను పంపి హైరిజల్యూషన్ జియోఫిజికల్ రెసిస్టివిటీ ఇమేజింగ్ విధానం ప్రకారం పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ పరీక్షల్లో చిత్రాలను విశ్లేషించి డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేలుస్తుంది.



సెస్మిక్ టోమోగ్రఫీ పరీక్ష: ఎన్‌హెచ్‌పీసీ బృందం సూచించిన మేరకు జలవనరుల శాఖ అధికారులు గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్‌కు ఒక మీటరు ఎగువన, ఒక మీటరు దిగువన 60 ఎంఎం వ్యాసంతో 30 నుంచి 40 అడుగుల లోతు వరకు ప్రతి 40 మీటర్లకు ఒక బోరు బావిని జిగ్‌జాగ్ విధానంలో తవ్వి వాటికి కేసింగ్ పైపులను అమర్చారు. ఎన్‌హెచ్‌పీసీ అధికారులు ఆ బోరు బావుల్లోకి ఎలక్ట్రోడ్‌లను పంపి పరీక్షలు నిర్వహిస్తారు. చిత్రాలను విశ్లేషించి డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేలుస్తారు. డయాఫ్రమ్ వాల్ పటిష్ఠంగా ఉందని ఎన్‌హెచ్‌పీసీ తేలిస్తే ఆ వెంటనే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపడతారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని ఎన్‌హెచ్‌పీసీ తేలిస్తే.. దానికి మరమ్మతులు చేయాలా? లేదంటే కొత్త డయాఫ్రమ్ వాల్ వేయాలా? అన్నది ఆ సంస్థ సూచనల మేరకు పనులు చేపట్టి, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులను చేపడతారు.

'బ్యాక్‌వాటర్'పై నేడు ఢిల్లీలో సాంకేతిక కమిటీ భేటీ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ (వెనక జలాలు) ప్రభావంపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేయడానికి బుధవారం ఢిల్లీలో సాంకేతిక కమిటీ సమావేశమవుతోంది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్ వోరా అధ్యక్షతన జరిగే ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ఈఎన్‌సీలతోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో శివ్ నందకుమార్ పాల్గొంటారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై మూడురాష్ట్రాల అనుమానాలను సాంకేతికంగా మరోసారి నివృత్తి చేయడమే ఈ సమావేశం ప్రధానోద్దేశం. ఈ సమావేశంలో వెల్లడైన అంశాల ఆధారంగా కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు సీడబ్ల్యూసీ నివేదిక ఇస్తుంది. ఆ తర్వాత ఫిబ్రవరి రెండోవారంలో ఆయన నాలుగు రాష్ట్రాల సీఎంలతో సమావేశమై.. బ్యాక్‌వాటర్ ప్రభావంపై అనుమానాలను నివృత్తి చేయనున్నారు. సీఎంల సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా కేంద్రం ఫిబ్రవరి 29న సుప్రీంకోర్టుకు నివేదిక ఇవ్వనుంది.

సాంకేతిక కమిటీ భేటీ ఇదే చివరిది

పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై అనుమానాలను నివృత్తి చేసి ఫిబ్రవరి 29లోగా నివేదిక ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ అనుమానాలను సాంకేతికంగా నివృత్తి చేయడానికి సీడబ్ల్యూసీ మరోసారి సమావేశం నిర్వహిస్తోంది. సాంకేతిక కమిటీ భేటీ ఇదే ఆఖరిదని ఇప్పటికే మూడు రాష్ట్రాలకు సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది.

బాలకృష్ణ వ్యాఖ్యలపై భగ్గుమన్న కాపు నేతలు

సాక్షి, అమరావతి: టీడీపీ ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలపై కాపు నేతలు భగ్గుమన్నారు. సినీ దిగ్గజాలైన ఎస్వీ రంగారావు, అక్కినేని నాగేశ్వరరావులను ఉద్దేశించి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బాలకృష్ణ తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బాలకృష్ణ వ్యాఖ్యలు కాపుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, ఈ నెల 25లోపు బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని కాపునాడు డిమాండ్ చేసింది. క్షమాపణ చెప్పకుంటే బాలకృష్ణను టీడీపీ నుంచి బహిష్కరించాలని, లేకుంటే లోకేశ్ పాదయాత్రను అడ్డుకుంటామని అల్టిమేటం జారీ చేసింది. కాగా, ఎస్వీ రంగారావు, అక్కినేని నాగేశ్వరరావుపై చేసిన వ్యాఖ్యలకు బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా రంగా విగ్రహాల వద్ద నిరసనలు చేపడతామని ఆంధ్ర తెలంగాణ రాధా–రంగా మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పన్నాస పూర్ణచంద్రరావు (కాళ్లపాలెం బుజ్జి) ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎస్వీఆర్, ఏఎన్ఆర్‌లను కించపరిచేలా బాలకృష్ణ వ్యాఖ్యానించడం ఆయన అహంభావానికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పుకాపు, మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అమ్మ శ్రీనివాస్ నాయుడు ఒక ప్రకటనలో ఖండించారు. బాలకృష్ణ వ్యాఖ్యలు కళారంగానికే తీవ్ర కళంకమని అభయ హ్యూమన్ సర్వీసెస్ మెంబర్ పెన్నేరు దామోదరరావు,కాపు జేఏసీ కాకినాడ జిల్లా అధ్యక్షురాలు అల్లవరపు నాగమల్లీశ్వరి,కాపు సంఘాల జేఏసీ పేర్కొంది. కాపు జేఏసీ సమావేశంలో జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షులు పోతుల శ్యామలాదేవి, రాయలసీమ మహిళా అధ్యక్షులు నాదెళ్ల శాంతకుమారి, రాష్ట్ర కాపు యువజన నాయకుడు వీరిశెట్టి సుబ్బారావు, రాష్ట్ర ఐక్య కాపునాడు నేత వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కుటుంబ పార్టీలతో పొత్తులకు బీజేపీ దూరం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

సాక్షి, భీమవరం/సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రానున్న ఎన్నికల్లో అవినీతి, వారసత్వ, కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ సమరశంఖం పూరిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ పార్టీలతో ఎన్నికల్లో పొత్తులకు బీజేపీ దూరంగా ఉంటుందని స్పష్టంచేశారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థలను ప్రోత్సహించి కేంద్రం మంజూరు చేసిన వైద్య కళాశాలలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎమర్జెన్సీ గురించి మాట్లాడుతున్న చంద్రబాబు...



ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు ఆమె వెంటే ఉన్న సంగతిని గుర్తించాలన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో గడిచిన తొమ్మిదేళ్లలో అవినీతి తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో ఉండటం లేదని మండిపడ్డారు. మార్చి 10 నుంచి 30 వరకు పాదయాత్రతో బీజేపీ ప్రజల్లోకి వెళ్లనుందని తెలిపారు. రాష్ట్రంలో 8 వేల ప్రాంతాల్లో 15 వేల కిలోమీటర్ల మేరకు పార్టీ శ్రేణులు పాదయాత్ర చేస్తాయన్నారు. కాగా రాష్ట్రంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు అభివృద్ధిని నిర్వీర్యం చేశాయని కేంద్ర సహాయ మంత్రి వి.మురళీధరన్ విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీకి జనసేనతోపాటు ప్రజలతో నేరుగా పొత్తు ఉంటుందని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీకి ప్రత్యామ్నాయంగా బీజేపీ అవతరిస్తుందన్నారు. ఈ సమావేశంలో కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్, ఎంపీ సీఎం రమేష్, పార్టీ నేతలు సునీల్ దేవ్‌ధర్, శివప్రకాష్, వాకాటి నారాయణరెడ్డి, విష్ణుకుమార్‌రాజు, అంబికా కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా 2024 సాధారణ ఎన్నికల వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా సోము వీర్రాజు కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల సహ ఇన్‌చార్జి సునీల్ దేవ్‌ధర్ ప్రకటన చేసినట్టు ఆ పార్టీ మీడియా విభాగం పేర్కొంది.

దివ్య తేజం.. భక్తిభావం

ఓ వైపు రంగురంగుల కిరణాలతో దేవతామూర్తులు కళ్ల ముందు ఆవిష్కృతమవుతండగా.. మరో వైపు భక్తి ఉప్పొంగేలా ఓంకార నాదం మనస్సు తాకుతుండగా.. మరో ఆధ్యాత్మిక ప్రపంచంలోకి అడుగు పెట్టామనే భావన కలుగుతుంది. నల్లమల గిరుల్లోని శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తులు మరింత ఆధ్యాత్మిక ఆనందానికి చేరువవుతున్నారు. శ్రీశైల వైభవం చాటేలా ఇటీవల క్షేత్రంలో ప్రారంభించిన లైట్ అండ్ సౌండ్ షో కార్యక్రమానికి భక్తుల నుంచి ఆదరణ పెరుగుతోంది.

- శ్రీశైలంలో ఆకట్టుకుంటున్న లైట్ అండ్ సౌండ్ షో
- రోజూ సాయంత్రం రెండు ప్రదర్శనలు
- శ్రీశైల స్థలపురాణం, చరిత్ర అంశాలతో సంగీత, దృశ్య కావ్యం
- భక్తుల నుంచి విశేష స్పందన



లైట్ అండ్ సౌండ్ షో ప్రదర్శన దృశ్యాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల స్థల పురాణం, చరిత్ర తదితర అంశాలపై నిర్వహిస్తున్న లేజర్ షో కార్యక్రమంతో భక్తులు తన్మయత్వానికి లోనవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో ప్రసాద్ పథకం కింద చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఈనెల 16వ తేదీన ప్రారంభించారు. క్షేత్రంలో స్వామివారి ఆలయ ప్రాంగణంలో నాగులకట్ట వెనుక లైట్ అండ్‌సౌండ్ షోను ఏర్పాటు చేశారు. స్వామిఅమ్మవార్ల దర్శనం అనంతరం సాయంత్రం నిర్వహించే ఈ ప్రదర్శనలో భక్తులు పాల్గొని తరిస్తున్నారు. శ్రీశైల స్థలపురాణం, క్షేత్ర మహిమలు, స్వామిఅమ్మవార్ల మహిమలు, చరిత్ర దృశ్య, ధ్వని ప్రదర్శనను ప్రదర్శించడంతో భక్తులు వివరంగా తెలుసుకుని అవగాహన చేసుకుంటున్నారు. ప్రతి రోజు రాత్రి 7 గంటలకు మొదటి ప్రదర్శన, రాత్రి 8.15 గంటలకు రెండవ ప్రదర్శన ఉంటుంది. ఈ ప్రదర్శన తిలకించేందుకు ఒక్కొక్కరికి ప్రవేశ రుసుం రూ.50గా నిర్ణయించారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవేశ టికెట్లు ఇస్తున్నారు. అమ్మవారి ఆలయ వెనుక భాగంలో ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కౌంటర్ ద్వారా టికెట్లను భక్తులు పొందవచ్చు. ఈ లేజర్ షోను తెలుగు, కన్నడ, ఆంగ్ల భాషల్లో ఈ షోను రూపొందించగా ప్రస్తుతం రెండు విడుతలలో కూడా తెలుగు భాషలో మాత్రమే ప్రదర్శన నిర్వహిస్తున్నారు. కర్ణాటక భక్తులు అధికంగా ఉండే సమయంలో ముఖ్యంగా ఉగాది, శ్రావణమాసం తదితర సమయాల్లో కన్నడ భాషలో ప్రదర్శన ఉంటుందని ఆలయ అధికారులు చెబుతున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అవసరం మేరకు ఆంగ్ల భాషలో కూడా ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

శివ పార్వతులు సాక్ష్యాత్కరించినట్లుగా..

శ్రీశైలాలయ ప్రాంగణంలో రోజూ ప్రదర్శించే లైట్ అండ్ సౌండ్ షో సుమారు 40 నిమిషాల పాటు ఉంటుంది. ఈ ప్రదర్శనలో జ్యోతిర్లింగాల పరిచయం, అష్టాదశ శక్తిపీఠాల పరిచయం, శ్రీశైలక్షేత్ర ప్రాశస్త్యం, శిలాద మహర్షి కుమారుడైన పర్వతుడు తపస్సుతో శివుడిని మెప్పించి పర్వత ఆకారాన్ని పొంది, 'శ్రీపర్వతం'గా మారడం, శ్రీపర్వతంపై పరమేశ్వరుడు శ్రీపర్వతస్వామిగా స్వయంగా కొలువుదీరడం, ఆదిపరాశక్తి భ్రమర (తుమ్మెద) రూపాన్ని ధరించి అరుణాసురుడును సంహరించి శ్రీశైలంలో భ్రమరాంబాదేవిగా అవతరించడం, కాలక్రమంలో శ్రీపర్వతం శ్రీశైలంగా, శ్రీపర్వతస్వామి శ్రీమల్లికార్జునస్వామిగా పిలవబడడం, చంద్రావతికథ, శ్రీశైలంలో ఆదిశంకరుల తపస్సు, అక్కమహాదేవి ఇతివృత్తాంతం, శ్రీశైలంలో తపస్సు ఆచరించడం, కదలివనంలో సిద్ధిపొందడం, శ్రీశైల చారిత్రక విశేషాల అంశాలతో ఈ ప్రదర్శన ఉండటంతో భక్తులు ఆధ్యాత్మిక చింతనకు లోనవుతున్నారు.

భక్తులకు మరపురాని అనుభూతి

ఇటీవల ప్రారంభించిన శ్రీశైల వైభవ లైట్ అండ్ సౌండ్ షో పట్ల భక్తులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా యువతి, యువకులు, చిన్నపిల్లలు ఈ ప్రదర్శనపట్ల మక్కువ చూపిస్తున్నారు. ఈ ప్రదర్శనను తిలకించడం ద్వారా స్వామిఅమ్మవార్ల ఆవిర్భావం, క్షేత్ర మహిమ విశేషాలు, చరిత్ర, స్వామిఅమ్మవార్లను సేవించిన భక్తుల ఇతివృత్తాంతాలు తదితర అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. యాత్రికులకు ఈ ప్రదర్శన మరపురాని అనుభూతిని ఇస్తుంది అనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

– ఎస్. లవన్న, ఈఓ, శ్రీశైల దేవస్థానం

అద్భుతంగా ఉంది

లేజర్ షోలో శివుడు, భ్రమరాంబా దేవి స్వామి అమ్మవారుల గురించి వివరించే విధానం చాలా అద్భుతంగా ఉంది. భక్తులకు పురాణాలు, ఇతిహాసాలపై మరింత అవగాహన కలుగుతుంది. భక్తి భావం పెంపొందించేలా దేవస్థానం మరిన్ని కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది.

– సురేష్, కర్నూలు

హిందీ, ఇంగ్లిష్‌లో ఏర్పాటు చేయాలి

శ్రీశైల క్షేత్రానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ప్రతి రోజు హిందీ, ఇంగ్లిషులో కూడా ప్రదర్శన ఏర్పాటు చేయాలి. చిన్న పిల్లలకు సైతం అర్థమయ్యేరీతిలో ప్రదర్శన ఉంది. పరమేశ్వరుడు, శ్రీశైల క్షేత్ర ప్రాశస్త్యం, మహిమలు భక్తులకు అర్థమయ్యేలా వివరించారు.

– శబరీష్, హైదరాబాద్

ఉద్దానం తోటలో.. విదేశీ పంట

ఉద్దానం మార్కెట్‌కు కొత్త సరుకు వచ్చింది. పేరు బ్రకోలీ. చూసేందుకు అచ్చం మన క్యాబేజీ పువ్వులాగానే ఉంటుంది. కానీ తింటే మాత్రం పోషకాలు అమోఘం. మన దగ్గర ఇప్పుడిప్పుడే డిమాండ్ కనిపిస్తోంది గానీ.. వేరే దేశాల్లో అయితే ఎగబడి తింటారు. అందుకే మన ఉద్దానం రైతులు భవిష్యత్‌ను పసిగట్టి ఇప్పుడు తమ పొలాల్లో బ్రకోలీని పండించడం మొదలుపెట్టారు. ప్రస్తుతానికి దిగుబడి బాగానే ఉంది. రాబడి కూడా ఫర్వాలేదు. బ్రకోలీపై అవగాహన పెరిగితే మాత్రం రైతుల పంట పండినట్టే.

- బ్రకోలీ అనే విదేశీ పంటను పండిస్తున్న వైనం
- పలాస మార్కెట్‌లోనే విక్రయాలు
- ప్రోత్సహిస్తే రైతులకు లాభదాయకమే

కాశీబుగ్గ: బ్రకోలీ.. కాలీ ఫ్లవర్ జాతికి చెందిన పంట. దండిగా పోషక గుణాలు కలిగిన ఈ పదార్థాన్ని విదేశాల్లో విరివిగా వంటల్లో వాడుతుంటారు. ఉద్దానంలో ఈ పంట పండిస్తూ కొందరు రైతులు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. పలాస మార్కెట్‌లోనే వీటిని విక్రయిస్తున్నారు కూడా. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో ఈ పంటను పండిస్తున్నారు.

ఏమిటీ బ్రకోలీ..?

విదేశాలలో అతిశీతల ప్రాంతంలో పండే అత్యధిక పోషకాలు ఉన్న పంట బ్రకోలీ. మన ప్రాంతంలో దీని వాడకం చాలా తక్కువ. కానీ పోషకాలపై కాస్త అవగాహన ఉన్న వారెవరైనా బ్రకోలీ కనిపిస్తే కొనక మానరు. సామాజిక మాధ్యమాల ద్వారా స్థానికంగానూ దీని విలువను చాలా మంది తెలుసుకుంటున్నారు. ఇప్పుడు శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలోనూ ఈ పంట దొరుకుతోంది. బాగా చల్లగా ఉండే ఉద్దానంలో మునగ, జీడి మామిడి, పనస, మామిడి, కొబ్బరి, బొప్పాయి, జీనుగులు, కందులు, దుంపజాతులు, దబ్బ, నిమ్మ, అరటికాయలు, చింతకాయలు వంటివి ఎక్కువగా సాగు చేస్తారు. ఇప్పుడు ఆ జాబితాలోకి బ్రకోలీ వచ్చి చేరింది. శీతాకాలంలో ఉత్తరభారతదేశంలో సైతం ఇప్పుడు ఈ పంటను విరివిగా పండిస్తున్నప్పటికీ దక్షిణ భారతదేశంలో వేడిమికి ఈ పంటను అంతగా పండించడంలేదు. ఉద్దానంలో వాతావరణం అనుకూలంగా ఉండటంతో నవంబరులో పంటను వేసి సరిగ్గా మూడు మాసాలకు పంటను పొందుతున్నారు. వారానికి రెండు మూడు సార్లు నీటిసదుపాయం కల్పించే ఈ పంటకు చల్లదనమే ప్రధానం. అందుకు పల్లపు, కొండప్రాంతాలు అనుకూలం కాకపోవడంతో ఉద్దాన ప్రాంతంలో ఇది విజయవంతమవుతోంది. అయితే విక్రయాల్లో కాస్త ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏటికేటా పంట విస్తీర్ణం పెంచుకుంటూ పోతున్నామని రైతులు చెబుతున్నారు.



కొతకు సిద్ధంగా ఉన్న బ్రకోలి పువ్వు

పలాసలో అమ్ముతున్నారు..

బొడ్డపాడు, కాలనీ, మామిడిపల్లి గ్రామాలకు చెందిన మూడు కుటుంబాలు మూడెకరాల్లో ప్రయోగాత్మకంగా పెంచుతున్నారు. రోజు వారీగా పండిన పంటను సేకరించి వాటిని ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస–కాశీబుగ్గ మార్కెట్‌కు తీసుకెళ్తున్నారు. కిలో బ్రకోలి రూ.50కు విక్రయిస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943